



ఈనాడు




విజయవాడ 23-11-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 103

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 16+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాలు

23 నవంబర్, 2025

విశ్వశాంతి, సౌభాగ్యం, సకల జనుల సంతోషం కోసం పరితపించిన

భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 100వ జయంతి సందర్భంగా నవంబర్ 23, 2025న రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకలు



ప్రధాన వేదిక
ప్రశాంతి నిలయం, పుట్టపర్తి,
శ్రీ సత్యసాయి జిల్లా

**భగవాన్ సత్య సాయిబాబా
శత జయంతి సందర్భంగా
భక్తులందరికీ శుభాకాంక్షలు**

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సత్య సాయి సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకుందాం... సేవా కార్యక్రమాలకు ప్రేరణ పొందుదాం

చాంపియన్



కొత్త టెస్టు వేదిక గువాహటి.. కోల్‌కతాలా షాకులేమీ ఇవ్వలేదు. సగటు భారత టెస్టు పిచ్‌లాగే ఇక్కడి వికెట్ స్పందించడంతో బ్యాటుకు, బంతికి ఆసక్తికర పోరు సాగింది. తొలి రెండు సెషన్లలో దక్షిణాఫ్రికా బ్యాటర్ల జోరు చూసి భారత్‌కు చిక్కులు తప్పవేమో అనుకుంటే.. ఆఖరి సెషన్లో మన బౌలర్లు గొప్పగానే పుంజుకున్నారు. 166/2తో ఉన్న దక్షిణాఫ్రికాను.. 247/6కు కట్టడి చేసిన భారత్ సంతృప్తికరంగా ఆటను ముగించింది.

సంతోషం సగం సగం

- రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 247/6

కుల్‌దీప్‌కు మూడు వికెట్లు



గువాహటి

సిరీస్ చేజారకూడదంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌ను టీమ్‌ఇండియా మెరుగ్గానే ఆరంభించింది. తొలిసారి టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యమిస్తున్న గువాహటిలో పిచ్ బౌలింగ్‌కు అంతగా సహకరించకపోయినప్పటికీ భారత బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేసి జట్టును మెరుగైన స్థితిలో నిలిపారు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. తొలి రోజు ఆట చివరికి 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (3/48) గొప్పగా బౌలింగ్ చేశాడు. బుమ్రా, జడేజా, సిరాజ్ తలో వికెట్ తీశారు. దక్షిణాఫ్రికా జట్టులో టాప్-4 బ్యాటర్లు మార్‌క్రమ్ (38; 81 బంతుల్లో 5×4), ర్యాన్ రికిల్‌టన్ (35; 82 బంతుల్లో 5×4), ట్రిస్టన్ స్టబ్స్ (49; 112 బంతుల్లో 4×4, 2×6), టెంబా బవుమా (41; 92 బంతుల్లో 5×4) జట్టుకు బలమైన పునాది వేశారు. అయితే వీళ్లందరినీ అర్ధ శతకం లోపే ఔట్ చేయడం.. ఇంకో రెండు వికెట్లు తీయడం ద్వారా ప్రత్యర్థిని భారత బౌలర్లు బాగానే కట్టడి చేశారు. సెనురాన్ ముత్తుసామి (25 బ్యాటింగ్), కైల్ వెరీన్ (1) క్రీజులో ఉన్నారు. రెండో రోజు తొలి సెషన్లోనే దక్షిణాఫ్రికాను ఆలౌట్ చేయడం కీలకం. క్రీజులో ఉన్న ఇద్దరితో పాటు మిగతా ముగ్గురు యాన్సెన్, హార్మర్, కేశవ్ సైతం ఓ మోస్తరుగా బ్యాటింగ్ చేయగలవాళ్లే కాబట్టి ఇన్నింగ్స్‌ను ముగించడానికి బౌలర్లు కష్టపడాల్సిందే.

చెమటోడ్చిన బౌలర్లు: చివరి ఎనిమిది టెస్టుల్లో ఏడుసార్లు టాస్ భారత్‌కు కలిసి రాని స్థితిలో రిషభ్ పంత్ సైతం టాస్ ఓడిపోగా.. దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిసారి టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యమిస్తున్న గువాహటిలో పిచ్ ఎలా స్పందిస్తుందో అని అందరూ ఆసక్తిగా ఎదురు చూశారు. ఉదయం పేసర్లను ఎదుర్కోవడం కష్టమన్న అంచనాలేమీ ఫలించలేదు. అయితే పిచ్‌తో సంబంధం లేకుండా బుమ్రా కట్టుదిట్టమైన బంతులతో దక్షిణాఫ్రికా ఓపెనర్లను పరీక్షించాడు. సిరాజ్ మాత్రం పెద్దగా ప్రభావం చూపలేదు. బుమ్రా వికెట్ తీసేలాగే కనిపించాడు. ఏడో ఓవర్లో మార్‌క్రమ్‌ను బుట్టలో వేసుకునేవాడే. కానీ రెండో స్లిప్‌లో కేఎల్ రాహుల్ తేలికైన క్యాచ్‌ను వదిలేయడంతో వికెట్ దక్కలేదు. అప్పటికి మార్‌క్రమ్ స్కోరు 4 పరుగులే. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న అతను.. చక్కటి షాట్లతో స్కోరు బోర్డును కదిలించాడు. మరో ఓపెనర్ రికిల్‌టన్ సైతం క్రీజులో కుదురుకున్నాక బౌండరీలకు దిగాడు. సిరాజ్ తర్వాత చేంజ్ బౌలర్‌గా వచ్చిన నితీశ్ కుమార్ రెడ్డి సైతం బ్యాటర్లను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయారు. కుల్‌దీప్ వచ్చాక మాత్రం మార్‌క్రమ్, రికిల్‌టన్ కొంత తడబడ్డారు. మిగతా స్పిన్నర్లు జడేజా, సుందర్‌లను మాత్రం వాళ్లిద్దరూ సమర్థంగా ఎదుర్కొన్నారు. వికెట్ కోల్పోకుండా తొలి సెషన్‌ను ముగించేలా కనిపించింది దక్షిణాఫ్రికా.


సిరాజ్, బుమ్రా, రాహుల్

అయితే సెషన్ చివర్లో మార్‌క్రమ్.. బుమ్రా బంతిని వికెట్ల మీదికి ఆడుకుని పెవిలియన్ చేరాడు. సంప్రదాయానికి భిన్నంగా ఈ మ్యాచ్‌లో లంచ్ కంటే ముందు టీ విరామం తీసుకోగా.. బ్రేక్ తర్వాత వెంటనే రికిల్‌టన్‌ను కుల్‌దీప్ స్లిప్ క్యాచ్‌తో ఔట్ చేశాడు. దీంతో దక్షిణాఫ్రికా 82/0 నుంచి 82/2కు చేరుకుంది. కానీ ట్రిస్టన్ స్టబ్స్‌తో కలిసి కెప్టెన్ బవుమా కీలక భాగస్వామ్యం నెలకొల్పడంతో దక్షిణాఫ్రికా మళ్లీ పుంజుకుంది. ఇద్దరూ ఆచితూచి ఆడుతూ.. వీలు చిక్కినపుడల్లా బౌండరీలు రాబట్టాడు. బవుమా చక్కటి గ్రౌండ్ షాట్లతో అలరిస్తే.. స్టబ్స్ కుల్‌దీప్ బౌలింగ్‌లో సిక్సర్ సహా భారీ షాట్లు ఆడాడు. లంచ్‌కు దక్షిణాఫ్రికా 166/2తో పటిష్ట స్థితిలో నిలిచింది.

వ్యూహాత్మకంగా..: తొలి రెండు సెషన్ల ఆట చూస్తే శనివారం దక్షిణాఫ్రికాది స్పష్టమైన పైచేయి అవుతుందనిపించింది. కానీ ఆఖరి సెషన్లో భారత్ గొప్పగా పుంజుకుంది. పరిస్థితులు స్పిన్‌కు మరీ అనుకూలంగా ఏమీ లేకపోయినా.. స్పిన్నర్లు వ్యూహాత్మకంగా బంతులేసి వికెట్లు పడగొట్టారు. టీ తర్వాత కోల్పోయినట్లే.. లంచ్ తర్వాత కూడా దక్షిణాఫ్రికా వెంటనే వికెట్ చేజార్చుకుంది. బవుమా కవర్స్‌లో షాట్లు ఆడే ప్రయత్నం చేస్తుండడంతో ఫీల్డర్‌ను కొంచెం వెనక్కి పెట్టి, జడేజా అతడికి ఊరించే బంతి వేయగా.. యశస్వి తక్కువ ఎత్తులో వచ్చిన క్యాచ్‌ను చక్కగా అందుకున్నాడు. దీంతో మూడో వికెట్ భాగస్వామ్యానికి 84 పరుగుల వద్ద తెరపడింది. స్టబ్స్ ఆ తర్వాత కూడా ధాటిని కొనసాగించినప్పటికీ.. ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. వరుస బౌండరీలతో 49 మీదికి వచ్చిన అతణ్ని కుల్‌దీప్ ఔట్ చేశాడు. స్లిప్‌లో ఒక సులువైన, ఒక కష్టమైన కాచ్‌లను చేజార్చిన రాహుల్.. మూడో ప్రయత్నంలో విజయవంతమయ్యాడు. ముల్డర్ (13)ను సైతం బవుమా తరహాలోనే బోల్తా కొట్టించింది భారత్. ఈసారి బౌలర్ కుల్‌దీప్ కాగా.. క్యాచ్ పట్టింది జైస్వాలే. తన పొజిషన్ కూడా కవర్సే. 201/5తో దక్షిణాఫ్రికా ఒక్కసారిగా ఇబ్బందుల్లో పడగా.. సెనురాన్‌తో కలిసి టోనీ డి జోర్జి (28) పోరాడాడు. ఇద్దరూ నిలకడగా ఆడుతుండడంతో సఫారీ జట్టు మరో వికెట్ కోల్పోకుండా ఆటను ముగిస్తుందనిపించింది. కానీ చివర్లో జోర్జిని ఔట్ చేసి సిరాజ్ వికెట్ల ఖాతా తెరిచాడు. ఈ క్యాచ్‌ను పంత్ డైవ్ చేస్తూ భలేగా అందుకున్నాడు. వెలుతురు మందగించడంతో 8.1 ఓవర్లు మిగిలుండగానే తొలి రోజు ఆట ముగిసింది.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (బి) బుమ్రా 38; రికిల్‌టన్ (సి) పంత్ (బి) కుల్‌దీప్ 35; స్టబ్స్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 49; బవుమా (సి) యశస్వి (బి) జడేజా 41; టోనీ డి జోర్జి (సి) పంత్ (బి) సిరాజ్ 28; ముల్డర్ (సి) యశస్వి (బి) కుల్‌దీప్ 13; సెనురాన్ బ్యాటింగ్ 25; వెరీన్ బ్యాటింగ్ 1; ఎక్స్‌ట్రాలు 17 మొత్తం: (81.5 ఓవర్లలో 6 వికెట్లకు) **247;** **వికెట్ల పతనం:** 1-82, 2-82, 3-166, 4-187, 5-201, 6-246; **బౌలింగ్:** బుమ్రా 17-6-38-1; సిరాజ్ 17.5-3-59-1; నితీశ్‌కుమార్ రెడ్డి 4-0-21-0; సుందర్ 14-3-36-0; కుల్‌దీప్ 17-3-48-3; జడేజా 12-1-30-1

తుది జట్టు.. అనుకున్నట్లే!

దక్షిణాఫ్రికాతో తొలి టెస్టుకు తుది జట్టులో నలుగురు స్పిన్నర్లను ఆడించి బోల్తా కొట్టిన టీమ్‌ఇండియా.. రెండో టెస్టుకు అనుకున్నట్లే మార్పులు చేసింది. అక్షర్ పటేల్‌ను తప్పించి పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిని ఆడించింది. గాయంతో మ్యాచ్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్ స్థానంలో సాయి సుదర్శన్‌ను ఎంచుకుంది. దక్షిణాఫ్రికా తుది జట్టులో ఒక మార్పు చేసింది. పేస్ ఆల్‌రౌండర్ కార్బిన్ బోష్ స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ సెనురాన్ ముత్తుస్వామిని తీసుకుంది.

దంచేసిన హెడ్

యాషెస్ తొలి టెస్టు

- ఇంగ్లాండ్‌పై ఆస్ట్రేలియా ఘనవిజయం
- రెండు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్



పెర్త్

యాషెస్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన క్రికెట్ అభిమానులకు కాస్త నిరాశే. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య శుక్రవారం మొదలైన తొలి టెస్టు ఆదివారం వరకు కూడా నిలవలేదు. పేసర్ల ఆధిపత్యం సాగిన మ్యాచ్ రెండు రోజుల్లోనే ముగిసింది. కానీ ముగింపు ధమాకా మాత్రం బ్యాటర్‌దే. పేసర్లు విజృంభించిన పిచ్‌పై ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో ఆతిథ్య జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో హెడ్ (123; 83 బంతుల్లో 16×4, 4×6) మెరుపు శతకం బాదడంతో ఆస్ట్రేలియా శనివారం 8 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. హెడ్‌తో పాటు లబుషేన్ (51 నాటౌట్; 49 బంతుల్లో 6×4, 1×6) రాణించడంతో 205 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 28.2 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఇంగ్లాండ్ పేసర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఉదయం 123/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా.. 132 పరుగులకు ఆలౌటైంది. 40 పరుగుల ఆధిక్యం సంపాదించిన ఇంగ్లాండ్.. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌటైంది. అట్కిన్సన్ (37) టాప్ స్కోరర్. ఒలీ పోప్ 33 పరుగులు చేశాడు. క్రాలీ డకౌటైనప్పటికీ పోప్‌తో పాటు డకెట్ (28) నిలవడంతో ఇంగ్లాండ్ ఓ దశలో 65/1తో మెరుగ్గానే కనిపించింది. కానీ కంగారూ బౌలర్ల ధాటికి 23 పరుగుల వ్యవధిలో అయిదు వికెట్లు కోల్పోయి 88/6తో నిలిచింది. 104 వద్ద జేమీ స్మిత్ (15) కూడా వెనుదిరిగాడు. ఆ దశలో అట్కిన్సన్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కార్స్ (20)తో ఎనిమిదో వికెట్‌కు అతడు 50 పరుగులు జోడించడంతో ఇంగ్లాండ్.. 200పై లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. అట్కిన్సన్ ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. బోలాండ్ (4/33), స్టార్క్ (3/55), డాగెట్ (3/51) ఇంగ్లాండ్ పతనాన్ని శాసించారు. ఈ విజయంతో అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ 1-0 ఆధిక్యం సంపాదించింది. సొంతగడ్డపై యాషెస్‌లో తన అజేయ రికార్డును ఆసీస్ 16 మ్యాచ్‌లకు పెంచుకుంది. రెండో టెస్టు డిసెంబరు 4న మొదలవుతుంది.

ఛేదన అలవోకగా..: వరుసగా మూడు ఇన్నింగ్స్‌లో పేసర్ల ధాటికి బ్యాటర్లు బెంబేలెత్తిపోవడంతో 205 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా చెమటోడ్చక తప్పదనే అనుకున్నారంతా! కానీ ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకున్న హెడ్.. ఊహకందని విధంగా చెలరేగిపోయాడు. విధ్వంసక షాట్లతో ఇంగ్లాండ్ బౌలింగ్‌ను తుత్తునియలు చేశాడు. టీ20 క్రికెట్లోలా ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు బాదిన హెడ్.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వెదరాల్డ్ (23)తో తొలి వికెట్‌కు 75 పరుగులు, లబుషేన్‌తో రెండో వికెట్‌కు 117 పరుగులు జోడించి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. జట్టు స్కోరు 192 వద్ద అతడు ఔట్ కాగా.. కెప్టెన్ స్మిత్ (2 నాటౌట్)తో కలిసి లబుషేన్ లాంఛనాన్ని పూర్తి చేశాడు. హెడ్ 69 బంతుల్లోనే సెంచరీ సాధించడం విశేషం. టెస్టు మ్యాచ్ నాలుగో ఇన్నింగ్స్‌లో ఓ బ్యాటర్ చేసిన వేగవంతమైన శతకం ఇదే. ఇంగ్లాండ్ బ్యాటర్ గిల్బర్ట్ జెసాప్ (76 బంతుల్లో; 1902లో ఆస్ట్రేలియాపై) పేరిట ఉన్న రికార్డును హెడ్ బద్దలు కొట్టాడు.

26

టెస్టు క్రికెట్ చరిత్రలోనే రెండు రోజుల్లోనే ముగిసిన 26వ టెస్టు ఇది. యాషెస్‌లో మాత్రం ఓ మ్యాచ్ రెండో రోజు దాటకపోవడం 1921 తర్వాత ఇదే తొలిసారి.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 172; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 132; ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: 164 (అట్కిన్సన్ 37, ఒలీ పోప్ 33, డకెట్ 28; బోలాండ్ 4/33, డాగెట్ 3/51, స్టార్క్ 3/55); ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 205/2 (ట్రావిస్ హెడ్ 123, లబుషేన్ 51 నాటౌట్, వెదరాల్డ్ 23; కార్స్ 2/44)

మహిత్ ఖాతాలో నాలుగో పతకం

50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో స్వర్ణం



దిల్లీ: డెఫ్లింపిక్స్‌లో మహిత్ సంధు అదరగొడుతోంది. ఆమె ఈ పోటీల్లో నాలుగో పతకాన్ని ఖాతాలో వేసుకుంది. శనివారం మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో ఈ భారత షూటర్ స్వర్ణం సాధించింది. ఫైనల్లో మహిత్ 456 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. తుది పోరు చేరే క్రమంలో ఆమె 585 పాయింట్లతో క్వాలిఫికేషన్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది. తన పేరిటే ఉన్న రికార్డు (576)ను అధిగమించింది. ఈ ఈవెంట్లో దయన్ జంగ్ (కొరియా, 453.5) రజతం, సుజ్‌సనా (హంగేరీ, 438.6) కాంస్యం సాధించారు. ఇంతకుముందు ధనుష్ శ్రీకాంత్ జోడీగా 10 మీటర్ల మిక్స్‌డ్ రైఫిల్ టీమ్ స్వర్ణం గెలిచిన మహిత్.. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో రజతాలు గెలుచుకుంది. ఈ పోటీల్లో ఇప్పటిదాకా భారత్ 14 పతకాలు (5 స్వర్ణాలు, 6 రజతాలు, 3 కాంస్యాలు) సాధించింది.



టైటిల్ పోరుకు లక్ష్యసేన్

ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో లక్ష్యసేన్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శనివారం పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అతడు 17-21, 24-22, 21-16తో ప్రపంచ ఆరో ర్యాంకు ప్లేయర్ చౌతిన్ చెన్ (చైనీస్ తైపీ)పై గెలిచాడు. ఈ పోరు ఆరంభంలో లక్ష్య తడబడ్డాడు. దూకుడుగా ఆడిన చెన్ 14-7తో ఆధిక్యంలో నిలిచాడు. భారత షట్లర్ కాస్త ఆలస్యంగా పుంజుకున్నా.. ప్రత్యర్థిని గేమ్ గెలవకుండా ఆపలేకపోయాడు. రెండో గేమ్ హోరాహోరీగా సాగింది. ఒక దశలో 20-20తో స్కోర్లు సమమయ్యాయి. ఈ స్థితిలో మూడు మ్యాచ్ పాయింట్లు కాచుకున్న లక్ష్య.. గేమ్ గెలిచి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో లక్ష్య ఎదురుదాడి చేశాడు. 14-7తో ఆధిక్యంలో నిలిచిన అతడు.. అదే జోరుతో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో యుషి తనకా (జపాన్)తో లక్ష్య తలపడనున్నాడు. మరో సెమీస్‌లో యుషి 21-18, 21-15తో లిన్ చెన్ (చైనీస్ తైపీ)పై గెలిచాడు.

విశాఖ వన్డేకు 28 నుంచి టికెట్ల అమ్మకం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో డిసెంబరు 6న భారత్- దక్షిణాఫ్రికా మధ్య మూడో వన్డే కోసం ఈనెల 28న టికెట్ల విక్రయాలు ప్రారంభంకానున్నాయి. మొత్తం 22 వేల టికెట్లు అందుబాటులో ఉంటాయి. భారత్, దక్షిణాఫ్రికా జట్లు డిసెంబరు 4న విశాఖ చేరుకుంటాయి. క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని.. పిచ్, స్టేడియం సన్నద్ధత, భద్రత, ఆతిథ్యం, టికెట్ల విక్రయాలు.. తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి, ఎంపీ సానా సతీష్‌బాబు వెల్లడించారు.

విండీస్‌పై కివీస్ క్లీన్‌స్వీప్


హామిల్టన్: వెస్టిండీస్‌పై ఇప్పటికే టీ20 సిరీస్‌ను గెలిచిన న్యూజిలాండ్.. మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం చివరి వన్డేలో ఆ జట్టు 4 వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించింది. మొదట కరీబియన్ జట్టు 36.2 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌటైంది. రూథర్‌ఫర్డ్ (38), క్యాంప్‌బెల్ (26), పియెర్ (22 నాటౌట్) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. హెన్రీ (4/43), డఫీ (2/27), శాంట్నర్ (2/27) ప్రత్యర్థిని కట్టడి చేశారు. మార్క్ చాప్‌మన్ (64), మైకేల్ బ్రాస్‌వెల్ (40 నాటౌట్) సత్తా చాటడంతో కివీస్ 30.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. విండీస్ బౌలర్లలో మాథ్యూ ఫోర్డ్ (2/46), జేడన్ సీల్స్ (2/35) ఆకట్టుకున్నారు.



వన్డే సిరీస్‌కూ గిల్ దూరం?

గువాహటి: టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు కూడా దూరం కావచ్చు. గాయం వల్ల తొలి టెస్టు నుంచి అర్ధాంతరంగా వైదొలగిన అతడు.. రెండో టెస్టులోనూ బరిలోకి దిగని సంగతి తెలిసిందే. గిల్ మెడ నొప్పి తగ్గడానికి ఇంకా సమయం పడుతుందని సమాచారం. అతడి స్థానంలో పంత్ లేదా రాహుల్ వన్డే జట్టుకు నాయకత్వం వహించనున్నారు. గిల్ ప్రస్తుతం ముంబయిలో ఉన్నాడు. అక్కడ అతడు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాడు. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ సమయానికి గిల్ కోలుకుంటాడని సెలక్టర్లు ఆశిస్తున్నట్లు ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. గిల్ దూరమైతే.. రోహిత్‌తో కలిసి యశస్వి భారత ఇన్నింగ్స్‌ను ఆరంభించే అవకాశముంది. అభిషేక్ శర్మ రిజర్వ్ ఓపెనర్‌గా ఉండొచ్చు. హర్షిత్ రాణా, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ పేస్ భారాన్ని మోస్తారు. ఆకాశ్ దీప్ కూడా జట్టులో స్థానం కోసం పోటీపడుతున్నాడు. బుమ్రాకు విశ్రాంతినివ్వనున్నారు. వ్యక్తిగత కారణాలతో కుల్‌దీప్ యాదవ్ కూడా విశ్రాంతి తీసుకుంటాడని సమాచారం. అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, సుందర్ స్పిన్ బాధ్యతలు పంచుకుంటారు.

శ్రేయస్ అప్పటిదాకా..



ముంబయి: టీమ్‌ఇండియా వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయం నుంచి కోలుకోవడానికి అనుకున్న దాని కంటే ఎక్కువ సమయమే పట్టనుంది. అతను ఇంకో రెండు నెలల తర్వాత కానీ మైదానంలోకి రాలేడట. ఈ నెల 16న ఆస్ట్రేలియాతో రెండో వన్డే సందర్భంగా క్యాచ్ పట్టే ప్రయత్నంలో డైవ్ చేయగా.. అతడి కడుపులో తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో రెండు రోజులు ఐసీయూలో ఉండి చికిత్స చేయించుకున్న అతను.. అక్కడి నుంచి డిశ్చార్జి అయి స్వదేశానికి వచ్చాడు. లోపల గాయం పూర్తిగా మాని, శ్రేయస్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడానికి రెండు నెలలకు పైగానే సమయం పడుతుందట. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు కూడా అతను అందుబాటులోకి రాడట. ఫిట్‌నెస్ సాధించినా మ్యాచ్ ప్రాక్టీస్ ఉండదు కాబట్టి ఫిబ్రవరి-మార్చి నెలల్లో జరిగే టీ20 ప్రపంచకప్ ఎంపికకు శ్రేయస్ పేరును సెలక్టర్లు పరిగణనలోకి తీసుకోవడం కష్టమే. బహుశా మళ్లీ ఐపీఎల్‌లోనే అతణ్ని మైదానంలో చూస్తామేమో!

క్వార్టర్స్‌లో భారత్ ఓటమి

ప్రపంచ మహిళల టీమ్ చెస్

లినారెస్ (స్పెయిన్): ప్రపంచ మహిళల టీమ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో 1-2తో కజకిస్థాన్ చేతిలో ఓడిపోయింది. క్వార్టర్స్‌లో ఆరంభం నుంచే భారత్ తడబడింది. తొలి గేమ్‌ను కజకిస్థాన్ 3-1తో చేజిక్కించుకుంది. రెండో గేమ్‌లో భారత్ పుంజుకుంది. 2.5-1.5తో గెలిచి ఈ పోరులో నిలిచింది. నిర్ణయాత్మక ప్లేఆఫ్‌లో కజకిస్థాన్‌దే పైచేయి అయింది. ఆ జట్టు 2.5-1.5తో భారత్‌పై పైచేయి సాధించి సెమీఫైనల్లో ప్రవేశించింది.

పంకజ్ బృందం పరాజయం

మస్కట్: ప్రపంచకప్ స్నూకర్ టోర్నీలో భారత్-ఎకు షాక్ తగిలింది. శనివారం సెమీఫైనల్లో 1-3తో పాకిస్థాన్ చేతిలో ఓడింది. అయిదు ఫ్రేమ్‌ల ఈ పోరులో మొదట స్టార్ ఆటగాడు పంకజ్ అడ్వాణీ 85-21తో ఇక్బాల్‌ను ఓడించి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. డబుల్స్‌లో బ్రిజేశ్ దమాని 77-120తో మహ్మద్ ఆసిఫ్ చేతిలో ఓడాడు. తర్వాత పంకజ్-దమాని జంట 47-76తో ఆసిఫ్-ఇక్బాల్ చేతిలో కంగుతినడంతో భారత్ 1-2తో వెనుకబడింది. ఆపై సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన పంకజ్ కూడా తడబడ్డాడు. అతడు 61-73తో ఆసిఫ్ చేతిలో ఓడడంతో భారత్‌కు పరాజయం తప్పలేదు.

శ్రీలంకపై పాకిస్థాన్ విజయం

రావల్పిండి: టీ20 ముక్కోణపు సిరీస్ మ్యాచ్‌లో పాకిస్థాన్ శనివారం 7 వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. మొదట శ్రీలంక 7 వికెట్లకు 128 పరుగులే చేయగలిగింది. జనిత్ లియనాగె (41 నాటౌట్) టాప్ స్కోరర్. నవాజ్ (3/16) లంకను దెబ్బతీశాడు. అబ్రార్ (1/28), సల్మాన్ మిర్జా (1/26) కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ (80 నాటౌట్) చెలరేగడంతో లక్ష్యాన్ని పాకిస్థాన్ 15.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

కొరియాతో భారత్ ఢీ

అజ్లాన్‌షా కప్ హాకీ

ఇపో (మలేసియా): అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌కు వేళైంది. ఆదివారం తొలి మ్యాచ్‌లో కొరియాతో అయిదుసార్లు ఛాంపియన్ భారత్ తలపడనుంది. 2019లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత ఈ టోర్నీ బరిలో దిగడం భారత్‌కు ఇదే తొలిసారి. సంజయ్ సారథ్యంలోని భారత్.. 24న బెల్జియం, 26న మలేసియా, 27న న్యూజిలాండ్, 29న కెనడాతో ఆడుతుంది. 2026లో ప్రపంచకప్, ఆసియా క్రీడలు జరగనున్న నేపథ్యంలో జట్టు కూర్పును సరిచూసుకోవడానికి ఈ టోర్నీ ఉపయోగపడుతుందని భారత్ భావిస్తోంది. మోహిత్, సందీప్, యశ్‌దీప్ లాంటి యువ ఆటగాళ్లతో పాటు రాజ్‌కుమార్, నీలకంఠ శర్మ, వివేక్ సాగర్ లాంటి సీనియర్లతో జట్టు సమతూకంగా ఉంది.



ఈనాడు



విజయవాడ 23-11-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 103

THE LARGEST CIRCULATED TELUGU DAILY


రూ. 8-00 పేజీలు 16+28 www.eenadu.net


Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆధ్యాత్మిక సారథి.. ప్రేమ వారధి

మానవ సేవే మాధవ సేవ... అంటారు!
అలా.. మానవుడినే మాధవుడిగా భావించి
ఎనలేని సేవ చేస్తే.. ఏమనాలి?
ప్రేమతో పాటు... మానవత్వాన్ని నింపితే ఏమనాలి?
శ్రీసత్యసాయి అనాలి!
తడారిన నేలగా...
తెలుగు ఎడారిగా పేరొందిన అనంతపురం జిల్లాలో..
అపర భగీరథునిలా నీరు పారించినా...
విలువలే పునాదిగా... కేజీ నుంచి పీజీ దాకా
విద్యాకేంద్రాలు ఆరంభించినా...
ఆపన్నులను నారాయణ సేవతో అన్నపూర్ణలా ఆదుకున్నా..
అనారోగ్యానికి ఉచితంగా ఉన్నత వైద్యం
అందించే ఆసుపత్రులు కట్టించినా...
అన్నింటివెనకా ఉన్నది..
లవ్ ఆల్ - సర్వ్ ఆల్... అనే
మహోన్నత తత్వమే!
ఆధ్యాత్మికత అంటే... అందరిలో తనను
చూసుకోవడమేనని..
నిరపేక్షంగా ప్రేమించడమని...
నిష్కామంగా సేవించడమని..
భక్తిలోనూ బాధ్యతుందని.. ఆచరించి
చూపిన... సత్యాన్వేషి... ప్రేమాభిలాషి...
సేవారుషి... ప్రశాంతనిలయ వాసి...
పుట్టపర్తి సత్యసాయి బాబా!
ఆ మహనీయుని శతజయంతి వేళ...
ఈనాడు అందిస్తున్న అక్షరనివాళి...
నిత్యస్ఫూర్తి... సత్యసాయి
గ్రామ సేవే... రామ సేవ
ఓ అద్భుతం జరిగింది..
ఎడారి నేల తడిసింది
అమ్మకిచ్చిన మాటకోసం...
అందరికీ ఉచిత వైద్యం...
.... ఆదివారం మేగజైన్‌లో

ఆధ్యాత్మికత మానవతల కలబోత సంపాదకీయం 4లో





శతజయంతి వేడుకల్లో ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. వేదికపై మంత్రి లోకేశ్, సీఎం చంద్రబాబు, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే

మానవతా విలువలే సత్యసాయి బోధనలు

బాబా సందేశంతో కోట్ల మంది భక్తుల సేవామార్గం

శతజయంతి వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఈనాడు - పుట్టపర్తి

ఆధ్యాత్మికంతో పాటు సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే మానవతా విలువలను పాఠాలుగా బోధిస్తూ కోట్ల మంది భక్తుల గుండెల్లో సత్యసాయి కొలువయ్యారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు శనివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్, మంత్రులు, అధికారులు రాష్ట్రపతికి స్వాగతం పలికారు. ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం పూర్ణచంద్ర ఆడిటోరియంలో సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడారు. అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు అన్న బాబా నినాదం విశ్వవ్యాప్తం, శాశ్వతం అయ్యిందన్నారు. 1969లోనే బాలికల విద్య కోసం ప్రత్యేక మహిళా క్యాంపస్ ప్రారంభించడం నారీ శక్తిపై బాబాకు ఉన్న దూరదృష్టిని స్పష్టం చేస్తుందన్నారు. దేశాభివృద్ధిలో ధార్మిక, సేవా, ఎన్జీవో, ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ శతజయంతి అందరికీ స్ఫూర్తిదాయకం కావాలని, ప్రపంచ శాంతి కోసం కలిసి పనిచేయాలని రాష్ట్రపతి ముర్ము పిలుపునిచ్చారు.

శాంతికి బ్రాండ్ అంబాసిడర్ సత్యసాయి బాబా: చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. సేవ, శాంతికి బ్రాండ్ అంబాసిడర్‌గా బాబా నిలుస్తారని పేర్కొన్నారు. తాగునీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని బాబా భావించారని, ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు (మిగతా 10లో)

2047 నాటికి ప్రపంచ మేటిగా భారత్



- ఇతరుల కోసమూ బతకడమే సత్యసాయి విధానం
- విద్యార్థులు గొప్ప సమాజాన్ని నిర్మించగలరనే నమ్మకం కలిగింది
- సత్యసాయి యూనివర్సిటీ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ 10లో



నేడే సత్యసాయి శతజయంతి 10లో

డ్రగ్స్-ఉగ్ర బంధాలకు అడ్డుకట్ట

అభివృద్ధి ప్రామాణికాలను పునర్నిర్వచిద్దాం • జీ20 సదస్సులో ప్రధాని మోదీ



జీ20 శిఖరాగ్ర సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

జొహన్నెస్‌బర్గ్: ఉగ్రవాదులకు, మాదకద్రవ్యాలకు మధ్యనున్న సంబంధాలకు అడ్డుకట్ట వేద్దామని భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈ మేరకు కూటమి దేశాలు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ప్రతిపాదించారు. ఆరోగ్య రక్షణకు ప్రపంచవ్యాప్త ప్రతిస్పందన బృందం ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. అత్యవసర పరిస్థితిలో రంగంలో దిగేందుకు ఇది సన్నద్ధంగా ఉండాలన్నారు. జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సు శనివారం జొహన్నెస్‌బర్గ్‌లో ప్రారంభమైంది. పర్యావరణ సమతౌల్యాన్ని పరిరక్షిస్తూ, సాంస్కృతికంగా సమున్నతంగా ఉంటూ, సామాజిక జీవనాన్ని మెరుగుపరిచేలా 'ప్రపంచవ్యాప్త సంప్రదాయ విజ్ఞాన నిధి'ని జీ20లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మోదీ నొక్కి చెప్పారు. 'సమ్మిళిత, సుస్థిర ఆర్థికాభివృద్ధి' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 'అభివృద్ధి ప్రామాణికాలను పునర్నిర్వచించుకునేందుకు ఇది సరైన తరుణం. సమ్మిళిత, సుస్థిర వృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలి. భారతీయ నాగరికత విలువలు, ముఖ్యంగా సమగ్ర మానవత్వ సూత్రాలు దీనికి దారి చూపిస్తాయి. మాదకద్రవ్యాలు మనకు పెను సవాల్‌గా మారాయి. అత్యంత ప్రమాదకరమైన ఫెంటనిల్ వంటివి విస్తృతంగా లభ్యమవుతున్నాయి. (మిగతా 2లో)


కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ

- వైకాపా హయాంలో 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు
- అందులో 68 లక్షల కిలోలు కల్తీనే
- నిగ్గు తేల్చిన సిట్



తిరుమల, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో 2019 నుంచి 2024 మధ్య 20.01 కోట్ల శ్రీ వేంకటేశ్వరస్వామి లడ్డూలను కల్తీ నెయ్యితోనే తయారు చేశారని సిట్ విచారణలో తేలింది. మొత్తం 48.76 కోట్ల లడ్డూలను తయారు చేయగా అందులో దాదాపు 40 శాతం పామాయిల్, పామ్‌కెర్నల్ ఆయిల్, ఇతర రసాయనాలతో తయారు చేశారని నిర్ధారణయింది. వైకాపా ప్రభుత్వంలోని తితిదే ధర్మకర్తల మండలి నెయ్యి సరఫరాకు ఉత్తరాఖండ్‌కు చెందిన భోలేబాబా డెయిరీ, తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ, తిరుపతి జిల్లా పునబాకలోని వైష్ణవి డెయిరీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాల్‌గంగ డెయిరీలకు రూ.250 కోట్లు చెల్లించింది. ఈ డెయిరీల నుంచి మొత్తం 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేయగా.. అందులో 68 లక్షల కిలోలు కల్తీనే. శ్రీవారి ఆలయంలో రోజూ 3.5-4 లక్షల లడ్డూలు (మిగతా 2లో)

మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనండి




2.04 లక్షల టన్నులు సేకరించండి

ముంబయి, కోల్‌కతా మార్కెట్లలో అరటి విక్రయాలకు చర్యలు తీసుకోండి

అధికారులకు చంద్రబాబు ఆదేశం

పత్తి, మొక్కజొన్న రైతుల్ని ఆదుకోవాలని కేంద్రానికి లేఖ



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2.04 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అధికారుల్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయించేందుకు ప్రయోగాత్మకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమలో పండిన అరటిని ముంబయి, కోల్‌కతా తదితర ప్రాంతాలకు రైల్వే వ్యాగన్ల ద్వారా తరలించి.. విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కేంద్రానికి లేఖ రాసినట్టు వివరించారు. అరటి ధరలు, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులతో పుట్టపర్తి నుంచి శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'అరటి కొనుగోళ్ల గురించి రోజూ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించండి. డిసెంబర్ మొదటి వారం నుంచి మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉన్నందున అప్పటి వరకు రైతులు నష్టపోకూడదు. ఎప్పటికప్పుడు అరటిని రవాణా చేసేలా చర్యలు తీసుకోండి. మద్దతు ధర కంటే మొక్కజొన్న తక్కువ పలుకుతున్నందున ధరల స్థిరీకరణ నిధి ద్వారా చెల్లించే అవకాశాన్ని పరిశీలించండి' అని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాయలసీమలో 40 వేల హెక్టార్లలో అరటి, రాష్ట్రవ్యాప్తంగా 1.42 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగవుతోందని అధికారులు సీఎంకు వివరించారు. 8.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందన్నారు.

రంగు మారిన, తడిచిన పత్తినీ కొనుగోలు చేయాలి: రంగు మారిన, తడిచిన పత్తినీ కొనేలా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. 'పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి నష్టం జరిగినా సహించేది లేదు. కొనుగోలు కేంద్రాల్ని రోజూ తనిఖీ చేయండి. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోండి. సమీపంలోని జిన్నింగ్ మిల్లులకే పత్తిని రవాణా చేసేలా చర్యలు చేపట్టండి. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనలతో పత్తి రైతు నష్టపోకూడదు' అని సీఎం నిర్దేశించారు. రెండు, మూడు రోజుల్లో వర్ష సూచనల నేపథ్యంలో స్లాట్ బుకింగ్ సమస్యను సీసీఐ పరిష్కరించిందని అధికారులు తెలిపారు.



హైదరాబాద్‌లో తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి సమక్షంలో లొంగిపోయిన రాష్ట్ర కమిటీ సభ్యులు రమేశ్, ఎర్ర, ఆజాద్ ఇతర మావోయిస్టులు

భారీ లొంగుబాటు

- తెలంగాణ చరిత్రలో ఐదో అతి పెద్దది
- జనజీవన స్రవంతిలోకి 37 మంది మావోయిస్టులు
- 8 ఆయుధాల అప్పగింత.. రూ.1.41 కోట్ల రివార్డు అందజేత

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ చరిత్రలో మరో భారీ లొంగుబాటు ఇది. పార్టీకి మూలస్తంభాలుగా ఉన్న అగ్రనేతలు పలువురు ఈ ఏడాదే ఎన్‌కౌంటర్లలో మరణించగా.. తాజాగా పలువురు నేతలు ఆయుధాల్ని వదిలి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. తెలంగాణ డీజీపీ బి.శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి సమక్షంలో శనివారం ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు సహా మొత్తం 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. రాష్ట్ర చరిత్రలో ఇది ఐదో అతిపెద్ద లొంగుబాటు. 2021 సెప్టెంబరులో 52 మంది, ఈ ఏడాది మార్చి 15న 64 మంది, ఏప్రిల్ 5న 86 మంది, మే 9న 38 మంది లొంగిపోయారు. రాష్ట్ర కమిటీ సభ్యుల హోదాలో ఉన్న కొయ్యడ సాంబయ్య ఎలియాస్ ఆజాద్(49), అప్పాసి నారాయణ ఎలియాస్ రమేశ్(70).. ముచ్చకి సోమడ ఎలియాస్ ఎర్ర(42)తోపాటు డివిజనల్, ఏరియా కమిటీ సభ్యులు తాజాగా లొంగిపోయారు. వీరిలో 8 మంది తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఒక ఏకే-47, రెండు ఎస్ఎల్ఆర్‌లు, నాలుగు 303 తుపాకులు, ఒక జీ3 తుపాకీ, 346 తూటాలను అప్పగించినందుకు ప్రభుత్వం వారికి ప్రత్యేక రివార్డు ఇచ్చింది. మొత్తంగా ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులకు రూ.20 లక్షల చొప్పున రివార్డుతోసహా అందరికీ కలిపి రూ.1.41 కోట్లను పోలీసులు అందజేశారు. వీరు వారం రోజుల క్రితమే అడవులను వదిలి పోలీసులకు లొంగిపోయారు. చికిత్స పొందడంలాంటి కారణాలతో శనివారం లొంగిపోయినట్లు ప్రకటించారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావుకు సమాచారం అందించిన తర్వాతే తాము పార్టీని వీడినట్లు (మిగతా 2లో)

బంగాళాఖాతంలో అల్పపీడనం

తుపానుగా మారితే 'సెన్‌యార్' అని పేరు

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో అండమాన్ సమీపంలో శనివారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. తర్వాత అదే దిశలో పయనిస్తూ.. బుధవారం నాటికి మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. ఇది తుపానుగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. తుపానుగా మారితే 'సెన్‌యార్' అని ఐఎండీ నామకరణం చేయనుంది. ఈ పేరును యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సూచించింది. అయితే, తుపాను తీరం దాటే ప్రాంతంపై ఇంకా స్పష్టత రాలేదని నిపుణులు చెబుతున్నారు. ఇది సముద్రంలోనే దిశ మార్చుకునే అవకాశముందని చెబుతున్నారు. దీని ప్రభావంతో ఈ నెల 28 నుంచి డిసెంబరు 1 వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆదివారం ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది.

లోపలి పేజీల్లో

వైద్యసేవల్లో ఇంత నిర్లక్ష్యమా?
ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం
కాకినాడ, రాజమహేంద్రవరం ఘటనల బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం
హుటాహుటిన కదిలిన యంత్రాంగం

తెలుగుగంగ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఉద్యోగం ఇవ్వాల్సిందే
సాంకేతిక కారణాలతో ఉద్యోగ హామీని నిరాకరించడానికి వీల్లేదు: హైకోర్టు

రూ.7 కోట్ల దోపిడీ కేసులో కానిస్టేబులే సూత్రధారి
ఏటీఎం వాహనాన్ని అడ్డగించి సొమ్ము దోపిడీ
60 గంటల్లో ఛేదించిన బెంగళూరు పోలీసులు

రూ.9,490 కోట్లతో...

నాలుగు కీలక హైవేల విస్తరణ

మొత్తంగా 243.3 కి.మీ. మేర అభివృద్ధి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నాలుగు కీలక హైవేల విస్తరణకు రంగం సిద్ధమైంది. పెడన- విస్సన్నపేట- లక్ష్మీపురం, ఆకివీడు-దిగమర్రు, అమలాపురం-రావులపాలెం, ముద్దనూరు-కడప మధ్య 243.3 కి.మీ.ల విస్తరణకు అధికారులు సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు సిద్ధంచేసి జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ(మోర్త్)కు పంపారు. భూసేకరణ, సివిల్ పనులు తదితరాలన్నీ కలిపి ఈ ప్రాజెక్టులకు రూ.9,490 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. వచ్చే మార్చిలోపు అనుమతులు రానున్నట్లు తెలుస్తోంది. అనంతరం భూసేకరణ, టెండర్ల ప్రక్రియ మొదలవుతాయి.
■ కృష్ణా జిల్లాలోని పెడన నుంచి గుడివాడ, నూజివీడు, విస్సన్నపేట (మిగతా 10లో)

గూగుల్ డేటా సెంటర్ భూ సేకరణకు అడ్డుపడే కుట్ర!

- రైతుల ఫోర్జరీ సంతకాలు, మరణించిన వారి పేరుతో కోర్టులో పిటిషన్లు
- రైతులు భూములు ఇవ్వకుండా రెచ్చగొట్టే చర్యలు
- ఎక్కువ మొత్తం చెల్లిస్తామని ప్రలోభాలు



విశాఖ జిల్లాలో తర్లువాడ వద్ద గూగుల్‌కు కేటాయించిన భూములు

ఈనాడు, విశాఖపట్నం, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ప్రాజెక్టు.. గూగుల్ డేటా సెంటర్. ఐటీ దిగ్గజ సంస్థ ఏకంగా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో విశాఖలో దీన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం చేస్తున్న భూసేకరణకు కొన్ని దుష్టశక్తులు అడ్డుపడుతున్నాయి. కొందరు రైతుల ఫోర్జరీ సంతకాలతో, చనిపోయిన రైతు పేరుతో హైకోర్టులో పిటిషన్ వేశాయి. గూగుల్ ప్రాజెక్టుకు భూములు ఇవ్వొద్దని మిగతా రైతులనూ రెచ్చగొడుతున్నాయి. ఆ భూములు తమకే ఇస్తే ఎక్కువ డబ్బులిస్తామని ప్రలోభపెడుతున్నాయి. దీనిపై స్థానిక తహసీల్దార్ ఈ నెల 3న ఫిర్యాదు చేస్తే.. పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు.

విశ్రాంత ఐఏఎస్ బినామీనే ఆయన!

వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖ చుట్టుపక్కల రైతులను మభ్యపెట్టి డీ-పట్టా భూముల్ని కొనేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న విశ్రాంత ఐఏఎస్ అధికారికి బినామీగా ఉన్న వ్యక్తే ఇప్పుడు ఈ కుట్ర పన్నారు. అప్పట్లో వైకాపా ప్రభుత్వం ఫ్రీహోల్డ్ పేరుతో డీ పట్టా భూముల విక్రయాలకు తెర తీయడంతో. . ఆ విషయం బయటకు రావడానికి ముందే అప్పుడు ఉన్నత స్థానంలో ఉన్న ఆ ఐఏఎస్ అధికారి విశాఖ చుట్టుపక్కల ఎడాపెడా ఆ భూములు కొనుగోలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఆయన తరఫున బినామీగా వ్యవహరించిన వ్యక్తి భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలంలోని తర్లువాడలో రైతులకు అడ్వాన్సులు చెల్లించి, వారితో ఒప్పందాలు చేసుకొని డీ పట్టా భూములను గుప్పిట్లో పెట్టుకున్నారు. ఇప్పుడు అదే తర్లువాడలో 308 ఎకరాల్ని గూగుల్‌కు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో 200 ఎకరాల డీ పట్టా, శివాయ్ జమేదార్ (మిగతా 2లో)

ఆరు నెలల్లోగా రాజధాని రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

స్వార్థం కోసం కొందరు చెప్పే మాటలు నమ్మొద్దు: త్రిసభ్య కమిటీ



మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్. చిత్రంలో పురపాలకశాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-తుళ్లూరు: రాజధాని రైతుల సమస్యలను ఆరు నెలల్లోగా పరిష్కరిస్తామని త్రిసభ్య కమిటీ హామీ ఇచ్చింది. స్వార్థం కోసం ఒకరిద్దరు చెప్పే మాటలు నమ్మొద్దని, రెండు వారాలకోసారి సమావేశమై రైతుల సమస్యలను పరిష్కరించేలా ముందుకెళతామని స్పష్టం చేసింది. రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించిన కమిటీ రాయపూడి ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో శనివారం సమావేశమైంది. కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవ్‌తేజ, గుత్తేదారులు, రైతు ఐకాస నేతలు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారంలో జాప్యం ఎందుకు జరిగిందని అధికారులను పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశ్నించారు. వారు చెప్పిన సమాధానాలపై రైతుల అభిప్రాయాలను తీసుకున్నారు. కమిటీ సభ్యులు చర్చించిన అంశాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

నిర్దిష్ట కాలపరిమితితో పరిష్కారం: రైతుల సమస్యలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేందుకు చర్యలు (మిగతా 2లో)

పెనమలూరుకు అడ్డుపడుతున్నదెవరు?

పక్కనే విజయవాడ.. అయినా మచిలీపట్నం పొమ్మనడమేంటి?

ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా నేతల యత్నాలు

అసంబద్ధ వాదనకు తలూపుతున్న మంత్రివర్గ ఉపసంఘం

ఎన్టీఆర్‌ జిల్లాలో కలిపితేనే ప్రజలకు సౌలభ్యం.. అభివృద్ధికీ అవకాశం

సంతనూతలపాడు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలు ఒంగోలులో భాగం. నియోజకవర్గ ప్రజలకూ నగరంతోనే అనుబంధం ఎక్కువ. వైకాపా ప్రభుత్వ హయాంలో దీన్ని బాపట్ల జిల్లాలో చేర్చాలనే ప్రతిపాదన వచ్చినా అక్కడి ప్రజలు వ్యతిరేకించడంతో ప్రకాశం జిల్లాలోనే కొనసాగించారు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంలోని సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గాన్ని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కొనసాగించడానికీ కారణమదే.

కందుకూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని మండలాలు, గ్రామాల నుంచి ఒంగోలుకు దూరం 60 కి.మీ పైనే. అయినా అక్కడి ప్రజలకు ఒంగోలుతో భౌగోళిక, సాంస్కృతిక సంబంధాలున్నాయి. అందుకే రెండు నియోజకవర్గాల్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే ప్రతిపాదన తెచ్చారు.

దాదాపు మూడొంతులు నియోజకవర్గం విజయవాడలో భాగంగా ఉండే పెనమలూరు పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నం. అక్కడి నాయకులు తమ నియోజకవర్గాన్ని విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్‌ జిల్లాలో కాకుండా కృష్ణా జిల్లాలో కొనసాగిస్తేనే ప్రజలకు సౌలభ్యమంటూ వితండ వాదన చేస్తున్నారు. దీనికి మంత్రివర్గ ఉపసంఘమూ వంత పాడుతోంది.



ఈనాడు – అమరావతి

జిల్లాల విభజనలో ప్రధానోద్దేశం పాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షలే. విజయవాడలో భాగమైన పెనమలూరు నియోజకవర్గ నేతల రూటే వేరు. ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఎన్టీఆర్‌ కలెక్టరేట్‌ ఉన్నా 65 కి.మీ. దూరంలోని మచిలీపట్నం వెళ్లాల్సిందే, అదే మీ జిల్లా కేంద్రమంటూ ప్రజల్ని ఇబ్బందుల పాలు చేస్తున్నారు. ఎన్టీఆర్‌ జిల్లాలో కలిపే ప్రతిపాదనలకూ మోకాలడ్డుతున్నారు. పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్‌ జిల్లాలో చేరిస్తే తమ ఆధిపత్యానికి గండిపడుతుందని, నగరపాలక సంస్థలోని ఐఏఎస్‌ అధికారి తాము చెప్పినదానికల్లా తలాడించరనే ఆందోళనే దీనికి కారణంగా తెలుస్తోంది. కృష్ణా జిల్లాలోనే కొనసాగిస్తే మూడో శ్రేణి మున్సిపాలిటీలోని అధికారుల్ని గుప్పిట పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించవచ్చని యోచిస్తున్నారు. అందుకే వైకాపా హయాంలో చేసిన అడ్డగోలు విభజనను సరిదిద్దేందుకు ససేమిరా అంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారిస్తేనే పెనమలూరు ప్రజల ఆశలు సాకారమవుతాయి.

70% జనాభా విజయవాడలో భాగమే

- పెనమలూరు నియోజకవర్గ జనాభా 3.70 లక్షలు. ఇందులో విజయవాడలో భాగమై ఉన్న తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోనే 2 లక్షలున్నారు. 10 కి.మీ.లోపులో ఉన్న పెనమలూరు, పెదపులిపాక, గంగూరు, ఈడ్పుగల్లు, గోశాల, కంకిపాడు ప్రాంతాల్లో కనీసం 70 వేల మందికి పైగా నివసిస్తున్నారు. అంటే నియోజకవర్గ జనాభాలో 70 శాతం దాదాపుగా విజయవాడలో భాగమయ్యారు.
- కానూరు, తాడిగడప, యనమలకుదురు, పోరంకి, గంగూరు, గోశాల.. ఇవన్నీ తాడిగడప మున్సిపాలిటీలో ఉన్నప్పటికీ నగరంలో అంతర్భాగమైపోయాయి. అక్కడ ఉండే 90% ప్రజల అవసరాలన్నీ విజయవాడతోనే ముడిపడి ఉన్నాయి.
- నియోజకవర్గ ప్రజలంతా ప్రతి పనికీ విజయవాడే వెళతారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులుంటే మాత్రం మచిలీపట్నానికి వెళ్లాల్సి వస్తోంది. విజయవాడను ఆనుకుని ఉన్న తాడిగడప నుంచి బందరు 65 కిలోమీటర్లు, పెనమలూరు కూడలి నుంచి 60 కి.మీ, మరో చివరన ఉన్న ఉయ్యూరు నుంచి చూసినా కనీసం 36 కి.మీ. దూరం. ప్రజలకు ఇవి దూరాభారమవుతున్నాయి.
- గన్నవరం నియోజకవర్గాన్ని ఎన్టీఆర్‌ జిల్లాలో కలిపే ప్రతిపాదన పరిశీలిస్తున్న మంత్రివర్గ ఉపసంఘం ఇదే సూత్రాన్ని పెనమలూరు విషయంలో ఎందుకు వర్తింపజేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగరంలో కలిసున్నా అభివృద్ధికి దూరమే

2020 డిసెంబరులో వైకాపా ప్రభుత్వం కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు గ్రామాల్ని కలిపేసి తాడిగడప మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. ఐదేళ్లవుతున్నా ఇక్కడ సరైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేవు. కొత్త కాలనీల్లో అంతర్గత రోడ్లు, వీధిదీపాల పరిస్థితి దారుణం. సనత్‌నగర్‌ ప్రాంతమంతా విజయవాడలో అంతర్భాగమైంది. తులసీనగర్‌, వరలక్ష్మీపురంకాలనీ, మహదేవపురంకాలనీ, శ్రీరామకాలనీ, యనమలకుదురు, వినాయకనగర్‌, మురళీనగర్‌ తదితర కాలనీలన్నీ నగరంలో కలిసినా అభివృద్ధికి నోచుకోలేదు.

- విజయవాడలో కలిస్తే భారీ ఎత్తున నిధులు అందుబాటులో ఉంటాయి. అభివృద్ధికి అవకాశాలు అధికం.
- భవిష్యత్తులో గ్రేటర్‌ అమరావతి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఓఆర్‌ఆర్‌, మెట్రో, ఎన్‌హెచ్‌-65 విస్తరణ వంటి ప్రాజెక్టులు రాబోతుండటం.. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిని ఆనుకున్న ప్రాంతంలో భారీ గృహ నిర్మాణ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉండటంతో పెనమలూరు నియోజకవర్గంలోని మండలాలన్నీ విజయవాడతో పెనవేసుకుపోతాయి. భవిష్యత్తు కోణంలో చూసినా పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్‌ జిల్లాలో కలపడమే ఉత్తమం.



అభివృద్ధి జరగాలంటే ఎన్టీఆర్‌ జిల్లాలోనే కలపాలి..
– యార్లగడ్డ రూప్‌కుమార్‌, సిద్ధార్థ వాకర్స్‌ సంఘం అధ్యక్షులు

మచిలీపట్నం మాకు 60 కి.మీ. దూరంలో ఉంది. జిల్లా కేంద్రంలో ఏ పని ఉన్నా ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లడానికి చాలా కష్టమవుతోంది. విజయవాడకు అనుబంధంగా ఎన్టీఆర్‌ జిల్లాలో కలిపితే ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గుతాయి. అభివృద్ధీ మరింత వేగం అందుకుంటుంది.



గూగుల్‌ డేటా సెంటర్‌ భూ సేకరణకు అడ్డుపడే కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

భూములను రైతుల పరిహారమిచ్చి భూసేకరణ చట్టం ప్రకారం సేకరిస్తోంది. ఆ బినామీ గుప్పిట్లో పెట్టుకున్న 76 ఎకరాలూ ఆ భూముల్లో ఉన్నాయి. దీంతో భూసేకరణ ప్రక్రియనే అడ్డుకునేందుకు కుట్రపన్ని రైతులతో కోర్టులో కేసు వేయించారు.

ఎక్కువ మొత్తం చెల్లిస్తామంటూ..

రైతుల డిమాండ్‌ మేరకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌ విలువను ఎకరం రూ.20 లక్షలకు పెంచి, ఎకరానికి 20 సెంట్ల చొప్పున ప్రత్యామ్నాయ భూమి ఇచ్చేందుకు అంగీకరించడంతో రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అంగీకార పత్రాలు అందజేస్తున్నారు. ఇప్పటికే 60 శాతానికిపైగా రైతులు అంగీకార పత్రాలు అందజేశారు. మిగిలిన వారిని విశాఖ ఎంపీ బినామీ ప్రలోభ పెడుతున్నారు. భూముల్ని తమకు విక్రయిస్తే ఎకరానికి రూ.55 లక్షల నగదు, 27.50 సెంట్ల అభివృద్ధి చేసిన భూమి ఇస్తామని చెబుతున్నారు. ఇందుకు అంగీకరిస్తే ఇప్పటికిప్పుడు 50 శాతం సొమ్ము రైతుల ఖాతాలో జమ చేస్తామని మభ్యపెడుతున్నారు. ఆయన సీఎం చంద్రబాబు పేరును లాగుతున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి, కలెక్టర్‌ను మేనేజ్‌ చేశానని రైతులకు చెబుతున్నట్లు సమాచారం. వైకాపా ప్రభుత్వ హయాంలో చీటీల్లా భూముల కొనుగోలులో దళారిగా వ్యవహరించి, అనకాపల్లి జిల్లాలో ఒక పంచాయతీ సర్పంచి పదవికి పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి ఇప్పుడు.. ఆ బినామీ తరఫున రైతుల్ని ప్రలోభపెట్టే పనిలో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా విశాఖ ఎంపీ అభ్యర్థిని తానేనని కూడా ఆ దళారి ప్రచారం చేసుకుంటున్నట్లు సమాచారం. స్వచ్ఛందంగా భూములిచ్చేందుకు వస్తున్న రైతులను అడ్డుకుంటున్న వారిపై, రైతుల సంతకాలు ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేశారు. నలుగురు రైతుల నుంచి స్టేట్‌మెంట్‌ నమోదు చేశామని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని ఆనందపురం సీఐ వాసునాయుడు తెలిపారు.

డ్రగ్స్‌-ఉగ్ర బంధాలకు అడ్డుకట్ట

(మొదటి పేజీ తరువాయి)

దీనిని మనమంతా కలిసి అడ్డుకోవాలి. ఉగ్రవాదం-డ్రగ్స్‌ మధ్య సంబంధాలకు గండికొట్టాలి. ఆ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయాలి. మానవాళి సమగ్రాభివృద్ధి, ఆరోగ్య రక్షణకు కార్యాచరణ చేపట్టాలి" అని సదస్సులో, ఆ తర్వాత ఎక్స్‌ వేదికగా మోదీ చెప్పారు. పునర్వినియోగం, శుద్ధఇంధనం, సుస్థిరతలకు తమ దేశం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. 'జీ20 ఓపెన్‌ శాటిలైట్‌ డేటా పార్టనర్‌షిప్‌' ఏర్పాటు చేసి, అంతరిక్ష సంస్థల మధ్య సహకారాన్ని అందించుకోవాలని ప్రతిపాదించారు. తద్వారా దక్షిణార్ధగోళ దేశాలకు ఉపగ్రహ సేవలు మరింతగా అందుబాటులోకి వస్తాయన్నారు.

దేశాధినేతలతో భేటీ: ఐరాస సెక్రటరీ జనరల్‌ ఆంటోనియో గుటెరెస్‌, బ్రిటన్‌ ప్రధాని కీర్‌ స్టార్మర్‌, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌, కెనడా ప్రధాని మార్క్‌ కార్నేలతో మోదీ భేటీ అయ్యారు. ఈ భేటీలు ఫలప్రదమయ్యాయని తెలిపారు. 'ఆస్ట్రేలియా-కెనడా-భారత్‌ సాంకేతికత, నవకల్పనల (ఏసీఐటీఐ) భాగస్వామ్యం' కుదిరిందని ప్రకటించారు. కృత్రిమ మేధను ఉపయోగించుకుని పౌరుల జీవితాలను మెరుగుపరిచే అవకాశాలను పరిశీలించాలని మూడు దేశాలూ నిర్ణయించాయి. ఈ మేరకు మూడుదేశాల అధికారులు వచ్చే ఏడాది తొలినాళ్లలో సమావేశం కానున్నారు. ఫ్రాన్స్‌, కొరియా, బ్రెజిల్‌ దేశాధినేతలతోనూ మోదీ సమావేశమయ్యారు. పర్యటన నిమిత్తం శుక్రవారం జొహాన్నెస్‌బర్గ్‌ శివార్లలోని వైమానిక స్థావరానికి చేరుకున్న మోదీకి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్‌ రమఫోసా ముకుళిత హస్తాలతో హార్దిక స్వాగతం పలికారు. దక్షిణాఫ్రికాలో భారత సంతతికి చెందిన టెక్‌ వ్యాపారులతో, ప్రవాస భారతీయులతో మోదీ సమావేశమయ్యారు. భారత్‌తో అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దక్షిణాఫ్రికాలో పండిన చిరుధాన్యాలతో కూడిన కలశాన్ని చిన్మయ మిషన్‌ ప్రతినిధులు మోదీకి అందించారు. ఈ కలశాన్ని దర్బన్‌లోని అన్నపూర్ణాదేవి ఆలయంలో అందజేయనున్నట్లు మోదీ తెలిపారు.

అమెరికాను తోసిరాజని తీర్మానం: అమెరికా అడ్డుకోవాలని ప్రయత్నించినా జీ20 దేశాల నేతలు శనివారం ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించుకున్నారు. ఇది ఆఫ్రికా ఖండంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని, బహుళపాక్షికవాదాన్ని బలపరుస్తుందని దక్షిణాఫ్రికా పేర్కొంది. సాధారణంగా సదస్సు ముగింపు సమయంలో తీర్మానం చేస్తారు. దానికి విరుద్ధంగా ఈసారి ప్రారంభంలోనే చేశారు. అగ్రరాజ్యం తమతో ఉన్నా, లేకపోయినా జీ20 కొనసాగుతుందనే సంకేతాలిచ్చారు. సంఘటితత్వం, సమానత్వం, సుస్థిరతలు సమ్మిళిత వృద్ధికి మూలస్తంభాలని తీర్మానం పేర్కొంది. ఇంధన భద్రత, వాతావరణ కార్యాచరణ, విపత్తులను ఎదుర్కొనే సన్నద్ధత వంటివాటిని ప్రస్తావించింది. ఉమ్మడి సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చింది. ఒక దేశ సార్వభౌమత్వం, రాజకీయ స్వాతంత్ర్యం పరిధిలోకి మరో దేశం చొరబడకుండా సంయమనం పాటించాలంది. అంతర్జాతీయ కట్టుబాట్లకు లోబడి బహుళపాక్షికవాద స్ఫూర్తితో ఆర్థిక సహకారం కొనసాగించుకోవాలని జీ20 తీర్మానించింది.

జీ20లో 'మెలోడీ'

ఆత్మీయంగా పలకరించుకున్న మోదీ, మెలోనీ

ఇంటర్నెట్‌ డెస్క్‌: భారత్‌, ఇటలీ ప్రధానులు- నరేంద్ర మోదీ, జార్జియా మెలోనీ మంచి స్నేహితులు. అంతర్జాతీయ వేదికలపై కలిసినప్పుడు ఆత్మీయంగా పలకరించుకుంటుంటారు. ఆయా సందర్భాలకు సంబంధించిన దృశ్యాలు 'మెలోడీ' పేరుతో నెట్టింట వైరల్‌ అవుతుంటాయి. జొహాన్నెస్‌బర్గ్‌లో శనివారం జరిగిన జీ20 దేశాల 20వ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాధినేతలు హాజరయ్యారు. మోదీ, మెలోనీ ఒకరికొకరు ఎదురుపడినప్పుడు చిరునవ్వులు చిందిస్తూ.. పలకరించుకున్నారు. ఈ దృశ్యాలు మరోసారి సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారాయి. 2023 డిసెంబరులో దుబాయ్‌ వేదికగా జరిగిన 'కాప్‌28' సదస్సు సందర్భంగా మొదటిసారి వారిద్దరి సెల్ఫీ వైరల్‌ అయిన సంగతి తెలిసిందే. ఇద్దరి స్వీయ చిత్రాన్ని మెలోనీ ఎక్స్‌లో షేర్‌ చేశారు. దానికి మెలోడీ (ఇద్దరి పేర్లలోని అక్షరాలు కలిసేలా) అనే హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. అప్పటి నుంచి ఈ పదం ట్రెండ్‌ అయింది. గతేడాది ఇటలీలో జరిగిన సదస్సులోనూ మోదీతో తీసుకున్న సెల్ఫీని మెలోనీ షేర్‌ చేశారు.



జొహాన్నెస్‌బర్గ్‌ జీ20 సదస్సులో ఆత్మీయంగా పలకరించుకుంటున్న మోదీ, జార్జియా మెలోనీ

భారీ లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

ఆజాద్‌ ఈ సందర్భంగా వెల్లడించారు. చొక్కారావుతో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఆయన విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

తెలుగు నేతలు ఇద్దరే..

లొంగిపోయిన వారిలో ఆజాద్‌, రమేశ్‌ మాత్రమే తెలంగాణకు చెందినవారు. ఆజాద్‌, ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందినవారు. ఆయన 31 ఏళ్ల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఉంటూ భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు(బీకే-ఏఎస్‌ఆర్‌) డివిజనల్‌ కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం ఎఫ్‌సీఐ ప్రాంతానికి చెందిన రమేశ్‌ తెలంగాణ కమిటీ హోదాలో ఉంటూ రాష్ట్ర సాంకేతిక విభాగానికి ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. మరో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగుండాకు చెందినవారు. ఆయన దండకారణ్యం స్పెషల్‌ జోనల్‌ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ) పరిధిలోని దక్షిణ బస్తర్‌ డివిజనల్‌ కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. తాజాగా లొంగిపోయినవారిలో ఆజాద్‌, రమేశ్‌లతో కలిపి తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన 12 మంది ఉన్నారు. తక్కిన 10 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు.

తెలంగాణలో మిగిలింది 59 మంది

విలేకరుల సమావేశంలో డీజీపీ వెల్లడించిన వివరాల మేరకు.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి చెందిన 59 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారు. వీరిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు కాగా.. 10 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న 8 మందిలో గణపతి, దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, పాక హన్మంతు, పసునూరి నరహరి తెలుగువారు. మరో 10 మంది తెలంగాణతోపాటు ఇతర ప్రాంతాల్లో రాష్ట్రకమిటీ హోదాలో ఉన్నారు.

హిడ్మా సమాచారం ఇచ్చామనడం అవాస్తవం
– డీజీపీ శివధర్‌రెడ్డి

తెలంగాణ పోలీసులే హిడ్మాకు సంబంధించిన సమాచారాన్ని ఏపీ పోలీసులకు చేరవేయడం వల్లే ఎన్‌కౌంటర్‌ జరిగిందన్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. అది పూర్తిగా అవాస్తవమని డీజీపీ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గణపతి, దేవ్‌జీలాంటి అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిసేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

ఆరు నెలల్లోగా రాజధాని రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ స్పష్టం చేశారు. భూములిచ్చిన రైతులకు 98% ప్లాట్ల కేటాయింపు పూర్తయిందన్నారు. జరీబు భూముల గుర్తింపు, గ్రామకంఠాల సమస్యను 30 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. లంక, ఎసైన్డ్‌ భూముల సమస్యలపై న్యాయవివాదాలు ఉన్నందున 90 రోజుల్లో పరిష్కరించడానికి చొరవ చూపుతామన్నారు. 25 గ్రామాల పరిధిలో మౌలికవసతుల కల్పనకు డిసెంబరులో డీపీఆర్‌ తయారుచేసి జనవరిలో పనులు ప్రారంభించి జూన్‌ నాటికి పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించామని వివరించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతిలో రైతుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. రిటర్నబుల్‌ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వేగంగా జరుగుతున్నాయని, 719 ఎకరాలకే ప్లాట్లు కేటాయించాల్సి ఉందన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌ మాట్లాడుతూ రాజధాని లేఔట్లలో సరిహద్దు రాళ్లు, తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, మల్కాపురం, లింగాయపాలెంలో శ్మశానాల ఏర్పాటు సాకారం కానున్నాయన్నారు. ఎసైన్డ్‌ భూముల రైతులను మోసగించేలా జగన్‌, ఆయన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల సమస్యలు తలెత్తాయని.. ఫిబ్రవరి నెలాఖరుకల్లా పరిష్కారమవుతాయని వివరించారు.

జోగి, అద్దేపల్లి ఆర్థిక బంధం బట్టబయలు

ముడుపులిచ్చినట్లు విచారణలో అంగీకరించిన జనార్దనరావు

జనార్దనరావు, జోగి రాము మధ్య ఫోన్‌ కాల్స్‌

ఆఫ్రికా వెళ్లే ముందు జోగి రమేష్‌ ఇంటికి వెళ్లినట్లు నిర్ధారణ

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం వ్యవహారంలో ప్రధాన నిందితుడు జనార్దనరావు, వైకాపా నేత జోగి రమేష్‌, అతని సోదరుడి మధ్య బంధంపై ఆధారాలు బయటకు వస్తున్నాయి. అద్దేపల్లి సోదరులు తమ బ్యాంకు ఖాతాల నుంచి డబ్బును డ్రా చేసి అందజేసినట్లు జనార్దనరావు కస్టడీలో అంగీకరించాడు. గత నాలుగేళ్లలో పలుమార్లు జనార్దనరావు, జగన్మోహన్‌రావుల ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో విత్‌డ్రాయల్స్‌ ఉన్నాయి. వీటిని సీసాలు, స్పిరిట్‌, మూతలు, లేబుల్స్‌ సరఫరాదారులతో పాటు జోగి సోదరులకు కూడా లంచాల రూపంలో అందజేసినట్లు విచారణలో వెల్లడించారు. అద్దేపల్లి సోదరుల నాలుగు రోజుల కస్టడీ శనివారంతో ముగిసింది. వీరికి సాయంత్రం ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించి, ఎక్సైజ్‌ కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. అనంతరం జనార్దనరావును నెల్లూరు కారాగారానికి, జగన్మోహన్‌రావును విజయవాడ జైలుకు తరలించారు.

నగదు రూపంలో ముడుపుల అందజేత

2021 నుంచి 2025 వరకు అద్దేపల్లి సోదరుల బ్యాంకు స్టేట్‌మెంట్లను సిట్‌, ఎక్సైజ్‌ అధికారులు వడపోశారు. నగదు విత్‌డ్రాయల్స్‌ వివరాలను క్షుణ్నంగా పరిశీలించారు. ఏ అవసరాలకు నగదు తీశారనేది ప్రశ్నించారు. అక్రమ మద్యం, నకిలీ మద్యం వ్యాపారానికి ఇబ్బంది లేకుండా చూసుకునేందుకే తరచూ జోగి సోదరులకు లంచాలను నగదు రూపంలో అందజేసినట్లు వారు ఒప్పుకొన్నారు. జోగి సోదరుల బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలించిన పోలీసులు.. పలు అనుమానాస్పద లావాదేవీలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిసింది.

- జోగి రమేష్‌ సోదరుడు రాముతో జనార్దనరావు తరచూ ఫోన్‌లో మాట్లాడినట్లు సీడీఆర్‌ విశ్లేషణలో బయటపడింది. ఇద్దరి కాల్‌డేటాను పరిశీలిస్తే పెద్ద సంఖ్యలో కాల్స్‌ కనిపించాయి. దీన్నిబట్టి నకిలీ మద్యం తయారీ కుట్రలో వైకాపా నేత ప్రమేయం ఉందని సిట్‌ భావిస్తోంది. సెప్టెంబరు ముందువరకు పలు దఫాలు రెగ్యులర్‌ కాల్స్‌లో మాట్లాడుకున్నట్లు గుర్తించారు.
- ఆఫ్రికా వెళ్లే ముందు సెప్టెంబరు 23న జోగి రమేష్‌ ఇంటికి వెళ్లానని జనార్దనరావు తన నేరాంగీకార వాంగ్మూలంలో వెల్లడించారు. నిందితుడు చెప్పిన సమయానికి సీసీ కెమెరాల్లోని దృశ్యాలతో సరిపోలాయి. జనార్దనరావు, జోగి రమేష్‌, రాములు ఒకే లొకేషన్‌ పరిధిలో ఉన్నట్లు తేలింది.
- జోగి రమేష్‌ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల డీవీఆర్‌ను ఆయన అరెస్టు సమయంలో స్వాధీనం చేసుకున్నారు. దీని పాస్‌వర్డ్‌ను చెప్పకపోవడంతో తెరవలేకపోయారు. జోగి సోదరులను కస్టడీకి తీసుకున్నప్పుడు తెరవాలని భావిస్తున్నారు.

కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేస్తారు. ఇందుకోసం 12-13 వేల కిలోల నెయ్యి వినియోగిస్తారు. వైకాపా హయాంలో ఐదేళ్లలో లడ్డూల తయారీకి రోజూ 40 శాతం కల్తీ నెయ్యినే వినియోగించారు.

త్వరలో మరిన్ని అక్రమాలు వెలుగులోకి: తితిదే ఛైర్మన్‌ బీఆర్‌ నాయుడు

వైకాపా ప్రభుత్వంలో తితిదే ధర్మకర్తల మండలి, అధికారులు కుమ్మక్కై భారీగా అవినీతికి పాల్పడ్డారు. తిరుమల క్షేత్రాన్ని తమ ధనార్జన కేంద్రంగా మార్చుకున్నారు. కల్తీ నెయ్యిని సరఫరా చేసే సంస్థలను ప్రోత్సహించారు. కల్తీ నెయ్యితో తయారు చేసిన లడ్డూలు అందజేసి, భక్తుల మనోభావాలు దెబ్బతీశారు. సిట్‌ ఈ విషయాన్ని దర్యాప్తులో గుర్తించింది. వైకాపా ప్రభుత్వంలో తిరుమలలో చేసిన అక్రమాలు త్వరలోనే మరిన్ని వెలుగులోకి రానున్నాయి.

పాఠశాల విద్యార్థులకు... ఇంధన పొదుపుపై షార్ట్‌ వీడియో పోటీలు

ఈనాడు, అమరావతి: ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్యంపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు షార్ట్‌ వీడియో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ జెన్‌కో ఎండీ, ఏపీ ఎస్‌ఈసీఎం సీఈవో నాగలక్ష్మి తెలిపారు. రాష్ట్రంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పోటీకి అర్హులని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్యం.. సుస్థిర ఆచరణలపై తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో 30 సెకన్ల నుంచి 2 నిమిషాల నిడివితో ఎంపీ4 ఫార్మాట్‌లో వీడియోలు రూపొందించి డిసెంబరు పదో తేదీ సాయంత్రం 5లోగా పంపాలి. పాఠశాల నుంచి గూగుల్‌ ఫాం https://forms.gle/ZK3c8EKdWNZ7Ykv7A ద్వారానే పంపించాలి. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు.. పది మంది విద్యార్థులకు రూ.రెండు వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసపత్రాలు అందిస్తాం. మరిన్ని వివరాలకు 0866-2457620 నంబరు లేదా energyclubs.secm@gmail.com వెబ్‌సైట్‌లో సంప్రదించాలి' అని నాగలక్ష్మి వివరించారు.

గ్రహం అనుగ్రహం

23–11–2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం
తదియ: సా. 4-32 తదుపరి చవితి
మూల: సా. 5-44 తదుపరి పూర్వాషాఢ
వర్జ్యం: మ. 3-59 నుంచి 5-44 వరకు
అమృత ఘడియలు: ఉ. 10-45 నుంచి 12-30 వరకు
దుర్ముహూర్తం: సా. 3-50 నుంచి 4-35 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6.12; **సూర్యాస్తమయం:** సా.5.20

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	19.0	29.0
శ్రీకాకుళం	22.0	31.0
అనంతపురం	22.3	29.6
రాజమహేంద్రవరం	22.5	37.0
తిరుపతి	23.6	30.2
విశాఖపట్నం	23.8	31.0
గుంటూరు	24.0	31.0
విజయవాడ	24.2	32.2
నెల్లూరు	26.0	32.0
తాడేపల్లిగూడెం	27.0	32.0

మార్గదర్శి 127వ శాఖ తునిలో ప్రారంభం

ఈనాడు, కాకినాడ– తుని, న్యూస్‌టుడే: చిట్‌ఫండ్ పరిశ్రమలో నమ్మకమైన, అగ్రగామిగా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేటు లిమిటెడ్ 127వ శాఖ కాకినాడ జిల్లా తుని పట్టణంలో శనివారం ఏర్పాటైంది. 'మార్గదర్శి చిట్ ఫండ్' వైస్ ప్రెసిడెంట్ జి.బలరామకృష్ణ, జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్, చీఫ్ మేనేజర్ కె.కృష్ణమోహన్, తుని బ్రాంచ్ మేనేజర్ పుల్లేశ్వరావుతో కలసి వేదమంత్రోచ్చారణల మధ్య సీఈవో పాతూరి సత్యనారాయణ జ్యోతి వెలిగించి బ్రాంచ్‌ను ప్రారంభించారు. మొదటి ఖాతాదారు దాసరి సావిత్రి నుంచి చిట్ నగదు అందుకొని ఆమెకు రసీదు అందించారు. అత్యంత విశ్వసనీయమైన మార్గదర్శి చిట్ ఫండ్‌కు ఏపీలో ఇది 39వ శాఖ. నమ్మకానికి మారుపేరుగా అందరి మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఈ సంస్థ తునిలో సేవలను అందుబాటులోకి తీసుకురావడంపై ఖాతాదారులు సంతోషం వ్యక్తం చేశారు. చందాదారులు తమ కుటుంబాలు, వ్యాపారాల వృద్ధి, విద్య, వివాహాలు, గృహాల కొనుగోలు, వ్యాపార సంస్థలకు



మొదటి ఖాతాదారు దాసరి సావిత్రి నుంచి చిట్ నగదు అందుకొంటున్న సంస్థ సీఈవో పాతూరి సత్యనారాయణ. చిత్రంలో 'మార్గదర్శి చిట్‌ఫండ్' చీఫ్ మేనేజర్ కె.కృష్ణమోహన్, 'ఈనాడు' రాజమహేంద్రవరం యూనిట్ ఇన్‌ఛార్జి ఐవీ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, 'మార్గదర్శి చిట్‌ఫండ్' జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్, వైస్ ప్రెసిడెంట్ జి.బలరామకృష్ణ

వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చుకోవడం సహా అనేక లక్ష్యాలను సాధించుకోవడంలో ఆరు దశాబ్దాలకు పైగా మార్గదర్శి అందిస్తున్న సేవలను కొనియాడారు. 'ఈనాడు' రాజమహేంద్రవరం యూనిట్ ఇన్‌ఛార్జి ఐవీ శ్రీనివాస సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మా వ్యాపారాభివృద్ధిలో మార్గదర్శి తోడుంది



బంగారం వ్యాపారం చేస్తుంటా. 2004 నుంచి మార్గదర్శితో అనుబంధం ఉంది. అనకాపల్లి శాఖలో చిట్‌లు వేయడం మొదలుపెట్టాను. నా వ్యాపారాభివృద్ధిలో మార్గదర్శి తోడుగా నిలిచింది.

– సాయిబాబా, బంగారం వర్తకుడు

తునిలో ప్రారంభించడం సంతోషంగా ఉంది



మా మావయ్య 25 సంవత్సరాల నుంచి విశాఖలోని మార్గదర్శి శాఖలో చిట్ వేస్తున్నారు. ఇప్పుడు తునిలో కొత్త శాఖ ప్రారంభించడం స్థానికులకు, వ్యాపారులకు ఉపయుక్తంగా ఉంటుందని నమ్ముతున్నాం.

– కారుమూరి వీరభద్రరావు, ఐటీసీ డిస్ట్రిబ్యూటర్

మార్గదర్శి అంటేనే నమ్మకం..



బయట చిట్‌లు కట్టి మోసపోయినవారిని చూస్తున్నాం. పొదుపు చేసుకున్న డబ్బులు పోగొట్టుకుంటే చాలా బాధ కలుగుతుంది. అదే రిజిస్టర్డ్ సంస్థ అయిన మార్గదర్శి లాంటి సంస్థల్లో చిట్‌లు వేసుకుంటే డబ్బుకు భద్రత ఉంటుంది. మార్గదర్శి అంటేనే నమ్మకం. ఆ సంస్థ తునిలో శాఖను ఏర్పాటుచేయడం సంతోషంగా ఉంది.

– ప్రత్యూష, గృహిణి


ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం

గన్నవరం విమానాశ్రయంలో
చకచకా ఏటీసీ టవర్ పనులు


నిర్మాణంలో ఉన్న ఏటీసీ టవర్, అనుబంధ భవనం

గన్నవరం విమానాశ్రయంలోని ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌కు అనుబంధంగా నిర్మిస్తున్న ఏటీసీ టవర్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.80 కోట్లతో నిర్మిస్తున్న ఈ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) టవర్ అత్యాధునిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంటోంది. విమానాల రాకపోకలను నియంత్రించడంలో ఇదే కీలకం. విమానాశ్రయంలో ఉన్న పాత టవర్ స్థానంలో దీన్ని నిర్మిస్తున్నారు. టవర్‌కు ఆనుకొని రెండంతస్తుల భవన సముదాయం పనులు కూడా చేపట్టారు. కొత్త టవర్, భవనం అందుబాటులోకి వచ్చాక.. ఇక్కడి నుంచే విమానాశ్రయానికి సంబంధించిన సాంకేతిక, టెలి కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ విభాగాలు పనిచేయనున్నాయి. రూ.470 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు పూర్తయి, అందుబాటులోకి వచ్చాక.. ఏటీసీ టవర్ కార్యకలాపాలు ఆరంభం కానున్నాయి. – ఈనాడు, అమరావతి

రాహుల్ వచ్చేవరకూ.. కన్నడనాట అదే సందిగ్ధత

- నోరు మెదపని కాంగ్రెస్ పెద్దలు
- బెంగళూరు చేరుకున్న ఖర్గే
- రాష్ట్రంలో పరిస్థితిపై రాహుల్ గాంధీకి సమాచారం


శనివారం ఓ కార్యక్రమంలో సిద్ధరామయ్య– డీకే సందడి

ఈనాడు, బెంగళూరు: కన్నడనాట అధికార కాంగ్రెస్‌లో మొదలైన రాజకీయ సందిగ్ధతకు ఇంకా తెరపడలేదు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య అధికార పంపిణీ కోసం కొనసాగుతున్న సమరానికి ముగింపు పలికేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బెంగళూరు వచ్చారు. ఇటీవల శివకుమార్ మద్దతుదారులు దిల్లీలోని తన నివాసానికి రాగా, ఎందుకొచ్చారని మండిపడిన ఖర్గే.. బెంగళూరులోనూ ఇదే ధోరణి వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రే బెంగళూరుకు చేరుకున్న ఆయనను కలిసేందుకు నేతలు పోటీపడినా ఎవరికీ సమయం ఇవ్వలేదు. తన ఇంటి వద్ద భారీగా చేరిన మీడియా ప్రతినిధులతోనూ ఏమీ మాట్లాడకుండా నమస్కారంతో సరిపెట్టారు. శనివారం రాత్రి 9 గంటల తర్వాత ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో వేర్వేరుగా చర్చించేందుకు అవకాశం కల్పించారు. ఆయన విదేశీ పర్యటనలో ఉన్న పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో ఫోన్లో మాట్లాడి రాష్ట్ర పరిణామాలపై సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఈ నెల 25న రాహుల్ భారత్‌కు తిరిగి వస్తానని చెప్పడంతో అప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయరాదని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పార్టీ నేతలు ఎవరూ అనవసర వ్యాఖ్యలు చేయకుండా అధిష్ఠానం హెచ్చరించాలని సీఎం సిద్ధరామయ్య పార్టీ పెద్దలను కోరారు.


ఖర్గేతో శనివారం సమావేశమైన సిద్ధరామయ్య

నంబర్ గేమ్ మొదలు!

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు తమ మద్దతుదారులను కూడబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. అధికార పంపిణీకి ఎమ్మెల్యేల అభిప్రాయమే కీలకమైతే తమ బలాన్ని నిరూపించుకునేందుకు వీరు సిద్ధమవుతున్నారు. మీడియాతో బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్న వారి లెక్కల ప్రకారం డీకే శివకుమార్‌కు మొత్తం 140 మందిలో కనీసం 25 మంది ఎమ్మెల్యేలు మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సంఖ్య పెంచుకునేందుకు డీకే జైల్లో ఉన్న ఇద్దరు ఎమ్మెల్యే (వినయ్ కులకర్ణి, వీరేంద్ర పప్పి)లను కలిసి వారి సంతకాలను సేకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య.. సీనియర్ మంత్రులు సతీశ్ జార్ఖిహొళి, జమీర్ అహ్మద్, హెచ్.సి.మహదేవప్ప, మాజీ మంత్రి కె.రాజణ్ణల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలను సమీకరిస్తున్నారు.

హస్తినపై ఒత్తిడి

విధానసభ ఎన్నికల్లో 135 స్థానాలు గెలిచి.. ప్రస్తుతం ఆ సంఖ్య 140కి చేరుకున్నా కాంగ్రెస్ సర్కారు ఊగిసలాడటం శ్రేయస్కరం కాదని మంత్రి కేహెచ్ మునియప్ప, మాజీ మంత్రి ఆర్.వి.దేశ్‌పాండే, పలువురు ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. పార్టీ ఇంత గందరగోళంలో ఉన్నా అధిష్ఠానం మౌనంగా ఉండటం సరికాదంటున్నారు.

రాయలసీమకు అసలు ద్రోహి జగనే

- ఎపెక్స్ కౌన్సిల్‌లో అన్యాయం చేస్తుంటే ఎందుకు పెదవి విప్పలేదు?
- ఆ రోజు కేసీఆర్ డిమాండ్లను ఎందుకు వ్యతిరేకించలేదు?
- మాజీ ముఖ్యమంత్రిపై జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు ధ్వజం



ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే–పాలకొల్లు: 'ఆంధ్రప్రదేశ్‌కు నీటి కేటాయింపులను తిరిగి సమీక్షించేలా దారుణమైన అన్యాయం చేస్తుంటే.. ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఒక్క మాటైనా మాట్లాడారా జగన్? ఆ సమావేశంలో పెదవి విప్పకుండా ఇంత దారుణమైన అన్యాయం చేసింది మీరు కాదా? తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ తమకు అనుకూలమైన డిమాండ్లు చేశారు. ఆ భేటీలో కేంద్ర మంత్రి, కేసీఆర్, మీరూ ఉన్నారు. విభజన చట్టం ప్రకారం ఇలా తిరిగి సమీక్షించే అధికారం లేదు అని ఒక్క మాట ఆనాడు మాట్లాడారా? మా ప్రభుత్వమేదో నీటి కేటాయింపులకు అన్యాయం చేస్తోందని విమర్శిస్తూ, లేఖలు రాస్తున్నారు. రాయలసీమకు అసలు ద్రోహి మీరు కాదా?'' అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణా జలాలకు సంబంధించి ట్రైబ్యునల్ ముందు ఏపీ ప్రభుత్వం సరిగా వాదించడం లేదని, సాక్షి ఎ.కె.గోయల్ ప్రమాణపత్రం సరిగా లేదంటూ జగన్ రాసిన లేఖపై మంత్రి స్పందించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- రాష్ట్ర విభజన తర్వాత 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో ఆంధ్రప్రదేశ్ 512 టీఎంసీలు, తెలంగాణ 299 టీఎంసీలు వాడుకునేందుకు రెండు రాష్ట్రాలూ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ ఘనత మా ప్రభుత్వానిదే. ఈ కేటాయింపులు తిరగతోడే నిర్ణయం తీసుకున్నది జగన్ సర్కారులోనే.
- జల వివాదాలకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య పరిష్కారం కాకపోతే కేంద్ర జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఉంటుంది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అందులో ఉంటారు. 2020లో నిర్వహించిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే ఏపీకి అన్యాయం చేశారు. మన రాష్ట్ర నీటి కేటాయింపులను తిరిగి సమీక్షించాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. ఆ రోజు ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కేసీఆర్ డిమాండ్లను వ్యతిరేకించలేదు.
- కృష్ణా డెల్టాకు ఉన్న 152 టీఎంసీలు, సాగర్ కుడి కాలువకున్న 132 టీఎంసీలు, సాగర్ ఎడమ కాలువకున్న 31.9 టీఎంసీలు, ఎస్ఆర్‌బీసీకి ఉన్న 19 టీఎంసీలను మళ్లీ సమీక్షించే అధికారం కృష్ణా రెండో ట్రైబ్యునల్‌కు అప్పగించాలని ఆ రోజు చర్చిస్తే జగన్ కనీసం అభ్యంతరం వ్యక్తం చేయలేదు. రాష్ట్రానికి ఇంత ద్రోహం చేసి ఇప్పుడు మాట్లాడడం ఏమిటి?
- పోలవరం నీటి మళ్లింపులో 45 టీఎంసీలు తెలంగాణ కావాలంటున్నా అభ్యంతరం వ్యక్తం చేయలేదు.
- ఎ.కె.గోయల్ అఫిడవిట్ సరిగా లేదని విమర్శలు చేస్తున్నారు. కేంద్ర జలసంఘంలో గోయల్‌కు 20 ఏళ్ల అనుభవం ఉంది. ఆయన వాదన, శక్తిని పరీక్షించేలా జగన్ మాట్లాడడం దురదృష్టకరం.
- రాయలసీమ ప్రాజెక్టులకు 2014-19 మధ్య చంద్రబాబు సీఎంగా రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే జగన్ ఐదేళ్లలో రూ.2,000 కోట్లే ఖర్చు పెట్టారు.

రాజ్యాంగంతోనే బలహీనవర్గాల హక్కులకు భద్రత

- బామ్‌సెఫ్ జాతీయాధ్యక్షుడు మేష్రమ్


మాట్లాడుతున్న వామన్ మేష్రమ్

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: రాజ్యాంగ పరిరక్షణతోనే బలహీనవర్గాల ప్రజల హక్కులకు భద్రత ఉంటుందని బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బామ్‌సెఫ్) జాతీయ అధ్యక్షుడు వామన్ మేష్రమ్ అన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) ఆధ్వర్యంలో గుంటూరు వైద్యకళాశాల జింఖానా ఆడిటోరియంలో శనివారం రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వామన్ మేష్రమ్ మాట్లాడుతూ 'రాజ్యాంగం మౌలిక విలువలు కొద్దిమంది చేతుల్లోకి వెళ్లాయి. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. పరిపాలనలో జనాభా దామాషా మేరకు అన్ని కులాల వారికి ప్రాతినిధ్యం ఉండాలి. బీసీల ప్రతినిధిగా చెప్పుకొనే నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండి కూడా బీసీలకు పాలనలో 50% ప్రాతినిధ్యం ఇవ్వడం లేదు. అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10% రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకం' అని చెప్పారు. మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ హరిపరంధామన్ మాట్లాడుతూ 'దేశంలో సీజేఐకే రక్షణ లేదు. న్యాయవాదులకు రక్షణ కావాలంటున్నారు. రాజ్యాంగం 50% రిజర్వేషన్లు దాటకూడదని చెప్పకపోయినా.. చెప్పినట్లు సుప్రీం కోర్టు ప్రచారం చేసింది. తమిళనాడులో 69% అమలు చేస్తున్నారు. అక్కడ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ లేదు' అని తెలిపారు. కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్.బాలన్ ప్రసంగిస్తూ, దేశంలో ఎక్కడికి వెళ్లినా దళిత, గిరిజనవాడలు, తండాలు, అగ్రహారాలు వేర్వేరుగా కనిపిస్తున్నాయని, ప్రజలు ఏదైనా సమస్యపై పోరాడిన తర్వాత సాంఘికంగా ఎవరికి వారు విడిపోతున్నారని వాపోయారు. ఏబీఎస్పీ జాతీయ సమన్వయకర్త, విశ్రాంత డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఏపీలో 16 సార్లు అసెంబ్లీకి ఎన్నికలు జరిగితే మొత్తం 2,900 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికవగా.. రెండు కులాల వారే 1,200 మంది ఎన్నికయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. గతంలో భూస్వామ్య ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు భూ గరిష్ఠ పరిమితి చట్టాన్ని అమలుచేసినట్లే శాసనసభ్యుల సంఖ్యపై పరిమితి విధించాలన్నారు. సమావేశంలో ఐఎల్‌పీఏ జాతీయ అధ్యక్షురాలు సుజాత కె.చౌడంటే, బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రాముడు, కేంద్ర కస్టమ్స్, ఎక్సైజ్ శాఖ విశ్రాంత జీఎస్టీ అధికారి బి.రాజేశ్వరరావు, బామ్‌సెఫ్ తెలంగాణ ప్రచారక్ దాస్‌రాం నాయక్, క్రైస్తవ మోర్చా అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్, సమతా క్లబ్ అధ్యక్షుడు టి.రజనీకాంత్, ఐఎల్‌పీఏ జిల్లా బాధ్యుడు మణి, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

33 ఏళ్లుగా చోరీలు.. 218 కేసులు

- శ్రీకాకుళం పోలీసులకు పట్టుబడ్డ గజ దొంగ
- ఇప్పటి వరకు 50 కేజీల బంగారం, 300 కేజీల వెండి, కేజీ ప్లాటినం దొంగిలించినట్లు వెల్లడి


బంగారు ఆభరణాలు చూపిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి


స్వాధీనం చేసుకున్న వెండి సామగ్రి

ఈనాడు డిజిటల్–శ్రీకాకుళం, న్యూస్‌టుడే–నేరవార్త విభాగం: తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని తెలుగు రాష్ట్రాల్లో దోపిడీకి పాల్పడుతున్న ఓ గజ దొంగను శ్రీకాకుళం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. 33 ఏళ్లుగా చోరీలు చేస్తున్న అతడిపై ఏకంగా 218 కేసులు ఉన్నాయి. ఇప్పటికే 60 కేసుల్లో జైలు శిక్ష అనుభవించాడు. అయినా తీరు మార్చుకోకుండా మళ్లీ అదే బాట పట్టాడు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి శనివారం ఈ వివరాలు వెల్లడించారు. "శ్రీకాకుళంలోని ఎస్బీఐ కాలనీలో సెప్టెంబరు 10న ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ కేసుకు సంబంధించి మెళియాపుట్టి మండలం చాపరకు చెందిన నిందితుడు దున్న కృష్ణ(55)ను వప్పంగి వద్ద అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా, రెండు రాష్ట్రాల్లో అతడిపై 218 కేసులున్నట్లు తేలింది. ఈ కేసులన్నింటిలో కలిపి అతడు 50 కేజీల బంగారం, 300 కేజీల వెండి, కేజీ ప్లాటినం దొంగిలించాడు. శ్రీకాకుళం జిల్లాలో నమోదైన 18 కేసులకు సంబంధించి 476 గ్రాముల బంగారం, 1,443 గ్రాముల వెండి, రూ.7.03 లక్షల నగదు చోరీ చేశాడు. జైలులో పరిచయమై అతడికి సహకరించిన గూనపాలెంకు చెందిన సయ్యద్ రఫీని సైతం అరెస్టు చేశాం. ఈ ఆభరణాలను పశ్చిమబెంగాల్‌లో విక్రయించినట్లు తెలిసింది. ప్రస్తుతం నిందితుల నుంచి 237 గ్రాముల బంగారం, 1,391 గ్రాముల వెండి, రూ.1.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. నిందితుడు కృష్ణ ఫోన్ ఉపయోగించకుండా, ఆధార్ కార్డు లేకుండా జాగ్రత్త పడ్డాడు" అని ఎస్పీ వెల్లడించారు.


సీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిర్మించిన పీఈబీ భవనాలు

అమరావతిలో సీఆర్డీఏ భవనాలకు హరిత ధ్రువీకరణ

- జారీ చేసిన గ్రీన్ బిజినెస్ సర్టిఫికేషన్ సంస్థ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయం ఎదురుగా పీఈబీ (ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్) విధానంలో నిర్మించిన 4 బ్లాక్‌లకు 'ఎడ్జ్ (ఎక్స్‌లెన్స్ ఇన్ డిజైన్ ఫర్ గ్రేటర్ ఎఫిషియెన్సీస్) ధ్రువీకరణ పత్రం వచ్చింది. పర్యావరణ హిత విధానాలతో భవనాలను నిర్మించినందుకు జీబీసీఐ (గ్రీన్ బిజినెస్ సర్టిఫికేషన్ ఇంక్) సంస్థ దీనిని జారీ చేసింది. హరిత నగరంగా అభివృద్ధి చేయాలనే బృహత్ ప్రణాళిక లక్ష్యం మేరకు భవనాలకు గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ పొందే ప్రయత్నంలో ఇప్పటికే సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం ఈ ధ్రువీకరణను సాధించింది. కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించడం ద్వారా పర్యావరణంపై దుష్ఫలితాలు పడకుండా ఆచరించిన విధానాల కారణంగా ఈ ధ్రువీకరణ వచ్చింది. భవనంలో విద్యుదీకరణ చేసే సమయంలోనే విద్యుత్తు ఆదాకు తోడ్పడే ఉపకరణాలు, సామగ్రిని వినియోగించారు. నీటి సంరక్షణ చర్యలతో పాటు పునర్వినియోగంపై ఎక్కువగా దృష్టి సారించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, మెప్మా, ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ తదితర విభాగాల కోసం సీఆర్డీఏ ఈ బ్లాక్‌లను నిర్మించింది. ఇప్పటికే మూడు నిర్మాణాలు పూర్తై ప్రభుత్వ విభాగాలు పనిచేస్తున్నాయి. మిగిలిన ఒక బ్లాక్ తుది మెరుగులు దిద్దుకుంటోంది.

సజ్జల శ్రీధర్‌రెడ్డి పిటిషన్‌పై వివరాలు సమర్పించండి: హైకోర్టు


ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో బెయిలు మంజూరు చేయాలని కోరుతూ ఆరో నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై శనివారం హైకోర్టు విచారణ జరిపింది. పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను 28కి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన శ్రీధర్‌రెడ్డి ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

ఆధ్యాత్మికత మానవతల కలబోత

'ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచును' అన్నాడు పోతనామాత్యుడు. సత్యసాయిబాబాకు నూరుపాళ్లూ వర్తించే సూత్రమది. కొందరికి సాయి అంటే- సేవ. మరి కొందరికి సాయి అంటే- త్యాగం, ఎందరికో సాయి అంటే- సాయం! మునుల తపన- సిద్ధికోసం. మనిషి తపన- ప్రసిద్ధికోసం. రెండోదాన్ని ఆశించి సేవారంగాన్ని ఎంచుకుంటారు కొందరు. తప్పులేదు కానీ, 'ప్రార్థించే పెదవులకన్నా- సాయంచేసే చేతులు మిన్న' అన్న బాబా ఆదేశాన్ని శిరసావహించి, సేవలో దైవాన్ని దర్శించి సిద్ధి పొందే సాయి భక్తులు అసంఖ్యాకంగా ఉన్నారు- లోకంలో ఇప్పటికీ. 'మానవసేవే మాధవసేవ' అనే ఆర్యోక్తి వారికి రక్తనిష్ఠం! 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అన్న బాబా నినాదం- భక్తులకు వేదం. నిజానికది వారి నిత్యజీవన విధానం. గుర్తింపుకోసం తపన ఉండదు- దానిలో. ప్రాచుర్యం కోసం పాకులాట ఉండదు- సేవలో. హృ'దయ'ం అనే తెలుగు పదంలోని దయకు- హార్ట్ అనే ఆంగ్లపదం చివరి 'ఆర్ట్'ను జోడించి, భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని కళాత్మక సేవాతత్త్వంగా రూపొందించినవారు- సత్యసాయిబాబా! 'మనసుతో చేసిందే- చేసింది' అని యోగవాసిష్ఠం చెప్పిందదే!

అన్నం పెట్టడం, దాహం తీర్చడం, చదువులు చెప్పడం, వైద్యం చేయడం.. అనే నాలుగు ప్రధాన స్తంభాలపై బలంగా నిలబడింది- సాయి సేవా చైతన్య కీర్తిసౌధం. ఆ భవన నిర్మాణం వెనక మానవాతీతమైన సంకల్పబలం ఉంది. అది దేశాల మధ్య సరిహద్దులను చెరిపేసింది. కులమత భేదాలను రద్దుచేసింది. 'మానవత్వమే నా మతం- సేవాతత్త్వమే నాకు సమ్మతం' అన్న సాయి సందేశం- దేశదేశాల ప్రజలను దగ్గర చేసింది. 'సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న పదవులేవియున్న ఫలము సున్న' అనేది రాజకీయ నాయకులకు పాఠం అయ్యింది. 'కాంక్షతోడ కోటి కర్మంబులొనరింప దక్కబోదు లక్ష్మి ధరణియందు' అన్న ప్రబోధం కార్పొరేట్ సంస్థలను కదిలించింది. 'దాస్యం చేయాల్సింది సిరికి కాదు- మనిషిలోని హరికి' అనే సాయి మాట మంత్రంగా మారింది. ఆ మంత్రం- ప్రభుత్వాలకు సైతం సాధ్యంకాని అమోఘ విజయాలను నమోదు చేసింది. అప్పట్లోనే రూ.350 కోట్ల తాగునీటి పథకం మొదలు ప్రపంచస్థాయి అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ దాకా లెక్కలేనన్ని పథకాలను ఆ మంత్రమే నిజం చేసింది. ఆయన తదనంతరం సైతం ఆ కార్యక్రమాలు అదే దీక్షతో, అంతే సేవాభావంతో కొనసాగడం- ఆ మంత్ర ప్రభావమే!

అన్నీ స్వయంగా తానే నిర్వహించి తనమీద మనకు నమ్మకాన్ని పెంచుకోవడం- భాగవత కృష్ణుడి లీలా విభూతి. మనల్ని ప్రోత్సహించి అన్నీ మనతో చేయించి మనపై మనకు నమ్మకాన్ని కలిగించడం భారత కృష్ణుడి శైలి. బాబా ఈ రెండింటినీ ఆచరణలోకి తెచ్చారు. ఘనకార్యాలు సాధించారు. 'సముద్రంలో కలిసేముందు నది భయంతో కంపిస్తుంది' అంటాడు ఖలీల్ జిబ్రాన్. అంతవరకు సాగిన ప్రయాణంలో ఎదురైన కొండలు, కోనలు, మైదానాలు, దాహార్తులు, స్నానార్థులతో తన సంపర్కాలను గుర్తుచేసుకుంటుంది. తన ఉనికి ప్రత్యేకతను కోల్పోతుందని, తాను మాయమైపోతానని బెంగపడుతుంది. ఆ దశలో దానికో సత్యం స్ఫురిస్తుందట- 'సముద్రంలో తాను కనుమరుగవడం కాదు- తానే సముద్రం అయిపోతున్నాను' అని! సాయిభక్తుల విషయమూ అంతే! ఆయన నేర్పించిన ప్రేమభావంలో సేవాతత్త్వంలో కరిగిపోతారు. ప్రత్యేక అస్తిత్వాన్ని కోల్పోతారు. తమ వ్యక్తిత్వమే సాయి తత్త్వంగా మారిపోవడం గమనిస్తారు. సాయి ఎవరని అడిగితే- వేలును నింగికేసి చూపించి 'సాయిరాం' అని పలవరిస్తారు. 'పూర్ణాత్ పూర్ణమాదాయ పూర్ణమేవ అవశిష్యతే' కావడమే బాబా శతజయంతి బహుమతి అవుతుంది చివరకు!



ఎంతసేపూ తమ కష్టాలను ఇతరుల ముందు ఏకరువు పెడుతూ వాళ్ల సానుభూతి కోసం పరితపించడం వ్యక్తి విలువను పెంచదు. సెల్ఫ్ పిటీ మనిషిని ఉన్నచోట నుంచి ఇంకాస్త దిగజారేలా చేస్తుంది, ఎదగడానికి అవరోధంగా మారుతుంది.

– నీరద్ చంద్ర చౌధురి, రచయిత

ముందుచూపు

పని చేయడంలో మనిషిది భిన్నమైన శైలి. తన అవసరార్థం కొన్ని, అభిరుచికి తగినట్టు కొన్నీ... పనులు చేస్తుంటాడు. పనిని ఎంచుకుని తన మేధో పరిమితికి, అభ్యాసానికి తగ్గట్టు చేయడంతో పాటు భవిష్యత్ అవసరాల పట్ల ముందుచూపు కలిగి ఉండడం సృష్టిలో ఒక్క మనిషికి మాత్రమే ఉన్న అద్భుత లక్షణం.

మేధాశక్తి ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు ప్రణాళికలు రచించి, కార్య సాఫల్యత పొందడానికి పనులు ఎలా చేయాలో నిర్దేశించగలరు. దానివల్ల ఎవరైనా ఆ పనిని యాంత్రికంగా చేసేయొచ్చు. కానీ, ఒక ఊహ ఆలోచనగా మారి, మేధోమథనంతో దానికి ఆచరణ రూపమివ్వడం అంత సులువైన విషయమేం కాదు. ఎన్నో సాధకబాధకాలు ఉంటాయి. వ్యయ ప్రయాసలకు జంకకూడదు. మరీ ముఖ్యంగా ఏకాభిప్రాయం గల వ్యక్తులను సమకూర్చుకోవాలి. అందరూ ఒకే స్థాయిలో ఆలోచించగలిగినప్పుడే ఊహ త్వరితగతిన సాకారం అవుతుంది. వీటన్నిటికి తోడు వారికి ముందు చూపు స్పష్టంగా ఉండాలి.



అంతర్యామి

లంకను చేరడానికి సముద్ర మార్గం తప్ప వేరే దారి లేదనుకున్నప్పుడు, విశ్వకర్మ కొడుకైన నలుడి ప్రజ్ఞ, పర్యవేక్షణతో అనితర సాధ్యమైన వారధిని నిర్మించారు. రాముడితో సహా అసంఖ్యాక వానర సైనికులు అవలీలగా సముద్రాన్ని దాటి లంకకు చేరారు. సవ్యమైన ఆలోచన, భవిష్యత్ దర్శనశక్తి, సత్సంకల్పం మానవ ప్రయత్నాన్ని సఫలం చేస్తాయి.

శ్రీరాముడి చేతిలో రావణుడు అసువులు బాయడానికి, సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడు అండగా ఉన్న పాండవుల చేతిలో కౌరవులు మట్టికరవడానికి, ఆ అధర్మపరుల్లో ముందు చూపు లోపించడమూ ఒక కారణమే. దూరదృష్టి ఉన్న వ్యక్తికి పర్యవసానం ముందే గోచరిస్తుంది కాబట్టి అధర్మం వైపు మొగ్గు చూపడు. అప్పుడప్పుడే రూపుదిద్దుకుంటున్న గ్రామంలో, జనం తక్కువగా ఉన్నారని సన్నటి రోడ్డు వేయరు. రేపటి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని విశాలమైన రహదారికి ప్రణాళికలేస్తారు అధికారులు. అవసరమైతే భవిష్యత్తులో ఆ దారిని మరింత విస్తరించడానికి వీలుండేలానూ చూస్తారు. వైద్యులు ఒక వ్యాధికి మందు ఇచ్చేటప్పుడు ఆ జబ్బును మాత్రమే దృష్టిలో పెట్టుకోరు. రోగుల ఆహారపు అలవాట్లు, ఇతర వ్యాధులకు వాళ్లు తీసుకునే మందులలోని రసాయనాలు, విభిన్న వాతావరణ పరిస్థితులూ అన్నీ పరిగణనలోకి తీసుకుంటారు. ఆ తరహా ముందుచూపు ఉంటేనే సమగ్రమైన చికిత్స చేయగలుగుతారు.

ఏ రంగంలో పనిచేసే వారికైనా ముందుచూపు ఉంటేనే ఇవాళ చేసే పని, భవిష్యత్ అవసరాలనూ తీరుస్తుంది. లేకపోతే వనరులు వృథా అవుతాయి. అదే పని మళ్లీ మళ్లీ చేయాల్సి వస్తుంది. కాటన్ మహాశయుడి దూరదృష్టే కదా అంత గొప్ప ధవళేశ్వరం ఆనకట్టకు రూపాన్నిచ్చింది. బహుళార్థ సాధక ప్రాజెక్టులన్నీ కూడా దశాబ్దాలు గడిచినా చెక్కు చెదరకుండా ఉండి పెరుగుతున్న ప్రజల అవసరాలు తీర్చగలుగుతున్నాయంటే కారణం ఆనాటి పాలకులు, అధికారుల ముందుచూపే. అలాంటి దూరదృష్టితో ప్రజోపయోగమైన పనులు చేసేవాళ్లు అమరజీవులుగా ప్రజల మనసుల్లో నిలిచిపోతారు.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు

కాంగ్రెస్ భవితపై బిహారర్!

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయ దుందుభి మోగించింది. పేలవ ప్రదర్శనతో మహా గఠ్‌బంధన్ భాగస్వామ్య పక్షాలు అసెంబ్లీలో మైనారిటీగా మిగిలిపోయాయి. బిహార్ ఎన్నికల ఫలితాల ప్రభావం- వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు శాసనసభలకు జరిగే ఎన్నికలపైనా పడే అవకాశం ఉంది.

బిహార్ అసెంబ్లీలోని 243 సీట్లలో ఎన్డీయే 202 గెలిచింది. మహ గఠ్‌బంధన్ పార్టీలు 35 సీట్లతో సరిపెట్టుకున్నాయి. ఎన్డీయేలో ప్రధాన భాగస్వామి భారతీయ జనతా పార్టీ అత్యధిక స్థానాలు దక్కించుకుంది. నీతీశ్ కుమార్ జేడీయూ రెండో స్థానంలో నిలిచి, మరో భాగస్వామి లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్) అసెంబ్లీలో నాలుగో అతిపెద్ద పార్టీగా నిలిచింది. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బిహార్ శాసనసభలో పట్టుమని పది సీట్లు గెలవలేకపోయింది. 61 చోట్ల పోటీ చేసి 6 సీట్లతో సరిపెట్టుకుంది. మహా గఠ్‌బంధన్ పుట్టిగా బలహీన పడటంతో రేపు అసెంబ్లీలో పాలక కూటమికి ఎదురే లేకుండా పోవచ్చు.



పునరాలోచన చేస్తుందా?

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి సభలోనూ మహా గఠ్‌బంధన్‌పై విరుచుకుపడ్డారు. ఒక సభలోనైతే ఆర్జేడీ నాయకులను తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌తో కుమ్మక్కయ్యారని దుమ్మెత్తిపోశారు. తమిళనాడులో వలస వెళ్లిన బిహారీ కూలీలను ఇండియా కూటమి భాగస్వామి అయిన డీఎంకే నాయకులు వేధిస్తున్నారని ఆరోపించారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ కూడా భాగస్వామి అని గుర్తుచేశారు. దీనిపై స్టాలిన్ ఆగ్రహించారు. ప్రధాని మోదీ తమిళనాడులో ఇదే విధంగా ప్రచారం చేయగలరా అని సవాలు విసిరారు. అదే సమయంలో బిహారీ ప్రజలను కానీ, వలస కూలీలను కానీ పల్లెత్తు మాట అనకుండా జాగ్రత్త వహించారు. బిహార్ నుంచి వలస వచ్చిన ఒక వ్యక్తి కుమార్తె తమిళనాడు బోర్డు పరీక్షల్లో టాపర్‌గా నిలవగా, ఆ అమ్మాయిని డీఎంకే అనుకూల మీడియా ఇంటర్వ్యూ చేసింది. తమిళనాడు తమను గుండెల్లో పెట్టుకుని ఆదరించిందని ఆ బాలిక చెప్పింది. స్టాలిన్ జవాబు, బాలిక ఇంటర్వ్యూ బిహారీలు సెలవులో ఛాత్ పూజ కోసం స్వరాష్ట్రానికి వెళ్తున్న సమయంలో వెలువడ్డాయి. మరోవైపు ప్రకటన బోర్డుల్లో, మీడియా వాణిజ్య ప్రకటనల్లో హిందీ భాష వాడకాన్ని నిషేధించాలని డీఎంకే ప్రభుత్వం యోచిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. బిహార్ ఎన్నికలు జరుగుతున్న వేళ ఇలాంటి పనులు చేయవద్దని కాంగ్రెస్ వారించినట్లు వార్తలు వెలువడ్డాయి. అవన్నీ వట్టి వదంతులని డీఎంకే ప్రతినిధి ఎలాంగోవన్ కొట్టిపారేశారు. తమ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన పనులేవీ చేయదని స్పష్టం చేశారు. ఏదేమైనా కాంగ్రెస్‌తో అంటకాగడం డీఎంకే నాయకులు, కార్యకర్తలకు అంతగా రుచించడం లేదని తెలుస్తోంది. కాంగ్రెస్ తమకు గుదిబండ అనీ, దాన్ని వదిలించుకోవాలనీ వారు భావిస్తున్నారు. అయితే డీఎంకే నాయకత్వం మాత్రం భవిష్యత్తులో కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే అది తమిళనాడుకు ఎంతో మంచిదని ఆశల మేడలు కట్టుకుంటోంది. అండర్ గ్రాడ్యుయేట్ మెడిసిన్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్షల పరిధి నుంచి తమిళనాడును మినహాయించాలని డీఎంకే కోరుతోంది. ఆ మేరకు ఎన్నికల హామీ కూడా ఇచ్చింది. దాన్ని నెరవేర్చడానికి కేంద్రం సహకరించడం లేదని డీఎంకే వాపోతోంది. ఇతరత్రా అందవలసిన నిధులూ లభించడం లేదని నిరసిస్తోంది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని డీఎంకే కలలు కంటోంది. అందుకే రాష్ట్రంలో తనకు జూనియర్ భాగస్వామిగా కాంగ్రెస్‌ను భరిస్తోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవ ప్రదర్శన చూశాక బహుశా డీఎంకే పునరాలోచనలో పడవచ్చు. 1960లలో తమిళనాడులో కాంగ్రెస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి ద్రావిడ పార్టీల పంచన చేరి సీట్లు సంపాదించుకుంటోంది. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డీఎంకే మునుపటి ప్రాధాన్యం ఇస్తుందా అనేది సందేహమే. కాంగ్రెస్‌ను వదిలించుకుంటే తామే ఎక్కువ సీట్లలో పోటీ చేయవచ్చనీ, ఇతర మిత్రపక్షాలకూ ఎక్కువ సీట్లు కేటాయించవచ్చని డీఎంకే శ్రేణులు తలపోస్తున్నాయి.


కలిసి పోటీ చేస్తారా?

బిహార్ పరిణామాలు తమిళనాడును మరో విధంగానూ కూడా ప్రభావితం చేయనున్నాయి. బిహార్‌లో ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని (సర్) ఎన్నికల సంఘం చేపట్టడం, దానిపై వివాదం రేగడం అందరికీ తెలిసిందే. సర్‌పై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. భారతీయ జనతా పార్టీ సర్‌ పేరిట ఓట్ల చోరీ చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెద్దయెత్తున ప్రచారం చేసినా ఓటర్ల ఆదరణ సంపాదించలేకపోయారు. ఓట్ల చోరీ ఆరోపణలపై తన తదుపరి కార్యాచరణ ఏమిటో రాహుల్ ఇంకా బయటపెట్టలేదు. తమిళనాడులో సర్ మీద ఆయన ఎలా ప్రతిస్పందిస్తారో చూడాలి. మరోవైపు, 2026లో పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరిలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరిలో కాంగ్రెస్ పార్టీ చివరిసారిగా 2016లో అధికారంలోకి వచ్చింది. తరవాత 2021లో మెజారిటీ కోల్పోవడంతో పుదుచ్చేరిలో రాష్ట్రపతి పాలన విధించారు. అస్సాంలో 2016లో కాంగ్రెస్ ఓడిపోయి భాజపా అధికారంలోకి వచ్చింది. కేరళలో కూడా కాంగ్రెస్ అదే సంవత్సరం అధికారం కోల్పోయింది. వామపక్ష ఫ్రంట్ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి వరసగా రెండుసార్లూ కాంగ్రెస్ ఓడిపోగా, ఫ్రంట్ గెలిచింది. ఇండియా కూటమిలో కాంగ్రెస్, వామపక్షాలు భాగస్వాములే అయినా కేరళలో మాత్రం ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. ఈ రాష్ట్రాల్లో వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి కలిసికట్టుగా పోటీ చేస్తుందా అన్నది పెద్ద ప్రశ్న. కేరళలో కాంగ్రెస్, వామపక్షాలు ఢీ అంటే ఢీ అంటున్నా, పశ్చిమ బెంగాల్‌లో మాత్రం చేతులు కలపాల్సిందే. తమిళనాడులో డీఎంకేతో పొత్తు పెట్టుకోక తప్పదు. వచ్చే ఏడాది ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ భవితను ప్రభావితం చేస్తాయనడంలో సందేహం లేదు.

– ఆర్.ప్రిన్స్ జెబాకుమార్

మానవ వికాస పరిణామ క్రమంలో ప్రశ్నకు ఉన్న విలువేంటో మనకు తెలుసు. అయితే సైన్సులోనే కాదు, ఇంకా ఎన్నో విషయాల్లో ప్రశ్నకు చాలా ప్రాధాన్యముంది. ఏ రంగంలోనైనా సరే, ముఖ్యంగా 'ఎందుకు' అన్న ప్రశ్న ఎంత అవసరమో చర్చిస్తుంది 'స్టార్ట్ విత్ వై: హౌ గ్రేట్ లీడర్స్ ఇన్‌స్పైర్ ఎవ్రీవన్ టు టేక్ యాక్షన్' అనే పుస్తకం. న్యూయార్క్ టైమ్స్, వాల్‌స్ట్రీట్ జర్నల్‌లలో బెస్ట్ సెల్లర్‌గా నిలిచిన ఈ పుస్తకాన్ని సైమన్ సినెక్ రాశారు. ప్రపంచం మీద ప్రభావం చూపిన గొప్ప నాయకులందరి ఆలోచన, పని, మాట... ఒకేలా

ఎందుకో తెలిస్తే...



ఉంటాయి. అదే సాధారణ ప్రజలు వారికి పూర్తి భిన్నంగా ప్రవర్తిస్తారు.. అంటారు సినెక్. ఈ పుస్తకంలో ఆయన 'గోల్డెన్ సర్కిల్' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తారు. ఒక సంస్థనో, ఒక ఉద్యమాన్నో నిర్మించడానికి ఇది ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగపడుతుందని, దాని ద్వారా ప్రజల్ని మోటివేట్ చేయడం తేలికనీ అంటారు. దాన్నే మరింతగా వివరిస్తూ 'లీడర్స్ ఈట్ లాస్ట్', 'టుగెదర్ ఈజ్ బెటర్'... లాంటి పుస్తకాలు రాశారు.

సైమన్ సినెక్ మోటివేషనల్ స్పీచ్‌లు, టెడ్ ప్రసంగాలూ ఇచ్చేవారు. ఆయనకి ఒక దశలో ఉద్యోగం పట్ల విసుగు పుట్టిందట. చేస్తున్న పనిమీదే ఫోకస్ చేస్తూ ఎందుకు చేస్తున్నానన్నది తెలుసుకోకపోవడమే అనాసక్తికి కారణమనిపించిందట. తనలాగే చాలా వ్యాపార సంస్థలు కూడా 'ఏం చేస్తున్నాం- వాట్' అన్న విషయంమీద దృష్టి పెడుతున్నాయి కానీ ఈ పని 'ఎందుకు చేస్తున్నాం- వై' అన్నదాని మీద శ్రద్ధ పెట్టడం లేదని ఆయన గమనించారు. 'ఎందుకు' అన్న విషయానికి ప్రాధాన్యం ఇచ్చిన సంస్థలు విజయం సాధించడమే కాక, ప్రజలకూ ప్రేరణనిస్తున్నాయని గుర్తించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగదారులకు దగ్గర చేసింది ఈ 'వై' నే కదా... అంటారాయన. చేయాల్సిన పనికి ఒక స్పష్టమైన ప్రయోజనం ఉన్నప్పుడే చేయడానికి ప్రేరణ లభిస్తుందన్నది సినెక్ అభిప్రాయం. యాపిల్ కంపెనీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, రైట్ సోదరులను ఉదాహరణలుగా తీసుకుని 'వై' ప్రాధాన్యం ఏమిటో వివరిస్తారు. రచయిత పేర్కొన్న గోల్డెన్ సర్కిల్‌లో 'వై' మధ్యలో ఉంటుంది. హౌ, వాట్ అన్నవి ఆ తరవాత పొరల్లో వస్తాయి. వ్యక్తులైనా, సంస్థలైనా, వ్యాపారాలైనా... ఈ ప్రాధాన్య క్రమంలో తమ విధానాలను రూపొందించుకుంటే విజయం సులభసాధ్యమవుతుందంటారు సినెక్. ధరల తగ్గింపు, రకరకాల ఆఫర్లతో వ్యాపారాల్లో స్వల్పకాలిక లక్ష్యాలను సాధించవచ్చు. దీర్ఘకాలిక కస్టమర్ బేస్‌ని ఏర్పాటుచేసుకోవాలంటే మాత్రం అసలు ఆ వ్యాపారం ఎందుకు చేస్తున్నామో దానికి ప్రాధాన్యమివ్వాలంటారు సినెక్.

డబ్బు సంపాదన అనేది చేసే పనికి ఫలితం మాత్రమే, పర్పస్ కాదు. ఒక ప్రయోజనం, కారణం, విశ్వాసం, ఆశయం... ఏదో మనల్ని నడిపించాలి. పొద్దున్నే లేచి ఉత్సాహంగా పనిలోకి రావాలంటే, ఎవరైనా మనం చేస్తున్న దాని గురించి పట్టించుకోవాలీ అంటే... దానికో కారణం ఉండాలి. ఆ కారణాన్ని బట్టే మనం ఏం చేసేదీ, ఎలా చేసేదీ ప్రాధాన్యం సంతరించుకుంటాయి. మనం ఎవరమో చెప్పేది ఆ 'వై' మాత్రమే. ఎందుకు పనిచేస్తున్నామో తెలిసినప్పుడే ఎంత బాగా అయినా పనిచేయగలం. గోల్డెన్ సర్కిల్ విధానాన్ని అలవరచుకుంటే మనిషి ప్రవర్తనలో ఒక క్రమశిక్షణ వస్తుందంటారు సినెక్.

– మిహిర

జీవితం మారకపోతుందా?

ఇప్పుడు ఎన్ని బాధలున్నా, రాబోయే రోజుల్లో అంతా కుదుటపడుతుందనే ఆశే మనిషిని నడిపిస్తుంది. కాలం గడిచేకొద్దీ తమ జీవితాలు తప్పక మారతాయని ప్రపంచంలో చాలామంది ఆశిస్తున్నారు. మరికొందరేమో తమ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుంటుందని, లేదంటే మరింత భయానకం కావచ్చని ఆందోళన చెందుతున్నారు. రాబోయే అయిదేళ్లలో తమ జీవితంలోకి అభివృద్ధి తొంగిచూస్తుందన్న ఆశాభావంతో ఆయా దేశాల్లో ఎందరున్నారంటే... (శాతాల్లో)

బ్రెజిల్	92
ఇండోనేసియా	88
నైజీరియా	88
అమెరికా	87
అర్జెంటీనా, మెక్సికో, ఫిలిప్పీన్స్	85
ఆస్ట్రేలియా	84
స్వీడన్	83
దక్షిణాఫ్రికా, స్పెయిన్	82
యూకే	80
జపాన్	79
ఇండియా	77
జర్మనీ	75
ఈజిప్ట్	73

(ఆధారం: గ్లోబల్ ఫ్లరిషింగ్ స్టడీ-2024)

వినోదం కాదది... విష వలయం!



బ్యాంకులూ, బంగారు కొట్ల దగ్గర కొందరు కేడీలు మాటువేసి ఉంటారు. వాటి నుంచి బయటకు వచ్చేవారి వాలకాలను గమనించి పది రూపాయల నోట్లు నాలుగైదు కింద వెదజల్లుతారు. మీ డబ్బు పడిపోయిందంటూ పెద్ద నీతిమంతుల్లా సాయం చేయబోతారు. చిల్లర నోట్లకు ఆశపడి ఏరుకునే వారి నుంచి డబ్బులు కొట్టేసి చక్కా పారిపోతారు. కొత్త సినిమాలను పైరసీ చేసి నెట్లో పెట్టి జనానికి వలేసేవారు ఆ కేటుగాళ్లకు ఎంతమాత్రం తీసిపోరు! ఏదో ఒక వెబ్‌సైట్‌లో సినిమా హెచ్‌డీ ప్రింట్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచడమన్నది పైకి కనిపించే ముసుగు మాత్రమే. దాని వెనక అండర్ వరల్డ్‌కు మించిన చీకటి దందాలెన్నో దాగున్నాయి. ఆ మాయదారి వెబ్‌సైట్ల మాటున ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల ప్రచారం మూడు పువ్వులు, ఆరు కాయల్లా సాగుతోంది. ఫ్రీగా సినిమా చూద్దామని పైరసీ సైట్లలోకి వచ్చినవారెందరో జూదమనే సాలెగూట్లో చిక్కుకుని సర్వనాశనం అవుతున్నారు. నిజానికి, సినిమా పైరసీ వెబ్‌సైట్లను బెట్టింగ్ మాఫియాలే వెనకుండి నడిపిస్తున్నాయన్న కథనాలూ వెలువడుతున్నాయి. వీక్షకుల వివరాలు సేకరిస్తున్న ఆయా సైట్ల నిర్వాహకులు వాటిని సైబర్ నేరగాళ్లకు అంగడి సరకు చేస్తున్నారు. ఆ వ్యక్తిగత వివరాలతో ఆన్‌లైన్ బందిపోట్లు యథేచ్ఛగా జనం ఖాతాలు కొల్లగొడుతున్నారు. సినీ పైరసీకి పర్యాయపదంగా మారిన ఐబొమ్మ రవి అరెస్టుతో ఈ విషయాలన్నీ మరోసారి తేటతెల్లమయ్యాయి.

పుణ్యభూమి

సినిమా విడుదలైన గంటల వ్యవధిలోనే సెల్‌ఫోన్‌లోనే రూపాయి ఖర్చు లేకుండా చూసే భాగ్యం కలుగుతోందని చాలామంది మురిసిపోతుంటారు. కానీ, వాళ్లు వాళ్లకు తెలియకుండానే ఎరకు ఆశపడి గాలానికి వచ్చి చిక్కుకునే చేపల్లా మారిపోతున్నారు. సున్నితమైన వ్యక్తిగత సమాచార దోపిడీకి గురవుతున్నారు. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్లను వీక్షించిన 50 లక్షల మంది వివరాలను రవి అలాగే దోచేశాడు. ఆరేళ్లుగా పోలీసులను, సినీ పరిశ్రమను ముప్పుతిప్పలు పెడుతున్న అతడు.. ఒక సందర్భంలో, దమ్ముంటే నన్ను పట్టుకోండంటూ వ్యవస్థకే సవాలు విసిరే స్థాయిలో రెచ్చిపోయాడు. ఆ తరవాత కొద్దికాలానికే చట్టానికి చిక్కి కటకటాలపాలయ్యాడు. విదేశాల్లో సర్వర్లు నిర్వహిస్తున్న అతగాడు ఇప్పటిదాకా వివిధ భాషలకు చెందిన 21వేల సినిమాలు పైరసీ చేశాడంటేనే ఆధునిక సాంకేతికతను ఎంతగా దుర్వినియోగం చేశాడో అర్థమవుతుంది. సినీ పరిశ్రమకు ఎంతో నష్టం కలిగించిన రవి- తన సైట్లలో గేమింగ్, బెట్టింగ్ ప్రకటనలతో రూ.20 కోట్లు వెనకేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. తన వెబ్‌సైట్ల ద్వారా జనాన్ని బెట్టింగ్ ఊబిలోకి నెట్టిన ఆ దుర్మార్గుడు.. అలా సంపాదించిన పాపపు సొమ్ముతో విదేశాల్లో జల్సాలు చేశాడు. అక్కడి గేమింగ్, బెట్టింగ్ మాఫియా బాస్‌లతో నేరుగా ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. వ్యక్తుల గోప్యతా హక్కును, కుటుంబాల సౌభాగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిన ఆ మేకవన్నె పులిని సినీ ప్రేమికుల బాంధవుడంటూ సామాజిక మాధ్యమాల్లో కొందరు ఆకాశానికి ఎత్తుతున్నారు. తన స్వార్థం కోసం పదిమంది బతుకులతో పులిజూదం ఆడేవాడు మహానుభావుడు అవుతాడంటే- చార్లెస్ శోభరాజ్ లాంటివాళ్లంతా మంచోళ్లయిపోరూ!


ఇరవై నాలుగు విభాగాలకు చెందిన సృజనకారులు ఎంతో కష్టపడితే ఒక సినిమా రూపుదిద్దుకుంటుంది. మన దేశంలో అరవై లక్షల మందికి పైగా సినీరంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. శాటిలైట్ ఛానళ్లూ ఓటీటీల్లో ప్రసారమయ్యే కార్యక్రమాలు, వెబ్‌సిరీస్‌ల వెనక మరెంతో మంది అలుపెరగని శ్రమ దాగుంటుంది. వారి కష్టార్జితాన్ని కాజేస్తున్న పైరసీ ప్రబుద్ధులు భారతీయ వినోద పరిశ్రమకు 2023లో రూ.22,400 కోట్ల నష్టం వాటిల్లజేశారు. అందులో థియేటర్లు కోల్పోయింది రూ.13,700 కోట్లు అయితే, ఓటీటీల వాటా రూ.8,700 కోట్లు. ఆ ఏడాది మీడియా, వినోద పరిశ్రమ మొత్తం ఆదాయంతో పోలిస్తే పైరసీ వల్ల కలిగిన నష్టం అందులో నాలుగో వంతుగా తేలింది. పైరసీ మహమ్మారి వల్ల ఒక్క తెలుగు సినీ పరిశ్రమకే నిరుడు రూ.3,700 కోట్ల మేర గండిపడింది. పదేళ్లలో ఆ నష్టం రూ.20 వేల కోట్లకు పైమాటే! ఒకదాన్ని బ్లాక్‌చేస్తే, రావణాసురుడి తలల్లా పైరసీ సైట్లు మరో రూపంలో రంగప్రవేశం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 వెబ్‌సైట్లు తెలుగు సినిమాలను అక్రమంగా అందుబాటులో ఉంచుతున్నాయి. పైరసీ రాకాసి కోరలు పీకేందుకు రెండేళ్ల కిందట సినిమాటోగ్రఫీ చట్టాన్ని కేంద్రం సవరించింది. దాని ప్రకారం దోషులకు మూడేళ్ల దాకా జైలుశిక్ష, మూడు లక్షల రూపాయల నుంచి నిర్మాణ వ్యయంలో అయిదు శాతం మేర జరిమానా విధించే అవకాశం ఉంది. అయినప్పటికీ, ఎక్కడికక్కడ పైరసీ ముఠాలు పేట్రేగిపోతున్నాయంటే అర్థమేంటి? దేశీయంగా పైరసీ సమస్యను ఎవరూ పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవని ఆ జాడ్యంపై ఏర్పాటైన కేంద్ర ప్రభుత్వ కమిటీ గతంలోనే ఆవేదన వ్యక్తం చేసింది. పైరసీ దొంగల భరతం పట్టాలంటే శిక్షల కాఠిన్యాన్ని పెంచాలి. నిందితులను త్వరితగతిన పట్టుకుని విచారణను వీలైనంత వేగంగా ముగించాలి. సినిమా, ఓటీటీ వేదికల సర్వర్లలోని సాంకేతిక లోపాలను సంబంధిత వర్గాలు సరిచేసుకోవాలి. పైరసీ సైట్లతో మాల్‌వేర్ ముప్పు సైతం పొంచి ఉందని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అధ్యయనం మొన్నామధ్య హెచ్చరించింది. వ్యక్తిగతంగా, సామాజికంగా తీవ్ర నష్టం కలిగిస్తున్న ఆ వెబ్‌సైట్లకు దూరంగా ఉండటమే అందరికీ మేలు!

– వేణుబాబు మన్నం

వైరస్‌పై.. యుద్ధం చేద్దామా?

నేస్తాలూ.. మనం వైరస్‌ల పేర్లు తరచూ వింటుంటాం. కొన్నేళ్ల క్రితం కరోనా వైరస్ అందరినీ ఎంతగా భయపెట్టిందో తెలుసు కదా! ఇంతకీ వైరస్‌లు అంటే ఏమిటి.. ఎక్కడుంటాయి.. వాటితో జబ్బులెలా వస్తాయి. ఇలాంటి సందేహాలు బోలెడు వస్తుంటాయి. మరి, వాటి గుట్టేమిటో తెలుసుకుందామా!

వైరస్‌లు అతిసూక్ష్మ రేణువుల్లాంటివి. ఇవి పరాన్న జీవులు. అంటే మరో కణజాలంపై ఆధారపడతాయి. చాలాచాలా చిన్నవి కాబట్టి మామూలు మైక్రోస్కోపులతో చూడలేం. ఇవి ఒంట్లో అవయవాలపై దాడిచేసి రకరకాల జబ్బులకు కారణమవుతాయి. వీటివల్ల చికెన్‌పాక్స్, స్మాల్‌పాక్స్, ఫీవర్ బ్లిస్టర్స్, రేబీస్, బ్రెయిన్ ఫీవర్, ఎల్లో ఫీవర్, జలుబు వంటి సమస్యలెన్నో వస్తాయి. బ్యాక్టీరియా మాదిరిగా వైరస్‌లకు యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేయడం సాధ్యంకాదు. మరెలా అన్నదే మీ సందేహం కదూ! వైరస్ బారిన పడినప్పుడు ఎదుర్కొనేందుకు మన శరీరం తెల్ల రక్తకణాల్ని సృష్టిస్తుంది. అవి సైనికుల్లాంటి యాంటీబాడీస్‌ను తయారు చేస్తాయి. అవి వైరస్‌పై పోరాటం చేస్తాయి. ఇలాంటి సైనికుల్ని శరీరం తనలోనే దాచుకుంటుంది. మళ్లీ ఎప్పుడైనా వైరస్ దాడిచేస్తే గుర్తుంచుకుని, యాంటీబాడీస్‌ను యుద్ధానికి సిద్ధం చేస్తుంది. అయితే, కొంత కాలం గడిచిన తరవాత యాంటీబాడీలు మాయమైపోతుంటాయి. వైరస్‌ల లక్షణాలూ మారిపోతాయి. అలాంటప్పుడు శరీరం వాటిని వెంటనే గుర్తుపట్టలేదు. అందుకనే, శాస్త్రవేత్తలు టీకాలు, బూస్టర్ టీకాలనూ తయారు చేస్తారన్న మాట. వైరస్‌పై యుద్ధం చేసేందుకు అవి శరీరానికి సాయం చేస్తాయి.



హాయ్! బుజ్జీ!!

ఇదంతా సరే, ఇంతకీ వైరస్ బారిన పడకూడదంటే ఏం చేయాలి? చేతుల్ని శుభ్రంగా కడుక్కుంటూండాలి. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు, ముక్కు చీదినప్పుడు, బాత్‌రూమ్ తలుపు గొళ్లెం పట్టుకున్నప్పుడు హ్యాండ్‌వాష్ చేసుకోవాలి. అపరిశుభ్రమైన చేతులతో కళ్లు, ముక్కు, నోటిని తాకకూడదు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతులు అడ్డం పెట్టుకోవడం అలవాటు చేసుకోవాలి సరేనా!

– శ్రీజన్

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1. MUS□□ON
2. MOTI□□RTICAL
3. PA□□NDER
4. WIN□□□N
5. KNI□□STIVAL

జవాబు: 1.MUSIC, ICON 2.MOTIVE, VERTICAL 3.PAGE, GENDER 4.WINDOW, DOWN 5.KNIFE, FESTIVAL




అలరించిన జానపదం

మునునేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలో సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం రాత్రి నిర్వహించిన జానపద నృత్య ప్రదర్శనలు అలరించాయి. - న్యూస్‌టుడే, మొగల్రాజపురం (విజయవాడ సిటీ)

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' రేపు

కానూరు పి.వి.పి. సిద్ధార్థ ప్రాంగణంలో నిర్వహణ



ఈనాడు - అమరావతి: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. కానూరులోని పి.వి.పి. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు ఈ మెగా సైన్స్ ఫెయిర్ ప్రారంభం కానుంది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో వివిధ పాఠశాలలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పాల్గొననున్నారు. విద్యార్థులను వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించడం 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' ముఖ్య ఉద్దేశం. సుమారు 100 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు.

నడిరేయి తిండి.. నాసి కదండి..

ఈనాడు, అమరావతి

హైదరాబాద్, విశాఖ మధ్య కీలక జంక్షన్ విజయవాడ.. తెల్లవార్లూ బస్సులు, రైళ్లలో వేలాది ప్రయాణికులు నిత్యం వచ్చి పోతుంటారు. వీరికి రాత్రుళ్లు ఆహారం దొరకక ఇబ్బంది పడకూడదనే.. ఫుడ్‌కోర్టులు ఆవిర్భవించాయి. నగరపాలిక అనుమతితో.. ఈట్‌స్ట్రీట్‌లో 11 అల్పాహార స్టాళ్లతో మొదలై.. క్రమంగా 98కి పెరిగాయి. ఇప్పుడు.. 126 స్టాళ్లున్నాయి. 80 శాతం స్టాళ్లు నాన్‌వెజ్, బిర్యానీలే విక్రయిస్తున్నాయి.



★ బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫుడ్‌కోర్టులో 44 స్టాళ్లున్నాయి. రాత్రివేళ.. బారులు తీరి మరీ తినే వారు పెరగడంతో.. స్టాళ్లు పెరిగాయి.

రూ.కోట్లలో వ్యాపారం..

ఈ ఫుడ్‌కోర్టులలో నెలవారీ రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. అందుకే.. పోటీ పడి మరీ. ఎంత డబ్బులను చెల్లించైనా ఇక్కడ స్టాల్ కోసం వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. ఆహార నాణ్యతపై నగరపాలిక వారు తమకు సంబంధం లేదంటే.. ఆహార నియంత్రణ శాఖ.. కన్నెత్తయినా చూడదు.

విజయవాడలో ఈట్‌స్ట్రీట్ నైట్ ఫుడ్‌కోర్టు ఇది. రాత్రి 10-12 గంటల వరకు, ఆపై మరో గంట అనధికారికంగా ఆహార విక్రయాలు జరుగుతాయి. ఇక్కడ అమ్మే.. బిర్యానీలు, చికెన్, మటన్, ఐస్‌క్రీమ్స్, కుల్ఫీలలో.. కల్తీ, నాసివే అధికం. సత్యనారాయణపురం, తాడిగడప చౌరస్తాలోనూ ఫుడ్‌కోర్టులు ఉన్నాయి. వీటిలో తినే వారిలో 90 శాతం మంది యువతే. ఇదే ఇప్పుడు వారిని అనారోగ్యంపాలు చేస్తోంది.

★ **హెపటైటిస్ ఏ:** ప్రస్తుతం హెపటైటిస్ ఏ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఇది పచ్చకామెర్లకు దారితీస్తోంది. పేగుల్లో పుండ్లు, దీర్ఘకాలం విరేచనాలు, భరించలేని కడుపునొప్పి ఎక్కువై చివరకు మూత్రపిండాలు పాడవుతున్నాయి.

★ **ఆరోగ్యం గుల్ల:** రాత్రుళ్లు నాణ్యత లేని, కల్తీ నూనెలతో చేసిన ఆహారం తిని యువత రోగాల బారిన పడుతున్నారని వైద్యనిపుణులు డాక్టర్ బొర్రా సాయి కిరణ్మయి పేర్కొన్నారు. నిద్రలేమి, కాలేయం, మూత్రపిండాలు, పొట్ట, పేగుల సమస్యలతో ఆసుపత్రులకు వస్తున్నవారు పెరిగారన్నారు.


రోజూ 10-15 వేల మంది.. ఫుడ్‌కోర్టులకు రోజుకు 10-15 వేల మంది వచ్చి తింటున్నారు. వీరిలో హాస్టళ్లు, కళాశాలల విద్యార్థులే అధికం. ఫుడ్‌కోర్టులను అడ్డాలుగా మార్చుకొని.. నిత్యం వచ్చి తినే వారే వందల్లో ఉన్నారు.

ఈట్‌స్ట్రీట్లలో కల్తీ ఆహారంతో రోగాలపాలు

వైద్యుల వద్దకు బారులు

నగరంలో జనరల్ ఫిజీషియన్లు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు వందకుపైగా.. 25 ప్రముఖ ఆసుపత్రులున్నాయి. నిత్యం ప్రతి వైద్యుడి వద్దకూ 1-2 కేసులివే వస్తున్నాయి.

పేదరికం మోస్తూ.. ప్రతిభతో మెరుస్తూ..




పవర్ లిఫ్టింగ్‌లో ప్రవల్లిక మేటి

ఈనాడు, అమరావతి

పేద కుటుంబం.. ముగ్గురు ఆడపిల్లలు.. తండ్రి జీతం పోషణకే చాలని పరిస్థితి. నాన్న యాతన చూసిన ఆమెలో పవర్ లిఫ్టర్‌గా ఎదగాలన్న స్ఫూర్తి రగిలింది. పేదరికాన్ని జయించాలన్న తపన పెరిగింది. నిరంతర కృషితో అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయి పవర్ లిఫ్టర్‌గా విజయ పథంలో పయనిస్తోంది జగ్గయ్యపేటకు చెందిన పోతిన ప్రవల్లిక.. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు స్థోమత లేక దాతల సాయానికి ఎదురు చూస్తోంది.

అవజయాల స్ఫూర్తితో.. ప్రవల్లిక తండ్రి నరసింహారావు పేదరికంలో ఉన్నా పవర్ లిఫ్టింగ్‌లో కుమార్తె తపన చూసి ఆయన రెక్కల కష్టంపై శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రవల్లికను పాఠశాల స్థాయిలో అనేక అపజయాలు వెక్కిరించినా కుంగిపోలేదు. ఆ ఓటమి నేర్పిన పాఠంతో మరింత కఠోర సాధన చేసి తన బలహీనతలను బలంగా మార్చుకుంది.

స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఏపీగా..

సబ్ జూనియర్ విభాగంలో 30, జిల్లా స్థాయిలో 30 పతకాలు మంగళగిరి, విశాఖపట్నం, సత్తెనపల్లి, జగ్గయ్యపేట, నెల్లూరు తదితర ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆమె ఆరు బంగారు పతకాలు సాధించింది. కేరళ, హైదరాబాద్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఆరు పతకాలు, రాష్ట్ర స్ట్రాంగ్ ఉమెన్ కేటగిరిలో మూడు పతకాలు సాధించింది. దీంతో 2021లో రాష్ట్ర స్ట్రాంగ్ ఉమెన్ అవార్డు కైవసం చేసుకుంది.

అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించినా..

జాతీయ స్థాయిలో పోటీల్లో అపూర్వ ప్రతిభ చూపిన ప్రవల్లికకు 2019, 2022లో రెండుసార్లు అంతర్జాతీయ ఎంపిక పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. వీటికి ఆస్ట్రేలియా, హాంకాంగ్ దేశాలకు వెళ్లాల్సి వచ్చింది. వీసా, పాస్‌పోర్టు, అక్కడ అయ్యే ఇతర ఖర్చులు కలిపి ఒక్కో చోటికి రూ.5 లక్షల వరకు అవుతుండటంతో అంత స్థోమత లేక.. ఆదరించేవారు రాక వెళ్లలేక పోయింది. జాతీయ స్థాయిలో ఇప్పటికే రాణిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆసరాగా ఇస్తే అద్భుతాలు ఆవిష్కరిస్తానని అంటోంది.

రాజధాని రైతులకు కమిటీ భరోసా

ఈనాడు, అమరావతి: రాజధాని రైతుల సమస్యలకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపించాలని త్రిసభ్య కమిటీ సీఆర్డీఏ అధికారులకు సూచించింది. సమస్యలకు కారణాలపై ఆరా తీసి.. అధికారులిచ్చిన వివరణలపై రైతు నేతల అభిప్రాయాలు తెలుసుకుంది. సీఆర్డీఏ యంత్రాంగం, గుంటూరు జిల్లా అధికారుల సమన్వయంతో సమస్యలపై అధ్యయనం చేసి సమగ్ర వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించింది. శనివారం రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సభ్యులు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్.. సీఆర్డీఏ అధికారులు, రైతు నేతలతో సమావేశమయ్యారు. ఆర్-5 జోన్ అంశంలో ఎలా ముందుకెళ్లాలో చర్చించారు. సమాచార లోపంతో సమస్యలేర్పడ్డాయని ఐకాస నేతలు పువ్వాడ సుధాకర్, అనిల్, కిరణ్ చెప్పారు. సున్నితమైన అంశాలపై వైకాపా నాయకులు యాగీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కొంత సొంతానికి.. మిగిలింది అమ్మకానికి..!



వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డి వ్యవహార శైలి

ఈనాడు, అమరావతి: బెంగళూరు నుంచి తెప్పించిన డ్రగ్స్‌లో వైకాపా నేత కొండారెడ్డి కొంత సొంతానికి వాడుకునేవాడు.. మిగిలింది తన [illegible] రులకు అమ్మేవాడు. ఎక్కడా తన ప్రమేయానికి సంబంధించి ఆధారాలు దొరకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకునేవాడు. ఆర్డర్లు, విక్రయాలకు ఇతరుల నంబర్ల ద్వారా మాట్లాడి వ్యవహారాలు చక్కబెట్టేవాడని తేలింది. డబ్బులు కూడా నేరుగా తీసుకోకుండా ఇదే పద్ధతిని అనుసరించాడు. విజయవాడలో నమోదైన ఎండీఎంఏ కేసులో కొండారెడ్డిని నిందితుడిగా చేర్చడంతో పాటు పీటీ వారెంట్‌పై విజయవాడకు తెచ్చి కోర్టులో హాజరుపరిచే సన్నాహాల్లో పోలీసులు ఉన్నారు.

శ్రీవాత్సవ్, స్వరూపరాజ్ ఫోన్ల నుంచి.. బెంగళూరులోని మదుసూదన్ అలియాస్ మ్యాడీ ద్వారా పలు దఫాలుగా కొండారెడ్డి డ్రగ్స్ తెప్పించుకునేవాడు. ఇందుకు శ్రీవాత్సవ్, స్వరూపరాజ్ ఫోన్లను ఉపయోగించాడు. వారి వాట్సాప్ నంబర్ల నుంచి మ్యాడీకి కాల్ చేసి మాట్లాడేవాడు. ఎండీఎంఏను పార్టీల్లో తీసుకునేవారు. కొండారెడ్డి, గీత్ చరణ్, హర్షవర్ధన్, హవీలా, స్వరూపరాజ్, తదితరులు సేవించేవారు. మిగిలింది స్వరూపరాజ్, కొండారెడ్డిలు విక్రయించేవారు. [illegible] లోహిత్ ఒప్పుకున్నాడు.

లోహిత్ ఫోన్‌లో కీలక సమాచారం !

[illegible] పట్టుబడ్డారు. అందులో కొంత తీసుకుంటానని కొండారెడ్డి లోహిత్‌కు చెప్పాడు. దీంతో ప్రేమికులు విజయవాడలో పోలీసులకు దొరికిన రోజు కొండారెడ్డిలో కంగారు పెరిగింది. కొండారెడ్డి అప్రమత్తమై లోహిత్ యాదవ్ ద్వారా శ్రీవాత్సవ్ తల్లితో మాట్లాడించినట్లు తేలింది. అదే రోజు లోహిత్, కొండారెడ్డిల మధ్య చాలా కాల్స్ ఉండడమే ఇందుకు సాక్ష్యం. కొండారెడ్డితో పాటు డ్రగ్స్ తీసుకునే అతని సహచరులంతా వైకాపా ర్యాలీల్లో పాల్గొని హల్‌చల్ చేసేవారు.

ఓఆర్ఆర్‌లో ముందడుగు!

ఎన్‌హెచ్ఏఐ వద్దకు ఎన్టీఆర్ 3ఏ ప్రతిపాదనలు



ఈనాడు, అమరావతి: అమరావతికి మణిహారంగా నిర్మించనున్న ఓఆర్ఆర్ విషయంలో కీలక అడుగు పడింది. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 3ఏ ప్రతిపాదనలు ఎన్‌హెచ్ అధికారులకు చేరాయి. సోమవారానికి కృష్ణా జిల్లా ప్రతిపాదనలు చేరనున్నాయి. మరి కొన్ని దశలు దాటితే భూసేకరణ మొదలవుతుంది. ఇప్పటికే ఏలూరు జిల్లా ప్రతిపాదనలు దిల్లీలో ఆమోదం పొందగా గుంటూరు, పల్నాడువి దిల్లీకి పంపించారు. మరో వారంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలవి దిల్లీ పంపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

❖ **18 గ్రామాల్లో పూర్తి:** ఓఆర్ఆర్ 23 మండలాల్లోని 97 గ్రామాల మీదుగా వెళుతుంది. ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల, మైలవరం, జి.కొండూరు, వీరులపాడు మండలాల్లోని 18 గ్రామాల్లో నిర్మిస్తారు. దీనిపై 6 గ్రామాల ప్రతిపాదనలు ఎన్‌హెచ్ అధికారులకు పంపగా.. లోపాలు ఉన్నాయని వెనక్కి పంపారు. వాటిని సరిచేసి మిగిలిన గ్రామాల వివరాలు జోడించి రెవెన్యూ అధికారులు తాజాగా 3ఏ ప్రతిపాదనలు ఎన్‌హెచ్ అధికారులకు పంపారు. ఇందులో భూమి పూర్తి వివరాలు, సదరు సర్వే నంబరులో ఎంత భూమి ఉంది.. అందులో రహదారి నిర్మాణం నేపథ్యంలో ఎంత తీసుకుంటున్నామనే వివరాలన్నీ ఉన్నాయి.

❖ **భూసేకరణకు కీలక అడుగు:** ఎన్‌హెచ్ అధికారులు పోర్టల్‌లో నమోదు చేసి దిల్లీలో ఉన్నతాధికారులకు, సంబంధిత మంత్రిత్వ శాఖకు పంపనున్నారు. ప్రతిపాదనలు ఆమోదిస్తే అభ్యంతరాల స్వీకరణ తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి భూసేకరణ చేపడతారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

2021 July Model, Mahindra Thar M.T- Maroon Colour, 60,000 km is for Sale. ✆ 98482 42831.

FOR SALE: Tippers & Millers (Swing Setter), 3 Tippers - Bharat Benz 12 Tyres, 2 Tippers 10 Tyres, 2 Millers - Ashok Leyland Ltd, 2019 Model. ✆ 94401 72901.

మంచి కండిషన్‌లో ఉన్న Maruthi Dzire VXI 2018 ... ✆ 91003 63437

BUSINESS SERVICES

బంగారం కొనుగోలు ... ✆ 87907 41166

WANTED DEALERS/AGENTS

... Ph: 98492 77733.

BUSINESS OFFER

IndiaStudent.Com AI-EdTech Pvt Ltd. Franchise Offer: @5L/ Dist & Investors/ Partners Welcome, Grow with Us: 9908981464

... FMCG, ... 76599 77788, 99664 57579.

... ✆ 90909 00069.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified Co. Household Goods Shifting Any time Any Where. ✆ 97043 64389.

SOLAR PRODUCTS

PM సూర్యఘర్ 3KW సోలార్ 1.98 ... 90%- 100% Govt. సబ్సిడీ 78 ... 1.20 ... 120 నెలలు EMI 97004 29623

BUILDING CONSTRUCTION

BPS&LRS ... ANCISON ... 94917 55456

ARCHITECT & ENGINEERS

Contact For Building Plan Approvals & BPS, LRS Plans of AP CRDA Vijayawada Municipal Corporation. ✆ 83747 33456

... BPS ... Govt. ... M.Tech. ... VMC & CRDA ... ✆ 89777 71989.

WATER PROOFING

Tarun Slab Leakage works ★ 25y exp. ★ 5yrs warranty ★ Bathroom Leakage Grouting Epoxy works. ✆ 94940 02285, 99616 07504

FINANCIAL SERVICES

... 1% ... ✆ 96661 54940

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో ధ్రువీకరించుకోవాలని ... ఈనాడు యాజమాన్యానికి కలదు.

... ✆ 83099 11995.

EDUCATION

పారామెడికల్ Diploma in Medical Laboratory Tech., Diploma in Operation Theater Tech., Diploma in Anaesthesia Tech., Diploma in Cardiology, MPHA ..., Inter, MLT Inter MPHW (F) ... ✆ 98482 42880

HOME TUITIONS

... LKG to PG All Objective ... NEET, IIT ... ✆ 92900 05677, 74165 35749.

HOME NEEDS

MOSQUITO SCREENS

... UPVC ... Bird ... ✆ 98495 69111.

PEST CONTROL

Tarun Pest ★25y exp 5yrs Warranty ★ SmellLess ★ Bayers Chemicals(Pest & Other Insects Control) 94940 02285, 9951607504

... ✆ 93932 30136

PERSONAL INTEREST COURSES

TAILORING

... ✆ 96523 09860

PEOPLE CARE

OLD AGE HOME

... ✆ 96038 53355, 97047 41122

REAL ESTATE

VJA ... Old 1,2,3 BHK ... SBI 100% ... ✆ 93476 98060

... ✆ 93926 02024.

... ✆ 89195 62183.

FLAT FOR SALE

3 B/R + Home Theatre, Fully Furnished, Near Ayush Hospital, Sree Ramachandranagar, VJA. 12 Yrs Old, E/F ✆ 98495 68939.

... ✆ 98662 01239.

... ✆ 94931 21030, 79013 96499

3BHK ... IMMEDIATE OCCUPATION ... ✆ 85229 12999.

VJA ... 3 BHK ... ✆ 98485 98331.

3BHK డ్యూప్లెక్స్ OLD ... 1550 SFt UDS 48 ... VJA . ✆ 93907 78166.

4 BED ROOM LUXURY FLATS
SITE 1477 YARDS
TOTAL FLATS 10 ONLY
EACH FLAT 4260 SQ FEET
UDS 137 YARDS
(INCLOUD 3 CAR PARKINGS)
20X15 BED ROOMS 4
10X15 & 10X8 BATH ROOMS 4
20X15 KITCHAN
20X15 DINNING HALL
20X10 HOME THEATER
20X15 DRAWING HALL
60X17 LIVING HALL
Prime Locality
Beside SIT Office
Prathuru Road, Tadepalli
CONTACT
92464 95788 / 99

3BHK ... 3rd & 5th ... 1795Sft, ... VJA. ✆ 89777 88889, 89777 77797

New Luxury 3BHK 1800Sft ... 52Sq Yds UDS E/F, 3rd Floor With Full Wood work Marvel Heights Mahanadu Road VJA. ✆ 94405 28023.

3BHK 1930 Sft. N/F 13Y. old Flat at Patamata, Nr. Benz Circle, Lift, Car Park, Generator. ✆ 9701112559, 9840427849, 8826293015.

4 BHK ... ... NAC ... 4th ... 4 BHK ...
✆ 97017 88058

Vijayawada Porenki 100 Feet Road Brand New Flat 3rd and 4th floor 3000 Sft North/ East facing 1 Car Parking, Per Sft 7500 Slightly Negotiable Ready to Occupy Cont: 73965 44066

Two BHK Flat Constructed in 2014 With 980 Sft Plinth Area at Ashok Nagar With Car Parking For Sale. ✆ 77023 61362.

3 BHK Flat at Patamata Lanka and 2BHK Flat at Ashok Nagar For rent ✆ 77023 61362

3 BHK PREMIUM FLATS FOR SALE
...
✆ 83418 87324

విజయవాడ ... 3BHK (3100 SF.t) ... A/C, ... ✆ 99497 46789.

... 100% ... ✆ 97016 99983

విజయవాడ ... E/F 3BHK ... 2050 S.Ft ... ✆ 98663 09134.

FLAT FOR SALE
2620 Sq.ft 3 BHK
Ready to move
Fully Furnished (2 Floor),
Floor Wise Flat
SRI SESHADRINILAYAM
Near Sentini Hospital, VJA
PH.9848120049

... TVS ... 3 BHK ... ✆ 76800 70510.

... ✆ 73829 81107.

విజయవాడ ... CTO ... 1940Sft ... 5th ... 3BHK ... ✆ 9440857075

FLATS for SALE
4 BHK Premium FLATS - 2850 Sft.
(2 Cars Parking)
beside Bhashyam School, KANURU
9989855219
8977162616

... 2BHK ... 1324SFT ... ✆ 9160002359.

VJA ... 2BHK ... ✆ 72078 93551, 90105 63685.

NEW DELUXE 3 BHK FLATS
1522 S.Ft. For SALE
Near SS Convention, Y.V. RAO Hospital Road, Labbipet, Vijayawada
READY TO OCCUPY.
NO GST.
✆ 98481 77277

... 2BHK ... ✆ 98481 47485.

... 2BH, 3BH ... 2BH, 3 BH ... Cell: 92999 99714

... ✆ 70139 39155.

2BHK ... VJA. ✆ 92469 90799.

విజయవాడ ... 300 ... 3BHK ... Rs.1.62 Cr. ✆ 98480 82879.

VJA ... 2BHK ... ✆ 98485 42994, 94406 18108

... KLU ... ✆ 63040 00712, 70134 39314.

... 2/3BHK ... ✆ 76740 82458.

... 3BHK, 5th ... ✆ 76740 82458.

2 & 3BHK ... 2BHK @ 36L& 3BHK @ 55L ... CRDA ... M.P. ... ✆ 89856 50007

LICకాలని 3B/R E/F 1400S. 72L, ... 3B/R W/F 1100S. 64L, ... 200 ... 90L 12 ... ✆ 98661 38032

KANURU

3BHK - 1470Sft North, 2BHK - 1240Sft East, Ready to move at Srinivasa Residency, Near Sitapuram Colony, Aravapalli Purnaiah Veedi, Opp. Priya Foods, Poranki, VJA. (C) 7702876445

3 BHK FLAT FOR SALE
3 BHK FLAT 1750 S.ft E/F; 1st Floor; With Car Parking
Deepika Grandeur Apt.
Road No.3, Amaravathi Colony, Kanuru, VJA.
✆ 99081 12244

PENAMALURU

విజయవాడ, పోరంకిలో ... 3BHK ... ✆ 81437 04122.

RAMAVARAPPADU

2BHK ఫ్లాట్స్ ... St Medplus GF 800 plinth ... 22L SF 850 plinth West 25L. ✆ 79957 69538, 92464 93458.

GOLLAPUDI

... 2&3 BHK ... ✆ 92464 72524

HOUSE FOR SALE

Independent House for sale. Nethaji St, Sitharampuram, Next right to Visalandhra office-Vijayawada, East Face, 279 Sq.Yd. Clear title, Prime location. Ph: 87902 77465

G+1 & ... ✆ 94906 08053, 83090 20208.

... 1400SF.t 2BHK E/F 69L W/F67L. ✆ 95427 56666

... G+2 ... 2BHK ... ✆ 80740 23492.

... 235 ... G+2 ... 1BHK+ ... 2BHK ... 3300 Sft ... ✆ 98669 11199, 98668 33383.

... 262 ... G+1 ... ✆ 94401 77350.

VJA ... D.No. 27-31-3 ... 156 ... G+3 ... ✆ 99481 14455

... G+1 ... 1.35 ... 70 ... 45 ... 35 ... ✆ 93949 64999.

... ✆ 95420 50403

... ✆ 99637 22999.

... 123 ... G+1 ... ✆ 82477 82459.

... ✆ 80746 23884, 83176 37676

... ✆ 79890 42115

LAND FOR SALE

Land for Development/ outright sale for apartments only in Kankipadu Town , Just 750 meters from RTC Bus Stand, Godavarru Main Road Area: 60 Cents/ 2831 Sq.Yards, Call for More Details: Mr. Srikanth Hyderabad Ph: 76619 77789

... ✆ 93462 81147, 83676 38755.

CURRENCY NAGAR

VJA, ... 2&3&4 BHK ... ✆ 86884 66789.

పొలం అమ్మకము
... 50 ... 28.50 ...
98493 45590
79013 81590

... ✆ 78425 99975

... ✆ 81437 72799

... ✆ 99087 39516

... ✆ 77807 25157/ 94915 86009

PLOT FOR SALE

VJA ... SBI ... 67 X 41 ... 307 ... ✆ 98487 14252

... 100Ft ... CRDA ... 80% ... 18K ... ✆ 94905 14626

... 5 ... 133 ... 30 ... 77320 51576

... CRDA ... Plots ... ✆ 99481 10645.

AP ... MLA ... E-11 ... 780 ... AP ... 180,360 ... LPS ... ✆ 92907 63488

... 7999/- ... CRDA ... ORR ... 70758 14389.

... NH ... 1/2km ... 10 ... 2,15,000/- ... 1,60,000/- ... 78933 89194

... Gated ... ✆ 78937 66996.

... No.6, 400 ... W/F ... Contact: 76610 34433.

... 1306 ... Contact: 76610 34433.

... SCOTSPINE International School ... 1084 ... Contact. 76610 34433.

... 120 ... 7 ... ✆ 92913 64999.

... R.S.No.104/2 ... 336 ... ✆ 79894 66969.

... VMC ... No.254, ... 40 ... 120 ... 35,000/- ✆ 94406 61789

133.33 Sq.Yds ... 1,00,000/- ... ✆ 91334 45755.

... ✆ 99630 77477.

VJA, ... CRDA LP No.104/25 ... ✆ 95531 29369, 99404 83810.

... 810 ... ✆ 98483 43355.

... CRDA ... 19,999/- ... ✆ 93944 44477.

1000 చ.గ.లు
విజయవాడ, బందరు రోడ్డుకి ... 82 x 110 ...
✆ 93470 24215

... CRDA ... 278 ... 300 ... 15 ... ✆ 98661 93232.

... LV ... 215 ... E/F ... ✆ 99518 35086.

VJA ... LP No. 62/2024, ... ✆ 95531 29369, 97054 33765

... 8999/- & 5999/-. ... 9030746514, 9390685019.

... 88 ... APCRDA, RERA ... 80% ... 79754 89223, 90008 94444.

392 ... ✆ 99851 51976

... E/F 230 ... W/F 228 ... 78938 37539

... 900 ... 320 ... 400 ... ✆ 98497 25707.

NTR ... 240 ... Near RTA Office ... 7075982694, 9989786951

NAC ... 460, 1500 ... 800, ... 290, 300, 700, ... 400, 300, 650, 900, ... 250, ... 300, 650, 800 ... 1500, 750, ... 5000, ... 300, 800, 1450, 4000, 5500, 2600, ... NH ... 70 ... 400 NH ... 1850 ... ✆ 98484 88999. propertyguru.site

... 12 ... ✆ 94925 74644

KANURU

... 68 ... W/F 229 ★282 ... ✆ 88851 00666

PENAMALURU

... 300 ... ✆ 99636 43786

GANNAVARAM

NH-5 ... 4km ... 234 ... ✆ 88856 12593

GOLLAPUDI

... C ... 200, 400 ... 25000/- ... ✆ 92907 63488

COMMERCIAL SPACE FOR SALE

... 1000 ... ✆ 98495 46408.

35 ... MG ... Ready to occupy. ... ✆ 99851 51976.

... NTR ... 233 ... MED PLUS ... 228 ... 300 ... 1st ... 290 ... ✆ 63000 65270

... 90,000/- ... ✆ 98482 54909.

PROPERTY FOR SALE

... 291 ... (60'X44') 2640 ... S/E Face RCC ... No. Brokers. ✆ 96032 02764, 99482 97379.

కమర్షియల్ బిల్డింగ్ అమ్మకం
HYD-VJA ... 585 ... G+1 ...
✆ 92913 23563

TO LET

... 2BHK ... ✆ 99487 23686.

... 3BHK ... (2500 S.Ft.) 1st ... ✆ 93473 06486, 98490 83118.

3bhk flat with car parking at Maruthinagar. Employees with small families preferred. ✆ 99487 89554

Individual house for rent 2bhk, 1Bhk Penthouse for Bachelor Marutinagar, Eluru Road Vijayawada. ✆ 77993 42228

2BHK Independent House 2nd floor for rent. Near Nalanda School, Beside Trendset Mall, Benzcircle, VJA. ✆ 99497 76210.

1 BHK Semi Furnished. Families / Employees Only, Near SVR Neuro Hospital, Labbipet, VJA ✆ 95024 38911, 94936 85811

Tolet 2 Bhk Flat, Bhuvaneswari residency near Ushodaya techno School Poranki. Ph No: 83097 87789

3 BHK Ind House GR Flr, Near Nelson Mandela Park LIC Colony Vijayawada. ✆ 94407 72381, 94406 56508

2BHK 3rd Floor 858 SFT, GNR towers, Near SER center Prasadampadu, Vijayawada with car parking. ✆ 9490168244

Two Flats 2BHKD With Full Ventilation and Car Parking for Rent at Durgapuram Opp to Music College for Employees. ✆ 94410 72460.

... 2300 sft ... ✆ 94408 56182, 93631 19793.

VJA 5 ... 3 BHK ... ✆ 93919 99973.

3BHK, 2000 S.Ft. ... 3A/cs ... LIC ... ✆ 98854 42812.

... F-Block ... 3BHK 204 ... ✆ 94403 53834

1 ... 3000 ... ✆ 98499 13700.

... 2BHK ... No.509 ✆ 90143 19721.

COMMERCIAL

Small Office 500 S.Ft. Fully furnish ready to occupy. Plug and play all facilities near Govt. Hospital VJA ✆ 99599 42178

ఆఫీస్ / కమర్షియల్
VJA ... 1800 sft. ... F/F ... etc. ...
✆ 98481 21161

... (27 X 54) 1,458 S.Ft, ... C&F, ... ✆ 98487 74420.

... 1000 ... ✆ 91821 72609.

1,650 Sft Space (2Nos) For Shops / Office / Medical Agencies / Banks. Near Andhra Hospital Gollapudi ✆ 98491 00767.

13'x26' Shop Tolet at Machavaram down, Eluru Road, beside R.R. Chiken. Ph: 94903 66722, 89191 88166.

2,600 S.Ft. Ground and 1st Floor Hospital/ Office Space for Rent. Near Suryaraopet, Vijayawada ✆ 91606 83161, 63052 76554.

8000 Sft 6th ఫ్లోర్
... 8000 Sft ... 6th ...
✆ 90004 41211

VJA ... 1,500 S.ft & 800 S.ft ... C&F ... ✆ 92464 72524.

... 200 ... 70 HP ... 3000 to 10000 Sft. ... ✆ 97911 93789

... RCC G+1 3000 + 3000SFT 60KV ... ✆ 93464 77774

VJA ... 100 ... (G+1) 13,000 Sft. ... ✆ 84312 51822.

... 5,600 ... ✆ 98481 33344.

VJA ... 1,100 Sft. 1st ... 1,100 Sft 2nd ... ✆ 94412 68670.

... SBI ... 22 ... 3,000 ... ✆ 98481 21859.

TO-LET
విజయవాడ గవర్నర్‌పేట ... 1500 SFT, ... 1500 SFT, ... 1500 SFT, ...
సంప్రదించండి :
73864 81333

విజయవాడ పటమట ... 350 Sft. ... ✆ 85007 41501.

... 11x26 ... ✆ 98669 75877, 93962 03890

TO.LET
విద్యా సంస్థలకు, ఆఫీసులకు
12000 వేలు చ.గ.
కమర్షియల్ స్పేస్ అద్దెకు ఇవ్వబడును.
దాసరి కమర్షియల్ కాంప్లెక్స్
జె.పి.రోడ్,భీమవరం-2
94408 70986
94403 56099

... 1500 ... Ph: 96527 73189.

... 650S.Ft. ... ✆ 98499 53900

VJA ... 7500 ... ✆ 96668 09119

2500 ... & 2500 1st ... RTC ... 12. ✆ 98491 48241.

500 ... RTC ... 12. ✆ 98491 48241.

VJA ... 150 ... ✆ 94908 96803.

SECOND SALE

20 ... 3 Nos ... ✆ 94850 59999.

JOBS

WANTED Lady Receptionist & Counselors for a leading edu consultancy in Vijayawada Pushpa Hotel Center 9492441188.

Nero Steels Pvt. Ltd., Required Factory Manager for steel pipes manufacturing company in Surampalli, Vijayawada. Minimum - Degree, Sal: 30K, Exp: 5+Y ✆ 90593 74737.

Wanted Faculty Urgently for 6th to 10th Classes. Interview Dates: 24th Nov to 29 Nov. Timings: 10 AM to 3 PM. ✆ 90101 60282. Address: The Brilliant EM High School, Road No. 12, V.Colony, Gunadala. VJA

Wanted Officer Boy and ANM Nursing staff-any Qualification to Work in Pediatric Hospital, Suryaraopet. ✆ 98490 84660.

... ✆ 94947 87509

MORE CLASSIFIEDS ON PAGES 8

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

★ తిరువూరు 5వ వార్డులోని తమ ఇంటి ముందు ఉన్న స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగాయని స్థానికురాలైన భాగ్యవతి 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ మున్సిపల్ సిబ్బందిని పంపి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. ★ తిరువూరు ఒకటో వార్డులోని డ్రెయిన్లలో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానికుడైన కిశోర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన శానిటరీ అధికారి తమ సిబ్బందిని పంపి దోమల మందు చల్లించారు. సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

? చెవుటూరులో ప్రధాన రహదారి వెంబడి ఉన్న పంచాయతీ నీటి పైపులైన్ మరమ్మతులకు గురై నీరు వృథాగా పోతోంది. - శ్రీనివాసరావు ✔ సిబ్బందితో పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథా అరికడతాం.
- వై. బసవ లింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి
– న్యూస్‌టుడే, జి.కొండూరు

రేపటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

మైలవరం: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో ఈ నెల 24వ తేదీ నుంచి ఏపీ సూపర్‌కప్ సెకండ్ ఎడిషన్ ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.శేషగిరిరావు, సూపర్‌కప్ ఛైర్మన్ బి.చక్రవర్తి తెలిపారు. వీటిని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, స్టేడియం నిర్మాణ దాత లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రారంభిస్తారని వివరించారు.

వంద రోజుల ప్రణాళిక సిద్ధం



ఎ.కొండూరులో ఉపాధ్యాయులకు సందేశమిస్తున్న కేశవరావు

ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని పాఠశాల సహాయకులు(ఎస్‌ఏ), వ్యాయామోపాధ్యాయులు(పీడీ), సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)లకు శనివారం సముదాయ సమావేశాలు నిర్వహించారు. ఎ.కొండూరు ఎంఈవో కేశవరావు నవంబరు మొదటి పక్షంలో నిర్వహించిన ఎస్‌ఏ- 1 పరీక్షల్లో విద్యార్థుల గ్రేడింగ్, ఉత్తీర్ణత శాతాన్ని సమీక్షించారు. పది విద్యార్థుల కోసం వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సీఆర్పీ నాగమయ చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

రెవెన్యూ డివిజన్‌లో ధాన్యం కొనుగోలు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో శనివారం నాటికి 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆర్డీవో కె.మాధురి తెలిపారు. తిరువూరు మండలం వావిలాల, రాజుగూడెంలో ఆరబెట్టిన ధాన్యాన్ని ఆమె పరిశీలించి సాగుదారులతో మాట్లాడారు. తేమ తగ్గే వరకు పంటను ఆరబెట్టి ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తే మేలైన ధర లభిస్తుందని చెప్పారు. ఆమె వెంట రెవెన్యూ, వ్యవసాయాధికారులు ఉన్నారు.



వావిలాల : ధాన్యం రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

ధరలు ప్రియం.. ప్రజలకు భారం

గంపలగూడెం, న్యూస్‌టుడే

ప్రైవేటు విపణిలో కూరగాయల ధరలు చుక్కలనంటాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వాటి ధరలు అందుబాటులో లేవు. కొన్ని రకాలు రైతుబజార్ ధర కంటే రెట్టింపుగా ఉన్నాయి. వారం కిందట కిలో రూ.40 నుంచి రూ.60 వరకు ఉన్నవి ప్రస్తుతం రూ.80 వరకు పెరిగాయి. సాధారణంగా అక్టోబరు, నవంబరులో దిగుబడి కారణంగా విపణిలో వీటి ధరలు ప్రియంగా ఉంటాయి. ఇటీవల వచ్చిన మొంథా తుపాన్ కారణంగా తోటలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గి సాగుదారులు ధరలు పెంచారని ప్రైవేటు దుకాణదారులు చెబుతున్నారు. వాస్తవంగా రైతుబజార్‌లో ధరలతో పోలిస్తే ప్రైవేటు వ్యాపార స్థల వద్ద ధర ఎక్కువగా ఉంది. రైతుబజార్, ప్రైవేటు దుకాణాలకు విజయవాడ తదితర హోల్‌సేల్ మార్కెట్ల నుంచే సరకు రవాణా జరుగుతోంది. నియోజకవర్గంలో తిరువూరులో మాత్రమే ప్రభుత్వ అజమాయిషీలో నిర్వహించే రైతుబజార్ ఒక్కటి ఉంది. మండల కేంద్రాలు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రైవేటు దుకాణాలు,



విక్రయానికి సిద్ధంగా కూరగాయలు

బడ్డీకొట్లలో కొనాల్సిందే. దీంతో గ్రామాల్లో విక్రయించేందుకు వాటి ధరలను ఇంకాస్త పెంచుతున్నారు.

నియంత్రణ లేకపోవడంతో..

ప్రైవేటు విపణిలో వారం కిందట కిలో రూ.50కు విక్రయించిన టమాట ఒక్కసారిగా రూ.80కు చేరింది. దొండ, బెండ, బీర, దోస ధరలు కూడా కిలో రూ.20 నుంచి రూ.30 వరకు పెంచేశారు. చిక్కుడు కిలో రూ.160, మునగ కాయలు కిలో రూ.200 వరకు ఉంది. ఈ నేపథ్యంలో ధరల నియంత్రణపై అధికారులు చొరవ చూపాలి. నోటికి రుచిగా ఉండే కూరగాయలను కొనే స్థితిలో పేదలు లేరు. కొన్నింటి ధరలు ధనికులకు మింగుడు పడడం లేదు. నలుగురు సభ్యులు ఉన్న ఒక కుటుంబం చిక్కుడు కాయ కూర తినాలంటే రోజుకు రూ.160 ఖర్చు చేయాలి. ఇక ఆకుకూరల ధరలు ఇటీవల పెరిగాయి. గోంగూర, మెంతు, బచ్చలి, తోటకూర, పాలకూర కట్ట గతంలో రూ.5 ఉండగా ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో ఒక్కో కట్ట రూ.10 వరకు విక్రయిస్తున్నారు. చింతకాయ, మామిడి, కాకర, బీట్‌రూట్ ధరలు చెప్పనక్కర్లేదు. పౌష్టికాహారం శరీరానికి అందించాలంటే ప్రజలు ప్రతి రోజు ఏదో ఒక ఆకు, కూరగాయ తినాల్సిందే. ధరలు ప్రియంగా మారడంతో పౌష్టికాహారం ఎలా ఉన్నా ఆర్థికంగా భారంగా ఉన్నాయంటూ నిట్టూర్పు విడుస్తున్నారు.

విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించండి



ప్రదర్శన తిలకిస్తున్న శోభామంజరి తదితరులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి సైన్స్‌పై పట్టు సాధించాలని ఏపీఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ డైరెక్టర్(నాన్‌క్యాడర్ ఎస్పీ) టి.శోభామంజరి పేర్కొన్నారు. గొల్లపూడిలోని సెయింట్ పాల్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎంఈవోల సంఘం ఏపీ అధ్యక్షుడు ఎ.వెంకటరత్నం, పాఠశాల నిర్వాహకులు లంకా కరుణాకర్‌దాస్, భూషణ్‌కుమారి పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి



ప్రసంగిస్తున్న కెరీర్ గైడెన్స్ సలహాదారు కోటిరెడ్డి

కొండపల్లి, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి ఓ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధనకు కృషి చేయాలని కెరీర్ గైడెన్స్ సలహాదారు కోటిరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్‌కే నగర మహిళా ఆధ్వర్యంలో కొండపల్లి క్రాంతి పాఠశాలలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

వైద్య సేవలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రుద్రవరం పీఏసీఎస్ సహకారంతో కుదప గ్రామంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి 72 పశువులకు వైద్య సేవలు అందజేసి మందులు పంపిణీ చేసినట్లు పీఏసీఎస్ కార్యదర్శి మార్కండేయా తెలిపారు. ముచ్చునపల్లి పశువైద్యశాల వైద్యాధికారిణి స్వప్న పశువులకు వైద్యం చేశారు. చెన్నారెడ్డి, శ్రీనివాస రెడ్డి, జయగుణ, అమ్మాజీ పాల్గొన్నారు.

చిన్నారులకు రాత పుస్తకాలు అందజేత

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని పెనుగొలను బీసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సత్యసాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, టవల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు చదువులో రాణించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, అయ్యప్ప దీక్షాధారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అనసూయకు సత్కారం

గంపలగూడెం, తిరువూరు : కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మల్లెతీగా సాంస్కృతిక సాహిత్య మాసపత్రిక శనివారం నిర్వహించిన జాతీయ సాహితీ సభలో తిరువూరు రచయితల సంఘం అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయను ఘనంగా సత్కరించారు.

24 నుంచి రైతన్నా.. మీ కోసం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 29 వరకు రైతన్నా.. మీకోసం కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన కార్యాలయ వర్గాలు శనివారం తెలిపారు.

ఆలయాల్లో విశేష పూజలు

తిరువూరు, న్యూస్‌టుడే : పాత తిరువూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటాచలస్వామి ఆలయంలో శనివారం అర్చకుడు డి.వేణుగోపాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం దేవతామూర్తుల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు.

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్టలోని గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు శ్యామ్ సుందర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని అలంకరించారు. వివిధ గ్రామాల భక్తులు దర్శించుకుని పాల పొంగళ్లతో మొక్కులు చెల్లించారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకట్రావు, సభ్యులు పాల్గొన్నారు.
★ పెనుగొలను బోటి మీద ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



గంపలగూడెం: మెట్టగుట్టలో శ్రీనివాస స్వామి

విరాళాలు

గంపలగూడెం : మండలంలోని మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయానికి పెనుగొలనుకు చెందిన కంభంపాటి శ్రీనివాసరావు, నాగలక్ష్మి దంపతులు రూ.1,01,116 విరాళం అందజేశారని గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు శనివారం తెలిపారు. కమిటీ సభ్యులు వై.విజయ్ కుమార్, వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇబ్రహీంపట్నం నివాసి ఎ.రవీంద్రనాథ్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పట్టభద్రులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని కొండపర్వలో జరిగిన అగ్రి క్లినిక్ అగ్రి బిజినెస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎలీప్ ఛైర్‌పర్సన్ కనకదుర్గ, కృష్ణ సుధా అకాడమి డైరెక్టర్ నాయుడు, అన్నపూర్ణ, మాధవి, శ్రీనివాసరావు, ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ పోలవరపు శోభారాణి పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన వ్యవసాయ పట్టభద్రులైన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాల్సిందే..

గొల్లపూడి, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌లను ఏకపక్షంగా అమలులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ గొల్లపూడిలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.



తిరువూరు: నినాదాలు చేస్తున్న కార్మికులు



గొల్లపూడిలో నిరసన తెలుపుతున్న రవీంద్రనాథ్, నాయకులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : నూతన లేబర్ కోడ్స్‌పై సీఐటీయూ ఆధ్వర్యంలో తిరువూరులో కార్మికులు ధర్నా నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికుల హక్కులు, భద్రత, వేతనాలు, పని గంటలు వంటి వాటిపై ఇవి తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు.

ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేయాలని వినతి



తిరువూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సీపీఐ నాయకుల ఆందోళన

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న బూటక ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. మావోయిస్టులపై బూటకపు దాడులు, ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపిస్తూ తిరువూరు ఆర్టీసీ డిపో ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొని మాట్లాడి ఈ చర్యలను ఖండించారు. నాయకులు టి.కృష్ణయ్య, ఎస్‌కే.నాగుల్‌మీరా, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎం.ఉదయ్, ఎం.డేవిడ్, ఎం.త్యాగరాజు పాల్గొన్నారు.

అమ్మ మృతితో అనాథలైన చిన్నారులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : పిల్లలను అల్లారు ముద్దుగా లాలన చేసి పెంచి విద్యాబుద్ధులు నేర్పించి పోషించాల్సిన తల్లిని విధి వక్రీకరించి విద్యుదాఘాతం రూపంలో కబలించి బలి తీసుకోవడంతో చిన్నారులు అనాథలుగా మారిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. విస్సన్నపేటకు చెందిన భోగిని శ్యామల(25) అనే మహిళ ఫ్యాన్ స్విచ్ ఆన్ చేస్తున్నప్పుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందరితో కలుపుగోలుగా ఉండే మహిళ ప్రమాదంలో హఠాత్తుగా మరణించడంతో విస్సన్నపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. తల్లి మృతితో అనాథలైన ముగ్గురు చిన్నారులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

EENADU Classifieds

JOBS

శ్రీశ్రీశ్రీ హోటల్, ఖమ్మం నందు పనిచేయుటకు నార్త్ ఇండియన్, చైనీస్ మాస్టర్స్ కావలెను. సంప్ర॥ 9949911636.

జైగణేష్ సెక్యూరిటీ విజయవాడలో ఫీల్డ్ ఆఫీసర్స్ (Ex. సర్వీస్‌లో సివిల్) కావలెను. జీతం: 35,000+ PF+ ESI సంప్ర: 79933 22229.

దేవాన్ష్ గ్రూప్స్ కొలనుకొండలో కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టుకు 5 సం.ల అనుభవంగల మార్కెటింగ్‌స్టాఫ్ M/F కావలెను. కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్ వారికి ప్రాధాన్యత. Salary 18,000/- నుండి 25,000/- వరకు సం. ✆ 87900 21648

వ్యవసాయ యంత్రాల షోరూమ్‌లో టెక్నీషియన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతభత్యాలు ఇవ్వబడును. మాగంటి ఎంటర్‌ప్రైజెస్, పటమట, VJA ✆ 99896 62172.

హోటల్ కోసం॥ అనుభవంగల క్యాషియర్, కిచెన్ సూపర్‌వైజర్, స్టోర్ కీపర్, అకౌంటెంట్, వాచ్‌మెన్ కావలెను. ✆ 99856 59070.

Teachers for 6 to 10th Telugu, Hindi, English & Social, Study Hours, Spoken English, Computer faculty, Art Craft & Drawing Teachers. ✆ 80745 28582.

Wanted MBA Marketing/ Business Development/ Supply chain management to work a reputed company at Guntur. Mini 2 years experience. Contact: 91333 99257.

VJA Kanuru Wanted Computer Operators, Accountants, Vice Principals, Incharges & Wardens Sri Gowtham Jr. College. ✆ 94947 42303, 96425 58058.

Wanted Sr. Technician (Instrumentation) ITI + 8Yrs exp. and DM Plant Lab Technician, B.Sc. - Chem. + 5Yrs exp. @ Vizag. 9866500432.

Wanted Female Telecallers for Education Consultancy at Vijayawada Fluency in Eng. Qul Degree. 15K Salary. 93478 91899

రామకృష్ణ గ్రూప్ VJA HYD. న్యూఢిల్లీకు 10th ఆపైన చదివిన అనుభవం ఉన్న డ్రైవర్స్ కావలెను. భో+వ+మంచిజీతం. ఇంటర్వ్యూ VJA ✆ 95736 91122.

రామకృష్ణ గ్రూప్ VJA ఇండ్లలో వృద్ధులు, పేషెంట్ల సేవకు ఇంటి/ వంట బేబీకేర్‌కు వర్కర్లు కావలెను. భో+వ+ మంచి జీతం 99087 69888, 95420 47788

అలంకార్ థియేటర్ దగ్గర సైట్‌కి సె.గార్డ్స్, 12 గం. డ్యూటీ, జీతం: 15K & తుళ్ళూరులో సె. సూ.వైజర్స్-3 (ఎకామిడేషన్ ఫ్రీ) కావలెను. ✆ 93911 11702.

రామకృష్ణ గ్రూప్ (AP No1) HYD, VJA, న్యూఢిల్లీకు టెలీకాలర్స్, కస్టమర్ కేర్ అన్ని రకాల ఆఫీస్ స్టాఫ్ కావలెను. భో+వ+జీ ఇంటర్వ్యూ VJA. ✆ 96764 91122

విశ్వశాంతి యూనివర్సల్ ట్రస్ట్ VJA. పని/ సేవ/ డ్యూటీ చేయుటకు M/F టెలికాలర్స్, వాలంటీర్స్, స్టాఫ్ కావలెను. భో+ వ+ జీతం. ✆ 95025 91122.

TVS మోటార్స్ ఆటో AP & TG వాక్‌ఇన్ ఇంటర్వ్యూ సేల్స్ & సర్వీస్‌లో వివిధ రోల్స్‌కు ఫ్రెషర్స్ & ఎక్స్‌పీరియన్స్ కలిగిన వారికి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ మీ సమీప TVS ఆటో షోరూమ్‌లో జరుగుచున్నవి సంప్రదించండి: 74186 99978 (AP), 74184 77742 (TG)

ఐశ్వర్య గోల్డ్ కంపెనీ నందు పర్మ చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ మరియు ఫ్రాంఛైజెస్ ఇవ్వబడును. Con: 99495 63945.

కంకిపాడు యందు స్థిరాస్తికి సంబంధించిన దస్తావేజులు టైప్ చేయడానికి అనుభవం కలిగిన DTP ఆపరేటర్స్ కావలెను. ✆ 92462 97979.

విజయవాడ లయోల కాలేజ్ దగ్గర హాస్పిటల్ నందు ల్యాబ్ టెక్నీషియన్స్ ★ రిసెప్షనిస్ట్ ★ PRO ★ PA ★ ఫార్మసిస్ట్ కావలెను. ✆ 81426 66222.

విజయవాడలోని ప్రముఖ విద్యాసంస్థలో Telecallers కావలెను. అర్హత: Any Degree, జీతం: 12,000 to 25,000 ✆ 94417 25617

CCTV **కెమెరాలు** ఫిట్టింగ్ కాన్ఫిగరేషన్ ఇన్‌స్టలేషన్ ట్రైనింగ్ కోర్స్ కేవలం 15 రో. మాత్రమే. కోర్స్ తరువాత ప్లేస్‌మెంట్. టెక్నికల్ స్టాఫ్ కావలెను. 94942 33533

Sales Exe's కావలెను Vja, తిరువూరు, గన్నవరం, Penamaluru, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ. జీతం+ ఇన్సెంటివ్. వ: 35 లోపు. ✆ 98492 77733.

ప్రముఖ హోటల్ నందు పనిచేయుటకు రూమ్‌సర్వీస్ బాయ్స్ కావలెను భోజనం+ వసతి కల్పించబడును, విజయవాడ. ✆ 90104 45678, 99666 61817.

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు పర్మచేయుటకు అకౌంటెంట్స్ (M) ★ సూపర్ వైజర్స్-2 (Age: 35 లోపు) ★ రిసెప్షనిస్ట్-1 (Qul: ఇంటర్, డిగ్రీ) కావలెను. ✆ 80965 56789.

విజయవాడలో బ్యాంకు వేల్యూర్ ఆఫీసు నందు పనిచేయుటకు Diploma Civil Engg. కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. C: 9505799599.

అమెరికా వీసా ఉన్నవారు వంటపని చేయుటకు, బాబుని చూసుకొనుటకు కావలెను. మంచి జీతం ఇవ్వబడును. ఆసక్తిగలవారు కాల్ చేయండి. ✆ 99850 84364.

హైదరాబాద్ సిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంట చేయుటానికి ఇద్దరు బ్రాహ్మణ స్త్రీలు, కేర్ టేకర్ కావలెను ఆకర్షణీయమైన జీతం, భోజనం వసతి కలదు. ✆ 98662 52220

గవర్నరుపేటలోని ఆయుర్వేదిక్ AC Show roomనందు పనిచేయుటకు షోరూం ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Data Entry మరియు కంప్యూటర్‌నందు అనుభవం కలిగిన అభ్యర్థులు సంప్రదించవలసిన అడ్రస్: మన్‌షార్ ఆయుర్వేదిక్ డ్రగ్స్ # 27-11-37, దూబగుంటవారివీధి, గవర్నరుపేట, విజయవాడ. ఇంటర్వ్యూ జరుగుతేది: 25-11-25, మంగళవారం సాయంత్రం 6 గం.లకు.

EXP **నర్సులు/** ఆయాలు/ వార్డ్‌బాయ్స్ కావలెను. జీతం Rs. 20,000/- నుండి Rs.25,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. ✆ 99665 68882, 99634 89661.

Castrol **ఆయిల్** డిస్ట్రిబ్యూటర్ విజయవాడకు వ్యాన్‌తో వెళ్లి స్టాక్ లోడింగ్/ అన్‌లోడింగ్ చేయుటకు చురుకైన యువకులు కావలెను. ✆ 94939 39411.

కార్పొరేట్ సంస్థలో మేనేజర్స్‌గా పనిచేయుటకు RTD & హౌస్‌వైఫ్స్ కావలెను. రోజుకు 3గం॥ పనిచేస్తూ నెలకు అదిక ఆదాయం సంపాదించండి. 9963213247

ప్రముఖ యాడ్ ఏజెన్సీలో పనిచేయుటకు ఫొటోషాప్, కొరల్‌డ్రాలో అనుభవం గల డిజైనర్ Part-time కావలెను. ✆ 98663 33787.

యాడ్స్ N లీడ్స్ డిజిటల్ మార్కెటింగ్ ఏజెన్సీ. మాక్రియేటివ్ టీమ్‌లో పనిచేయడానికి డిజైన్ & వీడియో ఎడిటింగ్‌లో నైపుణ్యం ఉన్న క్రియేటివ్ ప్రొఫెషనల్స్ కావలెను. Photoshop, Illustrator, CorelDraw, InDesign, Adobe Premiere, After Effects. అనుభవానికి తగ్గట్టుగా ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 63026 36409

ఆఫీస్‌బాయ్ కం॥ హెల్పర్ గత 40 సం॥ నుండి హైదరాబాద్‌లో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలో పనిచేయుటకు వ: 45 సం॥లోపు 10th P/F. ✆ 9676116243

ఫంక్షన్‌హాల్స్/ రిసార్ట్స్‌లో అనుభవం గల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ (Male), ఆఫీస్ అసిస్టెంట్ కమ్ Accountant (M) any డిగ్రీ మరియు వాచ్‌మెన్ ఫ్యామిలీ కావలెను. ✆ 80193 33377.

విజయవాడలో ఆటోమొబైల్ ఫైనాన్స్ కంపెనీలో ఫైనాన్స్ కలెక్షన్ చేయుటకు టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్సు గల మేల్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. ✆ 92478 64544

గొల్లపూడిలో హోల్‌సేల్ ఆయిల్ దుకాణం నందు పనిచేయుటకు లేడీస్ కావలెను. అర్హత ఇంటర్. సంప్రదించండి. ✆ 98486 10316

ప్రముఖ సిగరెట్ కంపెనీ బ్రాండ్స్ విక్రయించుట కొరకు 2 వీలర్ కలిగిన సేల్స్‌మ్యాన్‌లు విజయవాడసిటీలో తిరుగుటకు కావలెను. ✆ 94935 21242/ 77801 31516

కానూరు ఆటోనగర్‌లోని ప్రముఖ గ్లాస్ ఇండస్ట్రీలో పనిచేయుటకు టెలికాలర్స్ కావలెను. ఏదైనా డిగ్రీ వారికి ప్రాధాన్యత ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆98481 62965

MARKETING/ SALES

Wanted Agents for Booking of orders on 25% Commission basis. Items Brass Locks, Key Chains, School Items. Contact: 9837181654, 8909292238. Fine Lock Company, Aligarh- 202001 (UP).

FACULTY/ TEACHERS

Wanted Teachers: Pre Primary, PET, I, II, III Classes. T.T.I.A.A. E.M. High School, Bhavanipuram, VJA. ✆ 96189 70405, 87905 91440.

Wanted: English, Maths, Physics, Pet, Computer Operator, Receptionist Pre Primary-SRIVIDHATHRI WORLD SCHOOL. ✆ 8019676724

Wanted P.S.Teacher & Computer Teachers. Cont: Kommareddy (EM) High School, Bantumilli, Krishna Dist. ✆ 98480 63355.

DRIVERS

SSC చదివి లైసెన్స్ కలిగిన అనుభవంగల Dost గూడ్స్ బండి నడుపుటకు డ్రైవర్ కావలెను. జీతం + బేటా ఇవ్వబడును. సంప్ర ✆ 94939 39411.

విజయవాడ, పటమట ఏరియాలో పనిచేయుటకు కనీసం 10 సం॥లు అనుభవం గల 40 సం॥లు దాటిన
కారు డ్రైవర్ కావలెను
టైమింగ్స్ ఉ॥ 8 గం॥ నుండి రా॥ 9 (విజయవాడ లోకల్ వారు మాత్రమే)
✆ 94911 23645

VJA అమ్మ కళ్యాణమండపం దగ్గర్లో ఇంజనీరుగారి కారు నడుపుటకు 10 సం|| అనుభవం ఉన్న డ్రైవరు కావలెను. దగ్గర్లో ఉన్నవారికే ప్రాధాన్యత. ✆ 98485 27537

ACCOUNTING

Accountants & Store Keepers with 5 years experience to work in Jharkhand construction sites. WhatsApp resume to: 9502393999.

ENGINEERING

CIVIL ENGINEERS with 5 yrs exp. to work in Jharkhand Thermal Power Plant. CISCONS Pvt. Ltd, . WhatsApp resume to: 9502393999.

HOSPITALITY

Pulse Cafe and bakery shops at Mangalagiri Premises Manager post, South Indian cook. North Indian cook Cleaning Sweepers staffs Food supply staff Bill counter staff Security staff Minimum 5 years experience. Contact No: 9885711313

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్

ఆక్రమించి.. ఆపై దాడులకు తెగించి!



రైతు బజారు రోడ్డులోకి రావాలంటేనే వాహన చోదకులు భయపడిపోతున్నారు



రహదారికి ఇరువైపులా ఆక్రమించడంతో డివైడర్ మధ్యలోంచి దూసుకుపోతున్న లారీ

రహదారిపై చిరు వ్యాపారం చేసుకుని వచ్చే డబ్బులతో జీవనం సాగించే వన్నే.. క్రమంగా దుస్తులు.. ఆపై పండ్లు, గొడుగులు ఇలా మొత్తం కిలో మీటరు పొడవునా రహదారినే ఆక్రమించేశారు. విజయవాడ పటమట రైతుబజారులో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఏకంగా రహదారిని ఆక్రమించి హోల్‌సేల్ వ్యాపారాలు చేస్తున్నారు. అటుగా ప్రయాణించాలంటేనే వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. ఇరువైపులా ఆక్రమణలతో కుంచించుకుపోయిన మార్గంపై వెళ్లలేక విభాగిని మధ్యలోంచి వాహనాలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రైతు బజారుకు వచ్చే వారు వాహనాలు నిలిపేందుకు సైతం చోటు ఉండటం లేదు. తమదుకాణం ముందు నిలపొద్దని ఆక్రమణదారులు గొడవ పడటంతో పాటు దాడులు సైతం దిగుతున్నారు. - ఈనాడు, అమరావతి

విజయవాడ నుంచి తీసుకెళ్లి మావోయిస్టుల ఎన్‌కౌంటర్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: 'విజయవాడలో చికిత్స పొందుతున్న మావోయిస్టులను ఈ నెల 15న అడవుల్లోకి తీసుకెళ్లి అక్కడ ఎన్‌కౌంటర్ చేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి' అని బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) డిమాండ్ చేసింది. ఈ హత్యలపై 302 సెక్షన్ కింద విచారణ చేపట్టాలని కోరింది. శనివారం అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా, ఏపీ రాష్ట్ర న్యాయవాదుల సంఘం మానవ హక్కుల కమిటీ ఛైర్మన్ పిచుక శ్రీనివాస్, బెంగళూరుకు చెందిన న్యాయవాది, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ సభ్యుడు ఎన్.బాలన్ తదితరులు హాజరై మాట్లాడారు. పౌర హక్కుల నాయకులు టి.ఆంజనేయులు, ఎ.ఎస్.ఎస్.రాంప్రసాద్, వి.రవీంద్రనాథ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదేశాలిచ్చింది ఎవరు? హత్యలు చేసిందెవరు? 'మావోయిస్టుల విషయంలో పోలీసులు సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించలేదు. అసలు వారికి చంపే హక్కు లేదు. మృతదేహాలు ఎక్కడ దొరికాయి? ఎక్కడ చంపారు? హిడ్మా శరీరంలో ఏ బుల్లెట్ ఉందో చెప్పాలి? ఎన్‌కౌంటర్‌కు ఆదేశాలు ఇచ్చింది ఎవరు? దాన్ని ఆచరించి హత్య చేసిందెవరో వెల్లడించాలి? ఛత్తీస్‌గఢ్‌లో ట్రిలియన్ డాలర్ల విలువైన ఖనిజాలున్నాయి. ఇకపై వీటిని కార్పొరేట్ శక్తులు లూటీ చేస్తాయి' అని న్యాయవాది ఎన్.బాలన్ మండిపడ్డారు. 'ఎన్‌కౌంటర్‌పై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. మావోయిస్టులు ఎదురుదాడి చేస్తే వారు ఏ ఆయుధం వాడారు? ఎన్ని రౌండ్లు వాడారో చెప్పలేదు. పోలీసులు

సమగ్ర విచారణ చేపట్టాలి : బీబీఏ

చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. పోలీసులు సమాధానం చెప్పాలి. హైకోర్టు న్యాయమూర్తితో కమిటీ వేసి న్యాయ విచారణ జరిపించాలి' అని బీబీఏ అధ్యక్షుడు బాషా డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా. పక్కన ఆంజనేయులు, రాంప్రసాద్, రవీంద్రనాథ్, బాలన్, శ్రీనివాస్

కాల్చి చంపడం అనాగరిక చర్య: 'మావోయిస్టులను ఈసుకు వెళ్లి కాల్చి చంపడం అనాగరిక చర్య. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. విజయవాడలో 28 మందిని అరెస్టు చేసినా.. రిమాండ్ రిపోర్టు ఎవరికీ ఇవ్వలేదు. మావోయిస్టులను కోర్టులో హాజరుపరిచినప్పుడు న్యాయవాదులు, బంధువులను బయటికి పంపించారు. ఈ విషయంపై బీబీఏ తరఫున ప్రశ్నిస్తూనే.. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పిటిషన్లు వేస్తాం' అని ఏపీ రాష్ట్ర న్యాయవాదుల సంఘం మానవ హక్కుల కమిటీ ఛైర్మన్ పిచుక శ్రీనివాస్ తెలిపారు.

కళాకారుల సేవలు దేశ ఔన్నత్యానికి ప్రతీకలు



ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ, మరికొందరు, చంద్రశేఖరరెడ్డి, నారాయణరావు, కలిమిశ్రీ, రామసుబ్బారెడ్డి, కృష్ణకుమారి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : కవులు, రచయితలు, కళాకారులు అందిస్తున్న సేవలు దేశ ఔన్నత్యానికి ప్రతీకలని, వారిని ప్రోత్సహించడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. శనివారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కౌముది సంస్థ సహకారంతో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభించారు. కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఇంద్ర రామసుబ్బారెడ్డి, హజరత్తయ్యగుప్తా, కవులు కలిమిశ్రీ, పుట్ల సురేంద్రబాబు, రాపాకం చంద్రశేఖరరెడ్డి, కృష్ణకుమారి తదితరులు జ్యోతి వెలిగించారు. పౌరసరఫరాల సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. కవులు, రచయితలు, కళాకారులు, కార్టూనిస్టులు అందించిన సంస్కృతి, రచన, కళా సంపద భావితరానికి తరగని వనరులులాంటివని చెప్పారు. వీరిని ప్రోత్సహిస్తున్న మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ కన్వీనర్ కలిమిశ్రీ తదితరులను అభినందించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. గొప్ప సాంస్కృతిక కేంద్ర బిందువైన విజయవాడ నగరం కవులు, రచయితలు, కళాకారులకు పుట్టినిల్లులాంటిదని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గుర్తింపు పొందిన కూచిపూడి నృత్యం ఉమ్మడి కృష్ణా జిల్లాకు కేంద్ర బిందువు అని చెప్పారు. తెలుగు భాష, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి దివంగత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి సాంస్కృతిక రంగానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉత్సవాల ప్రత్యేక సంచిక, మనసా తుళ్లిపడకే, గాలివాటం పుస్తకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కార్టూన్లు ఆకట్టుకున్నాయి. చిన్ని నారాయణరావు, పూర్ణచంద్రరావు, ఏపీ సృజనాత్మక, సంస్కృతి సమితి- సీఈవో రేగుళ్ల మల్లికార్జునరావు, దుట్టా శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నేత అరాచకంపై పోరాటం

రూ.5 కోట్ల విలువైన స్థలం కబ్జా



ధర్నాచౌక్‌లో దీక్ష చేస్తున్న ఉమామహేశ్వరశాస్త్రి

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : విజయవాడ, సత్యనారాయణపురంలో సుమారు రూ.5 కోట్ల విలువైన 325 గజాల స్థలాన్ని కబ్జా చేసిన వైకాపా నేత గౌతమ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు గంధారి ఉమామహేశ్వరశాస్త్రి కోరారు. ఈ మేరకు శనివారం విజయవాడ ధర్నా చౌక్‌లో ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదరు ఆస్తి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా.. గౌతమ్‌రెడ్డి అందులో భవనం నిర్మించారని ఆరోపించారు. దీనిపై అన్ని విభాగాల అధికారులను కలిసి వినతి పత్రం సమర్పించినా ఇప్పటి వరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాను 2016 సంవత్సరం నుంచి పోరాడుతున్నానని వివరించారు. గతంలో ఒకసారి తనపై హత్యాప్రయత్నం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థలం విషయమై ఫిర్యాదు చేసినా నగర సీపీ, మున్సిపల్ కమిషనర్‌లు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

పీడీఎస్ వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ

పాయకాపురం, న్యూస్‌టుడే : ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జేసీ ఎస్.ఇలక్కియా హెచ్చరించారు. శనివారం నగరంలోని కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా తనిఖీలతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలపై చర్చించారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని వివిధ మార్గాల్లో సేకరించి.. కోళ్ల ఫారాలు, చేపల చెరువుల్లో వినియోగించడం, రీసైక్లింగ్ చేయడం చట్టవ్యతిరేక చర్యలని వివరించారు. వీటన్నింటిపై గట్టి నిఘా ఉంచి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఎ.పాపారావు, సహాయ పౌరసరఫరాల అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, తనిఖీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న ఏజెంట్ల అరెస్టుకు రంగం సిద్ధం

ఈనాడు- అమరావతి: అద్విక కేసులో కొట్టేసిన సొమ్మును తిరిగి చెల్లించకుండా, విచారణకు రాకుండా తప్పించుకు తిరుగుతున్న ఏజెంట్ల అరెస్టుకు రంగం సిద్ధమైంది. అనుచిత లబ్ధి పొందిన ఏజెంట్లు సుధాకర్, కల్యాణ్‌చక్రవర్తి, రాజేంద్రప్రసాద్‌లు నోటీసులు ఇచ్చినా పోలీసు విచారణకు డుమ్మా కొట్టారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. భవానీపురం ప్రాంతానికి చెందిన సోదరులు కల్యాణచక్రవర్తి, రాజేంద్రప్రసాద్‌తో పాటు ఒంగోలుకు చెందిన సుధాకర్‌లు తమకు రావాల్సిన దాని కంటే ఎక్కువగా ప్రయోజనం పొందారు. సుధాకర్.. రూ.2.76 కోట్లు, కల్యాణచక్రవర్తి.. రూ.1.58 కోట్లు, రాజేంద్రప్రసాద్.. రూ.2.5 కోట్లు అప్పనంగా దక్కించుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ డబ్బు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వీరిని అరెస్టు చేయనున్నారు. మొత్తం 62 మంది ఏజెంట్లలో 32 మంది రూ.54 కోట్లు పెట్టుబడికిగాను రూ.105 కోట్ల మేర ప్రయోజనం పొందారు. ప్రధాన నిందితుడు ఆదిత్యను రెండో విడత కస్టడీని కోరుతూ పోలీసులు ఇప్పటికే పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఇది సోమవారం కోర్టులో విచారణకు రానుంది.



బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

91.9 FM Vijayawada ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
ఆదివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్	ఉ. 7 - ఉ. 9
రాశి వాసి	ఉ. 9 - ఉ. 10
ఎక్స్‌ట్రా డోస్	ఉ. 10 - మ. 2
ఈవారం అతిథి	మ. 2 - సా. 5
టెస్ట్ డ్రైవ్	సా. 5 - రా. 7
#హ్యాష్‌టాగ్	రా. 7 - రా. 9
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 9 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297



న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పటిష్ఠమైన వార్తా వ్యవస్థను కలిగి, తాజా వార్తలను సేకరించి, వాటిని **ఈనాడు**తోపాటు ఈనాడు.నెట్, ఈటీవీ, ఈటీవీ భారత్ వంటి సంస్థలకు అందిస్తున్న న్యూస్ ఏజెన్సీ 'న్యూస్‌టుడే'కు న్యూస్ కంట్రిబ్యూటర్లుగా వార్తలు అందించేందుకు ఔత్సాహికులైన యువకులు కావలెను.

అర్హత: డిగ్రీ, **వయసు:** 30 సంవత్సరాల లోపు

అభిరుచి: వార్తల రూపంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలన్న తపన, స్థానికులై, పరిసర ప్రాంతాలపై అవగాహన, కనీస సామాజిక-రాజకీయ పరిజ్ఞానం, కలివిడిగా ఉండే తత్వం కలిగి ఉండాలి.

న్యూస్ కంట్రిబ్యూటర్లు అవసరమైన ప్రాంతాలు:

ఎ.కొండూరు, జగ్గయ్యపేట టౌన్, గుణదల, సత్యనారాయణపురం, విజయవాడ లీగల్, ధర్నాచౌక్, బీఆర్‌టీఎస్ రోడ్డు, సబ్ కలెక్టరేట్

సరళమైన తెలుగులో రాయగల నేర్పు, లోకజ్ఞానం, వర్తమాన రాజకీయ-సామాజిక తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.

ఆసక్తి గలవారు నవంబరు 25, మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరిగే అర్హత పరీక్షకు ఈ క్రింది చిరునామాలో హాజరుకాగలరు.
గతంలో హాజరైన వారు తిరిగి ఈ పరీక్షకు రానవసరం లేదు.

న్యూస్‌టుడే ప్రైవేట్ లిమిటెడ్
C/o. ఈనాడు కార్యాలయం
గూడవల్లి గ్రామం, విజయవాడ రూరల్
మండలం, ఎన్టీఆర్ జిల్లా–521 104

వరి కళ.. సిరి భళా!



ఒక 20 రోజుల వ్యవధి తేడాలో పక్క పక్క పొలాల్లో వరి నాట్లు వేయడంతో పంట రెండు రంగుల్లో దర్శనమిస్తోంది. జాతీయ రహదారి పక్కనే పలవరం గ్రామంలో ముందుగా వేసిన పంట కోత దశకు రావడంతో బంగారు వర్ణంలో కనిపిస్తుండగా.. తర్వాత వేసిన పంట పచ్చగా కనిపిస్తుండడంతో చూపరులు ఆసక్తిగా చూస్తున్నారు. - ఈనాడు అమరావతి

కదిలించిన స్ఫూర్తి.. కరుణించిన దీప్తి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గ్రామాన్ని మరవద్దని 'ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీ రావు' చేసిన సేవలు.. పెదపారుపూడి గ్రామ యువతలో ప్రేరణ కలిగించాయి. [illegible] గ్రామాభివృద్ధికి 22 మందితో కూడిన యువ బృందం అడుగులు వేస్తోంది. 'హెల్పింగ్ హార్ట్స్' పేరుతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రతి నెలా రూ.300 గ్రామం కోసం.. ఉద్యోగ, వ్యాపారరీత్యా వేరే ప్రాంతాల్లో స్థిరపడ్డా స్వగ్రామంపై ఆసక్తి చూపిన వాళ్లు కొంతమంది. కానీ పెదపారుపూడి యువతలో ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నా గ్రామాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. ఉద్యోగరీత్యా విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం, ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నవారు 2018లో 'హెల్పింగ్ హార్ట్స్' పేరుతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. గ్రామ సమస్యలు, అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై ఎప్పటికప్పుడు చర్చిస్తారు. తమ జీతాల్లో నుంచి ప్రతి నెలా మొదట్లో రూ.200.. ఈ ఏడాది నుంచి రూ. 300 గ్రామం కోసం కేటాయిస్తున్నారు. అలా గ్రూప్ సభ్యులు కేటాయించిన డబ్బులు రూ.లక్షలు సిద్ధమయ్యాయి.

తమలా ఇబ్బంది పడకూడదని.. తమలా ఇబ్బంది పడకూడదని పెదపారుపూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక టీచర్‌ను నియమించి స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నారు. ట్యూషన్ పాయింట్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మూడేళ్ల కిందట కృష్ణుడి ఆలయం నిర్మించాలని రూ.లక్షల్లో పనులు మొదలుపెట్టారు. గ్రామ పెద్దల సహకారంతో రూ.50లక్షలు చందాలతో ఆలయం పూర్తి చేశారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబానికి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఆర్థిక సాయం చేస్తున్నారు. అనారోగ్యం, ప్రమాదాల బారినపడిన పేదలకు వైద్య ఖర్చులకు సాయం చేస్తున్నారు.



పేదలకు ఆర్థిక సాయం చేస్తూ..

అందరూ సహకరిస్తే మరిన్ని సేవలు: శ్రీనివాసరావు



రామోజీరావు స్ఫూర్తితో మొదట 15 మంది వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి నెలనెలా డబ్బులు కూడగడుతూ వచ్చాం. గ్రామం నుంచి వెళ్లి ఇతర ప్రాంతాల్లో స్థిరపడినవారు సహకరిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం.

గుండె గూటిలో.. ఐర్లాండ్ దొర..

చిట్టినగర్, న్యూస్‌టుడే

జనహితమైన పనులు చేసేవారు ఎవరైనా, ఏ దేశమైనా, వారి పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని చెప్పడానికి నిదర్శనం టేనర్ పేట. టేనర్‌దొర ఐర్లాండ్‌కు చెందిన వ్యక్తి. ఆ రోజుల్లో ఆంగ్లేయులు ఒక వర్గంగా, ఐరిష్ వారు మరో వర్గంగా ఉండేవారు. 1937 సంవత్సరంలో కృష్ణా జిల్లా కలెక్టర్‌గా ఆయన పని చేశారు.



కృష్ణానది పరీవాహక ప్రాంతంలో నివాసితులను వరదల కారణంగా ఖాళీ చేయించారు. వారికి కాళేశ్వరరావు మార్కెట్ ప్రాంతంలోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో పునరావాసం కల్పించారు. అప్పుడు వర్షాల ప్రజలు తలదాచుకోవడానికి ఇల్లు, వసతి లేకపోవడం చూసి చలించిపోయారు. దీంతో చిట్టినగర్ సొరంగం సమీపంలో లేఅవుట్ వేయించారు. వారి నివాసాలకు వీలుగా యోగ్యత కల్పించి అందరికి ఉచితంగా ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఆ మేలును కృతజ్ఞతగా ఆ ప్రాంతానికి స్థానికులు 'టేనర్‌పేట'గా మార్చుకున్నారు.

❖ అక్కడి నివాసితుల పిల్లలు చదువుకునేందుకు 10 సెంట్లు పాఠశాలకు, 10 సెంట్లు ఆట స్థలం, 10 సెంట్లు ఉపాధ్యాయుల క్వార్టర్స్ కోసం, 19 సెంట్లు చర్చి నిమిత్తం మొత్తం 49 సెంట్ల స్థలం ఆయన కేటాయించారు. పాఠశాలను నిర్మించి దానికి టేనర్ మెమోరియల్ ఉన్నత పాఠశాలగా నామకరణం చేశారు. నాటి నుంచి నేటికీ ఆ పాఠశాల కొనసాగుతోంది. టేనర్‌దొరకు ఆకస్మికంగా బదిలీ అయినప్పుడు ప్రజలు దానిని వ్యతిరేకిస్తూ ప్రభుత్వానికి వినతిపత్రాలు పంపారు.

నాగరాజునూ ఆటాడిస్తా..



జగ్గయ్యపేట పట్టణంలో నివాసముంటున్న సుధాకర్(62) వృత్తిరీత్యా జేసీబీ డ్రైవర్ అయినా.. ప్రవృత్తి పాములు పట్టుకోవడం. ఎలాంటి పామునైనా అవలీలగా పట్టుకోవడం ఒక నైపుణ్యమైతే.. వాటిని చంపకుండా జాగ్రత్తగా సమీప అడవుల్లో వదిలేయడం అతని కార్యశీలానికి నిదర్శనం. జగ్గయ్యపేట సమీపంలోని కర్మాగారంలో పనిచేసే ఉద్యోగ విరమణ చేశారు. సుధాకర్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తనకు పాములంటే భయం లేదని, తన బంధువు నుంచి మరిన్ని మెలకువలు నేర్చుకుని వాటిని పట్టివేయడాన్ని ప్రవృత్తిగా మార్చుకున్నట్టు తెలిపారు. వీటికి ఎలాంటి హానీ తలపెట్టకుండా, సమాజ హితానికి పాటుపడడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

కృష్ణమ్మ ఒడిలో జంగమయ్య..!

జగ్గయ్యపేట మండలంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన ముక్త్యేశ్వరపురం(ముక్త్యాల)లో మహా క్షేత్రానికి శతాబ్దాల చరిత్ర, విశిష్టత ఉంది. కృష్ణా నది ఉత్తర వాహినిలో ఆరు నెలలు జలాంతరవాసంలో ఉండడం ముక్తేశ్వరాలయం ప్రత్యేకత. అలాగే సువర్ణలింగం నది మధ్యలో మునిగి ఉంటుంది. దీనిని రెండు వేల ఏళ్ల క్రితమే నిర్మించారని స్థలపురాణం చెబుతోంది. వరద వచ్చినపుడల్లా మునిగిపోయే ఈ గుడికి ప్రత్యామ్నాయంగా 8వ శతాబ్దంలో గ్రామంలో ప్రస్తుతం ఉన్న భవానీ ముక్తేశ్వరాలయం నిర్మించారు. నది ఒడ్డున ఉండే పురాతన ముక్తేశ్వరుడు మాత్రం ఆరు నెలలు భక్తుల పూజలందుకుంటూ.. ఆరు నెలలు జలాంతరవాసం చేస్తుంటాడు. వరద తగ్గి ఆలయం బయటపడగానే భక్తులు అక్కడికి వెళ్లి పూజలు, అభిషేకాలు నిర్వహిస్తుంటారు. - న్యూస్‌టుడే, జగ్గయ్యపేట





ముక్త్యాల వద్ద నదిలో మునిగి ఉండే ముక్తేశ్వరాలయం

ప్రయోగ ఫలం.. విజ్ఞాన బలం



జువాలజీ ల్యాబ్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

ఎన్టీఆర్ జిల్లా నందిగామ కేవీఆర్ ఎయిడెడ్ కళాశాలలో సైన్స్ ల్యాబ్‌లు ప్రత్యేకత సంతరించుకున్నాయి. ఇంటర్ నుంచి పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపకరిస్తున్నాయి. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రయోగశాలల్లో పరికరాలు, రసాయనాలు విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచుతున్నాయి. బోటనీ ల్యాబ్‌లో మైక్రోస్కోపులు, ఇరాక్యులేషన్ ఛాంబర్, దాలోఫైట్, బ్రయోఫైట్, టెరిడోఫైట్, ఆవృత, వివృతబీజ మొక్కల భాగాలు కనిపిస్తాయి. జువాలజీ ప్రయోగశాలలో కాంపౌండ్ మైక్రోస్కోప్‌లు, వివిధ రకాల చేపలు, స్పెసిమెన్స్, పాముల రకాలు, ఉప్పునీటి, మంచినీటి చేపలు, పక్షుల నమూనాలు, మానవ అస్థిపంజరం, అనేక రిఫరెన్స్ పుస్తకాలు ఉన్నాయి. ఫిజిక్స్ ల్యాబ్‌లో ఇంటర్ విద్యార్థులకు లెన్స్‌ఫోకల్ లెంగ్త్, కొలత మీటర్, బ్రిడ్జి నియమాల పరిశీలన, డిగ్రీ విద్యార్థులకు సెమీ కండక్టర్, స్పెక్ట్రోస్కోపీ ఆప్టిక్స్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఉన్నాయి. కెమిస్ట్రీ ల్యాబ్‌లో లవణ విశ్లేషణ, ఘన పరిమాణాత్మక పరీక్షలు, కార్బన్ పదార్థాల విశ్లేషణ, కర్బన పదార్థాల తయారీ, కండక్ట్ మెట్రిక్ పరీక్షలు, పొటెన్షియో మెట్రిక్ పరీక్షలు, క్రొమటోగ్రాఫిక్, పీహెచ్ మెట్రిక్, కలరోమెట్రిక్ పరీక్షలు చేయడానికి ల్యాబ్‌లో పరికరాలు అందుబాటులో ఉన్నాయి. 1975 నుంచి తమ కళాశాలలో ఈ ల్యాబ్‌లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాయప్ప తెలిపారు. - న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం



వల్లకాని దారిది.. వల్లకాడు వారధి..

విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా.. కృష్ణా తూర్పు ప్రధాన కాలువలో కాస్తంత నిశితంగా గమనిస్తే వంతెన దిమ్మెలు కనిపిస్తాయి. బ్రిటిష్‌కాలంలో కొండరాళ్లు, గానుగ సున్నంతో ఇక్కడ వంతెన నిర్మించారు. ఒకప్పుడు పాత బస్తీలో రాకపోకలకు ఇదే కీలకంగా ఉండేది. కృష్ణలంక శ్మశాన వాటికకు మృతదేహాలను దీని మీదుగానే తీసుకువెళ్లేవారు. దీంతో పీనుగుల వంతెనగా పిలిచేవారు. దాని పక్కనే జంట వంతెనలు నిర్మించారు. వీటిని అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి 1980, అక్టోబరు 4న జాతికి అంకితం చేశారు. తర్వాత పీనుగుల వంతెనను మూసివేశారు. కొన్నాళ్ల వరకు నడకకు మాత్రమే అనుమతించారు. క్రమక్రమంగా వంతెన శిథిలం కావడంతో దిమ్మెలు మాత్రమే ఉంచి మిగిలిన నిర్మాణాన్ని తొలగించారు. - న్యూస్‌టుడే, సూర్యారావుపేట



పతాక స్తూపం.. కూచిపూడి వైభవం



కూచిపూడి గ్రామంలో కళాక్షేత్రం నుంచి ఎంతో మంది నాట్యం నేర్చుకుని దేశవిదేశాల్లో ప్రదర్శించి దేశానికి గౌరవం తెచ్చిపెట్టారు. గతేడాది జరిగిన కూచిపూడి నృత్యోత్సవాల్లో ఏర్పాటు చేసిన కూచిపూడి పతాక స్తూపం ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారింది. సుమారు వంద అడుగుల ఎత్తు ఉన్న ఈ పతాక స్తూపంపై చెక్కిన నాట్య ముద్రలు ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దారు. నృత్యంలో విలక్షణత, విశిష్టత చాటి వ్యక్తీకరించే విధంగా ప్రత్యేకంగా దీనిని రూపొందించారు. ప్రస్తుతం ఇక్కడ నాట్యం అభ్యసించడానికి వస్తున్నవారు, పర్యాటకులు మధురానుభూతి పొందుతున్నారు. - ఈనాడు, కృష్ణా

మోదుమూడి మోమున అక్షర తిలకం

అవనిగడ్డ మండలం మోదుమూడి సర్కారు యూపీ పాఠశాల వందేళ్లు పూర్తి చేసుకుని విద్యా పరిమళాలు వెదజల్లుతోంది. 1925లో ఓ పూరిపాకలో ప్రాథమిక పాఠశాలగా ఏర్పాటైంది. 1962లో యూపీ పాఠశాలగా రూపుదిద్దుకుని ఎందరికో అక్షర జ్ఞానం కల్పిస్తోంది. ఎమ్మెల్సీగా పనిచేసిన దివంగత సింగం బసవపున్నయ్య, దివిసీమలో తొలిసారిగా సినిమా టాకీసును అవనిగడ్డలో నిర్మించిన సనకా రామ్మూర్తి ఈ పాఠశాలలోనే ఓనమాలు దిద్దారు. సినిమా నటుడు, నాటక ప్రయోక్త దివంగత సనకా దామోదరరావు చదువుకున్నది ఈ పాఠశాలలోనే. 1995-2005 కాలంలో చదివిన వారిలో అనేక మంది ఇంజినీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారు. ❖ విద్యతో అలవడిన విజ్ఞానంతో సమీప గ్రామాల కంటే ముందే మోదుమూడి మౌలిక వసతులు సమకూర్చుకుంది. మండలంలో ప్రత్యేక గ్రామంగా గుర్తింపు పొందటానికి పాఠశాలే దోహద పడింది. ఇక్కడ చదివిన అనేక మంది పాఠశాల అభ్యున్నతికి కృషి చేశారు.- న్యూస్‌టుడే, అవనిగడ్డ గ్రామీణం



ఉరిమే ఆపద.. తరిమే యోచన

విజయవాడ, చుట్టు పక్కల ప్రాంతాల్లో కోతుల బెడద అధికంగా ఉంటుంది. నివాసాల్లోకి వచ్చి ప్రజలను భయాందోళనలకు గురి చేస్తుంటాయి. అడవుల్లో ఉండాల్సినవి నగరంలోకి రావడానికి ప్రధాన కారణం అక్కడ పండ్ల చెట్లు లేకపోవడమే. దీంతో నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు సూచనల మేరకు సురక్ష సంస్థ ఆధ్వర్యంలో కొండలపై సీడ్ బాల్స్ వేసే కార్యక్రమం చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని జగ్గయ్యపేట, తిరువూరు, కొండపల్లి, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి గ్రామాల్లోని కొండలపై 75 వేల సీడ్ బాల్స్‌ను వేశారు. కేరళ నుంచి తెప్పించిన వీటిని డ్రోన్ల సాయంతో కొండల మీద వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జామ, నేరేడు, సపోటా, చింత తదితర చెట్లకు సంబంధించిన విత్తనాలను కొండ ప్రాంతంలో చల్లారు. అవి చెట్లుగా మారితే కోతులు కొండ ప్రాంతంలోనే ఉండి అక్కడే ఆహారం సమకూర్చుకుంటాయి. తద్వారా కొండ ప్రాంతంలో పచ్చదనం పెంపొందడంతో పాటు కోతులు నగరంలోకి వచ్చే అవకాశం ఉండదు. - న్యూస్‌టుడే, గొల్లపూడి



క్షణాల్లో జీవన ప్రమాణ పత్రం

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు 'జీవన ప్రమాణ పత్రం' పొందాలంటే ఏటా కార్యాలయాలు, మీసేవా, నెట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. చరవాణిలోనే ముఖ ఆధారిత ద్వారా సేవలు పొందేందుకు కేంద్రం 'జీవన్ ప్రమాణ్ యాప్'ను అందుబాటులోకి తెచ్చింది.

రిజిస్ట్రేషన్ ఇలా..

❖ గూగుల్ ప్లేస్టోర్, యాప్ స్టోర్‌లో జీవన్ ప్రమాణ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ❖ యాప్ ఓపెన్ చేసి ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈమెయిల్ ఐడీ నమోదు చేసి సబ్మిట్ చేయాలి. ❖ ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయగానే, ముఖ ఆధారిత నిర్ధారణ అడుగుతుంది. ❖ రౌండ్ సర్కిల్‌లో స్పష్టంగా ముఖం కనిపించేలా చరవాణి కెమెరా ఉంచాలి. పచ్చటి గీతతో సర్కిల్ వచ్చి సక్సెస్ సందేశంతో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. అనంతరం యాప్ క్లోజ్ చేసి మళ్లీ తెరవాలి. తరవాత పెన్షనర్ ఆధార్, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ నమోదు చేస్తే వివరాలు వస్తాయి. ❖ గతంలో జీవనపత్రం పొందని వారు తమ వివరాలను కొత్తగా నమోదు చేసుకోవాలి. పేరు, పీపీవో నంబరు, బ్యాంకు డిపార్టుమెంట్, పింఛను మంజూరు ఏజెన్సీ తదితర వివరాలను సరిచూసుకుని సబ్మిట్ కొట్టాలి. తర్వాత ముఖం స్పష్టంగా కనిపించే విధంగా ఫొటో తీసుకుంటే ప్రక్రియ పూర్తయినట్లే.

❖ కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులు నవంబరు- డిసెంబరు నెలల్లో.. రాష్ట్రానికి చెందిన వారైతే జనవరి- ఫిబ్రవరిలో నమోదు చేసుకోవాలి.

❖ ఉమ్మడి కృష్ణాలో పింఛనుదారుల సంఖ్య : సుమారు 35వేలు

తపాలా కార్యాలయం లోనూ సేవలు.. దగ్గరలోని తపాల శాఖ కార్యాలయానికి వెళ్లి ఆధార్ అనుసంధాన బయోమెట్రిక్ వేసి జీవన ప్రమాణ పత్రాన్ని పొందవచ్చు. ✦ తపాలా కార్యాలయానికి వెళ్లలేని వారు పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా అభ్యర్థన పెట్టుకుంటే సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి సేవలందిస్తారు. ✦ ఆధార్ అనుసంధానం అయి ఉండడంతో పింఛను విభాగానికి వివరాలు పంపుతారు. ఇందుకు రూ. 70 నామమాత్రపు రుసుము చెల్లించాలి.

యువ: దీక్షాదక్షుడై... విజయ ధీరజుడై..!



విలువిద్య పోటీల్లో సత్తా

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా కృషి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

అయిదేళ్ల ప్రాయంలో విలువిద్యలో అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతున్నాడు విజయవాడకు చెందిన అంతర్జాతీయ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్. దేశానికి ఒలింపిక్ పతకం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. బొమ్మదేవర శ్రావణ్‌కుమార్, రేవతి దంపతుల కుమారుడు ధీరజ్. తండ్రికి క్రీడలంటే ఆసక్తి. ఈ నేపథ్యంలో ధీరజ్ ఆర్చరీని ఎంచుకున్నాడు. తొలి రోజుల్లో ఐజీఎంసీ స్టేడియంలో చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో కోచ్ దివంగత చెరుకూరి లెనిన్ పర్యవేక్షణలో 2010 వరకు శిక్షణ పొందాడు. అప్పటి వరకు పలు రాష్ట్ర, జాతీయ మినీ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌ల్లో పతకాలు సాధించాడు.

లెనిన్ మరణానంతరం 2010 నుంచి 2017 వరకు అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, కోచ్ శేఖర్ లాగురి పర్యవేక్షణలో సాధన చేశాడు. 2017లో ఢాకాలో జరిగిన యూత్ ఒలింపిక్ క్వాలిఫైయింగ్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఈ పోటీలో రికర్వ్ వ్యక్తిగత విభాగంలో రజత పతకం కైవసం చేసుకున్నాడు.

❖ 2024లో పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి మిక్స్‌డ్ (అంకిత భకత్) ఈవెంట్‌లో తలపడిన ధీరజ్ జోడీకి పాయింటు తేడాతో కాంస్య పతకం చేజారింది. దీంతో కుంగిపోకుండా సాధన మరింత తీవ్రం చేశాడు. ఫలితంగా 8 నుంచి 14 వరకు ఢాకా (బంగ్లాదేశ్)లో జరిగిన ఏషియన్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో తలపడి తొలిసారిగా దేశ చరిత్రలో రికర్వ్ వ్యక్తిగత విభాగంలో పసిడి పతకాన్ని సాధించాడు. క్వార్టర్స్, సెమీ ఫైనల్స్‌లో ప్రత్యర్థి కొరియా ఆర్చర్లను మట్టి కరిపించాడు. ఫైనల్‌లో 6- 2 తేడాతో భారత్‌కు చెందిన మరో ఆర్చర్ రాహుల్‌పై గెలుపొందాడు.


❖ 2017 యూత్ ఒలింపిక్ క్వాలిఫైయింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అధునాతన పరికరాలు లేక తల్లి రేవతి తన మంగళ సూత్రాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి ధీరజ్‌కు పరికరాలు సమకూర్చారు. చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందిన ధీరజ్.. ఆర్థికంగా, శిక్షణపరంగా బాగా రాణించేందుకు 2021లో పుణే ఆర్మీ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో ప్రవేశించాడు. వచ్చే ఏడాది జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్‌లో, 2027లో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత రికర్వ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి.. ప్రతిభ చాటి 2028 లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో సత్తా చాటే దిశగా కృషి చేస్తున్నానంటున్నాడు ధీరజ్.

ప్రమాద బీమా.. ప్రాణానికి రక్ష

రూ.0.45 కు రూ.10 లక్షల బీమా

ఐఆర్‌సీటీసీ ఈ టికెట్ ప్రయాణికులకు ప్రయోజనం

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే




ఐఆర్‌సీటీసీ టికెట్ తీసుకునే ప్రయాణికులు కేవలం రూ. 0.45 చెల్లించి టికెట్ బుక్ చేసుకునేటప్పుడు సంస్థ అందించే ప్రయాణ బీమా పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ పథకం ద్వారా ప్రమాదాల కారణంగా మరణం లేదా వైకల్యం సంభవించిన సందర్భాల్లో రూ. 10 లక్షల వరకు బీమా అందిస్తుంది. టికెట్ తీసుకునే అన్ని తరగతుల ప్రయాణికులకు ఇది వర్తిస్తుంది.

✦ ఆన్లైన్ ద్వారా టికెట్ తీసుకునే ప్రయాణికులు అవగాహన పెట్టించుకోరు. టికెట్ తీసుకునే సమయంలో ఇన్సూరెన్స్ ఆప్షన్ క్లిక్ చేస్తే సరిపోతుంది. టికెట్‌తో పాటు ఇన్సూరెన్స్ కలిపి నగదు డెబిట్ అవుతుంది. ఇన్సూరెన్స్ వివరాలతో కూడిన ధ్రువపత్రం మనం నమోదు చేసిన ఈ మెయిల్‌కు వస్తుంది.

✦ టికెట్ బుక్ చేసుకునే ప్రయాణికులు పాసింజర్, సబర్బన్ రైళ్లు మినహా అన్ని రిజర్వ్ తరగతుల రైళ్లల్లో ఏదైనా రైలు ప్రమాదం జరిగితే క్లెయిమ్ చేయడానికి అవసరమైన పత్రాలను రైల్వే శాఖ జారీ చేసింది.

✶ వైకల్యం ఉన్నట్లయితే ప్రమాదానికి ముందు, తరువాత ఛాయా చిత్రాలు, ఆసుపత్రిలో చేరడానికి సంబంధించిన పత్రాలు, వైద్యుడి తుది నివేదిక, అన్ని బిల్లులపై నంబరు, సంతకం, స్టాంపు, మరణించిన ప్రయాణికుడి వివరాలతో కూడిన అధికారిక నివేదిక (రైలు ప్రమాదంలో), బ్యాంకు ఖాతా వివరాలు, రద్దు చేసిన చెక్కు సమర్పించాల్సి ఉంటుంది. విచారణ అనంతరం నామినీకి పరిహారం చెల్లిస్తారు.

అపూర్వ చరితం.. అద్భుత రూపం



పీబీ సిద్ధార్థ కళాశాల సమీపంలో కొండ వెనుక వైపు ఉన్న గుహ

మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో గుహలు కనిపిస్తాయి. ఇవి శాతవాహనులు - విష్ణుకుండినుల కాలానికి (1-6 శతాబ్దాలు) చెందినవని చరిత్ర చెబుతోంది. పీబీ సిద్ధార్థ కళాశాల ఎదురుగా గల కొండ, బోయపాటి మాధవరావు రోడ్డులోని ధనకొండ పైన, మధుచౌక్, గిరిపురంలో బౌద్ధ, హిందూ గుహాలయాలున్నాయి. వీటిలో త్రిమూర్తి ఆలయాలు, గణేశ్, మహిషాసురమర్దిని, త్రిమూర్తి శిల్పాలు, కొమ్ములున్న ద్వారపాలకులు, నటరాజ శిల్పం.. అలనాటి వాస్తు శిల్పకళకు అద్దం పడుతూ పర్యాటకుల్ని ఆకర్షిస్తున్నాయి. - న్యూస్‌టుడే, విజయవాడ సిటీ

సంస్కృతి చిహ్నాలు.. సుందర చిత్రాలు..

గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే మార్గం అందంగా ముస్తాబు చేశారు. పచ్చదనంతో పాటు సుమారు 60 అడుగుల వెడల్పుతో, వివిధ సంస్కృతులకు అద్దంపట్టే బొమ్మలను ఏర్పాటు చేశారు. కొత్త టెర్మినల్‌కు వెళ్లే మార్గం, వివిధ ప్రదేశాల్లో 6 బొమ్మలను ఉంచారు. తెలుగు రాష్ట్రాల్లోని విభిన్న సంస్కృతుల మేళవింపుతో సహజత్వం ఉట్టిపడేలా ఈ కళాఖండాలను కొలువుదీర్చారు.





- ఈనాడు, కృష్ణా

మోత మోగించిన ఫిరంగి ఇదే



దివిసీమలో నాటి ఆంగ్లేయుల కాలం నాటి కట్టడాలతో పాటు వారు వినియోగించిన ఫిరంగి నేటికీ పదిలంగా ఉంది. పులిగడ్డలో 1936 కాలంలో ఆంగ్లేయులు అతిథి గృహం నిర్మించారు. ఈ నేపథ్యంలో 1903లో తయారు చేసిన ఫిరంగిని అతిథి గృహం ముందు ప్రాంగణంలో ఉంచారు. స్వాతంత్ర్యం వచ్చాక ఈ భవనాన్ని జల వనరుల శాఖ అతిథి గృహంగా కేటాయించారు. ట్రాలీలో ఉన్న ఫిరంగిని ఇటీవల ఆ శాఖ ఏఈ పి. వెంకటేశ్వరరావు ఓ రాతి దిమ్మెపై పెట్టించారు. రాతి దిమ్మెకు ముందు వైపు జాతీయ జెండా రంగులు అద్దారు. దీన్ని చూసేందుకు ఇప్పటికీ పలువురు వస్తుంటారు. - న్యూస్‌టుడే, అవనిగడ్డ గ్రామీణం



ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాబా మహాసమాధికి నమస్కరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



బాబా మహాసమాధికి పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



నివాళి అర్పిస్తున్న మంత్రి లోకేశ్



పుష్పాలంకరణలో సత్యసాయిబాబా మహాసమాధి



బాబా మహాసమాధిని దర్శించుకుంటున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

మానవతా విలువలే సత్యసాయి బోధనలు

(మొదటి పేజీ తరువాయి)

పెద్దఎత్తున విరాళాలు సేకరించి ప్రాజెక్టుల నిధులు సమకూర్చారని గుర్తుచేసుకున్నారు. ట్రస్టుకు 140 దేశాల్లో 2 వేలకుపైగా బ్రాంచిలు ఉన్నాయని, దాదాపు 7.50 లక్షల మంది వాలంటీర్ల ద్వారా ట్రస్టు సేవలందిస్తోందని ఏ వ్యవస్థకూ ఇంతటి శక్తి లేదన్నారు. భక్తులు శాంతి రాయబారులుగా నిలవాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రపతి ముర్ము జీవితం అందరికీ ఆదర్శం అని ముగించారు. ఈ సందర్భంగా శాంతికి చిహ్నంగా సత్యసాయి యూనివర్సల్ టవర్స్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వెలిగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సత్యసాయి గిరిజన మహిళల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే, జాతీయ సమన్వయకర్త కోటేశ్వరరావు, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి గీతారెడ్డి, మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తదితరులు



పాల్గొన్న మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, మంత్రులు సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్ తదితరులు

నేడే సత్యసాయి శతజయంతి వేడుక

- రాష్ట్ర పండగకు సర్వం సిద్ధం
- పుట్టపర్తికి తరలివస్తున్న దేశ, విదేశీ భక్తులు



పుట్టపర్తి ప్రధాన రహదారిలో స్వాగతతోరణం

ఈనాడు, పుట్టపర్తి: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లుతున్న పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించడంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు, ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో సకల ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18న బాబా రథోత్సవంతో ప్రారంభమైన వేడుకలు. . ఆదివారం జరిగే శతజయంతితో వేడుకలు ముగుస్తాయి. ఈ వేడుకలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గౌరవ అతిథులుగా, రాష్ట్ర మంత్రులు లోకేశ్, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్, ప్రజాప్రతినిధులు అతిథులుగా హాజరుకానున్నారు. తెలంగాణ సీఎం మినహా ఇప్పటికే వీరంతా పుట్టపర్తికి చేరుకున్నారు. ఉదయం హిల్‌వ్యూ స్టేడియంలో జరిగే శతజయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు.

భక్తులకు ఏర్పాట్లు

ఈ వేడుకలకు ఇప్పటికే లక్షల మంది భక్తులు దేశ, విదేశాల నుంచి పుట్టపర్తికి చేరుకున్నారు. భక్తుల బసకు తాత్కాలిక షెడ్లు, అక్కడే భోజనశాలలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. ఎక్కడికక్కడ వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితిలో స్పందించేందుకు అగ్నిమాపక దళాలు, 108 వాహనాలు సిద్ధంగా ఉంచారు. రైల్వేస్టేషన్ నుంచి వచ్చే భక్తులకు అక్కడే భోజన సదుపాయం ఉంది. అక్కడి నుంచి భక్తులు పట్టణంలోకి వచ్చేందుకు ఉచిత బస్సులున్నాయి. వాహనాలు నిలిపేందుకు పట్టణ పరిసరాల్లో పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. వాహనాలు అక్కడే ఉంచి భక్తులు ప్రశాంతి నిలయానికి చేరుకోవాలి.


2047 నాటికి ప్రపంచ మేటిగా భారత్

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

ఈనాడు, పుట్టపర్తి: 'ప్రపంచం చెబితే భారత్ వింటుందన్నది పాతమాట. భారత్ చెబితే ప్రపంచం వింటుందన్నది కొత్తమాట. 2047 నాటికి మన దేశం ప్రపంచంలోనే మేటిగా నిలుస్తుంది' అని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. పుట్టపర్తిలోని ప్రశాంతినిలయం పూర్ణచంద్ర ఆడిటోరియంలో శనివారం జరిగిన శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూనివర్సిటీ కులపతి చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ఉపకులపతి బి. రాఘవేంద్రప్రసాద్, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే తదితరులు హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ' 'నాలుగు రోజుల్లో దేశంలోనే అత్యున్నత పదవుల్లో ఉన్నవారు పుట్టపర్తికి వచ్చారంటే సత్యసాయి ఎంత శక్తిమంతులో అర్థమవుతోంది. మనతోపాటు ఇతరుల కోసమూ బతకాలన్నదే సాయి విధానం. ఇలాంటి సంస్థలో పట్టభద్రులైన విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కాబోతున్నారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని మంత్రి లోకేశ్ పిలుపు ఇచ్చినప్పుడు మంచిస్పందన వచ్చింది. దీన్నిబట్టి విద్యార్థులు భవిష్యత్తు నాయకులుగా తయారవుతారని ఆశిస్తున్నాను. ఏ యూనివర్సిటీలోనూ కనిపించని క్రమశిక్షణ ఇక్కడ ఉంది. ఇలాంటి యువతను తయారుచేసిన సంస్థకు నా అభినందనలు. ఆవిష్కరణల కేంద్రంగా.. సుస్థిరాభివృద్ధికి ప్రతిరూపంగా దేశాన్ని ప్రధాని నరేంద్రమోదీ తీర్చిదిద్దారు'' అని వివరించారు. అనంతరం 521 మందికి పట్టాలు, 20 మందికి బంగారుపతకాలు, 14 మందికి డాక్టరేట్లు అందజేశారు.

విలువల వ్యక్తిత్వమే సత్యసాయి సిద్ధాంతం

విలువల ఆధారిత, వ్యక్తిత్వ నిర్మాణమే కేంద్రంగా సత్యసాయి విద్యా సంస్థలను నిర్మించారని, అదే ఆయన సిద్ధాంతమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. "బాబా విశిష్టమైన విద్యా విధానానికి ఇక్కడున్న విద్యార్థులంతా ప్రతిరూపాలు. ఈ విద్యా విధానం విద్యార్థులను వృత్తిపరంగా సమర్థులు, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దింది. అధిక జనాభా వల్ల దేశానికి ప్రయోజనాలు కలుగుతున్నాయి. ఫ్యూచర్ టెక్నాలజీలను రాష్ట్రానికి తెస్తున్నాం. దేశంలో తెలుగువారు ప్రథమస్థానంలో ఉండేలా పనిచేస్తున్నాం. ధైర్యం, ఆత్మవిశ్వాసం, విలువలతో ముందుకు సాగాలి" అని సూచించారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు కోయంబత్తూరు గాంధీగా పేరుందని, నిత్యం ప్రజలకు సేవ చేయాలని తపన పడుతుంటారని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, ఎంపీలు పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, విప్ కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, పరిటాల సునీత, కందికుంట ప్రసాద్, ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి పట్టా ప్రదానం చేస్తున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్. చిత్రంలో సత్యసాయి ట్రస్టు సభ్యుడు మోహన్, ఉపరాష్ట్రపతి ప్రిన్సిపల్ సెక్రటరీ అమిత్ ఖరె, మంత్రి లోకేశ్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కులపతి చక్రవర్తి, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ఉపకులపతి రాఘవేంద్రప్రసాద్

అరటి నాణ్యతపై అవగాహన సదస్సులు

ఈనాడు, అమరావతి: అరటి దిగుబడులు నాణ్యంగా రాబట్టేందుకు రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉద్యానశాఖ సంచాలకుడు కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. నాణ్యంగా ఉండే పంటకు మార్కెట్‌లో సరైన ధర దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఏప్రిల్ నెలలో వేసిన పంటకు చిల్లింగ్ ప్రభావం ఉండదని, మహారాష్ట్రలో వేసిన పంటకు ఆ ప్రభావం ఉంటుందని, అందువల్ల మన అరటి పంటకు డిసెంబరు 15 నుంచి మంచి ధర దక్కే అవకాశం ఉందన్నారు. అరటి పంట మార్కెట్ విషయంలో వచ్చిన సంక్షోభం నేపథ్యంలో రాష్ట్ర ఉద్యానశాఖ సంచాలకుడు అరటి కొనే కంపెనీ ప్రతినిధులతో శనివారం సమావేశమయ్యారు. నాణ్యమైన పంటను కిలో రూ.7.50 నుంచి రూ.8. వరకు కొనుగోలు చేస్తున్నామని వారు తెలియజేశారు. నాణ్యత లేని పంటను స్థానిక వ్యాపారులు తక్కువ ధరకు తీసుకుంటున్నారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అరటి నాణ్యతపై ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

కార్మిక కోడ్స్‌కు వ్యతిరేకంగా 26న దేశవ్యాప్త సమ్మె

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌ల ద్వారా కార్మికులకు తీవ్ర అన్యాయం జరగనుందని, వారి హక్కులను కాలరాసే ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. శనివారం ఆయన నెల్లూరులో సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికులపై సీఎం చులకనగా మాట్లాడటం తగదు. రాష్ట్రంలో ప్రయోజనం కలిగే పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలి. బూటకపు ఎన్‌కౌంటర్లను సీపీఎం ఖండిస్తోంది'' అని రాఘవులు పేర్కొన్నారు.

భాజపా పాలనలో వెనుకబాటు

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ



అజాద్‌నగర్, న్యూస్‌టుడే: భాజపా పాలనలో ఏ రంగమూ అభివృద్ధి సాధించడం లేదని, రాజకీయాలకు మతం రంగు పులిమి ఓట్లు దండుకుంటోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. శనివారం అనంతపురంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్, కార్యవర్గ సభ్యుడు సి.జాఫర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నాలుగు కార్మిక కోడ్‌ల అంశాన్ని బిహార్‌లో ఎన్డీయే విజయం తర్వాత మళ్లీ తెరపైకి తెచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను దుర్మార్గంగా తొక్కిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీన్ని నిరసిస్తూ ఈ నెల 26న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు చేపట్టనున్న నిరసనకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుంది' అని రామకృష్ణ ప్రకటించారు.

వైద్యసేవల్లో ఇంత నిర్లక్ష్యమా?

- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం
- కాకినాడ, రాజమహేంద్రవరం ఘటనల బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం
- హుటాహుటిన కదిలిన యంత్రాంగం
- కాకినాడలో గర్భిణి మృతికి కారణమైన వైద్యురాలి సస్పెన్షన్
- రాజమహేంద్రవరంలో సమగ్ర విచారణ

ఈనాడు, అమరావతి, రాజమహేంద్రవరం-మసీదుసెంటర్, సాంబమూర్తినగర్, కంబాలచెరువు, న్యూస్‌టుడే: కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి, బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో తాళ్లరేవు మండలం చినవలసలకు చెందిన గర్భిణి మల్లీశ్వరికి.. మందు పడదని చెప్పినా పాంటోప్రజోల్ ఇంజక్షన్ ఇవ్వడంతో ఆమె ప్రాణాలు కోల్పోయారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో 55 ఏళ్ల మహిళకు ఈ నెల 8న.. అక్టోబరుతో గడువు ముగిసిన రక్తపోటు మాత్రలు ఇచ్చారని, దీంతో ఆమె మరింత అస్వస్థతకు గురయ్యారని ఎక్స్‌లో ఒకరు పోస్టు చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. మృతిచెందిన మల్లీశ్వరి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికార యంత్రాంగం హుటాహుటిన కదిలింది. రెండు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన ఘటనలపై విచారణ చేపట్టింది.

తనకు ఆ ఇంజక్షన్ పడదని చెప్పినా...

తాళ్లరేవు మండలం చినవలసలకు చెందిన మల్లీశ్వరి 8 నెలల గర్భిణి. ఆమెకు రక్తపోటు, మధుమేహం ఎక్కువగా ఉండటంతో ఈ నెల 14న కాకినాడ జీజీహెచ్‌లో చేరారు. ఆ సమయంలో తనకు పడని మందుల వివరాలను సంబంధిత పీజీ వైద్యులకు అందించారు. తనకు పడదని చెప్పిన పాంటోప్రజోల్ ఇంజక్షన్‌ను ఈ నెల 20 మధ్యాహ్నం పీజీ గైనిక్ వైద్యురాలు.. మల్లీశ్వరికి చేస్తుండగా బంధువు ఒకరు వద్దని వారించారు. అయినా వినకుండా వైద్యురాలు ఆ ఇంజక్షను చేశారు. కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి చేరుకున్న మల్లీశ్వరి అదేరోజు రాత్రి 11 గంటలకు చనిపోయారు. దీనిపై వైద్యులను బంధువులు నిలదీయగా, గొడవచేస్తే కేసు నమోదవుతుందని, మృతదేహానికి పోస్టుమార్టం చేస్తారని చెప్పారు. దీంతో వారు నిస్సహాయ స్థితిలో మృతదేహాన్ని అర్ధరాత్రి వేళ ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయం శనివారం వెలుగులోకి రావడం సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, మరికొంతమంది వైద్యుల బృందం విచారణ చేపట్టింది. వైద్యురాలి నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించి, పీజీ వైద్యురాలిని ఆరునెలల పాటు సస్పెండ్ చేశారు. పూర్తిస్థాయి విచారణ నిమిత్తం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) సోమవారం కాకినాడ జీజీహెచ్‌కు రానున్నారు.

ఆ మాత్రలు అక్టోబరులోనే అయిపోయాయి

అధికారుల దర్యాప్తులో వెల్లడి

మహిళకు కాలం చెల్లిన మాత్రలు ఇచ్చారనే ఘటనపై సీఎం ఆదేశాలతో... రాష్ట్ర డ్రగ్స్ విభాగ జీఎం డాక్టర్ బాలు శనివారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం చేరుకుని సమగ్ర విచారణ చేపట్టారు. జీజీహెచ్ సమీపంలోని నారాయణపురం అర్బన్ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)కు వెళ్లి మందుల నిల్వలు, దస్త్రాలు తనిఖీ చేశారు. 'ఎక్స్'లో పేర్కొన్న బ్యాచ్ నంబరుతో ఇక్కడికి మందులు వచ్చినట్లు గుర్తించినా, అవి అక్టోబరులోనే అయిపోయాయని బాలు చెప్పారు. నవంబరు 8న అక్కడి యూపీహెచ్‌సీకి రక్తపోటు సమస్యతో ఐదుగురు వచ్చినా, వారంతా 40 ఏళ్ల వయసు వారేనని, 55 ఏళ్ల మహిళ రాలేదని తెలిపారు. ఎక్స్‌లో ఆమె పోస్ట్ చేసిన మాత్రలు(ఏమ్లో డిపిన్ 5 ఎంజీ) అక్టోబరులోనే ఆసుపత్రిలో అయిపోయాయని, నవంబరులో ఆ నిల్వలు లేవని, ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని బాలు వివరించారు. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన మహిళ ఫోన్ నంబరు అందుబాటులో లేదని... తమకు వివరాలివ్వాలంటూ 'ఎక్స్'లోనే పలుమార్లు సందేశాలు పంపించినా ఆమె స్పందించలేదని బాలు వెల్లడించారు.



నారాయణపురం యూపీహెచ్‌సీలో విచారణ చేస్తూ... ఎక్స్‌లో పోస్టు చేసిన మహిళకు సందేశం పంపుతున్న డాక్టర్ బాలు

- రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోనూ ఆ మందులపై సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రగ్‌స్టోర్ వైద్యాధికారి నసీరుద్దీన్ విచారణ చేపట్టారు. ఆ బ్యాచ్ నంబరు ఏమ్లోడిపిన్ 5ఎంజీ మాత్రలు జీజీహెచ్ ఫార్మసీకి రాలేదని నిర్ధారించారు.

రూ. 9,490 కోట్లతో... నాలుగు కీలక హైవేల విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

మీదుగా తెలంగాణ సరిహద్దులోని లక్ష్మీపురం వరకు జాతీయ రహదారి-216హెచ్‌ను 118 కి.మీ. మేర విస్తరించనున్నారు. రూ.4,245 కోట్లతో డీపీఆర్‌ను సిద్ధంచేసి పంపారు. పెడన నుంచి నూజివీడు బైపాస్ వరకు 4 వరుసలుగా, అక్కడి నుంచి లక్ష్మీపురం దాకా రెండు వరుసలుగా విస్తరించనున్నారు. భూసేకరణ వ్యయం, ఇతర ఖర్చులు కాకుండా సివిల్ పనులకు రూ.2 వేల కోట్లను వెచ్చించనున్నారు.

- పామర్రు నుంచి ఆకివీడు వరకు 60 కి.మీ. మేర ఇప్పటికే విస్తరణ పనులు సాగుతున్నాయి. 45 కి.మీ. రెండు వరుసలుగా, 15 కి.మీ. నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. ఇప్పుడు ఆకివీడు నుంచి భీమవరం మీదుగా దిగమర్రు వరకు 44.94 కి.మీ. విస్తరణకు డీపీఆర్ పంపారు. ఇందులో 40 కి.మీ. 4 వరుసలు, మిగిలినది 2 వరుసలుగా విస్తరించేందుకు రూ.3,256 కోట్లతో అంచనాలు వేశారు. వాస్తవానికి పామర్రు నుంచి దిగమర్రు వరకు (ఎన్‌హెచ్-165) మొత్తం ప్రాజెక్టు విస్తరణ గతంలో మంజూరైంది. భీమవరం బైపాస్ ఎలైన్‌మెంట్ విషయంలో కోర్టు కేసుల కారణంగా.. పామర్రు నుంచి ఆకివీడు వరకు మాత్రమే గతంలో పట్టాలెక్కింది. ఇప్పుడు కోర్టు కేసులు పరిష్కారం కావడంతో ఆకివీడు-దిగమర్రు మధ్యనా విస్తరణ చేపట్టనున్నారు.

రెండు జాతీయ రహదారులనూ అనుసంధానించేలా..

రెండు జాతీయ రహదారులను అనుసంధానించేలా అమలాపురం-రావులపాలెం హైవే (ఎన్‌హెచ్-216ఇ)ను 32 కి.మీ. విస్తరించనున్నారు. కత్తిపూడి-ఒంగోలు హైవేలో అమలాపురం నుంచి రావులపాలెం వద్ద... చెన్నై-కోల్‌కతా పాత హైవే (గుండుగొలను-దివాన్‌చెరువు ఎన్‌హెచ్-216ఎ)ను అనుసంధానిస్తుంది. ఈ హైవేను 10 మీటర్ల వెడల్పుతో రెండు వరుసలతో విస్తరించేందుకు రూ.807 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ పంపారు.

- వైఎస్సార్ కడప జిల్లాలోని ముద్దనూరు నుంచి కడప వరకు (ఎన్‌హెచ్-716).. 48.36 కి.మీ. నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.1,182 కోట్లతో డీపీఆర్‌ను పంపించారు.

మిస్బా కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సాయం

- ఇంటి స్థలమూ అందజేత



మిస్బా తల్లి షేక్ నసీమాకు చెక్కు, ఇంటిపట్టాను అందిస్తున్న మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకుడి వేధింపులు తట్టుకోలేక పలమనేరుకు చెందిన పదో తరగతి విద్యార్థిని మిస్బా ఆత్మహత్య చేసుకుందని మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ గుర్తుచేశారు. మదనపల్లెలోని బాధిత కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధ్యక్షతన శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ 'మిస్బాను నాటి వైకాపా ప్రభుత్వమే చంపించింది. అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం మిస్బా తల్లిదండ్రులకు రూ.5లక్షలు చెక్కు, పుంగనూరులో ఇంటి స్థలం మంజూరు చేశారు' అని మంత్రి తెలిపారు. తన వంతుగా రూ.లక్ష ఇస్తానని ప్రకటించారు. ముస్లిం మైనార్టీలు కూడా రూ.5 లక్షలు విరాళాలను బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో హజ్ కమిటీ ఛైర్మన్ హసన్‌బాషా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్‌సాహెబ్, స్వచ్ఛ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్‌బేగం, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్, హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈక్వెస్ట్రియన్ ఫైనల్‌కు ముఖ్యఅతిథులుగా జగన్, కేటీఆర్

ఈనాడు, బెంగళూరు: బెంగళూరులో శనివారం నిర్వహించిన సర్జ్ ఈక్వెస్ట్రియన్ లీగ్ గ్రాండ్ ఫినాలే పోటీలకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. చిక్కజాల పరిసరాల్లోని సర్జ్ స్టేబుల్ ఈక్వెస్ట్రియన్ ఫెసిలిటీ కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు వీరిద్దరూ ట్రోఫీలు అందజేశారు. అంతర్జాతీయ రైడర్లు ఎడ్వర్డ్ స్కీమిజ్, బొండరివా జైన్, షాడీ సమీర్, వ్యాలంటైన్ మార్కట్ ఈ పోటీల్లో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.



ఎలిమెంటరీ ఛాంపియన్‌కు ట్రోఫీ అందిస్తున్న జగన్, కేటీఆర్

గురకను అశ్రద్ధ చేయొద్దు



గురక అనేది అపాయం లేని శబ్దం కాదు. అది మీ భాగస్వామికి తీవ్ర చికాకు కలిగించే అంశం. అంతేకాదు సహాయం కోసం మీ శరీర అర్థింపు కూడా. గురక వస్తోందంటే దానర్థం..

- ✦ మీ శ్వాసనాళ ద్వారాలు కుంచించుపోతున్నాయని.
- ✦ మీ మెదడుకు తగినంత ప్రాణవాయువు అందడంలేదని.
- ✦ మీ ఊపిరితిత్తులు వాటి సామర్థ్యానికి మించి పనిచేస్తున్నాయని.
- ✦ గాఢమైన నిద్ర తగ్గిపోతోందని.
- ✦ రాత్రంత ఒత్తిడి హార్మోన్లు క్రియాశీలంగా ఉంటాయని.
- ✦ బీపీ పెరిగే అవకాశం ఉంటుందని.
- ✦ బరువు నియంత్రణ కష్టసాధ్యంగా మారుతుందని.

ఈ సమస్య నుంచి బయటపడేందుకు త్వరగా చికిత్స చేయించుకోవాలి.

– శ్రద్ధే కటియార్, డాక్టర్

నువ్వు నాకూ కుమారుడివే..

• 81 ఏళ్ల బసంత్ పాండోతో ముర్ము

ఛత్తీస్‌గఢ్‌లో బసంత్ పాండో (81) అంటే భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దత్తపుత్రుడిగా చాలామందికి తెలుసు. ఆయన నేడు 'ఈటీవీ భారత్' జరిపిన కథనంతో ఈ విషయం రాష్ట్రపతి ముర్ము బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. పరిణామం.. నవంబరు 20న సర్గుజా జిల్లా అంబికాపూర్ పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసే అవకాశం బసంత్ పాండోకు అధికారులు కల్పించారు. పాండో గిరిజన తెగ సంక్షేమానికి సంబంధించిన 5 కీలక డిమాండ్లతో రాష్ట్రపతికి లేఖను ఇచ్చానని బసంత్ తెలిపారు. 1952లో అంబికాపూర్‌లో పర్యటించిన బాబూ రాజేంద్రప్రసాద్ స్థానిక పాండో గిరిజన తెగవారితో సమావేశమై.. అప్పటికి 8 ఏళ్ల వయసులో ఉన్న బసంత్‌ను ఒడిలో కూర్చోబెట్టుకున్నారు. ఈ పేరు కూడా ఆయన పెట్టినదే. నాటి నుంచి బసంత్ రాష్ట్రపతి దత్త పుత్రుడిగా ప్రసిద్ధుడయ్యారు. ఈ విషయాన్ని ముర్ముకు తెలుపగా.. ఆమె చిరునవ్వుతో "నువ్వు నాకూ కుమారుడివే" అన్నారని బసంత్ చెప్పారు.



35 ఏళ్లకు మళ్లీ.. కిలకిలల అధ్యయనం

రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో గల కెవలాదేవ్ జాతీయ పార్కులో ప్రతిష్ఠాత్మక బర్డ్ రింగింగ్ స్టడీ ప్రాజెక్టు 35 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ మొదలైంది. పక్షుల జీవనశైలి, వలసలు, జాతులు, ఆహారపు అలవాట్లు వంటి అంశాల ప్రాతిపదికన ఈ అధ్యయనం జరుగుతుంది. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్), రాజస్థాన్ అటవీశాఖ సంయుక్తంగా చేపట్టిన ఈ అధ్యయనం పక్షులకు సంబంధించిన పలు రహస్యాలను ఛేదించనుంది. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాజస్థాన్ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌ల నుంచి అనుమతి రావడంతో ఈ చారిత్రక ప్రాజెక్టును తిరిగి ప్రారంభించారు. సహజ ఆవాసాలలో వాతావరణ పరంగా జరిగే వేగవంతమైన మార్పులు పక్షుల జీవితచక్రాలను ప్రభావితం చేస్తాయని కెవలాదేవ్ జాతీయ పార్కు డైరెక్టరు మానస్‌సింగ్ తెలిపారు.





ధ్వంసమైన కారు

డ్రైవర్‌కు గుండెపోటు.. వాహనాలపైకి దూసుకెళ్లిన కారు

థానెలో నలుగురి మృతి

ముంబయి: రహదారిపై వేగంగా వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపు తప్పింది. ఎదురుగా ఉన్న పలు ద్విచక్ర, ఇతర వాహనాలను ఢీకొంటూ దూసుకెళ్లింది. మహారాష్ట్రలోని థానెలో జరిగిన ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ సహా నలుగురు మృతి చెందారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న శివసేన పార్టీ అభ్యర్థి కిరణ్ చాబే ఈ కారులో ప్రయాణిస్తున్నారు. కారును నడుపుతున్న డ్రైవర్ లక్ష్మణ్ శిందేకు గుండెపోటు రావడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. కిరణ్ చాబే ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.



మంచి నిద్రకు 10-3-2-1 సూత్రం

ఆరోగ్యకరమైన మంచి నిద్రకు పాటించాల్సిన సూత్రం 10-3-2-1. ✦ నిద్రపోవడానికి 10 గంటల ముందే కాఫీ తాగడాన్ని ఆపేయాలి. ✦ మూడు గంటల ముందు తినడాన్ని నిలిపేయాలి. ✦ రెండు గంటల ముందు నీళ్లు తాగడం బంద్ చేయాలి. ✦ గంట ముందు టీవీ, ఫోన్లు చూడటం నిలిపేయాలి.

– డాన్ గో, ఫిట్‌నెస్ శిక్షకుడు

పౌర అణు రంగంలోకి ప్రైవేటు సంస్థలు!



• పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కీలక బిల్లు

• చట్టసభల్లో ప్రవేశపెట్టేందుకు మరో 9 బిల్లులూ సిద్ధం

దిల్లీ: విద్యుదుత్పత్తి, వైద్య చికిత్సలు తదితర పౌర అవసరాలకు అణు శక్తి వినియోగం, ఆయా రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించేలా ప్రైవేటు సంస్థలను అనుమతించే కీలకమైన బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లు, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు, సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు వంటి ముఖ్యమైన మరో 9 బిల్లులను కూడా ఈ సమావేశాల్లో పార్లమెంటు ఆమోదం కోసం రానున్నాయి. డిసెంబరు 1న ప్రారంభమయ్యే శీతాకాల సమావేశాలు అదే నెల 19 వరకు కొనసాగుతాయి. ఈ సెషన్‌లో దాదాపు 15 సార్లు పార్లమెంటు ఉభయ సభలు సమావేశమవుతాయి. పది బిల్లులకు ఆమోదం పొందేందుకు ప్రభుత్వం ప్రయత్నించనున్నట్లు లోక్‌సభ బులెటిన్ వెల్లడించింది.

ఒకే సంస్థ పరిధిలోకి ఉన్నత విద్య

వైద్య, న్యాయ కళాశాలలకు మినహాయింపు

విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ), అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ), జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) వంటి వాటిన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు 'భారత ఉన్నత విద్యా కమిషన్'(హెచ్ఈసీఐ)ను కేంద్రం ఏర్పాటు చేయనుంది. దీని కోసం కొత్త చట్టం తీసుకురానుంది. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా హెచ్ఈసీఐకి రూపకల్పన చేసింది. వైద్య, న్యాయ విద్యకు సంబంధించిన కళాశాలలు, సంస్థలు మినహా మిగతా అన్నింటినీ ఉన్నత విద్యా కమిషన్ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ విద్యాసంస్థల నియంత్రణ, వృత్తిపరమైన నైపుణ్యాల నిర్ధారణ, అక్రిడిటేషన్ వంటి మూడు కీలక విధులను హెచ్ఈసీఐ నిర్వహించేలా బిల్లును ప్రభుత్వం ప్రతిపాదించింది. అత్యంత కీలకమైన నిధుల మంజూరు అంశం మాత్రం సంబంధిత మంత్రిత్వ శాఖ పరిధిలోనే ఉంటుంది.

చిరుతను ఎదిరించిన 11ఏళ్ల బాలుడు

• ప్రాణాలు కాపాడిన స్కూల్ బ్యాగ్



పాల్ఘర్: చిరుత తనపై దాడి చేసినా భయపడకుండా ఓ పదకొండేళ్ల బాలుడు ధైర్య సాహసాలు ప్రదర్శించి దాన్ని తరిమి కొట్టి ఔరా అనిపించాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా మాలా పడ్వీపాడ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పాఠశాల నుంచి తన స్నేహితుడితో కలిసి కువారా ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో చిరుత అతడిపై వెనుక నుంచి దాడి చేసింది. వీపుపై ఉన్న బ్యాగుపై పంజా పడటంతో అప్రమత్తమైన విద్యార్థులు గట్టిగా కేకలు వేశారు. స్నేహితుడితో కలిసి కువారా ధైర్యంగా రాళ్లు విసురుతూ చిరుతను ఎదిరించాడు. అరుపులు విన్న సమీపంలోని జనం పరుగున రావడంతో చిరుత అడవిలోకి పారిపోయింది. కువారా గాయం కావడంతో అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. భయపడకుండా సమయస్ఫూర్తితో పోరాడిన కువారాను అధికారులు అభినందించారు.

చండీగఢ్ చట్టాలన్నీ నేరుగా రాష్ట్రపతే చేస్తారు!

ఆర్టికల్ 131 సవరణకు కేంద్రం బిల్లు

దిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించే ఆదేశాలు, చట్టాలను నేరుగా చేసే అధికారాలను రాష్ట్రపతికి కల్పించిన రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి చండీగఢ్‌ను కూడా తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదించింది. దీనికిగాను రాజ్యాంగ అధికరణం 131ను సవరిస్తూ బిల్లు తీసుకురానుంది. త్వరలో ప్రారంభమయ్యే శీతాకాల సమావేశాల్లోనే ఈ బిల్లు పార్లమెంటు ముందుకు రానుంది. చట్టసభల్లేని కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్-నికోబార్ దీవులు, దాద్రా-నగర్ హవేలీ, దమణ్-దీవ్ ప్రస్తుతం అధికరణం 240 పరిధిలో ఉన్నాయి. వీటి కోవలోకే చండీగఢ్‌ను తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. తద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారి స్వతంత్ర పాలకునిగా నియమితులవుతారు. పంజాబ్, హరియాణా రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్... ప్రస్తుతం పంజాబ్ గవర్నర్ పాలనా పర్యవేక్షణలో ఉంది. చండీగఢ్ తమ రాష్ట్రానికే చెందాలని కోరుతున్న పంజాబ్ నేతలు కేంద్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు.

నైజీరియాలో అపహరణకు గురైన బడిపిల్లల సంఖ్య 303

అబుజా: నైజీరియాలో నైజర్ రాష్ట్రంలో ఒక బోర్డింగ్ స్కూలు నుంచి సాయుధ దుండగులు అపహరించుకుపోయిన బడి పిల్లల సంఖ్య 300 దాటినట్లు 'క్రిస్టియన్ అసోసియేషన్ ఆఫ్ నైజీరియా' వెల్లడించింది. 12 మంది ఉపాధ్యాయులనూ సాయుధులు కిడ్నాప్ చేసినట్లు తెలిపింది. నైజర్ రాష్ట్రంలోని సెయింట్ మేరీస్ కేథలిక్ గురుకుల పాఠశాలపై గుర్తు తెలియని సాయుధులు శుక్రవారం తెల్లవారు జామున దాడిచేశారు. తొలుత 52, ఆ తర్వాత 215 మంది వరకు విద్యార్థులు అపహరణకు గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే, స్కూల్‌లో తనిఖీలు, విద్యార్థుల లెక్కింపు అనంతరం ఈ సంఖ్య 303కు పెరిగినట్లు అధికార ప్రతినిధి తెలిపారు.

ట్రంప్‌తో మమ్దానీ భేటీ

• న్యూయార్క్‌ను అభివృద్ధి చేయడమే ఇద్దరి లక్ష్యం అని వెల్లడి



మమ్దానీని అభినందిస్తున్న ట్రంప్

న్యూయార్క్: నిన్న మొన్నటిదాకా ఒకరి మీద ఒకరు కారాలు, మిరియాలు నూరుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, న్యూయార్క్ మేయర్ మమ్దానీలు ఎట్టకేలకు తొలిసారిగా శ్వేతసౌధంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఒకరి మీద ఒకరు సానుకూల వ్యాఖ్యలు చేసుకున్నారు. తమ మధ్య ఫలప్రదమైన చర్చలు జరిగాయంటూ చెప్పుకొచ్చారు. న్యూయార్క్‌కు చెందినవారిగా నగర సమస్యలపై ఇద్దరికీ ఒకే దృక్పథం కనిపించిందని వారు పేర్కొన్నారు. మేయర్‌గా మమ్దానీ రాణించాలని కోరుకుంటున్నట్లు ట్రంప్ పేర్కొనగా.. తనతో సమావేశం అయినందుకు ట్రంప్‌నకు మమ్దానీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ సమావేశంలో భారత్, పాకిస్థాన్ మధ్య తానే సయోధ్య కుదిరించానని ట్రంప్ పునరుద్ఘాటించారు.

'ఒప్పేసుకో.. నాకేం అభ్యంతరం లేదు'

మమ్దానీ ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌ను 'ఫాసిస్ట్'గా అభివర్ణించిన వ్యాఖ్యపై భేటీ అనంతరం ఓ విలేకరి ప్రశ్నించారు. దీనిపై మమ్దానీ స్పందిస్తూ, 'ఆ విషయంపై నేను ఇప్పటికే మాట్లాడాను' అంటూ సమాధానం చెబుతుండగా.. ట్రంప్ వెంటనే నవ్వుతూ అడ్డుకున్నారు. 'నేరుగా అవును అని చెబితే చాలు. అప్పుడు పెద్దగా వివరించాల్సిన పని లేదు. నాకేం అభ్యంతరం లేదు' అని అధ్యక్షుడు వ్యాఖ్యానించడంతో అక్కడున్నవారు నవ్వుకున్నారు.

అవును.. పేలుళ్లకు ప్లాన్ చేశాం

• అంగీకరించిన ఉగ్ర డాక్టర్..!

• అమోనియా, నైట్రేట్ కొనే పని అప్పగించారు: షకీల్



ఇంటర్నెట్‌డెస్క్: 2023లో దేశవ్యాప్తంగా దాడులకు ప్రణాళిక వేసినట్లు దిల్లీ బాంబు పేలుడు కేసులో అనుమానితుడు విచారణలో అంగీకరించాడని తెలుస్తోంది. ఆత్మాహుతి చేసుకున్న డాక్టర్ ఉమర్ నబీతో సంబంధాలున్న పలువురు అనుమానితులను విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్త దాడుల కోసం రెండు సంవత్సరాలుగా సిద్ధం అవుతున్నానని, పేలుడు పదార్థాలు, రిమోట్లు, బాంబు తయారీ పదార్థాలను సేకరిస్తున్నానని అనుమానితుల్లో ఒకడైన డా.ముజమ్మిల్ షకీల్.. 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) విచారణలో అంగీకరించినట్లు సమాచారం. యూరియా, అమ్మోనియా నైట్రేట్‌ను కొనుగోలు చేయడం తనకు అప్పగించిన పని అని చెప్పినట్లు తెలుస్తోంది. "హరియాణాలోని గురుగ్రామ్, నూహ్ నుంచి 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఎరువును, ఫరీదాబాద్‌లో ఎలక్ట్రానిక్ పరికరాలను ముజమ్మిల్ కొన్నాడు. వీటి నిల్వకు ఒక డీప్ ఫ్రీజర్‌ను సమకూర్చుకున్నాడు. పేలుడు పదార్థాల్లో వాడేలా ఎరువుల్ని ప్రాసెస్ చేయడం, ఇతర రసాయనాలను సమకూర్చడం బాంబర్ ఉమర్ పని" అని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. తన హ్యాండ్లర్ పేరు మన్సూర్ అని, ఉమర్ హ్యాండ్లర్ పేరు హషీమ్ అని.. ఆ ఇద్దరూ ఇబ్రహీం అనే వ్యక్తి ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తారని ముజమ్మిల్ అంగీకరించినట్లు సమాచారం.

సీజేఐ గవాయ్ పదవీకాలంలో

10 మంది ఎస్సీ జడ్జీల నియామకం

దిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ తన ఆరు నెలల పదవీ కాలంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన పది మంది, వెనుకబడిన తరగతులకు చెందిన 11 మంది న్యాయమూర్తులను వివిధ రాష్ట్రాల హైకోర్టులకు నియమించారు. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య కొలీజియం వివిధ హైకోర్టులకు న్యాయమూర్తులుగా 129 మంది పేర్లను సిఫార్సుచేసింది. వీటిలో 93 మంది పేర్లను ఆమోదించారు. వీరిలో 13 మంది మైనారిటీ వర్గానికి చెందినవారు కాగా.. మరో 15 మంది మహిళా న్యాయమూర్తులు. ఐదుగురు మాజీ, ప్రస్తుత న్యాయమూర్తులకు సంబంధించిన వారు కాగా, 49 మంది బార్ నుంచి, మిగతా వారు సర్వీస్ క్యాడర్ నుంచి నియమితులయ్యారు. ఈయన పదవీకాలంలోనే జస్టిస్ ఎన్.వి.అంజరియా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్, జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలిలు సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు నియమితులయ్యారు. జస్టిస్ గవాయ్ ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో 53వ సీజేఐగా 24న జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం చేయనున్నారు.

మధ్యవర్తిత్వమే అత్యుత్తమ వివాద పరిష్కార మార్గం


• జస్టిస్ సూర్యకాంత్



దిల్లీ: దేశ న్యాయవ్యవస్థ అధినేతగా తన ముందు రెండు ప్రాధాన్యాలు ఉన్నాయని ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. దేశంలో పేరుకుపోయిన సుమారు 4.6 కోట్ల కేసుల పరిష్కారం ఇందులో మొదటిది కాగా, ప్రత్యామ్నాయ వివాద పరిష్కారం కోసం మధ్యవర్తిత్వానికి ఊతమివ్వడం రెండోదని ఆయన అన్నారు. ఆన్‌లైన్‌లో జడ్జీలను, వారి తీర్పులను అవహేళన చేయడం(ట్రోలింగ్) తనను ఏనాడూ కలవరపాటుకు గురిచేయలేదని ఆయన అన్నారు. న్యాయమైన, నిష్పాక్షికమైన విమర్శను తాను ఎల్లవేళలా స్వాగతిస్తానని తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానానికి 53వ ప్రధాన న్యాయమూర్తిగా అక్టోబరులో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించిన జస్టిస్ సూర్యకాంత్ సోమవారం పదవీ స్వీకార ప్రమాణం చేస్తారు. ఈ సందర్భంగా ఆయన తన అధికార నివాసంలో విలేకరులతో ముచ్చటించారు. "పెండింగ్ కేసులు నా ముందున్న అతి పెద్ద సవాలు. ఒక్క సుప్రీంకోర్టులోనే 90 వేల కేసులు పెండింగులో ఉన్నాయని తాజా నివేదికలు చెబుతున్నాయి. అయితే ఇలా ఎందుకు జరిగింది, దీనికి ఎవరు బాధ్యులు అన్న వివరాల్లోకి నేను వెళ్లదలచుకోలేదు" అని ఆయన అన్నారు. పెండింగ్ కేసులపై హైకోర్టుల నుంచి నివేదికలు కోరుతానని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. వివాద పరిష్కారం కోసం మధ్య వర్తిత్వమే సమర్థమైన మార్గమని జస్టిస్ కాంత్ అన్నారు. ఇటీవలి కాలంలో ప్రైవేటు బహుళజాతి సంస్థలు, బ్యాంకులు, బీమా కంపెనీలు తమ సిబ్బందికి మధ్యవర్తిత్వంలో శిక్షణ ఇవ్వాల్సిందిగా అత్యున్నత న్యాయస్థానాన్ని కోరుతున్నాయని ఆయన తెలిపారు.

హిందువులు లేకపోతే

ప్రపంచం ఉనికిలో ఉండదు: మోహన్ భాగవత్



దిల్లీ: ప్రపంచ మనుగడకు హిందూ సమాజం అత్యంత ముఖ్యమైనదని, హిందువులు లేకపోతే ప్రపంచానికి ఉనికి ఉండదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. మణిపుర్ జాతి ఘర్షణల తర్వాత తొలిసారిగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న భాగవత్- హిందూత్వ, ప్రపంచ నాగరికతల గురించి మాట్లాడారు. హిందూ సమాజం అజరామరమైందన్నారు. అది గ్రీకు, ఈజిప్టు, రోమన్ నాగరికతలను తట్టుకుని నిలబడిందని గుర్తుచేశారు. దేశ నిర్మాణానికి శక్తి అవసరమని, శక్తి అంటే ఆర్థిక సామర్థ్యమని నొక్కిచెప్పారు. దేశ ఆర్థికవ్యవస్థ స్వావలంబన సాధించాలని, ఇది అంత కష్టమైన పనేమీ కాదని అభిప్రాయపడ్డారు. ఎవరిపైనా ఆధారపడాల్సిన పరిస్థితి మనకు ఉండకూడదని చెప్పారు. భారత్‌పై అమెరికా సుంకాల విధింపు నేపథ్యంలో ప్రధాని మోదీ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూ భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారు. నక్సలిజాన్ని సహించేస్థితిలో దేశం లేదని, అందుకే అది తుడిచిపెట్టుకుపోతోందని వ్యాఖ్యానించారు.

నూతన కార్మిక కోడ్‌ల సమర్థతపై కాంగ్రెస్ సందేహం

దిల్లీ: కేంద్రం కొత్తగా అమల్లోకి తెచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లపై కాంగ్రెస్ పార్టీ సందేహాలు వ్యక్తం చేసింది. 29 కార్మిక చట్టాలను కలిపి నాలుగు కోడ్‌లుగా మార్చి విప్లవాత్మక సంస్కరణలు తెచ్చామని కేంద్రం చెప్పుకొంటోందని విమర్శించింది. క్షేత్రస్థాయిలో 'శ్రామిక న్యాయం' జరగాలంటే.. జాతీయ ఉపాధి హామీ పథకంతో పాటు, జాతీయ కనీస వేతనం రోజుకు రూ.400లకు పెంచడం, రూ.25 లక్షల సార్వత్రిక ఆరోగ్య బీమా కవరేజీ, పట్టణాల్లో ఉద్యోగ హామీ చట్టం, అసంఘటిత కార్మికులకు పూర్తిస్థాయి భద్రత, పట్టణాల్లో కాంట్రాక్టు వ్యవస్థ తగ్గించడం మొదలైనవి అమలు చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ప్రస్తుతం కర్ణాటక, గతంలో రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు గిగ్ వర్కర్ల కోసం మంచి చట్టాలను తెచ్చాయని.. కేంద్రం వాటిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. మరోవైపు ఈ చట్టాలను సీపీఐ(ఎం) వ్యతిరేకించింది. కాగా, ఈ కోడ్‌లను అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌వో), అంతర్జాతీయ సామాజిక భద్రతా సమాఖ్య(ఐఎస్ఎస్ఏ)లు స్వాగతించాయి.

ప్రజాస్వామ్యం అంటే ఇలా పనిచేయాలి

ట్రంప్, మమ్దానీ భేటీపై శశి థరూర్

దిల్లీ: ట్రంప్, మమ్దానీల భేటీపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. 'ప్రజాస్వామ్యం అంటే ఇలా పనిచేయాలి. ఎన్నికల్లో మీ సిద్ధాంతం, భావజాలం కోసం ఎంతవరకైనా పోరాడాలి. కానీ ప్రజలు తీర్పు చెప్పిన తర్వాత దేశ ప్రయోజనాల కోసం ఒకరికొకరు సహకరించుకోవాలి. ఇలాంటి స్ఫూర్తిని భారతదేశంలో కూడా చూడాలని కోరుకుంటున్నాను' అంటూ ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు.

సీఈసీపై నకిలీ వీడియో.. కేసు నమోదు

తిరువనంతపురం: కేరళలో స్థానిక ఎన్నికలకు సంబంధించి ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)పై నకిలీ వీడియోను వైరల్ చేస్తున్న ఘటనపై తిరువనంతపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాబోయే స్థానిక ఎన్నికలపై ఆ వీడియోలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నట్లు గుర్తించామని పోలీసులు శనివారం తెలిపారు. నకిలీ ఫొటో, మార్పులు చేసిన వీడియోతో కూడిన ఆ సమాచారం ముందుగా ఎక్స్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇతర సామాజిక మాధ్యమాల్లోనూ ఈ పోస్టే వైరల్ అవుతున్నట్లు అనుమానిస్తున్నారు.

బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సొనారో అరెస్టు



సావోపాలో: బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారోను ఫెడరల్ పోలీసులు శనివారం ముందస్తుగా అరెస్టు చేశారు. తిరుగుబాటుకు కుట్ర పన్నారన్న అభియోగంపై 27 సంవత్సరాల జైలు శిక్షకు గురైన బోల్సొనారో మరికొన్ని రోజుల్లో కారాగారానికి తరలాల్సి ఉండగా.. ఆయనను ముందుగానే అదుపులోకి తీసుకున్నారు. ఆయనను రాజధాని బ్రసీలియాలోని పోలీసు కేంద్ర కార్యాలయానికి తరలించినట్లు బోల్సొనారో ప్రతినిధి ఒకరు వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారమే ఈ చర్య తీసుకున్నామని ఓ ప్రకటనలో పోలీసులు పేర్కొన్నారు. బోల్సొనారో శిక్ష నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉన్న దరిమిలా ఆయనను వెంటనే అరెస్టు చేయాలని సుప్రీంకోర్టు శనివారం ఆదేశించింది. 2019 నుంచి 2022 వరకు బ్రెజిల్ అధ్యక్షుడిగా ఉన్న బోల్సొనారో.. 2022 ఎన్నికల్లో ఓడిపోయారు. అయినప్పటికీ ఫలితాలను అంగీకరించేందుకు నిరాకరించారు. ఆ సమయంలో వేల సంఖ్యలో ఆయన మద్దతుదారులు హింసకు పాల్పడ్డారు. పదవిలో కొనసాగేలా తిరుగుబాటు కుట్రకు బోల్సొనారో ప్రణాళికలు రచించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయన సాయుధ నేరస్థుల ముఠాకు నేతృత్వం వహించారని, ప్రజాస్వామ్య బద్ధమైన పాలనను హింసాత్మక పద్ధతిలో అంతమొందించడానికి ప్రయత్నించారని కూడా ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. మాజీ అధ్యక్షుడికి 27 సంవత్సరాల మూడు నెలల కారాగార శిక్ష విధిస్తూ సెప్టెంబరులో తీర్పు ఇచ్చింది.

రైల్లో నూడుల్స్ వండిన మహిళ

• ఆమె అరెస్టుకు పోలీసుల యత్నం



ముంబయి: రైలు ప్రయాణికుల భద్రతను ఫణంగా పెట్టే పరిణామం మహారాష్ట్రలో వెలుగు చూసింది. ఓ మహిళా ప్రయాణికురాలు రైల్లో నూడుల్స్ వండుతున్న వీడియో కలకలం సృష్టిస్తోంది. ఆమె విద్యుత్ కెటిల్‌ను వినియోగించి ఎక్స్‌ప్రెస్ రైల్లోని ఏసీ కోచ్‌లో నూడుల్స్ వండుతూ కనిపించింది. అంతకు ముందే 10-15 మందికి అదే పద్ధతిలో టీ తయారు చేసినట్లు ఆమె మరాఠీలో చెప్పింది. ప్రయాణికుల భద్రతపై ఆందోళనలు పెంచిన ఆ వీడియో రైల్వే అధికారుల దృష్టికి చేరడంతో.. ఆమెను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు చర్యలు మొదలు పెట్టారు. "రైల్లో విద్యుత్ కెటిల్‌ను వినియోగించడం నిషేధం. ఇది ప్రమాదకరం, అక్రమం. ఒక్కోసారి అది విద్యుదాఘాతానికి దారితీసి ఇతర ప్రయాణికులకు హాని కలిగిస్తుంది. ఇలాంటి చర్యలు రైల్లోని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించి ఏసీ, ఇతర విద్యుత్ పోర్టుల పనితీరుపై ప్రభావం చూపుతాయి. ఇలా చేయడం శిక్షార్హమైన నేరం." అని రైల్వేశాఖ 'ఎక్స్' పోస్టులో పేర్కొంది. రైల్వే చట్టంలోని సెక్షన్ 147(1) ప్రకారం ఆమెపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. వీడియోలో కనిపించిన మహిళతో పాటు దాన్ని అప్‌లోడ్ చేసిన వారిపై కూడా చర్యలు తప్పవని వారు పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదకరమైన పనులు రైల్లో కనిపిస్తే వాటిని అరికట్టేందుకు ప్రయాణికులు వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

నమోభారత్ రైళ్లలో పుట్టినరోజు వేడుకలు, ప్రీ వెడ్డింగ్ షూట్‌లు



దిల్లీ: నమోభారత్ రైళ్లు ఇకపై ప్రైవేటు వేడుకలకు వేదికలుగా మారనున్నాయి. పుట్టినరోజులు, పెళ్లికి ముందు చేసే ఫొటోషూట్‌లు, ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు ఈ రైలు బోగీలను అద్దెకు ఇస్తామని నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌సీఆర్‌టీసీ) శనివారం ప్రకటించింది. వ్యక్తులు, ఈవెంట్ల నిర్వాహకులు, ఫొటోగ్రఫీ సంస్థలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. స్టేషన్లలో నిలిపి ఉంచిన లేదా కదులుతున్న నమోభారత్ రైలు బోగీలను అద్దెకు ఇస్తారు. దుహాయిా డిపో వద్ద ఒక నమూనా బోగీని అలంకరించి ఎప్పుడూ అందుబాటులో ఉంచుతారు. వీటి బుకింగులు గంటకు రూ.5,000 నుంచి మొదలవుతాయి. వేడుకకు అవసరమైన అలంకరణకు 30 నిమిషాల సమయం అదనంగా ఇస్తారు. ఉదయం ఆరింటి నుంచి రాత్రి 11 గంటల మధ్య మాత్రమే అనుమతి ఉంటుంది. సాధారణ రైలు కార్యకలాపాలకు, ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూసుకోవాలి. ఈ వేడుకలు ఎన్‌సీఆర్‌టీసీ ఉద్యోగులు, భద్రతా సిబ్బంది పర్యవేక్షణలోనే జరుగుతాయి. సినిమాలు, డాక్యుమెంటరీలు, ప్రకటనల చిత్రీకరణ తదితర విజువల్ ప్రాజెక్టులకు నమోభారత్ రైళ్లు, స్టేషన్లను అద్దెకు ఇచ్చేందుకు సైతం ఎన్‌సీఆర్‌టీసీ ప్రత్యేక విధానాన్ని రూపొందించింది.



డెయిర్ అల్ బలాలో ధ్వంసమైన భవనం

ఇజ్రాయెల్ దాడుల్లో 14 మంది మృతి

డెయిర్ అల్ బలా: గాజాలో హమాస్ మిలిటెంట్లపై వైమానిక దాడులు ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ శనివారం ప్రకటించింది. ఈ దాడుల్లో 14 మంది మరణించారని, 45 మంది గాయపడ్డారని, క్షతగాత్రుల్లో పిల్లలు కూడా ఉన్నారని గాజాలోని వైద్య అధికారులు తెలిపారు. గాజాలోని రిమల్ ప్రాంతంలో ఒక వాహనంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 7 మంది పాలస్తీనియన్లు మృతి చెందగా 18 మంది గాయపడ్డారు. అల్ అవ్దా ఆసుపత్రికి సమీపంలోని ఒక ఇంటిపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ముగ్గురు మరణించగా 11 మంది గాయాల పాలయ్యారు. డెయిర్ అల్ బలాలో మరో ఇంటిపై జరిగిన దాడిలో ముగ్గురు మృతి చెందారు.

న్యాక్‌కు అల్-ఫలా క్షమాపణలు


ఇంటర్నెట్‌డెస్క్: దిల్లీ పేలుడు కేసులో ప్రముఖంగా వెలుగులోకి వచ్చిన అల్-ఫలా విశ్వవిద్యాలయం తమ గుర్తింపు విషయంలో 'జాతీయ మదింపు, గుర్తింపు మండలి' (న్యాక్)కి క్షమాపణలు తెలియజేసింది. షోకాజ్ నోటీసులకు ఈ మేరకు ప్రతిస్పందనను సమర్పించినట్లు అల్-ఫలా అధికారులు వెల్లడించారు. వెబ్‌సైట్ పర్యవేక్షణ, డిజైన్‌లలో అనుకోకుండా జరిగిన మార్పుల వల్ల న్యాక్ గుర్తింపు గురించి తప్పుడు సమాచారం అలాగే ఉండిపోయిందని.. ఆ పేజీలను తొలగించామని వెల్లడించింది.

లోయలో పడి సైనికాధికారి మృతి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ప్రమాదవశాత్తు లోయలో జారిపడి సైనిక జూనియర్ కమిషన్డ్ అధికారి(జేసీఓ) ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం సాయంత్రం బెహ్రాంగల్లాలోని సేరి మస్తాన్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సెర్చ్ పార్టీకి నాయకత్వం వహిస్తున్న అధికారి ఎత్తైన ప్రాంతం నుంచి నియంత్రణ కోల్పోయి లోయలో పడిపోయారు. సంఘటన స్థలంలోనే ఆయన మృతిచెందినట్లు సహాయక చర్యలు చేపట్టిన సైనిక బృందం గుర్తించింది.

జీసీసీలే రీట్స్‌కు ఇంధనం!

- హైదరాబాద్, బెంగళూరుల్లో జోరుగా విస్తరణ
- ఆఫీసు స్థలం పెంచుకోవడంపై దృష్టి
- ఆదాయాల్లో ఆకర్షణీయ వృద్ధి



ఆఫీసు స్థలం, షాపింగ్ మాల్స్, ఇతర రకాల వాణిజ్య భవనాలను నిర్వహిస్తూ అద్దె రూపంలో ఆదాయాలు ఆర్జించే రీట్స్ (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్) తమ కార్యకలాపాలు, ఆదాయాలను వేగంగా పెంచుకుంటున్నాయి. మన దేశంలోని ప్రధాన నగరాల్లో ఆఫీసు స్థలానికి గిరాకీ పెరగడమే కానీ, తగ్గుతున్న దాఖలాలు లేవు. దీంతో అదనంగా కొత్త భవనాలను తమ అజమాయిషీలోకి తెచ్చుకుని, ఆదాయాలు పెంచుకునే అవకాశం ఇక్కడి రీట్స్‌కు లభిస్తోంది. ఈ సానుకూలతను సొమ్ము చేసుకోవడానికి నెమ్మదిగా ఒక్కో మెట్టూ ఎక్కడానికి బదులు.. అందుబాటులో ఉన్న భవనాలు, ఆఫీసు స్థలం ఉన్న సంస్థలను కొనుగోలు చేయడానికి రీట్స్ ప్రాధాన్యం ఇస్తున్నాయి. తద్వారా తమ అజమాయిషీలో ఉన్న ఆఫీసు భవనాల సంఖ్యను వేగంగా పెంచుకుంటున్నాయి. దీనికి ప్రధాన ఇం'ధనం' జీసీసీ (గ్లోబల్ కేపబులిటీ సెంటర్)ల నుంచి లభిస్తున్నట్లు తెలుస్తోంది.

స్టాక్‌మార్కెట్‌లో 4 సంస్థలు

రీట్స్‌ను నిర్వహిస్తున్న సంస్థలు ఎన్నో ఉన్నా, స్టాక్‌మార్కెట్లో నమోదైనవి 4 సంస్థలే. ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, నాలెడ్జ్ రియాల్టీ ట్రస్ట్ ఇందులో ఉన్నాయి. ఈ సంస్థల ఆదాయాల్లో ఇటీవల ఆకర్షణీయ వృద్ధి కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో జీసీసీల నుంచి ఆఫీసు స్థలానికి అధిక గిరాకీ లభించడంతో, రీట్స్ ఆదాయాలు పెరగడానికి అవకాశం కలిగిందని సంబంధిత వర్గాలు వివరిస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఎంతో అధికంగా జీసీసీలు కొత్తగా ఏర్పాటవుతున్నాయి. దీంతో ఈ రెండు నగరాల్లో రీట్స్ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.

- మైండ్‌స్పేస్ రీట్ ఏడాది కాలంలోనే అదనంగా దాదాపు 40 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాన్ని సమకూర్చుకుంది. సొంతంగా సమకూర్చుకున్న భవనాలతో పాటు ఇతర సంస్థలను కొనుగోలు చేయడం వల్ల ఇది సాధ్యమైంది.
- బెంగళూరులో 77 లక్షల చ.అ. విస్తీర్ణం ఉన్న గ్రేడ్-ఏ ఆఫీసు పార్క్ స్థలం కలిగిన సంస్థను బ్రూక్‌ఫీల్డ్ రీట్ కొనుగోలు చేయబోతోంది. దీంతో బ్రూక్‌ఫీల్డ్ రీట్ అజమాయిషీలో ఉన్న నిర్మాణ స్థలం ఏకంగా 31% పెరుగుతుంది.
- ఎంబసీ రీట్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో 35 లక్షల చ.అ. నిర్మాణ స్థలాన్ని అద్దెకు ఇచ్చింది. రీట్స్‌లో ఇదొక రికార్డు. ఈ సంస్థ అజమాయిషీలో దాదాపు 5 కోట్ల చ.అ. నిర్మాణ స్థలం ఉంది. చెన్నైలో కొత్త ప్రాజెక్టులను ఈ సంస్థ చేపట్టింది.
- సెబీ నిబంధనల ప్రకారం రీట్స్ నిర్వహిస్తున్న ఆస్తుల్లో కనీసం 80% ఆదాయాన్ని ఆర్జిస్తున్న ఆస్తులై ఉండాలి. అందుకే నిర్మాణం పూర్తై, సిద్ధంగా ఉన్న భవనాలను రీట్స్ సొంతం చేసుకుంటున్నాయి.

ఈ ఏడాది 8 కోట్ల చ.అ. స్థలం

అందుబాటులో ఉన్న ఆఫీసు స్థలాన్ని సొంతం చేసుకోవటానికి రీట్స్ ఆసక్తి చూపటానికి ప్రధాన కారణం జీసీసీల నుంచి లభిస్తున్న గిరాకీ. ఈ ఏడాది జనవరి - సెప్టెంబరు మధ్య 6 కోట్ల చ.అ. స్థలాన్ని రీట్స్ అద్దెకు ఇవ్వగా, అందులో 35% వాటా జీసీసీలదే. వివిధ సంస్థలు ఈ ఏడాది మొత్తం మీద 8 కోట్ల చ.అ. ఆఫీసు స్థలాన్ని అద్దెకు తీసుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కొత్త జీసీసీలను ఆకర్షించడంలో హైదరాబాద్ ఇటీవల బెంగళూరును మించుతోంది. ఫార్మా, బయోటెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్ -ఆర్థిక సేవలు- బీమా)విభాగాలకు చెందిన బహుళజాతి సంస్థల జీసీసీలు హైదరాబాద్‌లో అధికంగా ఏర్పాటవుతున్నాయి. ఈ ఏడాదిలో కొత్తగా 40కి పైగా జీసీసీలు హైదరాబాద్‌లో ప్రారంభం అయ్యాయి. దీనివల్ల ఆఫీసు భవనాలకు గిరాకీ పెరుగుతోంది.

అద్దెలు ఆకర్షణీయం

ఆఫీసు స్థలం అద్దెలు హైదరాబాద్, బెంగళూరు, ముంబయి నగరాల్లో ఆకర్షణీయంగా ఉన్నట్లు సమాచారం. మార్కెట్ ధరల కంటే అధిక రేటుకు ఆఫీసు స్థలాన్ని అద్దెకు తీసుకోవడానికి జీసీసీలు ముందుకు రావటం దీనికి కారణంగా చెబుతున్నారు. అందుకే రీట్స్ ఉదారంగా తమ వాటాదార్లకు ఆదాయాన్ని పంచుతున్నాయి. సత్వ గ్రూపు, బ్లాక్‌స్టోన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నాలెడ్జ్ రియాల్టీ ట్రస్ట్ ఈ మధ్యకాలంలోనే స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో నమోదైంది. ఈ సంస్థ ఒక్కో యూనిట్‌కు రూ.1.55 చొప్పున రూ.690 కోట్లు వాటాదార్లకు పంచింది. ఇతర రీట్స్ కూడా ఉదారంగా ఆదాయాన్ని పంపిణీ చేస్తున్నాయి. వ్యాపార విస్తరణ అవకాశాలు అధికంగా కనిపిస్తూ ఉండటం, ఆదాయాల్లో వృద్ధి దీనికి కారణాలు.

- ఈనాడు, హైదరాబాద్

ఈనాడు బిజినెస్ వారాంతం

నెల్లూరు జిల్లాలో బిర్లాను కొత్త ఫైబర్ సిమెంట్ ప్లాంట్

మొదటి దశలో 600 కొత్త ఉద్యోగాలు

ఈనాడు, హైదరాబాద్: సీకే బిర్లా గ్రూపు సంస్థ బిర్లాను, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో నూతన ఫైబర్ సిమెంట్ ప్లాంట్ నెలకొల్పనుంది. పైకప్పులు, గోడలు, పైపులు, నిర్మాణ రంగ రసాయనాలు, పుట్టీలు, ఫ్లోరింగ్ విభాగాల్లో అగ్రగామి బ్రాండుగా బిర్లాను ఉన్న విషయం విదితమే. తమ దీర్ఘకాలిక విస్తరణ వ్యూహాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు బిర్లాను ఎండీ, సీఈఓ అక్షత్ సేథ్ వెల్లడించారు. పారిశ్రామిక వసతులు, మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నందున తమ కొత్త ప్లాంటు ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ ఉత్పత్తులకు గిరాకీ ఎంతో పెరుగుతోందని వివరించారు.

తొలిదశలో రూ.127 కోట్లు: బిర్లాను నెల్లూరు ఫైబర్ సిమెంట్ ప్లాంట్‌పై తొలి దశలో రూ.127 కోట్ల పెట్టుబడి పెడుతోంది. దీనివల్ల 600 కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ప్లాంట్ నుంచి ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణాది రాష్ట్రాలకు భవన నిర్మాణ ఉత్పత్తులను సరఫరా చేసేందుకు వీలవుతుందని అక్షత్ సేథ్ వెల్లడించారు. ఈ ఫైబర్ సిమెంట్ ప్లాంట్, ఫ్లైయాష్‌ను ఉపయోగించి ఫైబర్ సిమెంట్ ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్లాంట్‌తో పాటు మరి కొన్ని చిన్న, మధ్యతరహా అనుబంధ యూనిట్లు ఏర్పాటవుతాయి. రెండో దశలో పీవీసీ పైపులు, ఫిట్టింగ్‌లు, నిర్మాణ రసాయనాలు ఉత్పత్తి చేసే యూనిట్లు ఏర్పాటు చేస్తారు.

హైదరాబాద్‌లో సోల్-మిలీనియమ్ జీసీసీ

ఈనాడు, హైదరాబాద్: బహుళజాతి ఆరోగ్య సేవల సంస్థ సోల్-మిలీనియమ్ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ సమీపంలో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ (జీసీసీ)ని ఏర్పాటు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా తన కార్యకలాపాలను బలోపేతం చేయడానికి ఈ కేంద్రం ఉపకరిస్తుందని సోల్-మిలీనియమ్ విశ్వసిస్తోంది. హైదరాబాద్‌లో జీసీసీని సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఫైటోర్ మ్లొడెక్, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ మైఖేల్ బెకిన్స్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అర్విండ్ రాయ్ లాంఛనంగా ప్రారంభించారు. భారతదేశంలో దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు సోల్-మిలీనియమ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సంస్థ ప్రధానంగా వైద్య పరికరాల ఉత్పత్తిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. సోల్-కేర్, సోల్-గార్డ్ బ్రాండ్ల పేరుతో ఈ సంస్థ ఉత్పత్తులను అందిస్తోంది.

ఐడీబీఐ బ్యాంక్ రేసులో కోటక్ మహీంద్రా బ్యాంక్!

ఐడీబీఐ బ్యాంకును వచ్చే మార్చి కల్లా ప్రైవేటీకరించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా.. ఈ రేసులో కోటక్ మహీంద్రా బ్యాంక్ కూడా ఉందని వార్తలొస్తున్నాయి. ఆసక్తిగా ఉన్న సంస్థల్లో ఫెయిర్‌ఫాక్స్, ఓక్‌ట్రీ క్యాపిటల్‌తో పాటు కోటక్ మహీంద్రా బ్యాంక్ కూడా ఉందని ఎన్‌డీటీవీ ప్రాఫిట్ పేర్కొంది. రూ.లక్ష కోట్ల మార్కెట్ విలువ కలిగిన ఐడీబీఐ బ్యాంకులో 60% వాటా కొనాలంటే, ఏ సంస్థకైనా కష్టమే. అందుకే కొంత వాటాను ఈక్విటీ రూపంలో, మరికొంత వాటాను నగదు రూపేణ కొనుగోలు చేయాలన్నది కోటక్ బ్యాంక్ ఆలోచనగా చెబుతున్నారు.

కోడి గుడ్లు

23న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	645
వరంగల్	647
విజయవాడ	660
తూ/ప గోదావరి	645
విశాఖపట్నం	635
చిత్తూరు	673

కొత్త 'లేబర్ కోడ్'ల ప్రభావం ఎంత?

- కార్మికులకు అదనపు భద్రత, సంక్షేమం
- కొన్ని రంగాల సంస్థలకు ఖర్చులు పెరిగే అవకాశం



దేశంలో ఇప్పటివరకు అమల్లో ఉన్న కార్మిక చట్టాలను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం.. తాజాగా 4 కొత్త లేబర్ కోడ్‌లను ప్రకటించింది. వేతనాల కోడ్- 2019, సామాజిక భద్రతా కోడ్- 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్- 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్- 2020 ఇందులో ఉన్నాయి. ఈ నెల 21 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. దీంతో ఇప్పటివరకు అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను హేతుబద్ధం చేసినట్లు అవుతోంది. కొత్త కోడ్‌ల వల్ల కార్మికులకు భద్రత, అదనపు ప్రయోజనాలు లభిస్తాయి. పని పరిస్థితులు మెరుగుపడతాయి. మెరుగైన కార్మిక-ఉద్యోగ విధానాలు అమల్లోకి వస్తాయి.

ఇదీ నేపథ్యం: మనదేశంలో 1930- 50 మధ్య రూపొందించిన కార్మిక చట్టాలే అధికంగా అమల్లో ఉన్నాయి. ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చి, డిజిటల్/ గిగ్ ఆర్థిక వ్యవస్థలు విస్తరిస్తున్న ప్రస్తుత కాలానికి ఆ చట్టాలు సరిపోవనే ఆందోళన ఎంతో కాలంగా ఉంది. దశాబ్దాల నాటి పరిస్థితులకు అనుగుణంగా ఉన్న ఆ చట్టాలను పాటించటం ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపార సంస్థలు, ఫ్యాక్టరీలకు ఎంతో కష్టంగా మారింది. అదే సమయంలో కార్మికులకు సరైన భద్రత, సంక్షేమం అందని పరిస్థితి ఏర్పడింది. దీనికి కొత్తగా రూపొందించిన లేబర్ కోడ్‌లు కొంత వరకూ పరిష్కారం చూపుతాయని కేంద్ర ప్రభుత్వం ఆశిస్తోంది.

కార్మిక ఆధారిత రంగాల్లో ప్రభావం ఇలా: కొన్ని రంగాల కంపెనీలకు కార్మిక వ్యయాలు పెరిగే అవకాశం ఉందని స్టాక్‌మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. కార్మిక శక్తిని అధికంగా వినియోగించే రసాయనాలు, రంగులు, చమురు, వాహన - వాహన విడిభాగాలు, ఔషధ రంగాల్లోని కంపెనీలకు వ్యయాలు పెరిగే అవకాశం ఉందని అంచనా. అదే సమయంలో కార్మికుల ఉత్పాదకత పెరుగుతుందని, అధికోత్పత్తి సాధ్యమవుతుందనే అభిప్రాయమూ వ్యక్తం అవుతోంది. పని పరిస్థితులు మెరుగుపడిన ఫలితంగా కార్మికులు తక్కువ సమయంలో ఎక్కువ ఉత్పత్తి నమోదు చేయగలుగుతారని భావిస్తున్నారు.

షేర్లపై ప్రభావం చూడాలి: కొత్త లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక శక్తిని అధికంగా వినియోగించే కంపెనీల షేర్ల ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం లేకపోలేదని కొందరు స్టాక్ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 'సోమవారం ఈ షేర్లు ఎలా స్పందిస్తాయనేది చూడాల'ని పేర్కొంటున్నారు. ఏషియన్ పెయింట్స్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, ఎల్‌అండ్‌టీ, సిప్లా, డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్.. తదితర షేర్లపై ఆ వర్గాలు దృష్టి పెడుతున్నాయి.

ఎంతో మేలు: సీఐఐ-తెలంగాణ ఛైర్మన్

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఆవిష్కరించిన నాలుగు 'లేబర్ కోడ్'లు అధికోత్పత్తికి, పోటీతత్వానికి, ఉద్యోగాల కల్పనకు వీలుకల్పిస్తాయని సీఐఐ-తెలంగాణ ఛైర్మన్ ఆర్.శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. దీన్నొక చరిత్రాత్మక మలుపుగా ఆయన అభివర్ణించారు. 29 వేర్వేరు చట్టాలను క్రోడీకరించి, సంక్షిప్తం చేసి ప్రభుత్వం తీసుకువచ్చిన 4 కోడ్‌ల వల్ల కార్మికులకు జీతభత్యాలు పెరుగుతాయని, సాంఘిక భద్రత లభిస్తుందని, పని ప్రదేశాల్లో భద్రత పటిష్ఠం అవుతుందని ఆయన తెలిపారు. మనదేశంలో కార్మిక, పారిశ్రామిక పరిస్థితులు ఎంతో మెరుగుపడతాయన్నారు.

సెన్సెక్స్‌లోకి ఇండిగో

డిసెంబరు 22 నుంచి

ఇండిగో బ్రాండ్‌పై విమానయాన సేవలు అందించే ఇంటర్‌గ్లోబల్ ఏవియేషన్ షేరు, బీఎస్ఈ సెన్సెక్స్‌లోకి డిసెంబరు 22 నుంచి జతకానుందని బీఎస్ఈ ఇండెక్స్ సర్వీసెస్ తెలిపింది. ఇదే సమయంలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ షేరు, సెన్సెక్స్ నుంచి వైదొలగనుంది. బీఎస్ఈ 100 సూచీలోకి అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ స్థానంలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ షేరు రానుంది. బీఎస్ఈ 50లోకి ఇండస్ఇండ్ బ్యాంక్ షేరు స్థానంలో మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ షేరు వస్తుంది. బీఎస్ఈ నెక్ట్స్ 50 సూచీలో మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లను ఇండస్ఇండ్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ భర్తీ చేయనున్నట్లు తెలిపింది.


అశోక్ లేలాండ్ నుంచి త్వరలో కొత్త శ్రేణి హెవీ డ్యూటీ ట్రక్కులు

ఆంధ్ర, లఖ్‌నవూ ప్లాంట్లతో బస్సుల ఉత్పత్తి 20,000కు



హిందుజా గ్రూపు సంస్థ అశోక్ లేలాండ్ తన డీజిల్ ట్రక్కుల శ్రేణిని విస్తరించేందుకు సిద్ధమవుతోంది. 320, 360 హార్స్‌పవర్ (అశ్వశక్తి)తో హెవీ డ్యూటీ ట్రక్కులను త్వరలో విడుదల చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈఓ షేణు అగర్వాల్ తెలిపారు. 6 సిలిండర్ ఇంజిన్ల వల్ల ఈ ట్రక్కులు అత్యంత సామర్థ్యంతో పని చేస్తూ, యజమానులు మరింత ఆదాయం ఆర్జించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. డీజిలేతర విభాగంలోనూ మోడళ్ల సంఖ్యను పెంచుతున్నట్లు వివరించారు. ఇప్పటికే 2 తేలికపాటి విద్యుత్ ట్రక్కులు, 3 ఎంహెచ్‌సీవీ (మధ్య, భారీస్థాయి వాణిజ్య వాహన) విద్యుత్ ట్రక్కులను; విద్యుత్తు బస్సుల్లో పలు వేరియంట్లు, మోడళ్లను కంపెనీ విడుదల చేసిందని తెలిపారు. సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, హైడ్రోజన్ లాంటి పర్యావరణహిత వాహన విభాగంలోనూ అడుగు పెట్టామని ఆయన చెప్పారు. 'ఆంధ్రప్రదేశ్, లఖ్‌నవూ ప్లాంట్ల కార్యకలాపాలు పూర్తి స్థాయిలో జరిగితే, బస్సుల తయారీ వార్షిక సామర్థ్యం ప్రస్తుత 12,000 యూనిట్ల నుంచి 20,000 యూనిట్లకు పెరుగుతుంద'ని అగర్వాల్ తెలిపారు. పరిశోధన-అభివృద్ధి వనరులను మెరుగుపర్చుకోవడం పైనా కసరత్తు చేస్తున్నట్లు అశోక్ లేలాండ్ తెలిపింది.

రష్యా కాకసస్ పర్వతాల నుంచి భారత్‌కు మినరల్ వాటర్



మాస్కో: దక్షిణ రష్యాలోని కాకసస్ పర్వతాల నుంచి సహజసిద్ధ మినరల్ వాటర్, ఈ ఏడాది చివరి కల్లా భారత వినియోగదార్లకు అందుబాటులోకి రానుంది. రష్యాకు చెందిన ఆక్వా హోల్డింగ్ కంపెనీ ఈ నీటిని మన దేశానికి ఎగుమతి చేస్తోంది. మొదటి విడత కింద వేల సంఖ్యలో నీళ్ల బాటిళ్లను నల్ల సముద్రంలోని నోవోరోసిస్క్ ఓడరేవు నుంచి రవాణా ఓడ ద్వారా భారత్‌కు పంపించింది. ఈ ఏడాది చివరి కల్లా ఈ మినరల్ వాటర్ భారత విపణిలో లభ్యం అవుతుందని కంపెనీ తెలిపింది. భారత విపణిలో ఈ మినరల్ వాటర్ విక్రయం కోసం గోర్జి విటా బ్రాండును కంపెనీ రూపొందించింది. కాకసస్ మినరల్ వాటర్‌ను వివిధ బ్రాండ్ల ద్వారా అమెరికా, చైనా, కెనడా, ఇజ్రాయెల్, దక్షిణ కొరియా సహా 20కి పైగా దేశాలకు ఆక్వా హోల్డింగ్ కంపెనీ ఎగుమతి చేస్తోంది.

2030కి వాహన విభాగం నుంచి 8 రెట్ల ఆదాయం లక్ష్యం: మహీంద్రా గ్రూప్

తమ వాహన విభాగ ఏకీకృత ఆదాయం 2029-30 కల్లా ప్రస్తుతం కంటే 8 రెట్లు పెరిగేలా అడుగులు వేస్తున్నట్లు మహీంద్రా గ్రూప్ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం తన స్పోర్ట్స్ వినియోగ వాహనాలు (ఎస్‌యూవీ), తేలికపాటి వాణిజ్య వాహనాలు అధికంగా అమ్ముడుపోవడం.. తమ లక్ష్యానికి కలిసి రానున్నట్లు వెల్లడించింది. వాహన విభాగ ఏకీకృత ఆదాయం 2019-20 నుంచి 3.2 రెట్లు పెరిగి 2024-25కు రూ.90,825 కోట్లకు చేరిందని వివరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధిచెందుతున్న ఎస్‌యూవీ బ్రాండ్‌గా నిలవాలన్నది తమ లక్ష్యమని సంస్థ పేర్కొంది. ఎస్‌యూవీ విభాగంలో 70% దేశీయ వాటా సాధించడంతో పాటు యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి మార్కెట్లకు విస్తరిస్తామని తెలిపింది. అంతర్జాతీయంగా 10 దేశాలకు విద్యుత్తు వాణిజ్య వాహనాల ఎగుమతికి ఎం అండ్ ఎం ప్రయత్నం చేస్తున్నట్లు వివరించింది.

రాబోయే పదేళ్లలో వ్యవసాయంలో 4% వృద్ధి

నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్



దిల్లీ: వ్యవసాయ ఉత్పత్తులకు దేశీయంగా గిరాకీ 2.5% చొప్పున పెరుగుతోందని.. అయితే రాబోయే 10 సంవత్సరాల పాటు వ్యవసాయ రంగం 4% వృద్ధిని నమోదు చేస్తుందని నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్ తెలిపారు. పరిశ్రమ సంఘం పీహెచ్‌డీసీసీఐ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గిరాకీ కంటే దిగుబడుల వృద్ధి అధికంగా ఉంటుంది కనుక, వ్యవసాయ దిగుబడులను నిల్వ ఉంచేందుకు దేశంలో గిడ్డంగుల మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వ్యవసాయ రంగ వృద్ధి 3.7 శాతంగా నమోదైందని గుర్తు చేశారు. అయితే వ్యవసాయ దిగుబడులకు ఈ స్థాయిలో గిరాకీ లేదు. అందువల్ల ఎగుమతులు పెంచడం, దేశీయంగా వేర్వేరు రకాల ఉత్పత్తుల నిల్వకు గోదాముల నిర్మాణం మంచి ఆలోచన అవుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ దిగుబడుల్లో మన దేశం అంతర్జాతీయంగా రెండో స్థానంలో, ఎగుమతుల్లో ఎనిమిదో స్థానంలో ఉందని వెల్లడించారు. దేశీయంగా 2024-25లో రికార్డు స్థాయిలో 354 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యిందని పేర్కొన్నారు. 2030-31 కల్లా ఉత్పత్తి సామర్థ్యం దాదాపుగా 354 మిలియన్ టన్నులకు చేరే దిశగా అడుగులు వేస్తుందని తెలిపారు. పరికోతల తర్వాత ధాన్యాన్ని నిల్వచేసే సదుపాయం ఉంటే, రైతుల ఆదాయం పెంచడంతో పాటు వృథాను తగ్గించొచ్చని పేర్కొన్నారు.

- తగినంత పరిమాణంలో మాత్రమే ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనే నిబంధనలు, గిడ్డంగుల నిర్మాణం కోసం పెట్టుబడుల నిర్ణయాలను ప్రభావితం చేస్తాయని చాంద్ తెలిపారు.
- ఆహారం వృథా మనదగ్గర తక్కువేనని పేర్కొన్నారు. చాలా తక్కువ కాలం నిల్వ ఉండే పాలల్లో కూడా, దేశం నుంచి వృథా అయ్యేది కేవలం 0.5 శాతమే అని వివరించారు.

రూ.25,000 కోట్లు సమీకరించనున్న నౌకారంగ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ

దేశంలో నౌకా రంగం సంస్థలకు రుణాలిచ్చేందుకు, తొలిసారిగా ప్రభుత్వ రంగంలోని ఒక బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) భారీమొత్తంలో నిధులు సమీకరించనుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలతో పాటు బాండ్ల జారీ ద్వారా మొత్తం రూ.25,000 కోట్లు సమీకరించాలనే తన ప్రతిపాదనకు బోర్డు నుంచి ఆమోదం లభించినట్లు సాగర్‌మాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎస్ఎంఎఫ్‌సీఎల్) తెలిపింది. ఇందులో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రూ.8,000 కోట్లు సమీకరించనుంది. కొత్తగా ఏర్పడిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ, నిధుల సమీకరణకు అవసరమైన రేటింగ్‌ను పొందేందుకు ప్రధాన ఆర్థిక రేటింగ్ ఏజెన్సీలతో చర్చలు జరుపుతోంది. త్వరలోనే రేటింగ్ లభించే అవకాశం ఉందని సమాచారం. అప్పుడు ఈ సంస్థపై పెట్టుబడిదార్లకు విశ్వాసం కలగడంతో పాటు మంచి రేటింగ్ లభిస్తే, వడ్డీరేటు భారం కూడా తగ్గుతుంది. దేశంలో నౌకలను నిర్మించాలన్న ప్రభుత్వ యోచనను సాకారం చేసేందుకు ఈ కంపెనీ ఉపకరించనుంది.

- సాగర్‌మాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, నౌకా రంగ అవసరాల కోసం ఏర్పడిన తొలి ప్రభుత్వరంగ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ). నౌకాశ్రయాలకు, వాటితో సంబంధం ఉన్న ప్రాజెక్టులకు, పరిశ్రమలకు, సముద్ర తీర ప్రాంత అభివృద్ధికి, సముద్ర రవాణాకు, నదీ మార్గాలకు నిధులను అందించడం ఈ సంస్థ లక్ష్యం.

నెలవారీ వ్యయాల్లో ఆహారేతర ఖర్చులే అధికం

- టీవీల కంటే మొబైల్ వినియోగమే అధికం
- ఈఏసీ-పీఎం పత్రం



వినియోగ వస్తువులు, సేవలు, మన్నికైన వస్తువులు వంటి ఆహారేతర వ్యయాలకే కుటుంబాలు నెలవారీ ఎక్కువ కేటాయింపులు చేస్తున్నాయని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) వర్కింగ్ పేపర్ పేర్కొంది. 'ఛేంజెస్ ఇన్ డ్యూరబుల్ గూడ్స్ ఓనర్‌షిప్ ఇన్ ఇండియా: అనాలిసిస్ ఆఫ్ ది హౌస్‌హోల్డ్ కన్సప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే 2011-12, 2023-24' పేరిట ఈ పత్రాన్ని విడుదల చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మన్నికైన వస్తువులపై నెలవారీ తలసరి వ్యయాల (ఎంపీసీఈ) వాటా పెరిగిందని, చాలా రాష్ట్రాల్లో పట్టణ కుటుంబాల కంటే గ్రామీణ వాటా కొద్దిగా ఎక్కువగా ఉందని తెలిపింది. రూపాయిల్లో చూస్తే.. అన్ని రాష్ట్రాల్లో, రంగాల్లో వ్యయాలు పెరిగాయి. పట్టణ కుటుంబాల వ్యయాలు అధికంగా ఉన్నాయి.

- మొబైల్ ఫోన్ల వినియోగం విస్తృతంగా పెరిగింది. దాదాపు మొత్తం జనాభాకు నెట్‌వర్క్ అందుబాటులోకి రావడంతో, వీటి వినియోగం అధికమైంది.
- అందుబాటు ధరలు, వేగవంత నెట్‌వర్క్ అనుసంధానత వల్ల సమాచారం, వినోదం కోసం మొదటి ఎంపికగా మొబైళ్లు నిలిచాయి.
- ల్యాప్‌టాప్/వ్యక్తిగత కంప్యూటర్ల వృద్ధి మాత్రం ఇంకా కొన్ని గృహాలకే పరిమితమైంది. విద్య, వృత్తిపరమైన అవసరాలకు వీటిని వినియోగించడమే కారణంగా తెలుస్తోంది.
- పలు రాష్ట్రాల్లో టీవీ వినియోగం తగ్గుతున్న ధోరణులు నమోదయ్యాయి. మొబైళ్ల వినియోగం పెరగడంతో, టీవీల స్థానాన్ని అవి భర్తీ చేస్తున్నాయి. వినోదం, సమాచారం కోసం మొబైళ్లనే ఎక్కువగా వినియోగిస్తున్నారు.
- మన్నికైన వస్తువులపై వ్యయాలు పెరగడం అనేది ఆర్థిక పరిపుష్టత, కుటుంబాల జీవన ప్రమాణాలకు సూచికగా నిలుస్తోంది. మన్నికైన వస్తువుల వినియోగంతో కుటుంబాల భవిష్యత్ ప్రమాణాలను ప్రతిబింబిస్తోంది.
- ఆహార వస్తువులు, వినియోగ వస్తువులు, మన్నికైన వస్తువులు వంటి మూడు భాగాల్లో చూస్తే.. మిగతా రెండింటితో ఆహార వ్యయాల వాటా 50% కంటే తక్కువకు పడిపోయింది.
- దుస్తులు, పాదరక్షలు వంటి ప్రాథమిక అవసరాల నుంచి కుటుంబ వ్యయాలు.. వ్యక్తిగత వస్తువులు, వంట, గృహోపకరణాల వంటి వాటికి మారుతున్నాయి. మన్నికైన ఆస్తుల్లో ద్విచక్ర వాహనాల వినియోగం ఎక్కువ వృద్ధి నమోదుచేసింది.

రూ.10,300 కోట్లు తిరిగి చెల్లించాల్సిందే

బైజూ రవీంద్రన్‌ను ఆదేశించిన అమెరికా కోర్టు



దిల్లీ: బైజూస్ ఆల్ఫాతో పాటు అమెరికాకు చెందిన రుణదాత గ్లాస్ ట్రస్ట్ కంపెనీ ఎల్ఎల్‌సీకి 1.16 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10,300 కోట్ల) మొత్తాన్ని తిరిగి చెల్లించాలని బైజూ రవీంద్రన్‌ను అమెరికా కోర్టు ఆదేశించింది. డెలావర్ దివాలా కోర్టు తీర్పు ప్రకారం.. కోర్టు ఆదేశాలను పాటించడంలో రవీంద్రన్ విఫలమయ్యారని, అనేక సందర్భాల్లో తప్పించుకుంటూనే ఉన్నారని తెలిపింది. బైజూ ఆల్ఫా, గ్లాస్ ట్రస్ట్ కంపెనీ ఎల్ఎల్‌సీ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఈ తీర్పు వెలువడింది.

- బైజూ బ్రాండ్‌తో పని చేసే ఎడ్‌టెక్ సంస్థ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ (టీఎల్‌పీఎల్)ను రవీంద్రన్ నిర్వహిస్తున్నప్పుడు ఆల్ఫా విలీనమైంది. ఆల్ఫా ఫండ్స్, వాటి ద్వారా వచ్చే ఏవైనా ఆదాయాలకు సంబంధించి పూర్తి, కచ్చితమైన అకౌంటింగ్‌ను, కామ్‌షాఫ్ట్ ఎల్‌పీ వడ్డీ వంటి వాటిని కూడా అందించాలని తీర్పులో కోర్టు రవీంద్రన్‌ను ఆదేశించింది. విదేశీ సంస్థలు ఓసీఐ, కామ్‌షాఫ్ట్ ద్వారా నిధులను స్వాహా చేశారనే ఆరోపణలను రవీంద్రన్ ఎదుర్కొంటున్నారు. అయితే అంతర్జాతీయ విస్తరణ, వ్యాపార ప్రయోజనాల కోసం మార్కెటింగ్ ఖర్చులు, పరికరాల కొనుగోలు కోసం యూకే ఆధారిత ఓసీఐతో కలిసి పని చేశామని రవీంద్రన్ తెలిపారు.
- బైజూ విస్తరణ ప్రణాళికను కొనసాగించడానికి పెట్టుబడిదార్లు, రుణదాతలతో సమయం తీసుకుంటున్నందున.. కామ్‌షాఫ్ట్‌లో బైజూ ఆల్ఫా కొంత వాటా కొనుగోలు చేసిందని, దాన్ని సాధారణ వ్యాపారాన్ని నిర్వహించడానికి ఓసీఐకి రుణంగా అందించినట్లు వివరించారు.

కోర్టు తీర్పు, సంబంధిత ఆదేశాలపై బైజూ రవీంద్రన్ వెంటనే అప్పీల్ చేస్తారని రవీంద్రన్ న్యాయ సలహాదారుడు తెలిపారు.

నగరాల మధ్య బస్సు ప్రయాణాల్లో 25% వృద్ధి

- ఏప్రిల్-సెప్టెంబరులో 14 కోట్లకు ప్రయాణికులు: రెడ్‌బస్

దేశంలో నగరాల మధ్య బస్సు ప్రయాణాలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబరులో ఈ ప్రయాణికుల సంఖ్య 14 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ప్రయాణించిన 11.2 కోట్ల మందితో పోలిస్తే ఇది 25% ఎక్కువని రెడ్‌బస్ తన తాజా 'బస్‌ట్రాక్ రిపోర్ట్'లో తెలిపింది. దేశీయంగా బస్సు ప్రయాణాల టికెట్ బుకింగ్ పరిశ్రమ మొత్తం నుంచి సేకరించిన సమాచారంతో ఈ నివేదికను రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

- మొత్తం ప్రయాణాల్లో స్లీపర్, హైబ్రిడ్ బస్సుల వాటా 85 శాతంగా ఉంది.
- విక్రయమైన సీట్లలో ఏసీ బస్సుల వాటా 71%.
- మొత్తం 11,000 పట్టణాలను 6,70,000 మార్గాలు అనుసంధానం చేశాయి. 65% మార్గాలు 250 కి.మీ.కంటే అధిక దూరంతోనే ఉన్నాయి.
- బస్సు సేవల్లోకి కొత్త ఆపరేటర్లు రావడం, ప్రస్తుత ఆపరేటర్లు కొత్త బస్సులను తీసుకురావడం, కొత్త మార్గాల్లో టికెట్ల బుకింగ్‌ను డిజిటలీకరించడం వల్లే.. టికెట్ల బుకింగ్‌లో 25% వృద్ధి నమోదైంది.
- ప్రైవేటు బస్సు ఆపరేటర్లు భారీ స్థాయిలో ఆన్‌లైన్‌లోకి వచ్చారు. ఇందువల్ల ఎన్ని టికెట్లు బుక్ అవుతున్నాయో వారికి కచ్చితమైన సమాచారం ఉంటోంది. ప్రయాణికులు కూడా బస్సు బయలుదేరే ముందు వరకు, టికెట్ బుక్ చేసుకోగలుగుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో: నగరాల మధ్య తిరుగుతున్న బస్సుల్లో సగటున 76% సీట్లు నిండుతుండగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇది అత్యధికంగా 84 శాతంగా ఉంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో తక్కువగా 63% వద్దే ఉంది. దేశం మొత్తంమీద బస్ సీట్ల బుకింగ్‌లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వాటా 12 శాతంగా ఉంది.

రైతన్నా.. మీ కోసం..

- ఈ ప్రభుత్వం ఏం చేస్తోందో చెబుతూ సీఎం లేఖ
- ఊరూరా రైతుల ఇంటికి వెళ్లి అందజేత
- 24 నుంచి డిసెంబరు 2 వరకు..

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 24 నుంచి డిసెంబరు 2 వరకు 'రైతన్నా మీ కోసం' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. ఇందులో భాగంగా రైతును రాజును చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఏం చేస్తోందో.. రాబోయే ఐదేళ్లలో ఏం చేయబోతోందో రైతులకు వివరించనున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, ప్రతి గ్రామంలో 30 ఇళ్లకు వెళ్లాలని, 90 రైతు కుటుంబాలను కలవాలని నిర్దేశించారు. 'నేనూ రైతు బిడ్డనే. ప్రతి రైతు కష్టం నాకు తెలుసు. మీతో కలిసి నడుస్తా. మీ సమస్యలు పరిష్కరించేందుకు అండగా ఉంటా' అంటూ సీఎం రాసిన లేఖను రైతులకు అందిస్తారు.

సీఎం లేఖలో ఏముంది?

అన్నదాతకు సీఎం రాస్తున్న లేఖలో అన్నదాతల సంక్షేమానికి ఏం చేస్తున్నారో వివరించారు.

★ **నీటి భద్రత:** రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించేలా అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో అన్ని ప్రాజెక్టులు, జలాశయాలు నీళ్లతో నింపుతాం.

★ **డిమాండ్ ఆధారిత పంటలు:** సమాజంలో మారుతున్న అలవాట్లకు అనుగుణంగా రైతులూ సాగు పద్ధతులు మార్చుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రల వంటి వాటికి మళ్లీ డిమాండ్ వచ్చింది. చిరుధాన్యాల సాగు పెంచడంతో పాటు ప్రకృతి వ్యవసాయం అవలంబించాలి.

★ **వ్యవసాయంలో సాంకేతికత:** వ్యవసాయంలో సాంకేతికతను ప్రోత్సహిస్తున్నాం. ప్రతి రైతుకూ ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ పథకంలో యూనిక్ ఐడీల నమోదుతో ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నాం. డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యాన్ని పెంచుతున్నాం. బిందుసేద్యంపై 100% రాయితీ పునరుద్ధరించాం. ప్రకాశం, రాయలసీమ జిల్లాల మధ్య తరగతి రైతులకు గత ప్రభుత్వం సబ్సిడీ తగ్గించింది. మేం 90 శాతానికి పెంచాం. యంత్రాలు సరఫరా చేస్తున్నాం. కిసాన్ డ్రోన్ సేవలు అందిస్తున్నాం.

★ **ఆహార శుద్ధి:** రాష్ట్రంలో ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) పరిశ్రమలు ఏర్పాటయ్యేలా రూ.13 వేల కోట్ల పెట్టుబడులతో విశాఖ సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్నాం. కాఫీ, కోకో పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో ఫుడ్ ప్రాసెసింగ్‌కు అవకాశాలు పెంచుతున్నాం.

★ **ప్రభుత్వ మద్దతు:** రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ.14 వేల చొప్పున 46,86,838 మంది రైతు కుటుంబాలకు రూ.6,310 కోట్లు ఇచ్చాం. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు గతంలో కన్నా రూ.8 వేలు అదనంగా పరిహారం ఇస్తున్నాం. (హెక్టారుకు రూ.17 వేల నుంచి రూ.25 వేలకు పెంచాం). సమర్థమైన మార్కెటింగ్ వసతులు కల్పిస్తున్నాం. రైతులకు మద్దతు ధర కోసం ప్రభుత్వమే వరి, కందులు, మినుములు, పెసలు, శనగలు, టమాటా, ఉల్లి, మామిడి, కోకో పంట ఉత్పత్తులు కొనుగోలు చేసింది. తొలిసారిగా పొగాకునూ కొన్నాం. ఉల్లి రైతులకు అండగా ఉండేందుకు హెక్టారుకు రూ.50 వేల చొప్పున సాయం ప్రకటించాం.

★ **పాడి రైతులకు అండ:** పశు సంవర్ధక రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మూడో స్థానంలో నిలుపుతాం. పాలు, మాంసం ఉత్పత్తి పెంపుదలకు చర్యలు చేపడతాం. గుడ్ల ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానాన్ని కొనసాగిస్తాం. మెరుగైన పౌల్ట్రీ పాలసీని తీసుకువస్తాం. దేశవాళీ కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం, మాంసం ఉత్పత్తి, శుద్ధి కేంద్రాల స్థాపన.

★ సంపద సృష్టికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం. విశాఖ సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల విలువైన 613 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. వీటి ద్వారా 16 లక్షల ఉద్యోగాలొస్తాయి. సూపర్ సిక్స్ హామీలన్నీ 17 నెలల్లోనే అమలు చేశాం.

ఇవన్నీ చేశాం..

- ★ అన్ని ప్రాజెక్టుల నుంచి పంటలకు సకాలంలో సాగునీరు విడుదల చేశాం. చివరి ఎకరా వరకూ అందేలా చర్యలు తీసుకున్నాం.
- ★ రాయితీపై బిందుసేద్యం పథకం ద్వారా 1.50 లక్షల మంది రైతులకు కొత్తగా పథకాన్ని అమలు చేసి, రూ.1,654 కోట్ల లబ్ధి కల్పించాం.
- ★ 2025 ఖరీఫ్‌లో రూ.141.25 కోట్ల రాయితీతో 7.92 లక్షల మంది రైతులకు 4.22 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశాం. రబీలో రూ.11.77 కోట్లతో 57,500 క్వింటాళ్ల విత్తనాలు ఇచ్చాం. గిరిజన రైతులకు అదనంగా అందజేశాం.
- ★ బంగినపల్లి మామిడికి కవర్లు కట్టడం వల్ల రైతులకు కిలోకు రూ.50 అదనంగా లభించింది. రైతులకు 2024-25లో రూ.10 కోట్ల రాయితీతో పండ్ల కవర్లను అందించాం.
- ★ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవసరమైన సమాచారాన్ని ఇస్తున్నాం.
- ★ రాష్ట్రంలో 11.29 లక్షల మంది రైతులు 5.24 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయ విధానాలు అమలు చేస్తున్నారు.
- ★ ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50తో విద్యుత్తు సరఫరా చేస్తున్నాం.



వధువు కావలెను

KAMMA Rich 29 6' IIT Mumbai MBA IIM AHM 1.5 CR PA 30 5.10" IIT Khanpur MBA IIM CAL 30 6' IIT KGP MBA IIM ✆ 96429 57888 (B)

Arya Vysya. Fair/ 30/5'10". Low Vision, Software Eng. 45L P/A. Well settled Bridegroom looking for Educated Good looking Girl. Caste no bar ✆ 8555072557 (A)

Yadava/ 27/6'/ B.Tech, NIT, M.Tech, BITS, PG, IIT/ 40L ★ 31/6'/ B.Tech, NIT, MBA, IIM, 32L/ Vizag ★ 32/5'8"/ B.Tech, IIT, MBA, IIM/ 76L ★ 29/5'8"/ B.Tech/ 30L/ Hyd. ✆ 9440831748 (A)

★ ★

కాపు: 30/6'0"/ MBBS, MD జనరల్ మెడిసిన్, DM కార్డియాలజీ గల వరుడికి తగిన వధువు కావలెను. కులపట్టింపులేదు. Only OC, BC వాళ్లు మాత్రమే. ✆ 9704490217 (A)

సున్ని ముస్లిమ్, [illegible] 50/5'6" [illegible] 1st/2nd. వాట్సప్ ✆ 8500294786 (A)

పద్మశాలి: కులపట్టింపులేదు. సొంత ఇల్లు 28/5'5" ప్రైవేట్ జాబ్ నెల 25,000/- PM గల అబ్బాయికి చదువుకున్న అమ్మాయి కావలెను. [illegible] ✆ 9493666079 (A)

SC- మాల, [illegible] 29/5'10" M.Tech (IIT) [illegible] C.Govt. 18 Lakhs P/A [illegible] ✆ 7095019114 (A)

గౌడ్ 26 [illegible] B.Com/ డిగ్రీ, బిజినెస్ [illegible] ✆ 9550235699 (A)

KAMMA 30 5.11" MCH Neuro Surgeon 30 6' MCH Surgical Oncology 31 6' MCH Surgical Gastro 30 6' DM Gastro ✆ 99481 29111 (B)

KAMMA 29 5.11" DM Nephrology 31 5.11" DM Neurology 31 6' DM Cardiology 30 5.11" MCH Surgical Oncology ✆ 99481 29222 Sneha (B)

KAMMA 28 5.11" MS MBA Harvard 350K $ 29 5.11" MS Stanford 300K $ 29 6' MS 270K $ 30 5.11" MS 250K $ 30 6' MS ✆ 96422 15777 (B)

మాల 26 సం॥ B.Tech, IIT సెంట్రల్ Govt. సైంటిస్ట్ Hei 5'4", 24 Lacs P/A only Daughter వధువుకు వరుడు కావలెను. నో బ్రోకర్స్ ✆ 9493285326 (A)

KAMMA 28 5.5" MS OBG IVF 28 5.6" MS OBG IVF 50LPA 28 5.7" MD GM 27 5.6" MD Radiology 30 5.6" MS OBG IVF 60 LPA ✆ 99488 97778 (B)

KAMMA 26 5.6" MS Stanford 270K $ 27 5.5" MS Harvard 300K $ 27 5.7" MS 200K $ 28 5.5" MS 170K $ 28 5.5" MS 180K $ ✆ 96666 58789 (B)

KAMMA 25 5.6" CA CPA 26 5.6" CA ICW 40 LPA 27 5.4" CA CPA 35LPA 27 5.5" CA CS 30 LPA 28 5.3" CA 35 LPA ✆ 96422 15777 Dhatri (B)

[illegible] ✆ 9948353663 (A)

యాదవులు/ 45/5'4"/ [illegible] ✆ 9705894613 (A)

వధువు కావలెను

Dr / Medical or Dental Er / MBA Kammanaidu bride below 40 age for well settled Er Groom in Chennai

Contact : 87787 96515

Email id akrwindmill@gmail.com

★ ★

Yadava caste no bar 36/ 5'.1' MS. M.ch., Plastic Surgeon, Govt Job. Divorced. Wants Doctor's with P.G., Degree. ✆ 94402 93617. (L)



వరుడు కావలెను

బ్రాహ్మణ 26/5'4"/ 1st మ్యారేజ్, Q: 10th క్లాస్, [illegible] Any ప్రైవేట్ జాబ్ & పౌరోహిత్యం also OK. వరుడు కావలెను. ✆ 9347422789 (A)

బ్రాహ్మణ 24 Yrs [illegible] (జాబ్, పురోహితం OK) ✆ 6309407091 (A)

2nd కమ్మ, 35/5'2"/ B.Tech (IT) గల అందమైన వధువుకు తగిన well settled వరుడు కావలెను. ✆ 9391988909 (A)

'పెళ్లిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.



వివాహ వేదిక

[illegible] (15 వేల ప్రొఫైల్స్) డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, బిజినెస్ & [illegible] ✆ 9866619191 (A)

పద్మశాలి పెళ్లిసంబంధాలకై సంప్రదించండి Verified ప్రొఫైల్స్ & నమ్మకమైన సర్వీస్ ★ Srinivas ✆ 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd., (A)

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 (A)

మాదిగ- మాల పెళ్లిసంబంధాలకై సంప్రదించండి Verified ప్రొఫైల్స్ & నమ్మకమైన సర్వీస్ ★ Shyam ✆ 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd., (A)

[illegible] Ph: 9391 999 999/ 709 3200 333 (A)

కేవలం యాదవ్/ [illegible] www.gokulmarriage.com Hyd: 9440831748, GNT/ VIZ: 9440759945, BGL: 8332926034. (A)

సెకండ్ మ్యారేజెస్ [illegible] ✆ 9885143475 (A)

డైవర్స్ & విడో పెళ్లి సంబంధాలకై సంప్రదించండి Verified Profiles & నమ్మకమైన సర్వీస్ ★ Lakshmi ✆ 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd., (A)

స్పెషల్ డాక్టర్స్ (15 వేల ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MCH, MDS & [illegible] కులములకు కుదర్చబడును. ✆ 9866411588 (A)

కమ్మ, కాపు వధూవరులకు, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, US, UK వాళ్ళకు. వయస్సు 25 నుండి 40 వాళ్ళకు సంబంధములు కుదర్చబడును. డైవర్సీలకు మా ప్రత్యేకత. కొడాలి మ్యారేజ్‌లైన్, తాడేపల్లిగూడెం. ✆ 99127 11669. (M)

గమనిక

'పెళ్లిపందిరి' [illegible] ఏర్పడిన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునేముందు ఆరోగ్య పరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సీఎం చంద్రబాబుకు ఆహ్వానపత్రం అందజేస్తున్న గజల్ శ్రీనివాస్, రామచంద్రరాజు, విద్యాసాగర్

ప్రపంచ తెలుగుమహాసభలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 5 వరకు గుంటూరులో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు సతీసమేతంగా హాజరుకావాలని పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించారు. శుక్రవారం ఉండవల్లిలోని ఆయన కార్యాలయంలో ఆహ్వానపత్రిక అందించారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు నందమూరి తారకరామారావు వేదికపై నిర్వహించే మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనాలని ముఖ్యమంత్రిని ఆయన కోరారు. సీఎం సానుకూలంగా స్పందించారని గజల్ శ్రీనివాస్ తెలిపారు. మహాసభల ముఖ్య సమన్వయకర్తలు పి.రామచంద్రరాజు, వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు.

పాత్రికేయుడు శ్రీనివాసులుకు భద్రత కల్పించండి

తిరుపతి ఎస్పీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: తిరుమల పరకామణిలో కానుకల చోరీ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించాలని వ్యాజ్యం దాఖలుచేసిన పాత్రికేయుడు మాచర్ల శ్రీనివాసులుకు భద్రత కల్పించాలని తిరుపతి జిల్లా ఎస్పీని హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శనివారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. తనకు బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయని, ప్రాణహాని ఉన్నందున భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని తిరుపతికి చెందిన పాత్రికేయుడు శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించారు. శనివారం జరిగిన విచారణలో సీఐడీ తరఫున సహాయ పీపీ సాయిరోహిత్ వాదనలు వినిపిస్తూ.. పరకామణిలో సహాయ విజిలెన్స్ భద్రత అధికారిగా గతంలో పనిచేసిన సతీష్‌కుమార్ ఇటీవల అసహజ మరణానికి గురైన నేపథ్యంలో పరకామణి కేసులో సాక్షులకు, నిందితుడికి భద్రత కల్పించాలని ఇదే హైకోర్టులోని మరో న్యాయమూర్తి సీఐడీ డీజీని ఆదేశించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో భద్రత కల్పించేలా ఎస్పీని ఆదేశించాలని కోరుతూ సీఐడీ డీజీకి, రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారన్నారు. సాక్షుల జాబితాలో పాత్రికేయుడు శ్రీనివాసులు పేరు ఉందని తెలిపారు.

శ్రీనివాసులుకు భద్రత కల్పిస్తాం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మరోపక్క, పాత్రికేయుడు శ్రీనివాసులుకు భద్రత కల్పిస్తున్నట్లు అలిపిరి సీఐ రామ్‌కిశోర్ తెలిపారు. ఆ మేరకు భద్రతాపరమైన చర్యలకు సంబంధించిన పత్రాన్ని శనివారం ఆయనకు అందజేశారు. ఆయన ఇంటి సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించి పర్యవేక్షించనున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు, బ్లూకోల్ట్, భద్రత సిబ్బంది ప్రతి గంటకూ పర్యవేక్షిస్తారని తెలిపారు. పాయింట్ బుక్ పెట్టి ప్రతి ఐదు గంటలకు భద్రతను పరిశీలిస్తారని చెప్పారు. కోర్టులు, విచారణ నిమిత్తం వచ్చే సమయంలో కానిస్టేబుళ్లను ఇచ్చి భద్రత కల్పిస్తామన్నారు. మరోవైపు, పరకామణిలో చోరీ కేసుపై దర్యాప్తు సోమవారం నుంచి వేగం పుంజుకోనుందని తితిదే వర్గాలు చెబుతున్నాయి.




హైబీపీతో గుండె జబ్బులు

గుండె జబ్బులకు మొదటి కారణం హైబీపీ. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఔషధాలు కూడా హైబీపీపై సమర్థంగా పనిచేయడంలేదు. కాబట్టి బరువు తగ్గడం, ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం వంటి చర్యలతో బీపీని నియంత్రించుకోవడంపై అంతా దృష్టిపెట్టాలి.

— క్రిస్ బోట్చర్, బరువు నియంత్రణ శిక్షకుడు

డిసెంబరు నాటికి రహదారులపై గుంతలు ఉండకూడదు

- ముఖ్యమంత్రి చంద్రబాబు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రహదారులన్నింటినీ డిసెంబరు ఆఖరుకల్లా గుంతల రహితంగా మార్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రహదారుల అభివృద్ధి పనులు, మరమ్మతులు జరుగుతున్న తీరును ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. రహదారుల అభివృద్ధి పనులపై సీఎం శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. రహదారుల పనులకు ఒప్పందం చేసుకున్న గుత్తేదార్లలో ఇప్పటికీ పనులు ఆరంభించని వారుంటే వాళ్లపై తగిన చర్యలు తీసుకోవాలి. రహదారుల మరమ్మతుల్లో నాణ్యత ప్రమాణాలు పక్కాగా ఉండాలి. పనుల్లో పాత విధానాలే కాకుండా, కొత్త సాంకేతిక పద్ధతులు, వివిధ మెటీరియల్స్‌ను ఉపయోగించి రహదారుల పనులుచేసే విధానాలను ఇంజినీర్లు అందిపుచ్చుకోవాలి' అని సీఎం సూచించారు. ★ రాష్ట్రంలో ఈ ఏడాది రూ.2,500 కోట్లతో 5,471 కి.మీ. మేర రహదారుల అభివృద్ధి, పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. వీటిలో చాలావరకు టెండర్లు పూర్తయ్యాయి. వర్షాలు, తుపాన్ల కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. ఇప్పుడు వాటిని మొదలుపెడుతున్నారు. ★ మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న 4,794 కి.మీ. మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఆర్థిక శాఖకు ప్రతిపాదన పంపారు.

కార్మిక కోడ్‌ల అమలు చరిత్రాత్మకం

కార్మికులందరికీ సామాజిక భద్రత, న్యాయం అందించేందుకు నాలుగు కార్మిక కోడ్‌లను దేశవ్యాప్తంగా ఒకేసారి అమల్లోకి తీసుకురావడం చరిత్రాత్మకమని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. 1991లో జరిగిన ఆర్థిక సంస్కరణల తర్వాత చోటుచేసుకొన్న కీలక పరిణామంగా దీన్ని అభివర్ణిస్తూ.. 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు.

'తెలుగుగంగ' నిర్వాసితులకు ఉద్యోగం ఇవ్వాల్సిందే

- సాంకేతిక కారణాలతో హామీని నిరాకరించడానికి వీల్లేదు
- హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు



ఈనాడు, అమరావతి: తెలుగుగంగ ప్రాజెక్ట్ నిర్మాణ నిమిత్తం 1984లో భూములిచ్చిన నిర్వాసితులకు ఉద్యోగ కల్పన విషయంలో హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పునిచ్చింది. నిర్దిష్ట గడువులోగా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోలేదన్న కారణాన్ని సాకుగా చూపుతూ పిటిషనర్ల అభ్యర్థనను అధికారులు తోసిపుచ్చడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. 'ప్రజాప్రయోజనాల కోసం భూములను సేకరించేటప్పుడు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఉద్యోగావకాశాలు, పునరావాస పథకాలకు హామీలు ఇస్తుంది. వాటిని చిత్తశుద్ధితో అమలుచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. నిర్దిష్ట సమయంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ ఆ హామీలను నిరాకరించడానికి వీల్లేదు. దరఖాస్తుదారుడు నిజంగా నిర్వాసితుడా కాదా? ఆయా పథకాలను వర్తింపజేయడానికి ఆ వ్యక్తులు అర్హులా, కారా? అనే విషయాలనే చూడాలి' అని స్పష్టం చేసింది. పిటిషనర్లకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు సరైనదేనని స్పష్టంచేసింది. సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

★ తెలుగుగంగ ప్రాజెక్ట్ నిర్మాణ నిమిత్తం 1984లో తమ భూములను ప్రభుత్వం సేకరించిందని కడప జిల్లా బి.మఠం మండలానికి చెందిన రాజోల జగన్నాథరెడ్డి, బద్వేలు, మైదుకూరు తదితర గ్రామాలకు చెందిన 46 మంది హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యం వేశారు. భూములు తీసుకునే సమయంలో జీవో ద్వారా ఉద్యోగ హామీ ఇచ్చారన్నారు. నిర్దిష్ట గడువులోగా దరఖాస్తు చేసుకోలేదన్న కారణంతో తమకు ఉద్యోగాలను నిరాకరించారని, హామీకి అనుగుణంగా ఉద్యోగం ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. పిటిషనర్లకు ఉద్యోగం ఇవ్వాలని 2022 ఫిబ్రవరి 1న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి, తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈ, కడప జిల్లా కలెక్టర్ (ఎంపిక కమిటీ ఛైర్మన్) 2023లో ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై హైకోర్టు ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపింది. గతంలో కొంతమంది నిర్వాసితులకు ఎలా ఉద్యోగాలిచ్చారో అలాగే పిటిషనర్లకూ ఇవ్వాలని తేల్చిచెప్పింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

భూమితో ఉన్న అనుబంధాన్ని ఎవరూ మర్చిపోరు

'మన సమాజంలో భూమితో తనకున్న అనుబంధాన్ని ఎవరూ మర్చిపోరు. కన్నతల్లిలా ప్రేమించే భూమిని వదులుకునేందుకు ఎవరూ ఇష్టపడరు. ప్రజాప్రయోజనం కోసం ఆ భూమి అవసరమైతే.. యజమానికి ఇష్టం లేకపోయినా ప్రభుత్వం ఆ భూమిని భూసేకరణ చట్టం ద్వారా తీసుకుంటోంది. ఈ క్రమంలో జీవనాధారం కోల్పోయిన నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని రాజకీయ నాయకులు హామీ ఇస్తారు. వాటిని సకాలంలో అమలుచేయకుండా.. చిన్న చిన్న కారణాలను సాకుగా చూపుతూ కాలం వెళ్లదీస్తే ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలు విశ్వాసం కోల్పోతారు. అంతిమంగా అది అశాంతికి దారితీస్తుంది. ఇలాంటి పరిస్థితిని నివారించేందుకు పునరావాస పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా, సత్వరమే అమలుచేయాలి. నిర్వాసితులకు సామాజిక భద్రతగా వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పిస్తామని ప్రభుత్వం నిర్దిష్ట విధానాన్ని రూపొందించినప్పుడు దాన్ని సరైన స్ఫూర్తితో అమలుచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

అధికార భాషా సంఘం ఛైర్మన్‌గా విక్రమ్ పూల

- ఉర్దూ అకాడమీకి ఫరూఖ్ షిబ్లీ
- మొత్తం 11 కార్పొరేషన్లకు ఛైర్మన్‌ల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 11 కార్పొరేషన్లకు ఛైర్మన్‌లను నియమించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అధికార భాషా సంఘానికి విక్రమ్ పూల, ఉర్దూ అకాడమీకి మౌలానా ఫరూఖ్ షిబ్లీలను ఛైర్మన్‌లుగా నియమించింది. మిగిలిన కార్పొరేషన్ల ఛైర్మన్‌ల వివరాలు ఇవి..

పేరు	కార్పొరేషన్
కల్యాణం శివ శ్రీనివాసరావు	ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్
వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణరాజు	ఏపీ స్టేట్ ఎడ్వైజరీ బోర్డు ఆన్ ఛైల్డ్ లేబర్
యాటగిరి రాంప్రసాద్	ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్
చిరుమామిళ్ల మధుబాబు	పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ
కొండ శంకర్‌రెడ్డి	రెడ్డిక సంక్షేమ, అభివృద్ధి సొసైటీ
మిన్నప్ప	కుర్ని, కరికాలభక్తుల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్
ముక్తియార్	షేక్ సంక్షేమ, అభివృద్ధి సొసైటీ
సరికొండ వెంకటేశ్వరరాజు	భట్రాజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్
వనపర్తి వీరభద్రరావు	పెరిక(పెరిక, బలిజ, పురగిరి క్షత్రియ) సంక్షేమ అభివృద్ధి సొసైటీ



సీఆర్డీఏ కార్యాలయంలో మహిళలు తయారు చేసిన వంటకాల అమ్మకాలు

అమరావతిలో 'అమ్మవంట'

రాజధాని ప్రాంతానికి చెందిన మహిళలు స్వయం ఉపాధితో వారి కుటుంబాలకు ఆర్థికంగా దన్నుగా నిలిచేలా.. సీఆర్డీఏ ఆధ్వర్యంలో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మైక్రో స్కిల్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎంఎస్‌డీపీ)లో భాగంగా మిల్లెట్స్‌తో తినుబండారాలు, జావ, వివిధ రకాల వంటకాలు, కారప్పొడులు, పిండి వంటల తయారీలో మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్ వంటివి నేర్పి అనంతరం వారే స్వయంగా ఇంటి వద్ద తయారు చేసి, విక్రయించేలా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే శిక్షణ పూర్తిచేసుకున్న వారు తయారు చేసిన వంటకాలను శనివారం సీఆర్డీఏ కార్యాలయంలో 'అమరావతి అమ్మవంట' పేరుతో అమ్మకాలు చేశారు. — ఈనాడు అమరావతి

జనసేన పార్టీ కమిటీల నిర్మాణం, కూర్పుపై కసరత్తు

- ముఖ్యనాయకులకు పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం



ఈనాడు, అమరావతి: జనసేన పార్టీలో రాష్ట్ర కమిటీ నుంచి జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేశారు. పార్టీ కమిటీల నిర్మాణం, వాటి కూర్పులపై అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యనేతలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణతో పాటు కార్యకర్తల మనోభావాలను గుర్తించాలని, అందుకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. జిల్లాల్లో పార్టీ బలోపేతంపైనా దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా ఉమ్మడి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పార్టీ బలంగా ఉందని, అక్కడి నాయకత్వాన్ని పటిష్టం చేసి పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని చెప్పారు. మరోవైపు పవన్‌కల్యాణ్ గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయ బృందం వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, వీరమహిళలతో చర్చిస్తోంది. వారి ద్వారా క్షేత్రస్థాయిలోని అభిప్రాయాలు, సూచనలను స్వీకరిస్తోంది.

ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యం

- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి



కుప్పం మండలం దాసేగౌనూరు గ్రామంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ఏపీని దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో భాగంగా శనివారం కుప్పం మండలంలో ఆమె పర్యటించారు. వివిధ గ్రామసభల్లో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారంటే దానికి కారణం మన నాయకుడి(చంద్రబాబు)పై వారికున్న నమ్మకమేనన్నారు. అమరావతి, విశాఖ మాత్రమే కాదు, అన్ని జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో సీఎం ముందుకెళ్తున్నారని వివరించారు. నాయనూరులో జరిగిన మహిళల సమావేశంలో భువనేశ్వరి మాట్లాడుతూ "మిమ్మల్ని కలవడం చాలా సంతోషంగా ఉంది. 'నిజం గెలవాలి' నినాదంతో వచ్చినప్పుడు కార్యకర్తలందరూ ముందుకొచ్చారు. వారిలోని కసిని నా కళ్లతో చూశాను. ఆ కార్యక్రమం స్ఫూర్తితోనే నేను జనంలోకి వస్తున్నా" అని పేర్కొన్నారు.


నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

ఈనాడు, అమరావతి: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)-విజయవాడ, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్-బెంగళూరు సంయుక్త ఆధ్వర్యంలో 120 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. డిసెంబరులో 60 మందికి శిక్షణ ప్రారంభించనున్నామని వెల్లడించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పదో తరగతి ఉత్తీర్ణులైన 18-30 ఏళ్ల వయసున్న నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలో పాలిమర్స్ టెక్నాలజీలో మెషీన్ ఆపరేటర్-ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్, మెషీన్ ఆపరేటర్-ఇంజక్షన్ మౌల్డింగ్‌పై నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ఈ శిక్షణ 113 రోజుల పాటు ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలతో పాటు రూ.11,300 ఉపకారవేతనం అందిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాలలో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 93980 50255 ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

రూ.603 కోట్లతో ఎరువుల తయారీ ప్లాంట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లో తడి, పొడి చెత్త నిర్వహణతో పాటు ఎరువుల తయారీ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.603.45 కోట్లకు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటికి టెండర్లు పిలిచేందుకు కూడా అనుమతించింది.

కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్ డిప్యూటీ సెక్రటరీగా పార్థసారథి భాస్కర్



ఈనాడు, దిల్లీ: కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్ డిప్యూటీ సెక్రటరీగా 2012 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి దేవరకొండ పార్థసారథి భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగంలో డిప్యూటీ కార్యదర్శి హోదాలో ఉన్న ఆయన్ను క్యాబినెట్ సెక్రటేరియట్‌కు బదిలీ చేశారు. ఆయన 2026 జూన్ 22 వరకు కొనసాగుతారు. ఈయన పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారులు వెంకటరమణి భాస్కర్, లక్ష్మీపార్థసారథి భాస్కర్‌ల కుమారుడు. సోదరుడు కృష్ణ భాస్కర్ ప్రస్తుతం తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీగా పనిచేస్తున్నారు.

రూ.7 కోట్ల దోపిడీ కేసులో కానిస్టేబులే సూత్రధారి

- 60 గంటల్లో ఛేదించిన బెంగళూరు పోలీసులు



అణ్ణప్పనాయక్



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఏటీఎంలకు నగదును తీసుకెళ్లే వాహనాన్ని అడ్డగించి రూ.7 కోట్లను దోచుకెళ్లిన ఘటనలో కానిస్టేబులే ప్రధాన సూత్రధారని పోలీసులు తేల్చారు. 60 గంటల్లో కేసును ఛేదించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరులో జరిగిన ఈ చోరీకి సంబంధించిన వివరాలను నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ శనివారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం.. ఈ నెల 19న ఏటీఎంలకు నగదు తీసుకెళుతున్న వాహనాన్ని నిందితులు అడ్డగించి ఆర్‌బీఐ, ఐటీ అధికారులమంటూ సిబ్బందిని బెదిరించారు. ఆ వాహనంలోని రూ.7.11 కోట్లను వారి కారులోకి మార్చుకుని పరారయ్యారు. విషయం తెలిసిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. 11 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దోపిడీకి ఉపయోగించిన ఇన్నోవా వాహనం తిరుపతిలో కనిపించడంతో చిత్తూరు, కుప్పం, వేలూరు, బెంగళూరు ప్రాంతాల్లో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. దర్యాప్తు చేసే క్రమంలో బెంగళూరు గోవిందపుర పోలీసు ఠాణా కానిస్టేబుల్ అణ్ణప్పనాయక్ ఈ చోరీకి సూత్రధారుడని గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ముఠా వివరాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఏటీఎంలకు డబ్బును తీసుకెళ్లే ఏజెన్సీ సిబ్బంది గోపి, మాజీ ఉద్యోగి క్లేవియర్ అలియాస్ పవన్‌లతో కలిసి మూడు నెలల కిందటే ఈ దోపిడీకి పథక రచన చేశారని తేలింది. ప్రతి బుధవారం ఎక్కువ నగదు తరలిస్తారనే సమాచారాన్ని గోపి ద్వారా తెలుసుకుని 9 మంది రంగంలోకి దిగారు. ప్రస్తుతానికి కానిస్టేబుల్ సహా నలుగురిని అరెస్టు చేశామని, రూ.5.76 కోట్లను స్వాధీనం చేసుకున్నామని కమిషనర్ తెలిపారు. మరో ఐదుగురు నిందితులనూ త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు. కేసును విజయవంతంగా ఛేదించిన సిబ్బందిని అభినందిస్తూ.. దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన 200 మంది పోలీసులకు రూ.5 లక్షల నగదు బహుమతి ప్రకటించారు.

మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

- ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు తరలింపు



పోస్టుమార్టం పూర్తయిన సురేష్, సైను ఎలియాస్ వాసు మృతదేహాలు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, రంపచోడవరం, చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మరణించిన 13 మంది మావోయిస్టుల పోస్టుమార్టం పూర్తయింది. సురేష్, సైను అలియాస్ వాసు, అనిత మృతదేహాలకు శనివారం రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించారు. మృతదేహాలను అంబులెన్స్ వాహనాల్లో స్వగ్రామాలకు తరలించారు. శవ పంచనామా, ఇతర రిపోర్టులు రాసేందుకు ఏజెన్సీలోని ఏడు మండలాల నుంచి తహసీల్దార్లతో పాటు దాదాపు 30 మంది సిబ్బంది, పోలీసులు రాగా డీఎస్పీ సాయిప్రశాంత్ పర్యవేక్షించారు. మృతదేహాలన్నింటినీ ఆసుపత్రి నుంచి తరలించడంతో సాధారణ పరిస్థితి నెలకొంది.

నేడు మావోయిస్టుల బంద్

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన రెండు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ మావోయిస్టులు ఆదివారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో 30వ నంబరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. రాత్రి బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. చింతూరు - భద్రాచలం రహదారిలో వెళ్లే వాహనాలను కూనవరం మీదుగా మళ్లించారు. బంద్ పిలుపు దృష్ట్యా మావోయిస్టులతో ముప్పు ఉన్న రాజకీయ నాయకులు, గుత్తేదారులు అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు నోటీసులు పంపించారు.

నలుగురు మావోయిస్టుల కస్టడీకి పోలీసుల పిటిషన్

ఈనాడు, అమరావతి: ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు విజయవాడకు వచ్చి తలదాచుకోవడం వెనుక అసలు గుట్టును వెలికితీసేందుకు పోలీసులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు విజయవాడలో ఇటీవల అరెస్టు అయిన నలుగురు మావోయిస్టులను లోతుగా విచారించేందుకు కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. రంగు ఎలియాస్ బీమా, మంగి, చిన్మయ్ ఎలియాస్ మనీలా, లక్మ ఎలియాస్ మదన్ ఎలియాస్ జగ్గులను వారం రోజులు ప్రశ్నించేందుకు అనుమతించాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. ఇది సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

'కగార్' నుంచి విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం

- పీఎల్‌జీఏ వార్షికోత్సవాలకు మావోయిస్టు సీఎంసీ పిలుపు
- 11 నెలల్లో 320 మంది మరణించారని వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'కగార్' యుద్ధం నుంచి విప్లవోద్యమాన్ని కాపాడుకుందామని మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్(సీఎంసీ) పేర్కొంది. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) 25వ వార్షికోత్సవాలను డిసెంబరు 2-8 వరకు దేశవ్యాప్తంగా జరుపుకోవాలని పిలుపునిచ్చింది. ఈనెల 14వ తేదీతో ఉన్న ఈ ప్రకటన శనివారం వెలుగులోకి వచ్చింది. అప్పటికి ఎన్‌కౌంటర్‌లో హిడ్మా మరణించకపోవడంతో అతడి పేరును ప్రస్తావించలేదని తెలుస్తోంది. అందులోని వివరాల మేరకు.. '50వేల మంది పోలీస్ బలగాలతో చేపట్టిన కగార్‌లో గడిచిన 11 నెలల కాలంలో 320 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో 117 మంది మహిళలు ప్రాణాలు కోల్పోయారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ సహా 8 మంది కేంద్ర కమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్రకమిటీ సభ్యులు మృతిచెందారు. విప్లవోద్యమానికి తీవ్రనష్టం కలిగించిన స్థితిలో ఈసారి పీఎల్‌జీఏ 25వ వార్షికోత్సవాలను జరుపుకొంటున్నాం. విప్లవ శిబిరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఇవి దోహదం చేయాలి.

కగార్‌లో 116 మంది పోలీసులు మరణించారు. కేంద్ర బలగాల్లోని 208 మంది గాయపడ్డారు. కానీ కేంద్రప్రభుత్వం వాటిని దాచిపెట్టింది' అని మండిపడింది.

EENADU Vol: 52, Issue: 103 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

వసుంధర

vasundhara@eenadu.in

ట్రావెల్ వ్లాగర్... సోషల్‌మీడియాలో ఖాతా ఉన్న ఎవరికైనా పరిచయ పదమే ఇది! పైగా ఒకరా... ఇద్దరా బోలెడు మంది ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు లక్షల మంది అభిమానం సంపాదించుకున్నారు. కానీ ఇంత ప్రాచుర్యం లేనప్పుడే పర్యటనల విషయంలో తనదైన ముద్రవేశారు... దీప్తి భట్నాగర్. ఒకప్పుడు కుర్రాళ్ల గుండెలను కొల్లగొట్టిన అందాల తార ఆమె. ఇప్పుడు సోషల్‌మీడియా వ్లాగర్‌గానూ మరింతమంది అభిమానం సంపాదించుకుంటున్నారు.


దీప్తి

సినిమా కాదని...
వ్లాగర్‌గా మారి!

'పెళ్లిసందడి' సినిమా తరవాత ఎంతోమందికి స్వప్న సుందరి అయ్యారు దీప్తి. తమిళ, హిందీ సినిమాలతోపాటు హాలీవుడ్‌లోకీ అడుగుపెట్టారు. అయితే తొలిరోజుల్లో ఆమె కల సినిమా కాదు. దీప్తి పుట్టింది మేరఠ్. హస్తకళల వ్యాపారం చేయాలని ముంబయిలో అడుగుపెట్టారు. కానీ అనుకోకుండా మోడలింగ్ అవకాశం వచ్చింది. సంపాదన బాగుందని కొనసాగారు. వాటితో కొన్ని నెలల్లోనే 'మిస్ ఇండియా' పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకోవడమే కాదు... 18ఏళ్ల వయసులోనే టైటిల్‌నీ అందుకున్నారు. ఆ గుర్తింపుతో సినిమా అవకాశాలు వరుసకట్టాయి. నటించిన సినిమాలన్నీ గుర్తింపు తెచ్చినవే! కానీ ఇవి కాదు... జీవితానికి ప్రశాంతతనీ, ఆనందాన్నీ ఇచ్చేవేవైనా చేయాలి అనుకున్నారు. దీనికోసం షారూఖ్‌ఖాన్‌తో సినిమానీ కాదనుకున్నారు. ఆయనే స్వయంగా శిక్షణ ఇచ్చినా 'స్క్రీన్ టెస్ట్' నుంచి పారిపోయారట.

నేర్చుకుంటూ... ఆస్వాదిస్తూ...

తరవాత పంజాబీ నటుడు రణ్‌దీప్ ఆర్యని పెళ్లి చేసుకున్నారు దీప్తి. ఆయన ప్రముఖ నటుడు ధర్మేంద్రకి బంధువు. అయినా సినీ వాతావరణానికి దూరంగా ఉండాలనుకున్న ఆమె... పర్యటనలవైపు మొగ్గు చూపారు. 2001లో సొంత టీవీ ప్రొడక్షన్ సంస్థని ప్రారంభించి, ట్రావెల్ షో 'యాత్రా అండ్ ముసాఫిర్ హూ యారో'కి శ్రీకారం చుట్టారు. దాదాపు 90 దేశాలు తిరిగేశారు. 'యాత్ర' పేరుతో దైవక్షేత్రాలనీ పరిచయం చేశారు. 'నాకు పర్యటనలంటే కేవలం ప్రదేశాలను చుట్టి రావడం కాదు. కొత్త విషయాలు, వ్యక్తుల గురించి నేర్చుకోవడం. వీటివల్లే చాలా వంటకాలు, ఆటలు, డ్రైవింగ్... ఇలా ఎన్నో నేర్చుకున్నా. ప్రయాణాల్లో అయితే అసలే నిద్రపోను. ప్రతిదీ ఆస్వాదిస్తా' అనే దీప్తి 'ముసాఫిర్' కార్యక్రమానికి వ్యాఖ్యాతగా చేస్తూ... పర్యటనల్లోనే పిల్లలకి జన్మనిచ్చారు.

సోషల్ మీడియాలోకీ...

టీవీ కార్యక్రమంలో పర్యటనల్నీ చూపించొచ్చన్న కొత్త ఒరవడికి అప్పట్లోనే శ్రీకారం చుట్టారు దీప్తి. పర్యటనలపై ఆసక్తి ఉన్న భారతీయులకు కొత్త ప్రదేశాలను పరిచయం చేశారు. ఎంతోమంది అభిమానాన్ని పొందారు. ప్రదేశాల ఎంపిక, భిన్న సంస్కృతుల పరిచయం, అందమైన వర్ణనలతో 'ఒరిజినల్ ట్రావెల్ స్టోరీ టెల్లర్' గుర్తింపునీ తెచ్చుకున్నారు. 'జీవితంలో అనుభూతులకు మించిన ఆస్తి ఏముంటుంది చెప్పండి. వీటిని డబ్బులతో కొనలేం. అలాంటి వాటినెన్నింటినో పోగేసుకుంటున్నా. ప్రతి పర్యటన కుటుంబంతోనే చేస్తా. పిల్లలతో కలిసి ప్రపంచాన్ని చుట్టడం నా అదృష్టం. ఈ క్రమంలో ఓపిక, వినయం, కృతజ్ఞతా భావంతో ఉండటం వంటి విలువైన పాఠాలూ నేర్చుకున్నా' అంటారు దీప్తి. ఈతరంతో పోటీపడుతూ డిజిటల్ మీడియాలోకీ వచ్చారామె. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో తన పర్యటనల వివరాలను పంచుకుంటూ రెండింట్లో కలిపి దాదాపు 7లక్షల మంది ఫాలోయర్లను సంపాదించుకున్నారు.

'సినిమాని లక్ష్యంగా పెట్టుకుని ఉంటే మరిన్ని చిత్రాల్లో నటించి ఉండేదాన్ని. కానీ నాకు కావాల్సింది అదికాదు. ప్రపంచాన్ని చుట్టాలి, ప్రతి క్షణాన్నీ ఆస్వాదించాలి అనుకున్నా. అలాగే జీవిస్తున్నా. కాబట్టి, ఏదో మిస్ అయ్యానన్న బాధ లేదు. పాతికేళ్లుగా ప్రయాణిస్తున్నా. ఇప్పటికీ ఇంకా కొత్త ప్రదేశాలు చూడాలనే నా తపనంతా. అందుకే ఆ జాబితా ఎప్పుడూ ఖాళీ కాదు. పర్వతారోహణ, ఇంకా ఎన్నో సాహసాలూ చేయాలనుంది' అనే దీప్తి... భారతీయ వీక్షకులకు ప్రపంచాన్ని పరిచయం చేయడమే కాదు... చాలామంది ట్రావెల్ స్టోరీ టెల్లర్లు అయ్యేలా స్ఫూర్తినీ నింపారు. ఈ క్రమంలో కుటుంబానికీ ప్రాధాన్యమివ్వడం ఎంతోమంది ఆమెకు అభిమానులయ్యేలా చేసింది. కాబట్టే, ఆమె 'ప్రయాణం' సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది.

బామ్మ చిట్కా



అనారోగ్యంగా ఉన్నప్పుడూ, ప్రెగ్నెన్సీ తొలిరోజుల్లోనూ వాంతులు సాధారణమే! కొందరికి ప్రయాణ సమయాల్లోనూ ఇలాంటి ఇబ్బంది ఉంటుంది. అలాంటప్పుడు ఈ చిట్కా ప్రయత్నించవచ్చు. కొంచెం చింతపండుకు జీలకర్ర, ఉప్పు, కారం చేర్చి మెత్తగా రోట్లో దంచుకోవాలి. తరవాత ఆ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి పెట్టుకోవాలి. వాంతి భావన కలుగుతున్నప్పుడు దీన్ని బుగ్గన పెట్టుకుని నెమ్మదిగా చప్పరిస్తే సరి. అయితే ఒకటి, రెండుకు మించనీయొద్దు. లేదంటే నోరు కొట్టుకుపోయి ఏదీ తినలేరు.

ఇంటి చిట్కా...
వ్యాపారమైంది!

తనవాళ్లు, పిల్లలకోసం ప్రతి ఇల్లాలూ వంటింట్లో ఏదో ఒక ప్రయోగాలు చేస్తూనే ఉంటుంది. అందుకు కాజా పద్మావతి మినహాయింపు కాదు. అయితే ఆమె ఆ చిట్కాలను తన కుటుంబానికే పరిమితం చేయలేదు. అందరికీ అందిస్తూ... వ్యాపారంగానూ మలుచుకున్నారు.



పద్మావతిది కృష్ణా జిల్లాలోని మల్లవల్లి. పిల్లల ఆరోగ్యంకోసం తపన పడేవారు. వాళ్ల వయసుకు తగ్గ బరువు ఉండటానికి ప్రకృతి వైద్యుల సూచనలతో వివిధ రకాల దినుసులతో రాగి మాల్ట్ తయారు చేశారు. ఇది తన పిల్లలు, ఇంట్లోవాళ్లకి సానుకూల ఫలితాలు ఇవ్వడంతో ఇతరులకీ అందించాలనుకున్నారు. 2005లో రూ.11వేలతో 'సూర్యాహోమ్ ఫుడ్స్' ప్రారంభించారు. రైతుల నుంచి రాగులు, సజ్జ, జొన్న, సోయా, ఉలవలు వంటివి కొని, మొలకెత్తించి పొడులుగా చేసి అమ్మేవారు. మొదట చుట్టుపక్కల వాళ్లే కొనేవారు. స్పందన బాగుండటంతో సూపర్ మార్ట్‌లకీ ఆమె ఉత్పత్తులు చేరాయి. మొలకెత్తిన విత్తనాలను ఎండబెట్టి, విటమిన్లు పోకుండా పొడిచేయడానికి ప్రత్యేక యంత్రాలనీ సమకూర్చుకున్నారు. మొదట చిరుధాన్యాలపైనే దృష్టిపెట్టిన ఈమె తరవాత డ్రైఫ్రూట్స్‌సహా 15 రకాల పొడులు తయారుచేశారు. ఇవేకాదు, తులసి, మునగ, అరటి, పుదీనా, దోసకాయ, శొంఠిలతో కారప్పొడులనూ చేస్తూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కలిపి నెలకు సుమారు 10 టన్నుల వరకు విక్రయిస్తున్నారు.

ఈమె వ్యాపారానికి కొవిడ్ సమయం బాగా సాయపడింది. రోగనిరోధకశక్తి పెరిగేందుకు చాలామంది ప్రధాని, నిపుణుల సూచనమేరకు తృణధాన్యాలు, సోయా, శొంఠి వంటివాటిపై ఆధారపడ్డారు. అలా పద్మావతి ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. చాలామంది తమకోసమే కాదు... విదేశాల్లోని బంధువులకీ కొరియర్ ద్వారా పంపుతున్నారు. తన పిల్లల ఆరోగ్యం కోసం పాటించిన ఈ ఇంటి చిట్కాలతోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు పద్మావతి. పిల్లల్ని ఇంజినీరింగ్, మెడిసిన్ చదివించారు. ఇప్పుడు వాళ్లు అమెరికాలో స్థిరపడ్డారు. వ్యాపారం మెరుగవ్వడంతో భర్త రవిచంద్రన్ ఉద్యోగాన్ని వదిలి వ్యాపారంలో ఆమెకు సాయపడుతున్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో మల్లవల్లి పారిశ్రామికవాడలో పరిశ్రమనీ ఏర్పాటుచేసుకున్నారు. ప్రస్తుతం 20 మందికి ఉపాధినీ కల్పిస్తున్నారు. కష్టాన్ని నమ్ముకొని శ్రమిస్తే ఎవరైనా విజయం సాధించొచ్చు అంటారీమె.

– వై.సురేష్, మచిలీపట్నం

పారిశుద్ధ్య కార్మికురాలు...
రూ.పది లక్షలు తిరిగిచ్చారు!


అంజు



అంజు మానే... పారిశుద్ధ్య కార్మికురాలు. పుణెలోని సదాశివ్‌పేట్‌లో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నారీమె. రోజూలానే ఉదయాన్నే విధులకు వెళ్లారు. స్వచ్ఛ పుణెలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడం ఆమె పని. అలా ఆరోజు పోగయిన చెత్తను తరలిస్తుండగా రోడ్డు పక్కన ఓ బ్యాగు కనిపించింది. వైద్య సామగ్రికి సంబంధించినది అనుకుని జాగ్రత్తగా పక్కన ఉంచారు. తీరా తెరిచి చూస్తే అందులో మందులతోపాటు భారీగా నగదు ఉంది.

అప్పుడా చుట్టుపక్కల ఇళ్లవాళ్లని బ్యాగ్ పోయిందా అని అడుగుతుండగా... ఓ వ్యక్తి ఆందోళనగా దేని గురించో వెతకడం గమనించి పలకరించారు అంజు. వివరాల్ని బట్టి బ్యాగు అతనిదే అని నిర్ధరించుకున్నారు. ముందుగా అతనికి తాగడానికి నీరు అందించి, ఆయన కుదుటపడ్డాక బ్యాగును అందించారు.

ఈ ఘటన ఆమె నిజాయతీకే కాదు, పారిశుద్ధ్య కార్మికులు, పౌరుల మధ్య ఉన్న నమ్మకానికీ సామాజిక విలువలకీ కొలమానంగా నిలిచింది. ప్రతిగా కమ్యూనిటీ ప్రజలు ఆమెకు సన్మానం చేయగా, బ్యాగు హక్కుదారు ఆమెకో చీర పెట్టి, కొంత నగదునీ బహుమతిగా ఇచ్చారట. 'జీవనంకోసం ఎంత కష్టపడుతున్నా... మనది కానిది తీసుకోవడం వల్ల ఎలాంటి మంచీ జరగదు' అన్న సూత్రాన్ని బలంగా నమ్మిన అంజు మానే కచ్చితంగా మరెందరికో ఆదర్శప్రాయమే కదూ!

అమ్మానాన్నలూ...
మీకీ అలవాటుందా?

ఉత్తమ అమ్మానాన్నలు అవ్వాలి, పిల్లల్ని విజేతలుగా తీర్చిదిద్దాలి... చాలామంది కోరికే ఇది. అలా అవ్వాలంటే మీకో అలవాటు ఉండాలి అంటున్నారు నిపుణులు. అదేమిటంటే...



'ఈ ఆటలో అయితే రాణిస్తావు', 'ఈ కోర్సు చదివితేనే భవిష్యత్తు', 'ఫలానా వాద్యం నేర్చుకో'... ఆట, చదువు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్... ఇలా చాలావరకూ అమ్మానాన్నలే నిర్ణయిస్తుంటారు. పిల్లలు వాళ్లకేం తెలుసు? వాళ్ల మంచి కోసమంటూ మనకు మేలు అనిపించిన వాటిల్లో చేరుస్తుంటాం. నిజానికి చిన్నప్పట్నుంచే పిల్లలకు కొన్ని ఇష్టాలు ఏర్పడుతుంటాయి. మనం చెప్పినవన్నీ బుద్ధిగా చేస్తున్నా... వాళ్ల మనసు మాత్రం వాళ్లకి నచ్చిన వాటి చుట్టూనే తిరుగుతుందట. అంటే మనం చెప్పినవి అన్యమనస్కంగానే చేస్తుంటారనేగా! అలాకాకుండా వాళ్లకి నచ్చిన హాబీలు, ఆటలు ప్రయత్నించనివ్వండి. కొన్నిరోజుల్లోనే ఆసక్తి లేదు ఇంకోటి ప్రయత్నిస్తా అని చెప్పినా సరే... చేయనివ్వండి. ఈ తీరు వాళ్ల ప్యాషన్‌ని తెలుసుకోవడంలో సాయపడటమే కాదు, వాళ్లకి అనువైన కెరియర్ ఎంచుకోవడంలోనూ సాయపడుతుందట. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాకి చెందిన పరిశోధకులు కొన్ని పరిశోధనలు చేసిన తరవాత చెబుతున్న మాట ఇది. 'మనల్ని ఆకర్షించిన దానిపైనే మనసు లగ్నం చేయగలుగుతాం. ఆసక్తులు బయటపడేదీ అప్పుడే కాబట్టి, పిల్లలకే ఛాయిస్ ఇవ్వండి' అంటారు వాళ్లు. ఆసక్తి కలిగిన చోట సృజనకు తావుంటుంది. కొత్తది ప్రయత్నించే పట్టుదల, ధైర్యం ఏర్పడతాయి. విజేతలయ్యే వారి లక్షణాలివే అంటారా పరిశోధకులు. కాబట్టి, 'అమ్మానాన్నలూ పిల్లల ఇష్టాలేంటో గమనించండి. వాటినే ప్రయత్నించేలా ప్రోత్సహించండి. మీరు ఆ అలవాటు చేసుకుంటే మీ పిల్లల్ని విజేతలు కాకుండా ఎవరూ ఆపలేరు' అంటున్నారు. మరి ఆ అలవాటు చేసుకుంటారా?

బంగారం - వెండి



22న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,28,040	1,15,750	1,58,390
విజయవాడ	1,23,820	1,15,350	1,58,400
ప్రొద్దుటూరు	1,24,800	1,14,820	1,58,400
రాజమహేంద్రవరం	1,25,840	1,15,350	1,72,000
విశాఖపట్నం	1,25,380	1,15,350	1,60,000
తమిళనాడు	-----	1,16,300	1,72,000



రంగమేదైనా అభివృద్ధికి పాత పద్ధతులు పునాదులు కావాలే కానీ... ఆటంకాలుగా మారి ఎదుగుదలను నియంత్రించే విధంగా ఉండకూడదు. అదీ వ్యవసాయ రంగంలో ఇలాంటి వాటికి అసలే చోటివ్వకూడదు. 'మా పెద్దలు ఏం చేశారో, మేమూ దాన్నే అనుసరిస్తాం' అంటూ కూర్చుంటే ఎక్కడి వేసిన గొంగడి అక్కడే ఉంటుంది. దాన్ని గమనించే వైవిధ్య సాగుకు శ్రీకారం చుట్టారు లకేశ్ బాయ్ జైన్.

వైవిధ్యం...
ఆమె విజయం!

ఛత్తీస్‌గఢ్, కంకేర్ జిల్లాలోని నరహర్‌పూర్ గ్రామంలో పుట్టిపెరిగారు లకేశ్. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వరి ఎక్కువగా పండిస్తారు ఇక్కడ. అందుకే ఈ జిల్లాను 'రైస్ బౌల్'గానూ పిలుచుకుంటారు. కష్టమైనా నష్టమైనా వరి పంట వేయడానికే మక్కువ చూపిస్తారు ఇక్కడి రైతులు. అదే వారి అభివృద్ధికి అడ్డుకట్టగా మారింది. అది గమనించిన లకేశ్ ఈ పద్ధతుల్లో మార్పు తేవాలనుకున్నారు. ఆ మార్పు తన పొలం నుంచే ప్రారంభమవ్వాలని భావించారు. 'నాకు పదిహేడు ఎకరాల పొలం ఉంది. దానిలో ప్రతిసారీ వరి వేసేవాళ్లం. లాభనష్టాలకు అతీతంగా నా చిన్నప్పట్నుంచీ ఇలానే చేసేవారు. ఓసారి మా పొలానికి వ్యవసాయ అధికారులు వచ్చారు. భిన్న రకాల పంటల్ని వేయడం వల్ల వచ్చే లాభాల్ని వివరించారు. నేను ప్రయత్నించాలి అనుకున్నా. స్థానిక వ్యవసాయ కేంద్రంలో శిక్షణ తీసుకున్నా. ట్రైనింగ్ పూర్తయ్యాక నాలుగు ఎకరాల్లో కూరగాయలూ, ఆకుకూరల్నీ సాగుచేయడం మొదలుపెట్టా. అనతి కాలంలోనే దిగుబడి వచ్చింది. సేంద్రియ పద్ధతిలోనే పండించా కాబట్టి మంచి ఆదాయాన్నీ అందుకొన్నా. అది మొదలు పదేళ్లుగా ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నా' అంటారు లకేశ్.

ఎన్నో అవార్డులు...



ఈమె 2016 నుంచి సేంద్రియ పద్ధతుల్ని అనుసరించి సాగు చేస్తున్నారు. 20 రకాలకు పైగానే కూరగాయల్ని పండిస్తున్నారు. పశుపోషణ, ఆక్వా కల్చర్‌నూ అందిపుచ్చుకున్నారు. 'రకరకాల పంటల్ని వేయడం, పశువుల పెంపకాన్ని చేపట్టడం, ఈ వ్యర్థాలతోనే ఎరువులు తయారుచేయడం వల్ల భూసారం కూడా పెరిగింది. మొదట్లో నా సంపాదన రూ.50వేలు మాత్రమే. కానీ ఇప్పుడు నా వార్షిక ఆదాయం రూ.20లక్షలకు చేరుకుంది. పదిహేను మంది మహిళలకు ఉపాధి కూడా కల్పిస్తున్నా. రోజుకి పది, పదిహేను మందికి పైగానే రైతులు మా వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తుంటారు. సాగులోని మెలకువల్ని అడిగి తెలుసుకుంటుంటారు. ఇక్కడికి వచ్చే అవకాశం లేని వారు ఫోన్ల ద్వారానూ సలహాలు అడుగుతుంటారు. నేను తీసుకున్న ఆ నిర్ణయం నా జీవితాన్నే మార్చేసింది' అనే లకేశ్‌కు ఇందిరాగాంధీ అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయం 2016లో ఫార్మర్ ఫెలోషిప్ అవార్డును ఇచ్చింది. 2018లో ఇన్నోవేటివ్ ఫార్మర్ పురస్కారాన్నీ, ఈ ఏడాది ఉత్తమ రైతు అవార్డునూ అందుకున్నారీమె. అందరిలానే మూసధోరణిలో కొట్టుకుపోకుండా ఓ మార్గాన్ని నమ్మి అడుగేసి... శ్రమా పట్టుదలతో తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్న లకేశ్ ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!

ఈటీవీ భారత్

యాంటీ బయాటిక్ లక్షణాలు ఉన్న పసుపు చర్మానికీ మంచిదని విన్నాను. పైగా రంగూ పెంచుతుందని మా నానమ్మ చెప్పేది. కానీ, నేనేమో నల్లగా మారుతున్నా. ఇందువల్లేనా? నేనేం చేయాలి?

– నిరుపమ, రేణిగుంట

పసుపు రాస్తే మంచిదేనా?

డియర్ వసుంధర


– సూరపనేని పద్మావతి, డెర్మటాలజిస్ట్

పసుపుని శుభానికి సూచికగా, సంప్రదాయానికి ప్రతీకగా మహిళలు వాడుతుంటారు. ఇది చర్మానికి మంచిదే. ఇందులోని యాక్టివ్ కాంపౌండ్ అయిన కర్క్యుమిన్‌కి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఎక్కువ. పసుపు వాపుల్ని తగ్గిస్తుంది. మొటిమలకు కారణమయ్యే క్యూటీ బ్యాక్టీరియమ్ యాక్నేస్‌కీ, పిల్లల్లో కనిపించే పుండ్లకు కారణమయ్యే స్ట్రెప్టోకాకస్‌కూ వ్యతిరేకంగా పోరాడుతుంది. టైరోసినేస్ అనే ఎంజైమ్‌నీ నియంత్రించడంతో పిగ్మెంటేషన్ సమస్య రాదు. ఇక, మీ విషయానికి వస్తే... పసుపు వల్లే మీరు రంగు తగ్గానని అంటున్నారు. అయితే, అసలు మీరు వాడినది నిజమైన పసుపేనా కాదా అన్నది చూసుకోండి. ఎందుకంటే ఇన్‌ఫ్లమేషన్ వస్తే చర్మరంగూ మారుతుంది. ఈ మధ్య ఇలా కృత్రిమంగా తయారు చేసిన పసుపు, కుంకుమ వల్ల రంగు మారడం, మచ్చలు పడటం, అలర్జీలు వంటి ఇబ్బందులతో చికిత్స కోసం మా దగ్గరకు వస్తున్నారు. సున్నితమైన చర్మతత్వం ఉన్న కొంతమందికి పసుపు నిజంగానే పడదు. మచ్చలు వస్తాయి. రంగూ మారొచ్చు. అందుకే, ముందుగా ప్యాచ్‌టెస్ట్ చేసుకుని వాడితే మేలు.

డోరేమాన్... ఛోటాభీమ్...
కార్టూన్లన్నీ బ్రేస్‌లెట్‌పై!



కిడ్స్ కార్నర్

ఈ డిజిటల్ యుగంలో కార్టూన్లని చూడనీ, ఇష్టపడనీ పిల్లలు ఉండరంటే అతిశయోక్తి కాదేమో! నెలల వయసు నుంచే డోరేమాన్, షిన్-చాన్, ఛోటాభీమ్, మోటూ పత్లూ, కోకోమెలన్ వంటి వీడియోలను తెగ చూస్తుంటారు. అందులోని క్యారెక్టర్లను చూస్తూ కేరింతలు కొడతారు. అందుకే, వారికి సంతోషాన్నిచ్చే ఆ కార్టూన్ల బొమ్మలను ఊయలకూ వేలాడదీస్తున్నారు అమ్మానాన్నలు. ఈ బొమ్మలను చేతికిచ్చి ఆడుకునేలా చేస్తున్నారు. పిల్లల్ని ఇంకా ఆకర్షించాలని, బ్రేస్‌లెట్లపైనా ఈ కార్టూన్లనీ తీర్చిదిద్దుతున్నారు తయారీదారులు. వీటితో పాటు నక్షత్రాలు, సూర్య-చంద్రులు, పువ్వులు, ఆకులు, స్మైలీలు, ఏనుగులు, ఎలుగుబంట్లు... ఇలా ఎన్నెన్నో ఆకృతులు పసిపిల్లల చేతులపై అందంగా అమరిపోతున్నాయి. మరి ఇంకెందుకు ఆలస్యం... బుజ్జాయిల కలల ప్రపంచాన్ని వాళ్లకి బహుమతిగా ఇచ్చేయండి. వీటిని చూసుకుంటూ ఎంత మురిసిపోతారో గడుగ్గాయులు!





హార్మోన్లను సమతుల్యం చేసే కొబ్బరి!

కొబ్బరి... అందరికీ అందుబాటులో ఉండే పోషకాల ఖజానా. దీన్ని పచ్చిగా తిన్నా, పాలలా ఉపయోగించినా బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు మీ సొంతం. అవేంటో తెలుసుకుందామా!

- పొటాషియం, ఐరన్, విటమిన్ సి, ఈతో పాటు ఎన్నో ఖనిజాలు కొబ్బరిలో మెండుగా ఉంటాయి. ఇందులో కార్బోహైడ్రేట్స్ తక్కువగానూ ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగానూ ఉంటాయి. ముఖ్యంగా ఆరోగ్యకరమైన కొవ్వులు ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్లను సమతుల్యం చేస్తాయి. నెలసరి ఇబ్బందులను నియంత్రిస్తాయి.
- కొబ్బరిలోని మీడియం చైన్ ఫ్యాటీ యాసిడ్లు శక్తిమంతమైన యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఇది నోటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అంతే కాదు, ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ వ్యాధినిరోధకశక్తిని బలోపేతం చేస్తాయి. లారిక్ యాసిడ్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీ ఫంగల్ గుణాలు వివిధ రకాల వ్యాధులతో పోరాడే శక్తిని శరీరానికి ఇస్తాయి.



- రక్తహీనతతో బాధపడేవారు రోజూ కాస్త కొబ్బరి తిన్నా, కొబ్బరిపాల రూపంలో తీసుకున్నా సమస్య దూరమవుతుంది. అలానే తగినంత కాల్షియం అందించి ఎముకబలాన్నీ పెంచుతుంది. ఎప్పుడైనా కండరాలు పట్టేసినట్లు అనిపించినా, నొప్పిగా అనిపించినా కొబ్బరితో తయారు చేసిన ఆహారమేదైనా తీసుకోండి. దీనివల్ల శరీరానికి తగినంత మెగ్నీషియం అందుతుంది. కండరాలకు తగినంత విశ్రాంతి దొరికి నొప్పుల నుంచి కాస్త ఉపశమనం కలుగుతుంది.

మోక్షజ్ఞ పరిచయం ఆ చిత్రంతోనే!


మోక్షజ్ఞ

నందమూరి వారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదివరకే ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమాని అధికారికంగా ప్రకటించినా, కొన్ని కారణాలతో అది కార్యరూపం దాల్చలేదు. తాజాగా మోక్షజ్ఞ పరిచయం కానున్న సినిమాపై ఆయన తండ్రి నందమూరి బాలకృష్ణ స్పష్టతనిచ్చారు. తన 'ఆదిత్య 369'కి కొనసాగింపుగా రూపొందనున్న 'ఆదిత్య 999 మ్యాక్స్'తోనే మోక్షజ్ఞ కథానాయకుడిగా పరిచయం కానున్నట్టు తెలిపారు. 'గోవా'లో జరుగుతున్న 'ఇఫి' వేడుకల్లో బాలకృష్ణ ఈ విషయాన్ని చెప్పారు. 'ఆదిత్య 999 మ్యాక్స్' సినిమాని ప్రముఖ దర్శకుడు క్రిష్ తెరకెక్కించనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ సినిమా స్క్రిప్ట్ పనుల్లోనే ఆయన ఉన్నట్టు సమాచారం.

ఈనాడు సినిమా

సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రణాళికలు

– అన్నపూర్ణ స్టూడియో సందర్శనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


భట్టి విక్రమార్క, నాగార్జున

"తెలంగాణ యువతకు సినిమా, మీడియా, డిజిటల్, ఇతర సృజనాత్మక రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంద"న్నారు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క. ఆయన ఇటీవల ప్రముఖ కథానాయకుడు నాగార్జున ఆహ్వానం మేరకు అన్నపూర్ణ స్టూడియోను, అక్కడ నిర్వహిస్తున్న సినీ కళాశాలని సందర్శించారు. అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం ముందు నివాళులర్పించిన అనంతరం స్టూడియోలోని సాంకేతిక వనరులు, కళాశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. లఘు చిత్రాన్ని వీక్షించి, విద్యార్థులతో ముచ్చటించారు. ప్రపంచస్థాయిలో తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ఆయనతో పాటు నాగార్జున, అమల అక్కినేని ఉన్నారు.

కొత్తతరం కథలకు కేరాఫ్... ఈటీవీ విన్


'రాజు వెడ్స్ రాంబాయి'

చిత్రసీమలో విజయం అనే మాట ఎప్పుడో కానీ వినిపించదు. వందల సినిమాలు తెరకెక్కితే, పదుల సంఖ్యలోనే విజయాలు నమోదవుతుంటాయి. చిత్రసీమలో విజయం అరుదైన విషయమే అయినప్పటికీ ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ సంస్థ మాత్రం కథాబలమున్న చిత్రాల్ని, సిరీస్‌ల్ని తెరకెక్కిస్తూ వరుస విజయాలతో అదరగొడుతోంది. '#90s ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్'తో మొదలుపెడితే... 'లిటిల్‌హార్ట్స్', 'అరగగురా', 'ఎ.ఐ.ఆర్ (ఆల్ ఇండియా ర్యాంకర్స్)', 'కానిస్టేబుల్ కనకం', 'ఏనుగుతొండం ఘటికాచలం', ఈ శుక్రవారం విడుదలైన 'రాజు వెడ్స్ రాంబాయి' వరకూ! ఇలా వరుసగా వినోదాల పంట పండిస్తోంది. కొత్తతరం వినోదానికి కేరాఫ్‌గా నిలుస్తోంది.

ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ సంస్థ కొత్త తరం కథలతోనే ప్రయాణం చేస్తూ ప్రేక్షకులకు వినోదాలు పంచుతోంది. కొత్త కథల్ని వెలుగులోకి తీసుకు రావడంతోపాటు... కొత్త ప్రతిభకీ పట్టం కడుతోంది. ఈటీవీ విన్ సినిమాలు, సిరీస్‌ల్ని తెరకెక్కించిన దర్శకులు సింహభాగం కొత్తవాళ్లే. ఆయా చిత్రాలతో పదుల సంఖ్యలో కొత్త నటులూ వెలుగులోకి వస్తున్నారు. ట్రెండ్‌ని సెట్ చేసిన ఉషాకిరణ్ మూవీస్ సినిమాలు 'చిత్రం', 'నువ్వే కావాలి' విడుదలైన 25 ఏళ్ల తర్వాత మళ్లీ అలాంటి కొత్త తరం కథలతో ఈటీవీ విన్ సత్తా చాటుతుండడం విశేషం.

చిన్న సినిమాలతో పెద్ద విజయాలు...

సినిమా బడ్జెట్లు అంతకంతకూ పెరిగిపోతున్న కాలం ఇది. యువ హీరోలైనా సరే, రూ.పదుల కోట్లలో ఖర్చు చేస్తే తప్ప సినిమాలు బయటకి రావడం లేదు. ఇక అగ్ర తారల సినిమాలంటే రూ.వందల కోట్ల వ్యవహారమే. కానీ ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ సంస్థ మాత్రం పరిమిత వ్యయంతోనే సినిమాలు రూపొందిస్తోంది. చిన్న సినిమాలతో పెద్ద విజయాల్ని నమోదు చేస్తోంది. 'లిటిల్‌హార్ట్స్' సినిమా రూ.2.5 కోట్లలోపే తెరకెక్కింది. దాదాపు రూ.25 కోట్లు వసూళ్లు సాధించింది. థియేటర్లలో విడుదలైన సినిమాలే కాదు, ఓటీటీలో స్ట్రీమింగ్ అయిన సినిమాలు, సిరీస్‌లు కూడా బలమైన కథలతో ఇంటిల్లిపాదికీ వినోదాలు పంచుతున్నాయి.

నచ్చారు 'రాజు... రాంబాయి'

ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ సంస్థ నుంచి ఈ శుక్రవారం వచ్చిన చిత్రం... 'రాజు వెడ్స్ రాంబాయి'. హృద్యమైన పల్లెటూరి ప్రేమకథతో రూపొందిన ఈ చిత్రం తొలి రోజే మంచి వసూళ్లని సొంతం చేసుకుంది. కొత్తతరం నటులు అఖిల్ రాజ్, తేజస్వినీ రావ్ జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించారు. వంశీ నందిపాటి, బన్నీ వాస్ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. నిజమైన సంఘటనల ఆధారంగా... షాకింగ్‌గా అనిపించే పతాక సన్నివేశాలతో రూపొందిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. తొలిరోజే తెలుగు రాష్ట్రాల్లో రూ.1.47 కోట్లు గ్రాస్ వసూళ్లు దక్కాయి. ప్రేక్షకుల ఆదరణ దృష్ట్యా రెండో రోజే అదనంగా వంద థియేటర్లలో సినిమాని విడుదల చేశారు. ఈ సినిమా టిక్కెట్ ధరలపై కూడా ప్రేక్షకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సింగిల్ థియేటర్లలో రూ.99కే ఈ సినిమాని చూసేలా టికెట్ ధరల్ని తగ్గించారు నిర్మాతలు. తక్కువ వ్యయంతోనే ఇంటిల్లిపాదీ కలిసి సినిమాని చూసే వెసులుబాటు లభించడంతో ప్రేక్షకులు ఈ సినిమాపై ఆసక్తిని చూపుతున్నారు.

కథానాయికలు అంటే హీరోలతో కలిసి స్టెప్పులేస్తూ, ప్రేమ గులాబీలు పట్టుకుని హొయలొలికించే సుకుమార సుందరాంగులే కాదు అవసరమైతే తమలోని యాక్షన్ కోణాన్ని బయటపెడుతుంటారు. మరీ అవసరమైతే తుపాకీ చేతబట్టి తూటాల వర్షం కురిపిస్తుంటారు. ఇప్పుడు పలువురు అగ్ర కథానాయికలు అదే పనిలో ఉన్నారు. హీరోలకు దీటుగా ఫైట్లు, ఛేజింగ్‌లతో మాస్ హీరోయిజం ఎలా ఉంటుందో బాక్సాఫీస్‌కు రుచి చూపించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పుడిలా యాక్షన్ రాణులై తెరపై మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతున్న సొగసరి భామలు తెలుగులో చాలా మందే కనిపిస్తున్నారు. మరి వాళ్లెవరు? ఆ చిత్ర విశేషాలేంటి?

వయ్యారి పోరు

యాక్షన్ కథల్లో అందాల నాయికలు



గత కొన్నేళ్లుగా మన సినిమాల్లో కథానాయికల పాత్రల్ని తీర్చిదిద్దుతున్న తీరు చాలా మారింది. వాళ్లను ప్రేమ సన్నివేశాలు.. రొమాంటిక్ పాటలకే పరిమితం చేయకుండా యాక్షన్ కోణంలో ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈతరహా పాత్రలతో సాహసాలు చేసేందుకు అందాల నాయికలూ ఆసక్తి చూపిస్తుండటంతో వెండితెరపై యాక్షన్ రాణుల మెరుపులు అంతకంతకూ రెట్టింపవుతున్నాయి. నటి ప్రియాంక చోప్రా ఇప్పటికే ఈతరహా వైవిధ్యభరితమైన యాక్షన్ పాత్రలెన్నో పోషించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె మహేశ్‌బాబు - రాజమౌళిల 'వారణాసి' చిత్రంతో తెలుగులోకి పునరాగమనం చేసేందుకు సిద్ధమవుతోంది. దీంట్లో తను మందాకినిగా మరో విభిన్నమైన యాక్షన్ పాత్రతో అందర్నీ ఆశ్చర్య పరచనున్నట్లు ఇటీవల వచ్చిన ఆమె ఫస్ట్‌లుక్‌తో స్పష్టత వచ్చేసింది. మరి ఈ సినిమాలో ఆమె మహేశ్‌తో కలిసి ఎలాంటి సాహసాలు చేయనుందో చూడాలంటే 2027 వేసవి దాకా వేచి చూడక తప్పదు.

కీర్తి సాహసాలు..

నటి కీర్తి సురేశ్ ప్రస్తుతం వరుసగా యాక్షన్ పాత్రలతో సినీప్రియుల్ని మురిపించేందుకు సమాయత్తమవుతోంది. ఆమె ఈనెలాఖరున 'రివాల్వర్ రీటా'గా థియేటర్లలో యాక్షన్ హంగామా చేయనున్న సంగతి తెలిసిందే. దీని తర్వాత ఆమె నుంచి రానున్న 'కన్నెవెడి', ఇటీవల ఒప్పుకున్న 'తోట్టం'తో పాటు త్వరలో రానున్న 'అక్క' వెబ్‌సిరీస్‌లోనూ యాక్షన్ ప్రాధాన్యమున్న పాత్రలతోనే మురిపించనుంది. ముఖ్యంగా 'తోట్టం'లో కీర్తి పోషించనున్న పాత్ర ఇంతవరకు ఆమె చేసిన యాక్షన్ పాత్రలకు పూర్తి భిన్నంగా ఉండనున్నట్లు సమాచారం. మలయాళ దర్శకుడు రిషి శివకుమార్ రూపొందించనున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో తెరపైకి రానున్నట్లు తెలిసింది.

పోరు తొలిసారి

కథలు.. పాత్రల ఎంపికలో రష్మిక ఆలోచనా ధోరణి పూర్తిగా మారిపోయింది. ఓవైపు అగ్రతారలతో భారీ పాన్ ఇండియా సినిమాల్లో భాగమవుతూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా 'ది గర్ల్‌ఫ్రెండ్'తో సోలో నాయికగా తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఇక ఇప్పుడు తన తర్వాతి చిత్రం 'మైసా' కోసం తొలిసారి పూర్తి స్థాయి యాక్షన్ అవతారంలోకి మారనుంది. కొత్త దర్శకుడు రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. గోండు తెగల నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరిత యాక్షన్ థ్రిల్లర్‌లో రష్మిక శక్తిమంతమైన గిరిజన యువతిగా కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ప్రీలుక్‌లో ఆమె ఓ చేతిలో తుపాకీతో.. మరో చేతికి సంకెళ్లతో యాక్షన్ కోణంలో కనిపించిన తీరు ఆసక్తిరేకెత్తించింది. ఈ సినిమా ఇటీవలే కేరళలో చిత్రీకరణ ప్రారంభించుకుంది. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో వచ్చే అవకాశముంది.

దీపిక ఇలా.. మృణాల్ అలా!

కథానాయకుడు అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. రెండు సమాంతర ప్రపంచాల నేపథ్యంలో సాగే విభిన్నమైన కథాంశంతో ఇది తెరకెక్కుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ సినిమా కోసం దీపికా పదుకొణె, మృణాల్ ఠాకూర్ యాక్షన్ భామల్లా మారినట్లు సమాచారం. ఇప్పటికే దీపిక పాత్రను అధికారికంగా ప్రకటించినప్పటికీ.. మృణాల్ పాత్రపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. అయితే ఆమె ఇప్పటికే ఈ చిత్ర సెట్లోకి అడుగు పెట్టినట్లు తెలిసింది. ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్ కోసం వీళ్లిద్దరూ ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇక మృణాల్ ప్రస్తుతం అడివి శేష్‌తో కలిసి 'డెకాయిట్: ఎ లవ్‌స్టోరీ'లోనూ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్‌లోనూ ఆమె యాక్షన్ పాత్రతోనే అందర్నీ కట్టిపడేయనుంది. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న థియేటర్లలోకి రానుంది.

శక్తిమంతమైన బంగారి..

కమర్షియల్ చిత్రాల్లో గ్లామర్ నాయికగా సమంతను చూసి చాలా కాలమైపోయింది. ఇటీవల కాలంలో ఓ నటిగా తెరపై తనని తాను సరికొత్తగా ఆవిష్కరించుకునేందుకే ఆసక్తి కనబరుస్తోంది. ఈ క్రమంలోనే 'ది ఫ్యామిలీమ్యాన్ 2', 'యశోద' లాంటి ప్రాజెక్ట్‌ల్లో యాక్షన్ పాత్రలతో అదరగొట్టింది. ఇప్పుడదే మ్యాజిక్‌ను 'మా ఇంటి బంగారం'తో పునరావృతం చేసేందుకు ఉవ్విళ్లూరుతోంది. 'ఓ బేబీ' విజయం తర్వాత దర్శకురాలు నందిని రెడ్డితో సామ్ చేస్తున్న రెండో చిత్రమిది. 1980ల నేపథ్యంతో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో ముస్తాబు కానున్నట్లు తెలిసింది. సమంత దీంట్లో మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రలో అలరించనుంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్లలోకి రానుంది.

సంయుక్త.. యాక్షన్ పటాకా!

తెలుగులోకి అడుగు పెట్టిన అనతి కాలంలోనే.. 'భీమ్లా నాయక్', 'బింబిసార', 'విరూపాక్ష' లాంటి విజయాలతో అందరి దృష్టినీ ఆకర్షించింది నటి సంయుక్తా మేనన్. ఇప్పుడామె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం 'ది బ్లాక్ గోల్డ్'. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో శక్తిమంతమైన పోలీసుగా యాక్షన్ కోణంలో అదరగొట్టనుంది సంయుక్త. అంతేకాదు ప్రస్తుతం ఆమె నిఖిల్ 'స్వయంభూ', లారెన్స్ 'బెంజ్' చిత్రాల్లోనూ యాక్షన్ పాత్రలతోనే సాహసాలు చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలన్నీ వచ్చే ఏడాది వరుసగా ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

ఆట అంతా వెంకన్నదే...


"పాత్ర నచ్చిందంటే చాలు... తెరపైన తండ్రిగా కనిపిస్తానా లేక కథానాయకుడిగానా అనే విషయాల్ని అసలేమాత్రం పట్టించుకోను. అమితాబ్ బచ్చన్‌కు తండ్రిగా నటించాలన్నా నాకెలాంటి అభ్యంతరం ఉండదు" అన్నారు చైతన్య జొన్నలగడ్డ. యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ సోదరుడైన ఈయన... శుక్రవారం విడుదలైన 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంలో వెంకన్న పాత్రతో అందరి దృష్టినీ ఆకర్షించారు. ఆయన నటన సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా చైతన్య జొన్నలగడ్డ శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.


చైతన్య జొన్నలగడ్డ

"వినగానే షాకింగ్‌గా అనిపించింది 'రాజు వెడ్స్ రాంబాయి' కథ. వెంకన్న చివరికి ఏం చేస్తాడా అనే ఉత్కంఠ నాలోనే కలిగింది. పతాక సన్నివేశాలతోపాటు, ఈటీవీ విన్, దర్శకుడు సాయిలు, నిర్మాతలు వేణు ఊడుగుల, రాహుల్ కారణంగానే ఈ సినిమా చేశా. కచ్చితంగా సినిమా విజయం సాధిస్తుందనీ, నా నటనకు పేరొస్తుందనీ ముందే తెలుసు. కానీ మేం ఊహించిన దానికంటే గొప్పగా స్పందన లభిస్తోంది. నాకైతే రెండు రోజులుగా నిద్ర లేదు. అభినందనలు చెబుతూ పంపిస్తున్న సందేశాలకు బదులు ఇవ్వడంతోనే సరిపోతుంది. థియేటర్లలో ఈ సినిమాని ప్రేక్షకులు ఆస్వాదిస్తున్న తీరుని చూసి ఎంతో ఆశ్చర్యం కలిగింది. ఇప్పటికి మా బృందంతో కలిసి ఏడెనిమిది థియేటర్లు తిరిగాం. సినిమా అంతా గట్టిగా అరుస్తూ, అల్లరి చేస్తూ చూస్తున్న ప్రేక్షకులు, చివరి అరగంట మాత్రం నిశ్శబ్దంగా కనిపించింది. అక్కడ ఆట అంతా వెంకన్నదే. అంతగా కట్టిపడేస్తాయి ఆ సన్నివేశాలు. ఈ సినిమాలోని వెంకన్న పాత్ర గురించి మాత్రం అందరూ మాట్లాడుకుంటున్నారు. నటుడిగా నాకు మంచి గుర్తింపు వచ్చింది".

❑ "పాత్రని సులభంగానే చేశాను కానీ, గెటప్ కోసం చాలా కష్టపడాల్సి వచ్చింది. వేరొక సినిమా కోసం గడ్డం పెంచడం ఈ సినిమాకి పనికొచ్చింది. అలాగే దివ్యాంగుడిగా నటించడం కూడా ఓ సవాలే. కొన్నేళ్లపాటు అమెరికాలో ఉద్యోగం చేసి, జీవితంలో స్థిరపడిన తర్వాత సరదాగా ప్రయత్నిద్దాం అనుకుని చిత్ర పరిశ్రమలోకి వచ్చా. అయితే ఎక్కడా మా తమ్ముడి పేరుని వాడలేదు".

మహమ్మద్ రఫీతో సోనూ డ్యూయెట్




ఎన్నో రంగాలలో అద్భుతాలు చేస్తున్న కృత్రిమ మేధ.. సినీరంగంలోనూ సరికొత్త ట్రెండ్‌ను సృష్టిస్తోంది. దీని సహాయంతో పలువురు సంగీత దర్శకులు ఎంతో మంది దివంగత గాయకుల గొంతులకు మళ్లీ ప్రాణం పోసి పలు సినిమాల్లో వినిపించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ బాటలోనే గాయకుడు సోనూ నిగమ్ కూడా ఏఐని వినియోగించి దివంగత గాయకుడు మహమ్మద్ రఫీతో కలిసి డ్యూయెట్ పాడి సినీప్రియుల మనసుల్ని కదిలించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో సోనూ ఓ లైవ్ కాన్సర్ట్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగానే కృత్రిమ మేధను ఉపయోగించి రఫీతో గొంతు కలిపి ఆయనకు నివాళులర్పించారు సోనూ. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట్లో సందడి చేస్తున్నాయి.

అమ్మ ప్రేమ


రవి, శ్రేయ తివారీ

రవి, శ్రేయ తివారీ జంటగా నటించిన సినిమా 'విచిత్ర'. సైఫుద్దీన్ మాలిక్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. కుటుంబ వినోదంతో తెరకెక్కిన ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. సైఫుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ.. "అమ్మ సెంటిమెంట్ నేపథ్యంతో రూపొందిన చిత్రమిది. హృదయాన్ని తాకే సన్నివేశాలతో అమ్మ ప్రేమ, త్యాగం, భావోద్వేగాన్ని.. కుటుంబ విలువలతో అందరినీ ఆలోచింపజేసేలా కొత్త దృక్కోణంలో చూపించబోతున్నామ"ని అన్నారు. ఈ సినిమాలో జ్యోతి అపూర్వ, రవి ప్రకాశ్, సూర్య, మీనా వాసన్ తదితరులు నటించారు.

రమణ గోగుల సంగీత యాత్ర


రమణ గోగుల

తన పాటల్ని, వాటి వెనుక కథల్ని విశ్వ వేదికలపై ఆవిష్కరిస్తూ ఆస్ట్రేలియా నుంచి అమెరికా వరకూ సంగీత యాత్రని నిర్వహిస్తున్నట్టు తెలిపారు ప్రముఖ సంగీత దర్శకుడు రమణ గోగుల. డాక్యు - మ్యూజికల్ సిరీస్‌గా ఈ యాత్రని చిత్రీకరించి ఓటీటీ వేదికపై కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. 'ఇన్ కాన్వర్సేషన్స్ విత్ ది ట్రావెలింగ్ సోల్జర్ - రమణ గోగుల ఆస్ట్రేలియా టూర్' పేరుతో సాగనున్న ఈ యాత్రని మెల్‌బోర్న్ మామా క్రియేటివ్ స్పేస్, టాప్ నాచ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆస్ట్రేలియా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్రని శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అధికారికంగా ప్రకటించారు సంగీత దర్శకుడు రమణ గోగుల. మొదట ఆస్ట్రేలియాతో మొదలై, ఆ తర్వాత లండన్, అమెరికా మీదుగా ఈ యాత్ర సాగుతుందని, ప్రవాస భారతీయుల్ని కళ, కథలతో ఏకం చేయడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీశ్ వర్మ, రామ్ కట్టాల తదితరులు పాల్గొన్నారు.

పాటల చురకత్తి


హరీశ్ కల్యాణ్

హరీశ్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'దాషమకాన్'. వినీత్ వరప్రసాద్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రమిది. ప్రీతి ముకుందన్ కథానాయిక. శనివారం ఈ సినిమా టైటిల్ ప్రోమోను విడుదల చేసింది చిత్ర బృందం. హరీశ్..ఓసారి చేతిలో చురకత్తి తిప్పుతూ.. మరోసారి పాటలు పాడే మైక్‌తో కనిపిస్తుండడంతో ఇందులో ఆయన రెండు భిన్నమైన కోణాల్లో కనిపించనున్నట్లు ఈ వీడియోతో స్పష్టం చేసింది చిత్రబృందం.

మంచు మనోజ్ మోహనరాగం


మంచు మనోజ్

కథానాయకుడు మంచు మనోజ్ కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. 'మోహన రాగ మ్యూజిక్' అనే సంస్థని ఏర్పాటు చేసి సంగీత పరిశ్రమలోకి అడుగు పెడుతున్నట్టు శనివారం ఆయన ప్రకటించారు. కొత్త రకమైన మ్యూజిక్ ప్రాజెక్ట్స్‌ని ప్రోత్సహిస్తూ ఈ సంస్థ నుంచి ఒరిజినల్ గీతాల్ని, కొత్త ప్రతిభని తీసుకు రానున్నట్టు తెలిపారు. లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్ అనే నినాదంతో మనదైన ప్రతిభని ప్రపంచ స్థాయిలో నిలబెట్టేలా ఈ వేదికని మలుస్తున్నట్టు పేర్కొన్నారు. మంచు మనోజ్‌కు మొదటినుంచీ సంగీతంపై మక్కువ.

'ఛాంపియన్' చంద్రకళ



అనస్వర రాజన్

రోషన్ కథానాయకుడిగా.. ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఛాంపియన్'. అనస్వర రాజన్ కథానాయిక. స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలింస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం కథానాయిక పాత్రని పరిచయం చేస్తూ చిత్రబృందం ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. అందులో చంద్రకళ పాత్రలో అనస్వర రాజన్ చేసిన సందడి ఆకట్టుకుంది. పెద్ద కలలు కంటూ నాటక కళాకారిణిగా ఎదగాలనుకునే పల్లెటూరి అమ్మాయిగా అనస్వర చిత్రంలో కనిపిస్తుందని, ధైర్యసాహసాలున్న యువతిగా ఆ పాత్రలో ఆమె అభినయం అందరినీ ఆకట్టుకుంటుందని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్.

హానికరమైన అవపాతాలు!

జనరల్ స్టడీస్ – పర్యావరణ అంశాలు

మనుషులు, మొక్కలు, జలచరాలు తదితర జీవులతో పాటు నేలలు, కట్టడాలపైనా ఆమ్లవర్షాలు హానికరమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ ఉద్గారాలతో వాతావరణంలోని నీటి బిందువులు కలుషితమై వర్షం, మంచు, పొగమంచు, పొడి ధూళి రూపంలో భూమిపై పడుతోంది. వాతావరణంలోని కాలుష్య కారకాలకు తోడు శిలాజ ఇంధనాల దహనంతో తలెత్తుతున్న ఈ పరిస్థితులకు ప్రభావాలు, పర్యవసానాలు, నియంత్రణ చర్యల గురించి పోటీ పరీక్షార్థులకు పరిజ్ఞానం ఉండాలి. ఆమ్ల వర్షాలు ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన అనర్థాలు, పర్యావరణ వ్యవస్థలతో పాటు మనుషుల ఆరోగ్యంపై కలిగిస్తున్న దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవాలి.



నీటి ద్రావణానికి ఉండే ఆమ్లత్వం లేదా క్షారత్వాన్ని కొలవడానికి పీహెచ్ స్కేలు ఉపయోగిస్తారు. 1909లో సొరెన్‌సన్ అనే డానిష్ శాస్త్రవేత్త ఈ స్కేలును కనిపెట్టారు. ఇందులో '0' (బలమైన ఆమ్లం) నుంచి 14 (బలమైన ఆల్కలీన్) వరకు రీడింగ్ ఉంటుంది. స్కేలులో పాయింట్ 7 తటస్థతను సూచిస్తుంది.

ఆమ్ల వర్షాలు

అన్ని రకాల ఆమ్ల అవపాతాలను వివరించడానికి ఉపయోగించే విస్తృత పదం 'ఆమ్ల వర్షం (యాసిడ్ రెయిన్)'.. వాతావరణ కాలుష్య కారకాలైన సల్ఫర్, నత్రజని ఆక్సైడ్‌లు సల్ఫ్యూరిక్, నైట్రిక్ ఆమ్లాలుగా మారినప్పుడు అవపాతం మరింత ఆమ్లంగా మారుతుంది. ఆమ్ల నిక్షేపణ, ఆమ్ల వర్షం, ఆమ్ల అవపాతం తదితరాలన్నీ వాయు కాలుష్య రూపాలే. 'యాసిడ్ రెయిన్' అనే పదాన్ని మొదటగా 1870లో రాబర్ట్ అంగస్ స్మిత్ అనే శాస్త్రవేత్త ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్ నగరంలో ఉపయోగించారు. ఆమ్లవర్షం సమస్య కొత్తదేమీ కాదు. కానీ సమస్య స్వభావం పట్టణాలు, నగరాలకు విస్తరించడంతో అంతర్జాతీయ సమస్యగా మారింది. స్మిత్ కాలంలో పట్టణాలు, నగరాల్లో ఆమ్లవర్షం కురిసింది. ప్రస్తుతం వాతావరణంలోకి కాలుష్యాన్ని వెదజల్లే పొడవైన చిమ్నీలను ప్రవేశపెట్టడంతో కాలుష్య కారకాలు వేల కిలోమీటర్లు రవాణా అవుతున్నాయి.



ఆమ్ల కాలుష్య కారకాల మూలాలు: వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వల్ల అవపాతం సహజంగా ఆమ్ల స్వభావంతో ఉంటుంది. శిలాజ ఇంధనాలను మండించడం వల్ల సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ ఉత్పత్తి అవుతాయి. ఇవి అవపాతం ఆమ్ల గుణాన్ని పెంచుతాయి.

సల్ఫర్ డయాక్సైడ్, నత్రజని ఆక్సైడ్‌ల ఉత్పత్తి, అగ్ని పర్వతాలు, మహాసముద్రాలు, జీవక్షయం, అడవుల్లో మంటలు మొదలైనవి ఆమ్ల కాలుష్యానికి సహజ కారణాలు. వాటితోపాటు దహన వనరులు కూడా కారకాలే. ఇటీవలి దశాబ్దాల్లో విద్యుత్తు డిమాండ్, మోటారు వాహనాల సంఖ్య పెరగడంతో ఆమ్లీకరణ కాలుష్య కారకాలు, ఉద్గారాలు విపరీతంగా పెరిగాయి. 1950 తర్వాత వచ్చిన పరిణామాలతో కాలుష్య కారక ఉద్గారాలు ఉత్తరార్ధ గోళంలో, ముఖ్యంగా ఐరోపా, ఉత్తర అమెరికాల్లో కేంద్రీకృతమయ్యాయి. దీంతో ఆ దేశాల్లో అవపాతం ఆమ్ల స్వభావాన్ని సంతరించుకుంది. 1970, 1980లో స్కాండినేవియన్ దేశాలు చెట్లు, మంచినీటిపై ఆమ్ల ప్రభావాలను గుర్తించాయి. దానికి కారణమైన కాలుష్యాల్లో ఎక్కువ భాగం ఇతర దేశాల నుంచి రవాణా అయినవే అని గ్రహించారు. దీంతో ఆమ్ల వర్షం అంతర్జాతీయ ఆందోళనగా మారింది.

ఆమ్ల వర్షం ప్రభావాలు

చేప జాతులకు ముప్పు

ఆమ్ల వర్షం కారణంగా జర్మనీ, ఇతర ఐరోపా దేశాల్లోని అనేక నీటివనరుల పీహెచ్ విలువ ఐదు కంటే తక్కువగా ఉంటుంది. ఈ ఆమ్ల స్థాయి అనేక చేప జాతులకు ప్రాణాంతకం. ఆమ్ల నీరు మట్టి నుంచి అల్యూమినియాన్ని విడుదల చేస్తుంది. ఇది ప్రవాహాల్లో కలిసి నీటి వనరుల్లోకి చేరుతుంది. ఆల్కలీన్ లేదా న్యూట్రల్ సరస్సుల్లో రాళ్లు, మట్టి, సెడిమెంట్లలో అల్యూమినియం సాంద్రత తక్కువగా ఉంటుంది. పీహెచ్ తగ్గినప్పుడు గతంలో కరగని అల్యూమినియం నీటి ద్రావణంలోకి వెళుతుంది. దాంతో చేపలకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుంది.



సరస్సు పర్యావరణ వ్యవస్థపై ప్రభావం

అమెరికా, కెనడా, నార్వే తదితర దేశాల్లో వేలాది సరస్సులు ఆమ్లత్వం వల్ల నిరుపయోగంగా మారాయి. ఇందులో ఫైటోప్లాంక్టన్ తక్కువ స్థాయిలో ఉంటుంది. పెంకులున్న నత్తలు, క్లామ్స్, ఇతర జంతువులు ఆమ్ల నీటిలో సులభంగా కరిగిపోతాయి. వీటితో పాటు చేపలూ మరణిస్తాయి. డ్రాగన్ ఫ్లై లార్వా, వాటర్ బోట్ మ్యాన్ లాంటి కొన్ని కీటకాలు ఆమ్ల సరస్సుల్లో ఆహార గొలుసు పైభాగంలో ఉన్న చేపల స్థానాన్ని భర్తీ చేస్తాయి. నీటి మొక్కలు చనిపోతాయి. సరస్సు నాచుతో నిండిపోయి, ఇతర సూక్ష్మజీవులూ నశిస్తాయి.

భౌగోళిక పర్యావరణ వ్యవస్థపై ప్రభావం

1) కిరణజన్య సంయోగక్రియ, పెరుగుదల రేటు తగ్గుతుంది. 2) కరవు, వ్యాధులకు సున్నితంగా మారుతుంది. 3) బీన్స్, ముల్లంగి, పాలకూర లాంటి వివిధ రకాల పంటల్లో ఎదుగుదల మందగిస్తుంది. 4) నైట్రోజన్ ఫిక్సింగ్ బ్యాక్టీరియా కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఇది చివరికి నైట్రోజన్ వలయానికి ఆటంకం కలిగిస్తుంది. 5) స్ప్రూస్, పైన్ బూడిద, బిర్చ్ మొదలైన చెట్లు ఆమ్ల నిక్షేపణకు ఎక్కువగా గురవుతాయి.





నిర్మాణ సామగ్రి నష్టం

ఆమ్ల వర్షంతో రంగులు, స్టీల్, ప్లాస్టిక్ తదితర భవన నిర్మాణ సామగ్రితో పాటు పాలరాయి, సున్నపురాయి మొదలైన వాటికి నష్టం జరుగుతుంది. వాతావరణంలో పెరిగిన ఆమ్లత వల్లే తాజ్‌మహల్ సహజ సౌందర్యం మసకబారుతోంది. దీనికి 40 కిలోమీటర్ల దూరంలో చమురుశుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం.

మానవాళికి రోగాలు



వాతావరణ ఆమ్లత్వం దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలను కలిగిస్తుంది. రాగి, కాడ్మియం, జింక్, పాదరసం తదితర భార లోహాలు ఆమ్ల వర్షం ద్వారా నేల, శిలల నుంచి విడుదలవుతాయి. ఇవి ఆహార గొలుసులోని మొక్కలు, జంతువుల ద్వారా లేదా తాగునీటి రూపంలో మనుషుల శరీరంలోకి చేరతాయి. వాహనాల్లో ఇంధనం మండినప్పుడు వాయు కాలుష్య కారకాలు ఉత్పత్తి అవుతాయి. యూఎస్, జపాన్ 1970ల్లో మోటారు వాహనాల ఉద్గారాలను నియంత్రించడానికి కఠినమైన ప్రమాణాలను ప్రవేశపెట్టాయి. వాహన ఉద్గారాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మనుషుల ఆరోగ్యానికి ప్రమాదకరం. వాటి ప్రభావంతో రక్తానికి ఆక్సిజన్ మోసే సామర్థ్యం క్షీణించడంతోపాటు, శ్వాస సమస్యలు ఏర్పడతాయి. ఉత్ప్రేరక కన్వర్టర్ల వాడకంతో వాహనాల ఉద్గారాలను తగ్గించవచ్చు.

పారిశ్రామిక ఉద్గారాల నియంత్రణ: అనేక పారిశ్రామిక వనరుల్లో దహన ప్రక్రియల కారణంగా సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌ల ఆమ్ల ఉద్గారాలు ఉత్పన్నమవుతాయి. వాటిని తగ్గించడానికి పలు సాంకేతికతలు అందుబాటులో ఉన్నాయి. వాటిని దహనానికి ముందు, దహన సమయంలో లేదా తర్వాత ఉపయోగించవచ్చు.

ప్రత్యామ్నాయ ఇంధనాలు: కొన్ని ఇంధనాలు సహజంగానే ఆమ్ల ఉద్గారాల పరంగా తక్కువ కాలుష్యాన్ని ఉత్పత్తి చేస్తాయి.

పరిష్కార మార్గాలు

కాల్చే బొగ్గులో ఉన్న సల్ఫర్ పరిమాణం ఆధారంగా కాలుష్యం పెరుగుతుంది. థర్మల్ కేంద్రాల్లో తక్కువ సల్ఫర్ ఉండే శిలాజ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, జల, పవన విద్యుత్తు, అలల విద్యుత్తు లాంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించుకోవడం మొదలైన చర్యలు కాలుష్యాన్ని తగ్గిస్తాయి. డీ-సల్ఫ్యురైజేషన్ ప్రక్రియ వినియోగం, ఇంజిన్లలో మార్పులు తదితర పద్ధతులు కూడా మేలు చేస్తాయి.

ఆమ్ల జలాల్లో హేచరీ చేపలు: ఆమ్లీకరించిన సరస్సుల్లో పర్యావరణ సమతౌల్యత నిర్వహణకు ఈ విధానాన్ని చేపడతారు. చేపల సంఖ్య మరింత క్షీణించకుండా ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.

◆ భూమి క్షీణతతో భారత వ్యవసాయ ఉత్పత్తిలో 11%-26% వరకు నష్టపోతుండగా, ఆమ్ల వర్షాలు మరింత పెంచుతున్నాయి.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్



■ భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) విజయవంతంగా రూపొందించడంలో కీలకపాత్ర పోషించినందుకు ప్రతిష్ఠాత్మక 'లివింగ్ బ్రిడ్జ్' పురస్కారాన్ని ఎవరికి ప్రకటించారు?

జ: బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్

■ 2025, సెప్టెంబరు 23 నాటికి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని ప్రారంభించి ఎన్నేళ్లు పూర్తయ్యాయి? (ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ నిధులతో కూడిన ఆరోగ్య హామీ పథకమైన ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనను ఝార్ఖండ్ రాజధాని రాంచీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018లో ప్రారంభించారు.)

జ: ఏడేళ్లు

■ 2026, మార్చి 31తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ జీడీపీ వృద్ధి రేటును ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ ఎంత శాతంగా అంచనా వేసింది?

జ: 6.5%

■ రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి అగ్ని-ప్రైమ్ క్షిపణిని భారత దేశం ఇటీవల విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి పరిధి ఎంత? (రైలు ప్లాట్‌ఫామ్‌ల నుంచి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించగలిగే సామర్థ్యం ఉన్న అమెరికా, చైనా, రష్యాల సరసన భారత్ చేరింది.)

జ: 2000 కి.మీ.

మరింత సమాచారం

శ్రద్ధ ఉంటే గుర్తుంచుకోవడం సులభమే!

స్టడీ స్కిల్స్



'ఎంత చదివినా గుర్తుండటం లేదు' ఎక్కువ మంది విద్యార్థులు చెప్పే మాట ఇదే. కానీ చదివింది గుర్తుండకపోవడానికి ముఖ్యకారణం దానిమీద మనకు శ్రద్ధ లేకపోవడం, ప్రయత్నం చేయకపోవడం, గుర్తుంచుకోవాలనే ఆలోచన కలగకపోవడమే. పట్టుదల ఉంటే ఎంత కఠినమైన విషయాన్ని అయినా గుర్తుంచుకోవడం కష్టం కాదు. అలాగే జ్ఞాపకశక్తికి ముఖ్యమైంది పునశ్చరణ. అనవసరమైన విషయాలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, చదివే పాఠ్యాంశంపై అభిరుచి పెంచుకోవడం ద్వారా కూడా 'గుర్తుండటం లేదు' అనే మాట లేకుండా చేయవచ్చు. విద్యార్థులు, పోటీ పరీక్షార్థులు జ్ఞాపకశక్తిని పెంచుకునే అలాంటి కిటుకులు తెలుసుకునేందుకు క్యూఆర్ స్కాన్ చేయండి.

దరఖాస్తు చేశారా?




☛ రైట్స్ లిమిటెడ్‌లో ఇండివిడ్యువల్ కన్సల్టెంట్ పోస్టులు
చివరి తేదీ: 2025 నవంబరు 24.

☛ ఐఐఎంలో మల్టీ-టాస్కింగ్ స్టాఫ్ పోస్టులు
చివరి తేదీ: 25.11.2025.

పవనాలు.. ప్రవాహాలను నిర్ణయించే భ్రమణాలు!


ప్రపంచ భూగోళ శాస్త్రం



భూమి తన చుట్టూ తాను తిరుగుతూ దీర్ఘవృత్తాకారంలో సూర్యుడి చుట్టూ తిరుగుతుంటుంది. ఈ భ్రమణాల వల్లే పగలు, రాత్రి, రుతువులు ఏర్పడుతుంటాయి. ఈ ఖగోళ ప్రక్రియలో సంభవించే సహజ మార్పులను అర్థం చేసుకోవడానికి, భూమిపై ఏదైనా ప్రదేశానికి సంబంధించి కచ్చితమైన స్థానాన్ని గుర్తించడానికి, దూరాలను లెక్కించడానికి, సమయ మండలాలను నిర్ణయించడానికి భూమధ్యరేఖకు సమాంతరంగా అక్షాంశాలను, ఉత్తర ధ్రువం నుంచి దక్షిణ ధ్రువానికి రేఖాంశాలను గీశారు. ఈ ఊహాత్మక రేఖల ప్రాధాన్యం, ప్రామాణిక రేఖాంశాల గురించి పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. భూమి చలనంతో ఏర్పడే అపహేళి, పరిహేళి, విషవత్తులు, సూర్యుడు, భూమి, చంద్రుడు మధ్య సగటు దూరాలు, గ్రహణాలు ఏర్పడే తీరు తదితర అంశాలన్నింటిపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.

భూమి - చలనాలు అక్షాంశాలు - రేఖాంశాలు

1. కింది వాటిలో భూభ్రమణానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి?



ఎ) భూమి ఎల్లప్పుడూ తన అక్షాన్ని ఆధారంగా చేసుకుని గంటకు 1610 కి.మీ. వేగంతో పశ్చిమం నుంచి తూర్పునకు తిరుగుతుంది.
బి) భూమి ఒకసారి భ్రమణం చేయడానికి 23 గంటల 56 నిమిషాల 4.09 సెకన్ల సమయం పడుతుంది.
సి) భూభ్రమణం జరిగేటప్పుడు దాని గరిష్ఠ వేగం భూమధ్య రేఖ వద్ద ఉండగా, ధ్రువాల వద్ద శూన్యం.
డి) భూభ్రమణ సమయంలో ఉత్తర, దక్షిణ ధ్రువాలు స్థిరంగా ఉంటాయి.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి, సి, డి సరైనవి
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు

2. భూమి పరిభ్రమణంలో భాగంగా విషవత్తులకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) మార్చి 21, సెప్టెంబరు 23 తేదీల్లో విషవత్తులు సంభవిస్తాయి.
బి) విషవత్తుల సమయంలో సూర్యకిరణాలు భూమధ్య రేఖ వద్ద నిటారుగా పడతాయి.
సి) మార్చి 21న ఏర్పడే విషవత్తును 'వసంతకాల విషవత్తు' అంటారు.
డి) సెప్టెంబరు 23 నాడు ఏర్పడే విషవత్తును శరత్కాల విషవత్తు అంటారు.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు


3. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) భూమి కక్ష్యా మార్గం దాదాపుగా దీర్ఘవృత్తాకారంలో ఉంటూ సరాసరి 940 మిలియన్ కి.మీ. పొడవు ఉంటుంది.
బి) భూమిపై ఉన్న ఏదైనా ఒక రేఖాంశాన్ని సూర్యుడు దాటిన సమయం నుంచి తిరిగి అదే రేఖాంశాన్ని సూర్యుడు చేరడానికి పట్టే సమయాన్ని 'సౌరదినం' అంటారు.
సి) భూ పరిభ్రమణ వేగం గంటకు సరాసరి 1,08,000 కి.మీ..
డి) భూమిలో సగభాగాన్ని సూర్యుడు ఎప్పుడూ ప్రకాశమంతంగా చేస్తాడు. ఈ అంచునే ప్రకాశ వృత్తం అంటారు. ఇది ఎల్లప్పుడూ భూభ్రమణం వల్ల మారుతూ ఉంటుంది.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, బి, సి, డి సరైనవి.

4. భూభ్రమణానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి?



ఎ) భూభ్రమణం వల్ల భూమి ఉపరితలం పైన పవనాలు ప్రభావితం చెందుతాయి.
బి) భూభ్రమణం కారణంగా అపకేంద్ర బలం ఏర్పడి కొంత వరకు పోటుపాటులు కూడా ఏర్పడుతున్నాయి.
సి) భూభ్రమణం వల్ల దిక్కులు, సమయభావన లాంటివి కూడా ఏర్పడుతున్నాయి.
డి) భూభ్రమణం కారణంగా పవనాలు, సముద్ర ప్రవాహాలు ఉత్తరార్ధ గోళంలో కుడివైపు, దక్షిణార్ధ గోళంలో ఎడమ వైపు వంగి ప్రయాణిస్తాయి.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.

5. కింది వాక్యాలను సరిచూడండి.



ఎ) భూమి సూర్యుడి చుట్టూ తిరిగే క్రమంలో భూమికి సూర్యుడికి మధ్య అత్యధిక దూరం ఏర్పడే స్థితిని 'అపహేళి' అంటారు.
బి) భూ పరిభ్రమణ సమయంలో భూమికి సూర్యుడికి మధ్య అత్యల్ప దూరం ఏర్పడే స్థితిని 'పరిహేళి' అంటారు.
సి) జనవరి 3 నాడు ప్రధానంగా పరిహేళి ఏర్పడుతుంది. ఈ సమయంలో భూమి అధిక సౌరపటాన్ని పొందుతుంది.
డి) జులై 4 నాడు 'అపహేళి' ఏర్పడుతుంది. ఈ సమయంలో భూమి అత్యల్ప సౌరపుటాన్ని పొందుతుంది.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.

6. భూ పరిభ్రమణంలో భాగంగా జూన్ 21 నాడు జరిగే పరిణామాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి?
ఎ) జూన్ 21 నాటికి భూ పరిభ్రమణంలో భాగంగా సూర్యకిరణాలు నిటారుగా కర్కటరేఖపై ప్రసరిస్తాయి.
బి) జూన్ 21 నాటికి ఉత్తర ధ్రువం సూర్యుడి వైపు వాలి ఉంటుంది. అందుకే సూర్యకిరణాలు కర్కటరేఖ నుంచి ఉత్తర ధ్రువం వైపు ప్రసరిస్తాయి.
సి) జూన్ 21 నాటికి సూర్యుడు పూర్తిగా ఉత్తరార్ధ గోళంలో ఉంటూ పగటి సమయం ఎక్కువగా, రాత్రి సమయం తక్కువగా ఉండేలా చేస్తాడు.
డి) భూ పరిభ్రమణంలో భాగంగా జూన్ 21 నాటికి ఉత్తరార్ధ గోళంలో వేసవి కాలం, దక్షిణార్ధ గోళంలో శీతాకాలం ఏర్పడతాయి.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

7. రేఖాంశాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) రేఖాంశాలు మొత్తం భూగోళాన్ని విభిన్న కాల మండలాలుగా విభజిస్తాయి.
బి) రెండు రేఖాంశాల మధ్య దూరం 111.3 కి.మీ., అందువల్ల తూర్పు, పశ్చిమ అర్ధగోళాల మధ్య దూరాన్ని కొలవవచ్చు.
సి) రెండు రేఖాంశాల మధ్య అధిక దూరం భూమధ్య రేఖ వద్ద ఉంటుంది. కాని ధ్రువాల వద్ద ఒకదాంతో కలుస్తాయి.
డి) భారత ప్రామాణిక రేఖాంశం, కర్కటరేఖలు ఛత్తీస్‌గఢ్‌లోని బైకుంఠాపుర్ వద్ద ఖండించుకుంటాయి.
1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.


8. కింది వాటిని జతపరచండి.

ఎ) భూమికి, సూర్యుడికి మధ్య సరాసరి దూరం	1) 3,84,400 కి.మీ.
బి) పరిహేళి సమయంలో భూమికి సూర్యుడికి మధ్య దూరం	2) 152 మి.కి.మీ.
సి) అపహేళి సమయంలో భూమికి, సూర్యుడికి మధ్య దూరం	3) 147 మి.కి.మీ.
డి) భూమికి, చంద్రుడికి మధ్య దూరం	4) 150 మి.కి.మీ.

1) ఎ-4 బి-3 సి-2 డి-1 2) ఎ-1 బి-2 సి-3 డి-4
3) ఎ-4 బి-1 సి-3 డి-2 4) ఎ-3 బి-1 సి-4 డి-2

9. భూ పరిభ్రమణంలో భాగంగా డిసెంబరు 22 నాటికి జరిగే పరిణామాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి?
ఎ) డిసెంబరు 22 నాటికి దక్షిణ ధ్రువం సూర్యుడి వైపు వాలి ఉంటుంది.
బి) సూర్యకిరణాలు డిసెంబరు 22 నాటికి నిటారుగా మకరరేఖ మీద ప్రసరిస్తాయి.
సి) డిసెంబరు 22 నాటికి సూర్యుడు దక్షిణార్ధ గోళంలో అధికంగా ఉంటూ మకరరేఖ నుంచి సూర్యకిరణాలు దక్షిణ ధ్రువం వైపు అధికంగా ప్రసరింపజేస్తాడు.
డి) భూ పరిభ్రమణంలో భాగంగా డిసెంబరు 22 నాటికి దక్షిణార్ధ గోళంలో వేసవి కాలం, ఉత్తరార్ధ గోళంలో శీతాకాలాలు ఏర్పడతాయి.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు
3) ఎ, బి, సి, డి సరైనవి
4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు

10. గ్రహణాలకు సంబంధించి వాక్యాలను సరిచూడండి?



ఎ) భూమి సూర్యుడి చుట్టూ, చంద్రుడు భూమి చుట్టూ పరిభ్రమించే సమయంలో అవి ఒకే సరళరేఖపై చేరినప్పుడు ఏర్పడే నీడలనే 'గ్రహణాలు' అంటారు.
బి) సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు వచ్చినప్పుడు సూర్యకాంతి చంద్రుడిపై, చంద్రుడి ఛాయ భూమిపై ప్రసరిస్తే సూర్యగ్రహణం ఏర్పడుతుంది.
సి) సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి వచ్చినప్పుడు సూర్యకాంతి భూమిపై ప్రసరించి, భూమి ఛాయలోకి చంద్రుడు పూర్తిగా వస్తే చంద్రగ్రహణం ఏర్పడుతుంది.
డి) సూర్యగ్రహణం అమావాస్యనాడు ఏర్పడుతుంది. చంద్రగ్రహణం పౌర్ణమి నాడు ఏర్పడుతుంది.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

11. కింది వాటిని జతపరచండి.

జాబితా - 1	జాబితా - 2
ఎ) మహావృత్తం	1) రేఖాంశాలు
బి) అంతర్జాతీయ దినరేఖ	2) 0° రేఖాంశం
సి) ప్రధాన రేఖాంశం	3) భూమధ్య రేఖ
డి) మధ్యాహ్నరేఖలు	4) 180° రేఖాంశం

1) ఎ-1 బి-4 సి-3 డి-2 2) ఎ-4 బి-3 సి-2 డి-1
3) ఎ-3 బి-4 సి-2 డి-1 4) ఎ-3 బి-1 సి-2 డి-4

12. అక్షాంశాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) అక్షాంశాలను సాధారణంగా ధ్రువ నక్షత్రం ఆధారంగా గుర్తిస్తారు.
బి) అక్షాంశాలు ప్రధానంగా భూగోళాన్ని విభిన్న శీతోష్ణస్థితి మండలాలుగా విభజిస్తాయి.
సి) రెండు అక్షాంశాల మధ్య సరాసరి దూరం 111 కిలోమీటర్లు. అందువల్ల ఉత్తర, దక్షిణ ధ్రువాల మధ్య దూరాన్ని కొలవవచ్చు.
డి) అక్షాంశాలు పూర్తిగా వృత్తాలుగా సమాంతరంగా ఉంటాయి. ఒకదాంతో మరొకటి ఖండించుకోవు.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

13. కింది వాటిని జతపరచండి.

కర్కటరేఖను ఖండించే నదులు	రాష్ట్రాలు
ఎ) చంబల్, బెట్వా, కెన్	1) పశ్చిమ బెంగాల్
బి) దామోదర నది	2) గుజరాత్
సి) మహి, సబర్మతి	3) మధ్యప్రదేశ్
డి) హుగ్లీ నది	4) ఝార్ఖండ్

1) ఎ-3 బి-4 సి-2 డి-1
2) ఎ-1 బి-4 సి-3 డి-2
3) ఎ-1 బి-4 సి-2 డి-3
4) ఎ-4 బి-3 సి-2 డి-1



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-2; 2-1; 3-4; 4-2; 5-1; 6-2; 7-3; 8-1; 9-3; 10-1; 11-3; 12-2; 13-1.



జొహన్నెస్‌బర్గ్‌లో జీ20 సదస్సు సందర్భంగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్‌లతో నవ్వులు చిందిస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ





జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, అంగోలా అధ్యక్షుడు జోవో లౌరెంకో, కెనడా ప్రధాని మార్క్ కార్నీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, సౌదీ అరేబియా, అర్జెంటీనా విదేశాంగ మంత్రులు ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్, పాబ్లో క్విర్నో

ఎమ్మెల్యే వస్తే లేచి నిలబడలేదని వైద్యుడిని తొలగిస్తారా?

అసంతృప్తి వ్యక్తంచేసిన హరియాణా హైకోర్టు

చండీగఢ్: కరోనా సమయంలో రోగులను పరామర్శించడానికి అత్యవసర గదిలోకి ఎమ్మెల్యే వచ్చిన సమయంలో లేచి నిలబడలేదంటూ విధుల్లో ఉన్న వైద్యుడిని తొలగించడంపై పంజాబ్, హరియాణా హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. అంకితభావంతో పనిచేసే వైద్యుల పట్ల ఇటువంటి చర్యలు 'అవాంఛనీయమైనవి' అని జస్టిస్ అశ్వినీ కుమార్ మిశ్ర, జస్టిస్ రోహిత్ కపూర్‌ల ధర్మాసనం పేర్కొంది. పిటిషన్‌దారు పీజీ వైద్యవిద్యను అభ్యసించేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ)ని అందించాలని హరియాణా అధికారులను ఆదేశించింది. రూ.50 వేల వరకు ఖర్చును భరించాలని అధికారులకు స్పష్టంచేసింది. అసలేమైందంటే.. . పిటిషన్‌దారు డా.మనోజ్ హరియాణా ప్రభుత్వంలో వైద్య అధికారిగా పనిచేస్తున్నారు. కొవిడ్-19 సమయంలో ఆయన ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో ఆసుపత్రిని సందర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యేను చూసి, లేచి నిలబడనందుకు తనకు షోకాజ్ నోటీసులు అందాయని పిటిషన్‌లో వైద్యుడు ఆరోపించారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. వైద్యుడికి ఎన్‌ఓసీని నిరాకరిస్తూ.. .. సంవత్సరాల తరబడి అభ్యర్థనను పెండింగులో ఉంచడం సరికాదంది. వెంటనే నిరభ్యంతర పత్రాన్ని జారీచేయాలని హరియాణా అధికారులను ఆదేశించింది.

రోగుల పడకలపై కుక్కలు

ఖాండ్వా: మధ్యప్రదేశ్ ఖాండ్వా జిల్లాలోని ఓ ఆసుపత్రిలో రోగులకు ఏర్పాటుచేసిన పడకలపై శునకాలు నిద్రిస్తున్న వీడియో ఒకటి వైరల్ అయింది. దీంతో అక్కడ పనిచేసే క్లీనర్‌ను విధుల నుంచి తొలగించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న నర్సు జీతంలో ఏడు రోజుల వేతనాన్ని తగ్గించాల్సిందిగా అధికారులు ఆదేశాలిచ్చారు. ఈ ఘటన కిల్లోద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చోటుచేసుకుంది.

ఓటరుగా ఎవరుండాలో ప్రభుత్వం నిర్ణయిస్తోంది

- ఎస్ఐఆర్‌పై పరకాల ప్రభాకర్

కోల్‌కతా: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)కు ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ శనివారం కొత్త భాష్యం చెప్పారు. ఎస్ఐఆర్ అంటే ఓటరుగా ఎవరుండాలన్నది ప్రభుత్వం నిర్ణయించడం, ఎవరి ప్రభుత్వం ఉండాలో ఓటరు నిర్ణయించడం కాదు అని ఆయన అన్నారు. దేశంలో ఏ వర్గాలు ఉండకూడదని ప్రభుత్వం భావిస్తుందో వారిని ఏరివేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని ఆయన ఆరోపించారు. దేశంలోని 12 రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కసరత్తు.. రాజ్యాంగ విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, రాజ్యాంగ నైతికతలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో 'ద ఎడ్యుకేషనిస్ట్స్ ఫోరం' నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారీ నిరసనల కారణంగా ఎన్‌ఆర్‌సీని నిర్వహించలేకపోయిన కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్‌ను ముందుకు తెచ్చిందని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలను, నిరక్షరాస్యులను, మైనారిటీ వర్గాలను ఓటరు జాబితాల నుంచి తొలగించాలన్న లక్ష్యంతో ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నారని తెలిపారు. బిహార్‌లో ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ కసరత్తు వాస్తవానికి పశ్చిమబెంగాల్ కోసం ఉద్దేశించిందని రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ అన్నారు.

'సర్' విధుల నిర్వహణలో ముగ్గురు బీఎల్‌వోల మృతి

- పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్‌లో ఘటనలు

కోల్‌కతా: ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కసరత్తులో విధులు నిర్వహిస్తోన్న ముగ్గురు బూత్ లెవల్ అధికారు(బీఎల్‌వో)లు మృతి చెందారు. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్‌లలోని వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. బెంగాల్‌లోని నాదియా జిల్లాలో బీఎల్‌వోగా పనిచేస్తున్న రింకు తరాఫ్దార్(52) అనే మహిళ శనివారం ఉదయం ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. ఆమెపై 'సర్' పనిభారం తీవ్ర ఒత్తిడిని కలిగించిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

✦ మధ్యప్రదేశ్‌లోని రాయ్‌సేన్, దమోహ్ జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఇద్దరు బీఎల్‌వోలు అనారోగ్యం కారణంగా మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. వీరిద్దరూ ఉపాధ్యాయులు. వారిని సత్లాపుర్ ప్రాంతానికి చెందిన రమాకాంత్ పాండే, రాంజ్‌రా గ్రామానికి చెందిన సీతారాం గోండ్(50)గా గుర్తించారు. సర్ పని భారం కారణంగానే మృతిచెందినట్లుగా వారి బంధువులు ఆరోపించారు.



పశ్చిమబెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ(సర్) చేపట్టడంతో 24 ఉత్తర పరగణాలు జిల్లా నుంచి తమ దేశానికి వెళ్లేందుకు వేచి ఉన్న బంగ్లాదేశ్ పౌరులు

స్నేహమా.. దేశ గౌరవమా..!

- జెలెన్‌స్కీలో గుబులు రేపుతున్న ట్రంప్ శాంతి ప్రణాళిక



రష్యాతో యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 28 పాయింట్ల శాంతి ప్రణాళికతో ఉక్రెయిన్ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఒప్పందంలోని చాలా అంశాలు రష్యాకు అనుకూలంగా ఉన్నాయని కీవ్ భావిస్తోంది. అంగీకరిస్తే దేశ ఆత్మగౌరవం దెబ్బతింటుంది. ఒప్పుకోకపోతే ట్రంప్ ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుంది. అమెరికాతో స్నేహాన్ని కోల్పోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో వారం రోజుల్లో ఒప్పందంపై నిర్ణయం చెప్పాల్సిందిగా ట్రంప్ ఇచ్చిన అల్టిమేటంతో.. ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరిస్థితి కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్నట్లు తయారైంది. అదే సమయంలో రాజకీయంగా, సైనికపరంగా కూడా ఆయన తీవ్ర ఇబ్బందుల్నే ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుతం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరిస్థితి బలహీనంగా ఉంది. ఆయన ప్రభుత్వం ఇటీవల 100 మిలియన్ డాలర్ల అవినీతి కుంభకోణంలో చిక్కుకొంది. దీంతో రాజకీయంగా ఆ దేశంలో పెద్ద దుమారం రేగుతోంది. కుంభకోణంలో జెలెన్‌స్కీ పేరు లేకపోయినా, ఆయన సన్నిహితుల ప్రమేయం ఉంది. వారిని పదవుల నుంచి తొలగించాలన్న డిమాండ్ పెరుగుతోంది. ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేల్లోనూ అది వెల్లడైంది. ఇలాంటి సమయంలో తెరపైకి వచ్చిన ట్రంప్ శాంతి ప్రణాళిక.. జెలెన్‌స్కీపై మరింత ఒత్తిడిని పెంచుతుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే ఒప్పందంలోని చాలా అంశాలు రష్యాకు అనుకూలంగా ఉన్నాయి. ఈ శాంతి ప్రణాళిక ప్రకారం.. ఉక్రెయిన్ తన సైన్యాన్ని ఆరు లక్షలకు కుదించుకోవాలి. నాటోలోకి ఉక్రెయిన్ ఎప్పటికీ చేరకూడదు. అన్నింటికంటే కీలకం.. క్రిమియా, డాన్‌బాస్, లుహాన్స్క్‌తో పాటు.. ఖేర్సన్‌లో, జపోరిజియాలలో కొన్ని భూభాగాలను రష్యాకు అప్పగించాలి. ఈ ప్రతిపాదనను జెలెన్‌స్కీ తొలి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. అయినా ఒప్పందంలో భూభాగాల అప్పగింత ప్రతిపాదనను ట్రంప్ చేయడం గమనార్హం.

యుద్ధంలోనూ ఎదురుదెబ్బలు

యుద్ధక్షేత్రంలోనూ ఉక్రెయిన్‌కు పరిస్థితులు ఆశాజనకంగా లేవు. చాలా ప్రాంతాల్లో ఆ దేశ సైన్యానికి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రష్యా నెమ్మదిగా కీలక ప్రాంతాలను ఆక్రమిస్తోంది. దొనెట్స్క్, ఖేర్సన్ ప్రాంతాల్లో ముందుకు కదులుతోంది. ఉక్రెయిన్ ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా భారీస్థాయిలో దాడులు చేస్తోంది. ఆయుధాల కొరత కూడా ఉక్రెయిన్ సైన్యాన్ని ఇబ్బంది పెడుతోంది. అమెరికా, ఇతర ఐరోపా దేశాల నుంచి సరఫరాలు అనుకున్నంత వేగంగా ఆ దేశానికి చేరడం లేదు. మానవ వనరుల కొరత కూడా వేధిస్తోంది. కొత్తగా సైన్యంలోకి ఎవరూ చేరడానికి ముందుకు రావడం లేదు. దీంతో సైన్యం నైతిక స్థైర్యమూ దెబ్బతింటోంది.

పెరుగుతోన్న అగ్రరాజ్య ఒత్తిడి

అమెరికా ఆయుధాలు, ఆర్థిక సాయం అందిస్తేనే రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ నిలుస్తుంది. ఆ విషయంలో జెలెన్‌స్కీకి తెలుసు. అందుకే "ప్రస్తుతం మా దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఒప్పందాన్ని అంగీకరిస్తే, దేశ ఆత్మగౌరవాన్ని కోల్పోవాల్సి ఉంటుంది. తిరస్కరిస్తే కీలక భాగస్వామి(అమెరికా)ని వదులుకోవాల్సి ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ 28 పాయింట్ల శాంతి ప్రణాళికపై నెలరోజుల నుంచి చర్చలు జరుగుతున్నాయి. అమెరికా పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కాఫ్, అటు రష్యా.. ఇటు ఉక్రెయిన్‌తో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. ఒప్పందానికి అంగీకరించకపోతే.. ఆయుధ సాయాన్ని నిలిపివేస్తామని. నిఘా సమాచారం పంచుకోమని ఇప్పటికే ఉక్రెయిన్‌కు అమెరికా హెచ్చరికలు పంపినట్లు సమాచారం. అయితే ఈ మొత్తం వ్యవహారంలో జెలెన్‌స్కీకి ఊరట కలిగించే అంశమేంటంటే.. ఐరోపా దేశాలు అండగా నిలవడం. రష్యాకు అనుకూలంగా శాంతి ప్రణాళికలోని అంశాలు ఉన్నాయని ఐరోపా నేతలు భావిస్తున్నారు. మరి వారి మద్దతుతో రానున్న రోజుల్లో ట్రంప్ ఒత్తిడిని జెలెన్‌స్కీ అధిగమిస్తారా..లేక తలొగ్గుతారా అనేది చూడాలి.

- నేషనల్ డెస్క్

అవార్డు అందుకుంటే నోబెల్ గ్రహీత జైలుకే..

- మరియా కొరీనా మచాడోకు కొత్త చిక్కులు



ఇంటర్నెట్ డెస్క్: ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనా మచాడోను వరించిన విషయం తెలిసిందే. డిసెంబరు 10న నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది. అయితే ఈ అవార్డును అందుకునే విషయంలో మరియాకు చిక్కులు ఎదురవుతున్నాయి. అజ్ఞాతంలో ఉన్న ఆమె నోబెల్ బహుమతి స్వీకరించడానికి దేశం దాటి బయటకు వెళ్తే పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని వెనెజువెలా అటార్నీ జనరల్ వెల్లడించారు. మరియాపై కుట్రలు, విద్వేషాన్ని ప్రేరేపించడం, ఉగ్రవాదం వంటి ఆరోపణలు, పలు కేసులు ఉండడంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఇదీ వివాదం!

వెనెజువెలా ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి ఆరోపిస్తున్నారు. ఈ ముఠాలతో వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. దీంతో ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. అగ్రరాజ్యం చేపట్టిన ఈ చర్యలకు మరియా మద్దతు ఇచ్చినందుకు ఆమెపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు అటార్నీ జనరల్ తన నివేదికలో తెలిపారు. అందుకే ఆమె దేశం దాటి వెళ్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో వచ్చే నెలలో నోబెల్ పురస్కారాన్ని తీసుకునేందుకు మరియా వెళ్లకపోవచ్చని సమాచారం.

'తేజస్' పైలట్ మృతిపై హిమాచల్‌లో విషాదం

ధర్మశాల/ హమీర్పుర్: దుబాయ్‌లో తేజస్ యుద్ధ విమానం కూలిపోయిన ఘటనలో పైలట్ వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్ ప్రాణాలు కోల్పోవడంతో హిమాచల్ ప్రదేశ్‌లోని ఆయన స్వస్థలం నగ్రోటా భగవాన్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన సన్నిహితులు ఈ దుర్ఘటనను జీర్ణించుకోలేకపోతున్నారు. అద్భుతమైన క్రీడాకారుడిగా, దేశభక్తుడిగా ఆయనను స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.


శుక్రవారం దుబాయ్ ఎయిర్‌షోలో విన్యాసాలు నిర్వహిస్తుండగా తేజస్ జెట్ కూలి, అందులోని పైలట్ నమాంశ్ దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. శనివారం ఆయన నివాసం వద్ద హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులను స్థానికులు ఓదారుస్తున్నారు. నమాంశ్ మృతదేహం శనివారం ఉదయం తమిళనాడులోని కోయంబత్తూరుకు సమీపంలో ఉన్న సూలూర్ వైమానిక కేంద్రానికి చేరుకున్నట్లు బంధువులు తెలిపారు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. నమాంశ్.. హమీర్పుర్ జిల్లాలోని సుజాన్‌పుర్ జిల్లాలో ఉన్న సైనిక్ స్కూల్‌లో చదువుకున్నారు. ఆయన మరణవార్త అక్కడ కూడా విషాదం నింపింది. ఆయనకు నివాళిగా శనివారం ఈ పాఠశాలలో ప్రత్యేక ప్రార్థన సమావేశం జరిగింది. ఇక్కడి సిబ్బంది, పూర్వ విద్యార్థులు ఆయనతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

నమాంశ్ తండ్రి జగన్నాథ్ స్యాల్.. కుమారుడు పాల్గొన్న ఎయిర్‌షో వీడియోలను ఆసక్తిగా యూట్యూబ్‌లో వీక్షిస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. వెంటనే ఆయన.. వాయుసేనలోనే పనిచేస్తున్న తన కోడలికి ఫోన్ చేశారు. కొద్దిసేపటికే కొందరు అధికారులు జగన్నాథ్ ఇంటికి వచ్చారు. దాంతో తన కుమారుడికి ఏదో ప్రమాదం జరిగిందని ఆయన మనసు కీడు శంకించింది. కానీ, అప్పటికే అంతా జరిగిపోయిందని ఆయన కన్నీరుమున్నీరయ్యారు.

మరోవైపు నమాంశ్ మృతికి పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ సంతాపం తెలిపారు. భారత్‌తో తమ వైరం 'ఆకాశానికే' పరిమితమని ఆయన చెప్పారు. వైమానిక ప్రదర్శనల సమయంలో కలిసికట్టుగా ఉంటామన్నారు. ఆకాశమే హద్దుగా సాహసాలు చేసే వీరులను గౌరవిస్తామని చెప్పారు. ఖురాన్ బోధనలను అనుసరించి.. దురదృష్టకర ఘటనలను హర్షించబోమన్నారు.

మేవాఢ్ రాజ కుటుంబికులతో డొనాల్డ్ ట్రంప్ కుమారుడి భేటీ

ఉదయ్‌పుర్: ప్రవాస భారతీయుడైన అమెరికా పారిశ్రామికవేత్త రామలింగ రాజు మంతెన కుమార్తె వివాహానికి రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు ట్రంప్ జూనియర్, అతని స్నేహితురాలు.. శనివారం మేవాఢ్ రాజకుటుంబికులతో భేటీ అయ్యారు. ఉదయ్‌పుర్ సిటీ ప్యాలెస్‌లో రాజ కుటుంబ సభ్యుడు లక్ష్యరాజ్ సింగ్ వీరిని ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మేవాఢ్ వంశీకుల చరిత్ర, సంస్కృతి గురించి ట్రంప్ జూనియర్ అడిగి తెలుసుకున్నారు. మహారాణా కుంభ, మహారాణా సంగ, మహారాణా ప్రతాప్ వీరోచిత యుద్ధాలు, పాలన ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని ట్రంప్ జూనియర్ ప్రశంసించారని ప్యాలెస్ అధికారులు తెలిపారు. అతిథులకు రాజకుటుంబ సభ్యులు ప్రత్యేక బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు.



మేవాడ్ రాజకుటుంబికుడు లక్ష్యరాజ్ సింగ్‌తో ట్రంప్ జూనియర్, అతని స్నేహితురాలు


ఆడంబరంగా వివాహ సంబరాలు

పారిశ్రామికవేత్త రామలింగరాజు మంతెన కుమార్తె నవ్య, ఎన్నారై వంశీ గాదిరాజు వివాహ మహోత్సవం ఉదయ్‌పుర్‌లో అంగరంగ వైభవంగా జరుగుతోంది. శనివారం మనక్ చౌక్ ప్యాలెస్‌లో సంగీత వేడుక కనువిందు చేసింది. నృత్య కార్యక్రమాలతో బాలీవుడ్ సినీ తారలు సందడి చేశారు. ట్రంప్ జూనియర్, అతని స్నేహితురాలు వీరందరితో జత కలిశారు. నవ్య, వంశీ వివాహం ఆదివారం ఉదయం జగ్మందిర్‌లో జరగనుంది.

నేపాల్‌లో ప్రమాదకర స్థితిలో 42 హిమానీనద సరస్సులు

- ఐసీఐఎంఓడీ నిపుణుడి హెచ్చరిక

కాఠ్‌మాండూ: నేపాల్‌లో ఆకస్మికంగా విస్ఫోటనం చెందేందుకు అవకాశం ఉన్న 42 హిమానీనద సరస్సులను గుర్తించారు. శంఖువాసభ జిల్లాలోని ఖండబరీలో శుక్రవారం నేపాల్ హిమానీనద సరస్సుల్లో వేగవంతమైన మార్పులపై జరిగిన చర్చల్లో అంతర్జాతీయ ఏకీకృత పర్వతాభివృద్ధి కేంద్రం (ఐసీఐఎంఓడీ) నిపుణుడు శరద్ ప్రసాద్ జోషి పాల్గొన్నారు. హిమానీనద సరస్సుల విస్ఫోటనంతో వరదలు సంభవించి భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఆ దేశంలో ఉన్న దాదాపు 2,069 హిమానీనద సరస్సుల్లో 42 ప్రమాదం అంచున ఉన్నాయని వెల్లడించారు. వీటిలో నాలుగు అత్యంత ప్రమాదకరస్థాయిలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రమాదం తగ్గింపు చర్యలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.



చైనా ఆయుధ ప్రయోగశాలగా...

భారత్-పాక్ యుద్ధం

- అమెరికా కాంగ్రెస్ కమిటీ నివేదిక

వాషింగ్టన్: భారత్-పాకిస్థాన్ మధ్య మే నెలలో జరిగిన స్వల్పకాల యుద్ధాన్ని చైనా తన ఆయుధాలను పరీక్షించడానికి, ప్రచారం చేసుకోవడానికి ఉపయోగించుకుందంటూ అమెరికా కాంగ్రెస్ కమిటీ తాజాగా ఓ నివేదికను ప్రచురించింది. ఈ ఘర్షణలో ప్రత్యక్షంగా పాల్గొనకుండానే తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థను చైనా పరీక్షించిందని తెలిపింది. తమ ఆయుధాల అమ్మకాలను ప్రోత్సహించడానికి ఈ ఘర్షణను చైనా ఓ అవకాశంగా చూసిందని వెల్లడించింది. తన హెచ్‌క్యూ-9 గగనతల రక్షణ వ్యవస్థ, గగనతలంలోంచి గగనతలంలోని లక్ష్యాల్ని ఛేదించే క్షిపణి పీఎల్-15, యుద్ధవిమానం జే-10ను పరీక్షించడానికి భారత్-పాక్ యుద్ధాన్ని చైనా ఓ ప్రయోగశాలగా చూసిందని పేర్కొంది. ఆ తర్వాత జూన్‌లో 40 జే-35 ఐదోతరం యుద్ధ విమానాలను, కేజే-500 విమానాన్ని, బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థను పాకిస్థాన్‌కు విక్రయించడానికి చైనా ముందుకు వచ్చినట్లు ఆరోపించింది. ఇరు దేశాల ఘర్షణ సమయంలో వాడిన తమ ఆయుధాలు విజయవంతమయ్యాయని చైనా గొప్పగా ప్రచారం చేసుకున్నట్లు ఈ నివేదికలో అమెరికా స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ యుద్ధ విమానాల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చైనా ఓ తప్పుడు ప్రచార కార్యక్రమాన్ని నడిపిందని పేర్కొంది. అయితే అమెరికా నివేదికలోని ఆరోపణలను చైనా తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా అవాస్తవమని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు.

పాకిస్థాన్‌లో 17 మంది టీటీపీ ఉగ్రవాదుల మృతి

పెషావర్: పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో భద్రతా దళాలు చేపట్టిన పలు ఆపరేషన్లలో మొత్తం 17 మంది టీటీపీ ఉగ్రవాదులు మృతి చెందారని, పలువురు గాయపడ్డారని శనివారం పోలీసులు తెలిపారు. బన్నూ జిల్లాలోని షెరీ ఖేల్, పక్కా పహార్ ఖేల్ ప్రాంతాల్లో పోలీసులు, భద్రతా దళాలు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఒక ఆపరేషన్‌లో 10 మంది, మరో ఆపరేషన్‌లో 7 మంది ఉగ్రవాదులు మృతిచెందారు.

విద్యార్థుల కోసం

'జెన్-జడ్' పోస్టాఫీస్‌లు

ఇంటర్నెట్ డెస్క్: యువత కోసం ఆధునిక సేవలను అందించే దిశగా పోస్టల్ విభాగం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. దేశంలో జెన్-జడ్ థీమ్‌తో పోస్టాఫీసులను తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే దిల్లీలో రెండు పోస్టాఫీసులను ప్రారంభించారు. మొదటి జెన్-జడ్ పోస్టాఫీసును ఈనెల 19న ఐఐటీ దిల్లీలో, ఈనెల 20న దిల్లీ యూనివర్సిటీలో మరొక పోస్టాఫీసును ప్రారంభించారు. పోస్టల్ విభాగం సేవలను లేఖలను పంపించడానికే కాకుండా నేటి డిజిటల్ యుగానికి అనుగుణంగా వివిధ సేవలు అందించే కేంద్రంగా మార్చి చెందించని యువతకు చూపించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసింది. వచ్చే ఏడాది జనవరి నాటికి మొత్తం 46 విద్యా సంస్థల్లో ఇలాంటి పోస్టాఫీసులను జెన్-జడ్ పోస్టాఫీసులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

పోస్టాఫీసు ప్రత్యేకతలివే!

- ఈ జెన్-జడ్ పోస్టాఫీసు కేవలం పార్శిళ్లు, లేఖలు పంపించడమే కాకుండా సోషల్ లెర్నింగ్ స్పేస్‌గా రూపొందించారు.
- విద్యార్థులు ఇక్కడ ఉచితంగా వైఫైని వినియోగించుకోవచ్చు. అలాగే పుస్తకాలు చదువుకునేలా లైబ్రరీ ఉంటుంది.
- సౌకర్యవంతంగా కూర్చొని ఆర్ట్ ప్రదర్శనలను వీక్షించవచ్చు.
- క్యాంపస్‌లో విద్యార్థులు, అధికారులు, స్థానిక నివాసితులు స్నేహపూర్వ సమయం గడపడానికి సౌకర్యంగా ఉంటుంది.
- ఈ జెన్-జడ్ పోస్టాఫీసులో ఆర్ట్ కార్నర్ కూడా ఉంటుంది. అందులో విద్యార్థులు రూపొందించిన చిత్రాలు, స్కెచ్‌లు, ఫొటోగ్రాఫ్‌లను ప్రదర్శిస్తుంది.

200 ఏళ్లనాటి హిందూ చిత్రాల ఎగుమతిపై బ్రిటన్ నిషేధం

లండన్: దాదాపు రెండు శతాబ్దాల క్రితం చిత్రీకరించిన దేవీగాథల్ని తెలియజేసే హిందూ మతానికి చెందిన 56 అపురూప చిత్రాల ఎగుమతిపై బ్రిటన్ ప్రభుత్వం నిషేధం విధించింది. దేవీ మాత ఉద్భవాన్ని, ఆ దేవి సాధించిన విజయాలను చిత్రీకరించిన ఈ చిత్రాల ధర రూ.3.29 కోట్లుగా నిర్ణయించారు. దేవీ మాతకు సంబంధించిన నిశ్శబ్ద ధ్యాన దృశ్యాల నుంచి కాళీమాతగా ఆ తల్లి సాగించిన యుద్ధం వరకూ అనేక అపురూప దృశ్యాలతో కూడుకున్న ఈ చిత్రాలు బంగారు, వెండి పూతలతో వేశారు. "ఎంతో అందంగా ఉన్న ఈ చిత్రాలు బ్రిటన్‌లోనే అపురూపమైనవి" అని బ్రిటన్ సాంస్కృతిక శాఖ మంత్రి బారోనెస్ ఫియోనా ట్వైక్రాస్ అన్నారు. 1810 ప్రాంతంలో చిత్రించిన ఈ చిత్రాలు పంజాబ్‌లోని కాంగ్రా ప్రాంతంలో రూపొందాయి. ఈ కళాఖండాల చిత్రకారుడు ఎవరన్నది ఇంకా నిర్ధారించలేదు. ఈ అపురూప చిత్రాలు 1980 నుంచీ స్పింక్ అండ్ సన్ అనే కళాఖండాల సేకరణ సంస్థ ఆధీనంలో ఉన్నాయి. అంతకు ముందు అవి బ్రిటన్ పాలనలో ఉన్న భారత్‌లో అనేక పరిపాలక, న్యాయ, రాజకీయ పదవుల్ని నిర్వహించిన డాక్టర్ అల్మా కమ్రుద్దీన్ లతీఫ్ వద్ద ఉండేవి.

లక్ష్యం అల్లంత దూరం

- శిలాజ ఇంధనాల ప్రస్తావన లేకుండానే ముసాయిదా ప్రతి
- ముగిసిన కాప్-30 చర్చలు

బెలెమ్(బ్రెజిల్): కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్- 30 (కాప్-30) పేరుతో ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న వాతావరణ చర్చలు ఎట్టకేలకు ముగిశాయి. వాతావరణ మార్పు కారణంగా అధికంగా నష్టపోతున్న దేశాలకు మరింత పరిహారం చెల్లించడానికి శనివారం ఈ సదస్సులో అంగీకారం కుదిరింది. అయితే ఈ ఒప్పంద ముసాయిదాలో శిలాజ ఇంధనాల వినియోగంపై నియంత్రణకు మార్గసూచి ఏదీ లేకపోవడం గమనార్హం. అలాగే ప్రమాదకర ఉద్గారాలు తగ్గించడానికీ ఎలాంటి ప్రతిపాదనా లేదు. దీంతో భూతాపాన్ని పెంచుతున్న బొగ్గు, చమురు, సహజవాయువుల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ సదస్సు కఠిన చర్యలు సూచిస్తుందని ఆశించిన దేశాలు, పర్యావరణ కార్యకర్తలకు నిరాశే మిగిలింది. కాప్ సదస్సులో అనేక అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. వాతావరణ మార్పు కారణంగా అతి దారుణంగా నష్టపోతున్న దేశాలకు 30 వేల కోట్ల డాలర్లు పంచేందుకు గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మొత్తాన్ని ఎలా పంచాలన్న విషయంపై కాప్-30 సదస్సులో విస్తృత చర్చలు జరిగాయి. భూతాపాన్ని పెంచుతున్న ఉద్గారాల నియంత్రణకు సభ్యదేశాలు కఠిన చర్యలు తీసుకోవాలన్న విషయంపై సైతం చర్చలు జరిగాయి. గతంలో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా ప్రపంచ దేశాలు శిలాజ ఇంధనాలకు దూరం కావాలని గట్టిగా వాదించారు. ఆయన వాదనను 80 దేశాలు సమర్థించాయి కూడా. అయితే డొలాగో చేసిన తాజా ప్రతిపాదనల్లో శిలాజ ఇంధనం అన్న మాట కూడా ప్రస్తావించలేదు.



ప్రపంచశాంతిపై బౌద్ధ సన్యాసుల సదస్సు

ఈటీవీ భారత్: పశ్చిమబెంగాల్‌లోని బోల్‌పుర్‌లో గల విశ్వభారతి విశ్వవిద్యాలయంలో "ప్రపంచశాంతి - బౌద్ధ దృక్పథాలు" అనే అంశంపై శుక్ర, శనివారాల్లో అంతర్జాతీయ సదస్సు జరిగింది. భారత్‌తోపాటు రష్యా, చైనా, బంగ్లాదేశ్, తైవాన్, శ్రీలంక, భూటాన్ వంటి 15 దేశాల నుంచి దాదాపు 300 మంది బౌద్ధ సన్యాసులు తరలివచ్చారు. మహారాష్ట్ర, నలందా, కోల్‌కతా విశ్వవిద్యాలయాల పరిశోధకులు సైతం హాజరయ్యారు. రవీంద్రనాథ్ టాగోర్, గౌతమ బుద్ధుడి బోధలతోపాటు ప్రపంచశాంతిపై వర్సిటీలోని లిపిక ఆడిటోరియంలో రెండు రోజులపాటు చర్చలు జరిగినట్లు నిర్వాహక బృందంలోని రిటైర్డ్ ప్రొఫెసర్ కిశోర్ భట్టాచార్య తెలిపారు. విశ్వభారతి వీసీ ప్రబీర్ కుమార్ ఘోష్ ఈ సదస్సుకు ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా బౌద్ధ సన్యాసులు శాంతిసందేశం చాటుతూ శాంతినికేతన్ దాకా పాదయాత్ర నిర్వహించారు.

అక్రమ ఆయుధ రవాణా ముఠా గుట్టు రట్టు

ఇంటర్నెట్‌డెస్క్: పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐతో సంబంధం ఉన్న అంతర్జాతీయ అక్రమ ఆయుధ రవాణా ముఠా దిల్లీ పోలీసుల చేతికి చిక్కింది. పాకిస్థాన్ నుంచి డ్రోన్‌ల సాయంతో దిల్లీ, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్ ప్రాంతాల్లోని గ్యాంగ్‌స్టర్లకు ఈ ముఠా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. రాడార్ కంటికి చిక్కకుండా తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్‌ల సాయంతో ఈ ముఠా ఆయుధాలు భారత భూభాగంలోకి చేరవేస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. డీసీపీ సంజీవ్ కుమార్ యాదవ్ నేతృత్వంలోని బృందం ఈ ఆపరేషన్ చేపట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్లీలో కొంతమంది భారీగా అక్రమ ఆయుధాలు తరలిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి క్రైమ్ బ్రాంచ్‌కు సమాచారం అందించింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు పలు ప్రాంతాల్లో నిఘా ఉంచగా.. రోహిణిలో ఈ ఆయుధ మాడ్యూల్ గుట్టు బయటపడింది. నిందితులు డ్రోన్‌లను ఉపయోగించి పాకిస్థాన్ నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పంజాబ్ సరిహద్దుల నుంచి తీసుకొచ్చిన ఈ ఆయుధాలను లారెన్స్ బిష్ణోయ్, బాంబిహా, గోగి వంటి గ్యాంగ్ సభ్యులకు ఇవ్వాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.నిందితుల నుంచి విదేశాల్లో తయారైన 10 అత్యాధునిక సెమీ ఆటోమెటిక్ పిస్టల్స్‌తో పాటు 92 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. లభ్యమైన ఆయుధాలు తుర్కియే, చైనా దేశాల్లో తయారైనవిగా తెలిపారు. ఈ మాడ్యూల్‌కు చెందిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరు ఈ ఆయుధాలను ఎవరికి విక్రయించారు, నెట్‌వర్క్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారనే వివరాలు తెలుసుకునేందుకు అధికారులు కూపీ లాగుతున్నారు. నిందితులకు చెందిన మొబైల్ ఫోన్లు, బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నారు. దిల్లీలో ఎర్రకోట వద్ద బాంబు పేలుడుపై దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో ఈ రాకెట్ గురించి బయటపడటం గమనార్హం.

15 వేల మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళిక: సీడాప్ సీఈఓ

ఈనాడు, అమరావతి: నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించడమే రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి సంస్థ (సీడాప్) లక్ష్యమని సీఈఓ నారాయణస్వామి తెలిపారు. ప్రాజెక్టు అమలు సంస్థలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "డీడీయూజీకేవై-2.0 కార్యక్రమం ద్వారా 15 వేల మంది గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆరోగ్యం, రిటైల్-సేల్స్, లాజిస్టిక్స్, ఐటీ, హాస్పిటాలిటీ, ఆటోమొబైల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, నిర్మాణ రంగంలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. త్వరలో జరగనున్న ప్రాజెక్టు అనుమతుల కమిటీ సమావేశంలో వీటికి తుది అనుమతులు లభించనున్నాయి. ఆయా రంగాల్లో మూడు నెలలపాటు ఉచితం భోజనం, ఏకరూప దుస్తులు, స్టడీ మెటీరియల్ ఇచ్చి, శిక్షణ ఇస్తాం' అని తెలిపారు.


మత్తుతో యువత జీవితాల్ని నాశనం చేసిన జగన్

- మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో యువతను మత్తుకు బానిస చేసి వారి జీవితాల్ని మాజీ సీఎం జగన్ నాశనం చేశారని మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి మండిపడ్డారు. వైకాపా పాలనలో దేశంలో ఎక్కడ మత్తు పదార్థాలు దొరికినా వాటి మూలాలు ఏపీలోనే ఉండేవని గుర్తుచేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేసి గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతోందని పేర్కొన్నారు.

వచ్చే ఏడాది 40% కొత్త నియామకాలు

- ఫ్రెషర్లకు ప్రాధాన్యం ఇస్తున్న ఐటీ కంపెనీలు
- అభ్యర్థుల నైపుణ్యాల అంచనాకు ఏఐ వినియోగం
- తయారీ రంగంలో అనుభవానికి ప్రాధాన్యం
- భారత నైపుణ్యాల నివేదిక వెల్లడి



తయారీ, ఆటోమోటివ్ రంగాల్లో డిమాండ్ ఉంది.

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో 40% కొత్త నియామకాలు జరిగే అవకాశం ఉందని భారత నైపుణ్యాల నివేదిక-2026 అంచనా వేసింది. ఈ ఏడాది 29 శాతంతో పోల్చితే పెరుగుదల నమోదు కానుంది. కంపెనీల వృద్ధి, విస్తరణ కోసం కొత్తగా నియామకాలు చేపట్టనున్నాయి. ఐటీ పరిశ్రమలు ఫ్రెషర్ల నియామకాలకు ప్రాధాన్యం ఇస్తుండగా.. తయారీ రంగం మాత్రం అనుభవం ఉన్న వారిని తీసుకునేందుకే ఆసక్తి చూపుతున్నాయి. ఏఐసీటీఈ, సీఐఐ సహకారంతో వీబాక్స్ సంస్థ సర్వే నిర్వహించి భారత నైపుణ్యాల నివేదిక-2026ను తాజాగా విడుదల చేసింది. ఉద్యోగాలు, నియామకాల్లో వచ్చే ఏడాది చోటుచేసుకోనున్న మార్పులను ఈ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా ఐటీ రంగంలో 35% ఫ్రెషర్లను నియమించుకోవాలని కంపెనీలు చూస్తున్నాయి. గతేడాది 14% పోలిస్తే ఇది చాలా ఎక్కువ. తయారీ రంగంలో మాత్రం కొత్తవారికి చాలా తక్కువగా ఉద్యోగాలు రానున్నాయి. ఇది 5%గా ఉండనుంది. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల్లో 1-5 సంవత్సరాల అనుభవం ఉన్న 65%మందితో కొత్త నియామకాలు చేపట్టనున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా(బీఎఫ్ఎస్ఐ)లో ఇది 32%గా ఉంది. మధ్య స్థాయి నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు

ఉద్యోగాల్లో 72% పర్మినెంట్

దేశంలో ఉద్యోగాల్లో 72% పర్మినెంట్ ఉద్యోగాలే ఉంటున్నాయి. అత్యధికంగా బీఎఫ్ఎస్ఐ రంగంలో 80% శాశ్వత ఉద్యోగాలే ఉంటున్నాయి. థర్డ్ పార్టీ, గిగ్ వర్క్‌లో శాశ్వత ఉద్యోగాలు కేవలం 16% మాత్రమే. ఇన్‌ఫ్రా, తయారీలో 25%గా ఉన్నాయి.

✦ కాంట్రాక్టు ఉద్యోగాలు దేశ వ్యాప్తంగా సరాసరిన 7% ఉండగా.. ఐటీ రంగంలో 15%, ఫార్మా, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో 25% ఉన్నాయి. ఇది దేశ సరాసరి కంటే ఎక్కువ.

✦ బీఎఫ్ఎస్ఐ రంగం 26% నుంచి 50% వరకు అంతర్గత నియామకాలతో అగ్రస్థానంలో ఉంది. ఉద్యోగులను బయట నుంచి తీసుకోవడం కంటే కంపెనీ లోపల నుంచే పదోన్నతులు ఇవ్వడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

✦ ఫార్మా, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో అనుభవం ఉన్న వారికి అవకాశాలు ఇస్తున్నాయి.

✦ ఆటోమొబైల్, ఇన్‌ఫ్రా, ఐటీ, తయారీ విభాగాల్లో అంతర్గత నియామకాలు 10%-25% వరకు ఉన్నాయి. ఈ సంస్థలు అంతర్గత పదోన్నతులకు ప్రాధాన్యం ఇవ్వగానే అవసరమైతే బయట నుంచి నియామకాలు చేపడుతున్నాయి. బయటి మార్కెట్ నిపుణులను పొందేందుకు అవకాశం ఉంటుందని ఈ సంస్థలు భావిస్తున్నాయి.

పెరుగుతున్న ఏఐ ఇంటర్వ్యూలు..

చాలా పరిశ్రమలు ఇంటర్వ్యూలు, అభ్యర్థుల నైపుణ్యాలు అంచనా వేసేందుకు కృత్రిమ మేధ(ఏఐ)ని వినియోగిస్తున్నాయి. ఐటీ కంపెనీల్లో 70% ఏఐని అమలు చేస్తున్నాయి.

● బీఎఫ్ఎస్ఐ రంగంలో ఇంటర్వ్యూలు, అభ్యర్థుల స్క్రీనింగ్‌లు 50% ఏఐని వినియోగిస్తుండగా.. ఆటోమోటివ్, తయారీ రంగాల్లో 45% అమలు చేసే ప్రణాళికలో ఉన్నాయి. ● ఆటోమోటివ్‌లోని కంపెనీలు ఇప్పటికే 35% ఏఐని అమలు చేశాయి.

నియామకాల్లో మారుతున్న ప్రాంతాలు..

టైర్-3 నగరాల్లో ఆటోమోటివ్ కంపెనీల నియామకాలు పెరుగుతున్నాయి. గతంలో టైర్-3 నగరాల్లో 17% నియామకాలు ఉండగా.. ఇప్పుడు ఇవి 20 శాతానికి పెరగనున్నాయి. సూరత్, మైసూరు, తిరుచ్చి లాంటి నగరాల్లో నియామకాలు పెరుగుతున్నాయి.

● తయారీ రంగంలో టైర్-1 నగరాల్లో గతంలో 50% నియామకాలు ఉండగా.. ఇప్పుడు 35 శాతానికి తగ్గాయి. టైర్-2లో గతంలో 33% ఉండగా.. ఇది 35 శాతానికి పెరిగింది.

● ఫార్మా, హెల్త్‌కేర్‌లోనూ టైర్-2, టైర్-3 నగరాల్లో నియామకాలు పెరుగుతున్నాయి.

● బీఎఫ్ఎస్ఐ రంగంలో మాత్రం టైర్-1 నగరాల్లోనే ఎక్కువ నియామకాలు ఉన్నాయి.

● ఐటీ రంగం నియామకాల్లో మైసూరు, విశాఖపట్నం, మంగళూరు వంటి టైర్-3 నగరాల్లో 10% ఉంటున్నాయి. కొచ్చి, కోయంబత్తూరు, ఇండోర్ లాంటి టైర్-2 నగరాల్లో 25%, టైర్-1 నగరాల్లో 65% నియామకాలు ఉంటున్నాయి.

బంగారు 'నిధి'.. విధికి ఎదురీది!

క్యాన్సర్‌తో కాలు కోల్పోయినా.. ఈత పోటీల్లో ఇంటర్ బాలిక రాణింపు



కృత్రిమ కాలితో నిధి

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: అన్ని బాగున్నా క్రీడల వైపు వెళ్లడానికి కొందరు వెనకడుగు వేస్తుంటారు. కానీ, క్యాన్సర్ బారిన పడి కాలు కోల్పోయినా ఓ బాలిక పట్టుదలతో శిక్షణ తీసుకుని స్విమ్మింగ్‌లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఆమే.. విశాఖ మద్దిలపాలెంకు చెందిన బి.నిధి. ఈమెకు ఏడేళ్ల వయస్సులోనే క్యాన్సర్ సోకింది. ముంబయి టాటా ఆసుపత్రి వైద్యులు ఆమెను పరీక్షించి మొదట్లో తొడభాగాన్ని తొలగించారు. అనంతరం రొటేషనల్ ప్లాస్టిక్ సర్జరీ విధానంలో మిగిలిన కాలు అతికించారు. ఇలా క్యాన్సర్ బారిన పడిన పది మంది పిల్లల్ని ఆసుపత్రి వైద్యులే రష్యా తీసుకెళ్లి అక్కడ స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, పరుగు, చదరంగం క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. అలా శిక్షణ పొందిన నిధి.. చదరంగం, ఈత పోటీల్లో జాతీయస్థాయిలో పతకాలు కొల్లగొట్టింది. ప్రస్తుతం ఆమె ఇంటర్ చదువుతోంది. శనివారం విశాఖ బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ స్విమ్మింగ్ కాంప్లెక్స్‌లో ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఆక్వాటిక్ ఈత పోటీల్లో రెండు పతకాలు సొంతం చేసుకుంది. నిధి తల్లి జ్యోతి గృహిణి. తండ్రి కేశవరావు క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు.

ఇవీ విజయాలు..

2021లో బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి చదరంగం పోటీల్లో ఓ రజతం, 2024లో గ్వాలియర్‌లో జరిగిన జాతీయస్థాయి పారా నేషనల్ స్విమ్మింగ్ పోటీల్లో రెండు రజతాలు, గోవాలో జరిగిన నేషనల్స్‌లో ఓ స్వర్ణం, రెండు రజతాలు, గత నెలలో హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన పారా జాతీయ ఈత పోటీల్లో రెండు స్వర్ణాలు, ఓ రజత పతకం గెలుపొందింది. కోచ్ రమేష్ వద్ద శిక్షణ పొందుతూ భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తానని నిధి చెబుతోంది.

తలసీమియా బాధిత చిన్నారులకు రూ. పదేసి లక్షల ఆర్థిక సాయం

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: తలసీమియాతో బాధపడుతున్న ప్రతి చిన్నారికి రూ.10 లక్షల వరకు కోల్ ఇండియా ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. తలసీమియా బాలసేవా యోజన కార్యక్రమం కింద కోల్ ఇండియా సంస్థ, హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ మధ్య శనివారం అవగాహన ఒప్పందం కుదిరింది. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు.. అప్పటి సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డిని కలిసి తలసీమియా బాధితులకు సాయం అందించాలని ఒత్తిడి చేశానని గుర్తుచేశారు. ప్రతి బాధిత చిన్నారికి రూ.10 లక్షల సాయం అందించేందుకు కోల్ ఇండియా సంస్థ తలసీమియా బాలసేవా యోజన అమలు చేయటం ప్రశంసనీయమన్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న కోల్ ఇండియా డైరెక్టర్ డా.వినయ్ రంజన్, ఛైర్మన్ సనోజ్‌కుమార్ ఝా, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ డైరెక్టర్ డా.దినేశ్‌కుమార్ చిర్లా

ఇందుకోసం కోల్ ఇండియా ఇప్పటివరకు 17 ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకుందని, దాదాపు 800 మంది పిల్లలకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చేయించిందని చెప్పారు.

హిడ్మాను పోలీసులే చంపారు!

పౌరహక్కుల సంఘం ఆరోపణ

నాంపల్లి, న్యూస్‌టుడే: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆదివాసీ నాయకుడు హిడ్మాను పోలీసులు అంతమొందించి.. ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు చిత్రీకరిస్తున్నారని పౌరహక్కుల సంఘం నాయకులు ఆరోపించారు. మావోయిస్టు పార్టీ విడుదల చేసిన ప్రకటనలను పరిశీలిస్తే ఈనెల 15నే హిడ్మాతో పాటు ఆదివాసీ నాయకులు శంకర్, రాజే, చైతు, కమ్లూ, మల్లాల్, దేవేలను పోలీసులు, సాయుధ బలగాలు పట్టుకుని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదర్‌గూడలోని న్యూస్‌సెంటర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గెడ్డం, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, సంయుక్త కార్యదర్శి మదనకుమారస్వామిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ గత 22 నెలలుగా కగార్ పేరుతో హత్యాకాండను కొనసాగిస్తూ ఇప్పటివరకూ 84 ఎన్‌కౌంటర్లలో సుమారు 780 మందికి పైగా అమాయకులను కేంద్రం హత్య చేసిందని ధ్వజమెత్తారు. రాజ్యం ప్రయోగిస్తున్న నిర్బంధ, హత్యాకాండలను ప్రశ్నిస్తున్న వారందరిపైనా అర్బన్ నక్సలైట్లుగా కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ముద్ర వేస్తూ నిందించడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. హిడ్మాతో పాటు ఈనెల 18, 19 తేదీల్లో జరిగిన ఎన్‌కౌంటర్లపైనా న్యాయవిచారణ జరిపించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మణ్ గెడ్డం, నారాయణరావు, మదన కుమారస్వామి

ఎనర్జీ అసిస్టెంట్‌ల మరణాలపై 4 వారాల్లోగా నివేదిక ఇవ్వండి

ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశం

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో 2022 నుంచి ఇప్పటివరకూ జిల్లాల వారీగా చనిపోయిన ఎనర్జీ అసిస్టెంట్‌లు, గాయపడిన వారి వివరాలతో 4 వారాల్లోపు పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఏపీ తూర్పు మండల విద్యుత్తు పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) సీఎండీని జాతీయ మానవ హక్కుల సంఘం(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆదేశించింది. 2025 మే 7న తమకు అందిన ఫిర్యాదుపై ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో మానవ హక్కుల సంఘం తాజాగా సీఎండీ వివరణ కోరింది. 'ఎనర్జీ అసిస్టెంట్లను వారి స్థాయికి మించిన పనులకు పురమాయిస్తున్నారని, అవి ప్రమాదకరంగా మారి 140 మంది మరణించగా, మరో 250 మంది గాయపడినట్లు మాకు అందిన ఫిర్యాదులో ఉంది. దీనిపై మేం కోరిన వివరణకు ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ స్పందిస్తూ ఇచ్చిన నివేదికలో.. విధి నిర్వహణలో 34 మంది ఎనర్జీ అసిస్టెంట్లు మరణించినట్లు పేర్కొన్నారు. వారిని ప్రమాదకర పనులకు పురమాయిస్తున్నారా? వారి స్థాయికి మించిన అనధికారిక విధులు అప్పగిస్తున్నారా? అనే ప్రశ్నలకు సంబంధించి నివేదికలో స్పందించలేదు. ప్రమాదాలకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు జరిపించారా? ఏం చర్యలు తీసుకున్నారన్న దానిపైనా స్పష్టత లేదు. వీటిపై స్పష్టతనిస్తూ 4 వారాల్లోపు సమగ్ర నివేదిక సమర్పించాలి' అని ఈపీడీసీఎల్ సీఎండీని మానవ హక్కుల సంఘం ఆదేశించింది.

తెలంగాణ సర్వపిండి.. సకినాలకూ బ్రాండింగ్!

ఈనాడు, హైదరాబాద్: తాపేశ్వరం కాజా.. ఆత్రేయపురం పూతరేకులంటే తెలుగు రాష్ట్రాల్లో ఫేమస్. ఇదే తరహాలో తెలంగాణలోని మేడ్చల్ జిల్లా ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారు చేస్తున్న తినుబండారాల బ్రాండింగ్ కోసం గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కృషిచేస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో 3,585 మహిళా స్వయం సహాయక సంఘాల్లో 38,526 మంది సభ్యులున్నారు. 60% సంఘాల్లో సభ్యులు తినుబండారాలను తయారు చేసి సొంతంగా విక్రయిస్తున్నారు. లడ్డూలు, బూందీ, సర్వపిండి, సకినాలు, కజ్జికాయలు, గవ్వలు ఇలా అన్ని మిఠాయిలను బెల్లంతో తయారు చేస్తున్నారు. రాగులు, జొన్నలు, కొర్రలతోనూ మిఠాయిలు చేస్తున్నారు. వీటితోనే బూందీ, కారపూస, మిక్చర్‌ను వినియోగదారులకు అందిస్తున్నారు. వీటికి బ్రాండింగ్ కల్పించేందుకు ఆకర్షణీయ ప్యాకింగ్, నాణ్యత ధ్రువపత్రాలు వంటి అంశాలపై శిక్షణ ఇప్పించారు. మరోవైపు మార్కెటింగ్ వ్యూహాలు, బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు, విక్రయాల్లో లాభనష్టాలపై అవగాహన కల్పించేందుకు బిట్స్ హైదరాబాద్ ఆచార్యులతో ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

కోల్‌కతాలో ఆరితేరి.. పాలమూరులో పాగా వేసి

- సైబర్ మోసాలతో ఏడాదికాలంలో రూ.3 కోట్ల కాజేత

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: వారి వయసు 21 నుంచి 25 ఏళ్లలోపే.. చదివింది పది, ఇంటర్, ఐటీఐ. అంతా ముఠాగా ఏర్పడి.. ఏడాదిగా సైబర్ మోసాలకు పాల్పడుతూ రూ.3 కోట్ల వరకు కాజేశారు. వచ్చిన డబ్బుతో బెట్టింగ్‌లకు పాల్పడటంతోపాటు జల్సాలు చేసేవారు. ఎట్టకేలకు పాపం పండి.. కటకటాల పాలయ్యారు. శనివారం మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి నిందితుల వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని తువ్వగడ్డతండాకు చెందిన జరుపుల సురేందర్, కాట్రవత్ హన్మంతు ఖాళీగా ఉండేవారు. వనపర్తి జిల్లా ఖిల్లాగణపురానికి చెందిన శివ, నరేశ్ వీరిని కోల్‌కతాలో ఉద్యోగం కోసం తీసుకెళ్లి సైబర్ మోసగాళ్లకు అప్పగించారు. అక్కడ వారు ఎలా మోసాలు చేయాలో తర్ఫీదు ఇచ్చారు. నిత్యం కొంతమందితో మాట్లాడించి డబ్బులు తస్కరించేవారు. వీరికి కొంత కమీషన్ ఇచ్చేవారు. ఈ పని బాగుందని భావించిన సురేందర్, హన్మంతు గ్రామానికి చెందిన మరో ఐదుగురు వడిత్యా రాజా అలియాస్ రాజు, వడిత్యా భాస్కర్, కాట్రవత్ నరేశ్, రాత్లావత్ సంతోష్, రాత్లావత్ సోమ్లాలను తమ వద్దకు పిలిపించారు. ఈ ఏడుగురు అక్కడ ఆరితేరాక 2024లో తువ్వగడ్డతండాకు మకాం మార్చారు. గ్రామంలో నిర్జన ప్రాంతంలో ఉంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగావకాశాలున్నాయని, తక్కువ వడ్డీకి రుణం ఇస్తామని, పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలొస్తాయని ప్రకటనలు ఇచ్చేవారు. వాటిని క్లిక్ చేసిన వారితో ఫోన్‌లో మాట్లాడి ఖాతాలు ఖాళీ చేసేవారు.



వివరాలు వెల్లడిస్తున్న మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి, చిత్రంలో పోలీసు అధికారులు, ఏడుగురు నిందితులు

చిక్కారిలా: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం హన్మాన్‌నగర్‌కు చెందిన వాకిటి వంశీకృష్ణ ఈ నెల 19న సైబర్ మోసంపై రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్‌లో ధన ఫైనాన్స్ ప్రకటన చూసి వంశీకృష్ణ రుణం కోసం వివరాలు పంపించగా.. ప్రాసెసింగ్ ఫీజు, బీమా, టీడీఎస్ తదితరాల కోసం రూ.75,655 చెల్లించాలని సైబర్ కేటుగాళ్లు బదులిచ్చారు. బాధితుడు తీరా ఆ డబ్బు ఆన్‌లైన్‌లో పంపాక.. నిందితులు ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. శనివారం ఉదయం ఆ ఫోన్ ఆన్ కావడంతో పోలీసులు వారి ఆచూకీ కనుగొన్నారు. తువ్వగడ్డతండాలో ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా.. డొంకంతా కదిలింది. ఏడాది నుంచి దాదాపు వెయ్యి మందిని మోసగించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితులపై రాష్ట్రవ్యాప్తంగా 35 ఎఫ్ఐఆర్‌లు, ఏపీలో 9 కేసులు ఉన్నట్లు గుర్తించారు. వారి నుంచి 14 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు.

అమ్మానాన్న గొడవ పడుతున్నారని కుమారుడి ఆత్మహత్య

కోరుట్ల, న్యూస్‌టుడే: 'అమ్మా.. నాన్నా మీరిద్దరూ మాటిమాటికీ గొడవ పడుతున్నారు. ఇంకోసారి తగవులాడుకోం అని లేఖ రాసి సంతకం చేయండి' అని తల్లిదండ్రులను కోరిన బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర ఘటన తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం పట్టణంలోని రథాలపంపులో నివసిస్తున్న దంపతులకు కుమారుడు(13), కుమార్తె ఉన్నారు. 8వ తరగతి చదువుతున్న బాలుడు.. తల్లిదండ్రులు తరచూ గొడవ పడుతుండటంతో బాధపడేవాడు. శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పాఠశాల నుంచి ఇంటికి వచ్చేసరికి వారు తగవు పడుతుండటాన్ని చూశాడు. సాయంత్రం వచ్చాక మళ్లీ వాదులాడుకోవడం చూశాడు. మరోసారి ఇలా జరగొద్దని వారిని కోరాడు. ఈ మేరకు లేఖ రాసి ఇవ్వాలని కోరగా తండ్రి రాసి దానిపై తనతోపాటు భార్య సంతకం కూడా చేశాడు. ఇలా ఎందుకు చేశావని కుమారుడు నిలదీయడంతో తండ్రి బయటకు వెళ్లాడు. అనంతరం తల్లి కూడా బయటకు వెళ్లగా బాలుడు నచ్చజెప్పి ఆమెను ఇంటికి తీసుకొచ్చాడు. తర్వాత గదిలోకి వెళ్లిన బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటికి తల్లి గది తలుపులు తెరిచి చూసేసరికి విగతజీవిగా కనిపించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సౌదీ ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి

- పవిత్ర జన్నతుల్ బాకీ శ్మశానవాటికలో ఖననం

ఈనాడు, హైదరాబాద్: సౌదీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నగరవాసులకు శనివారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. మదీనాలో మహమ్మద్ ప్రవక్త సహచరులు, ఆయన కుటుంబసభ్యులను ఖననం చేసిన జన్నతుల్ బాకీ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు జరిగాయి. ముస్లింలు ఆ ప్రాంతాన్ని అతి పవిత్రంగా భావిస్తారని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థన మేరకు సౌదీ సర్కారు అక్కడే అంత్యక్రియలకు అవకాశం కల్పించిందని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ప్రకటించారు. నగరం నుంచి ఉమ్రా యాత్రకు వెళ్లిన 45 మంది భక్తులు మక్కా నుంచి మదీనా వెళ్తుండగా.. ఈ నెల 17న తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన విషయం తెలిసిందే. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో.. డీఎన్ఏ పరీక్షల కోసం రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబ సభ్యులు, బంధువులను అక్కడికి తీసుకెళ్లింది. శనివారంతో డీఎన్ఏ పరీక్షలు పూర్తయ్యాయని, మృతుల సంబంధీకులకు మరణ ధ్రువీకరణపత్రాలు అందించాక.. సౌదీ సర్కారు మృతదేహాలను అప్పగించిందని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు. అంత్యక్రియల కార్యక్రమానికి భారత ప్రభుత్వం పంపిన ప్రతినిధి బృందంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, మృతుల కుటుంబ సభ్యులు, తదితరులు... మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మదీనాలోని ప్రధాన మసీదులో నమాజు చేశారు. అనంతరం మృతదేహాలను అంతిమ సంస్కారాలకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భారత రాయబారి డాక్టర్ సుహేల్‌ఖాన్, కౌన్సిల్ జనరల్ ఫహత్ సూరి పాల్గొన్నట్టు సౌదీలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది.



సంక్రాంతికి రైళ్లన్నీ కిటకిట

- బస్సుల్లోనూ పూర్తయిన రిజర్వేషన్లు
- ప్రత్యేక సర్వీసుల మాటెత్తని రైల్వే, ఆర్టీసీ
- విమాన టికెట్ల ధరలూ భారీగా పెరుగుదల

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతికి ఇంకా ఏడు వారాలపైనే సమయం ఉన్నప్పటికీ దూర ప్రాంత రైళ్లలో రిజర్వేషన్లు అయిపోయాయి. కొన్నింట్లో నిరీక్షణ జాబితా ఐదారొందలు దాటేసింది. గోదావరి, గరీబ్‌రథ్, ఈస్ట్‌కోస్ట్, చార్మినార్, సింహపురి, గౌతమి, కోణార్క్, మహబూబ్‌నగర్-విశాఖపట్నం, శబరి, నారాయణాద్రి, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో... గరిష్ఠ పరిమితిని దాటేసి 'రిగ్రెట్'కు చేరింది. బస్సుల్లోనూ ముఖ్యమైన గమ్యస్థానాలకు అదే పరిస్థితి నెలకొంది. విమాన టికెట్ల ధరలకూ రెక్కలు వస్తున్నాయి. ఉన్న టికెట్లు అయిపోయేకొద్దీ ఆకాశయానం మరింత భారంగా మారే పరిస్థితి కనిపిస్తోంది.

ఆ నాలుగైదు రోజులు భారీ డిమాండ్

జనవరి 14(బుధవారం)న సంక్రాంతి. ముందురోజు భోగి, తర్వాత రోజు కనుమ. దాంతో జనవరి 9 నుంచి 13వ తేదీ వరకు రైళ్లు, బస్సుల ప్రయాణాలకు భారీ డిమాండ్ ఉంది. ఎక్కువ మంది శుక్ర, శనివారాల నుంచి ప్రయాణాలు పెట్టుకుంటున్నారు. దూరప్రాంత రైళ్లలో 9వ తేదీ నుంచే రిజర్వేషన్లు ముగిశాయి. బస్సులకు 10వ తేదీ నుంచి 13 వరకు డిమాండ్ అధికంగా ఉంది. ప్రధాన రైళ్లలో... హైదరాబాద్ నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, నరసాపురం, విశాఖపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు తదితర నగరాలు, పట్టణాలకు జనవరి 9-13 వరకు వెయిటింగ్ లిస్టు దాటేసి రిగ్రెట్‌కు చేరింది. హైదరాబాద్ నుంచి మహబూబాబాద్, ఖమ్మంకు వందేభారత్, గరీబ్‌రథ్, ఈస్ట్‌కోస్ట్, చార్మినార్, గోదావరి ఎక్స్‌ప్రెస్‌ల్లో రిగ్రెట్ కనిపిస్తోంది. హైదరాబాద్ నుంచి తిరుపతి, చిత్తూరుకు శబరి ఎక్స్‌ప్రెస్‌లో 10, 11 తేదీల్లో, వెంకటాద్రిలో 10, 12న రిగ్రెట్... మిగతా రోజుల్లో భారీగా నిరీక్షణ జాబితా ఉంది. హైదరాబాద్ నుంచి ఏపీ వైపు ఏపీఎస్‌ఆర్టీసీ అన్ని బస్సుల్లో సీట్లు అయిపోయాయి.



ప్రత్యేక సర్వీసులేవి?

సాధారణంగా ఏదైనా రూట్లో ప్రయాణికుల నుంచి భారీ డిమాండ్ ఉంటే రైల్వే, ఆర్టీసీలు వెన్వెంటనే ప్రత్యేక సర్వీసులు ప్రకటించాలి. ఒక రైలులో వెయిటింగ్ లిస్టు మూడు, నాలుగొందలు దాటగానే... అదే రూట్లో ప్రత్యేక రైలు ప్రకటిస్తే ప్రయాణికులు అందులో రిజర్వేషన్ తీసుకుంటారు. కానీ నిరీక్షణ జాబితా ఐదారొందలు దాటి 'రిగ్రెట్'కు చేరినా ప్రత్యేక రైలు ప్రకటనలు రావడం లేదు. ఏపీఎస్ ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులను ఆన్‌లైన్‌లోకి తీసుకురాలేదు. టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే కొంత మేరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇదే సమయంలో ప్రయాణికుల డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ప్రైవేటు ఆపరేటర్లు ఛార్జీలను భారీగా పెంచుతున్నారు.

◆ విమాన ప్రయాణాలకు జనవరి 10, 11 తేదీల్లో డిమాండ్ భారీగా ఉండటంతో టికెట్ల ధరలు 50-100% పెరిగాయి. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం విమాన ఛార్జీలు సాధారణ రోజుల్లో రూ.4,600-4,900 ఉంటే జనవరి 10న రూ.10,529, 11న రూ.8,695గా, 9న రూ.7,075 ఉన్నాయి. హైదరాబాద్-విశాఖకు సగటున టికెట్ ధర రూ.4,144 ఉంటే... జనవరి 10న రూ.7,366, 11న రూ.6,443 ఉండటం గమనార్హం.

తనను కాపాడబోయి.. తండ్రి మృతి చెందారని..

మూడేళ్ల మానసిక క్షోభతో విద్యార్థి బలవన్మరణం

కోరుట్ల, న్యూస్‌టుడే: తన వల్లే తండ్రి మృతి చెందారని మూడేళ్లుగా మానసిక క్షోభకు గురైన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగిత్యాల జిల్లా కోరుట్లలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన దంపతులకు ఇద్దరు కుమారులు. 2022 నవంబరు 25న తండ్రి అయ్యప్ప దీక్ష తీసుకోవడానికి ముందు మల్లాపూర్ మండలం మొగిలిపేట వద్ద గోదావరిలో స్నానం చేసేందుకు చిన్న కుమారుడి(17)ని తీసుకొని వెళ్లారు. బాలుడు ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగిపోతుండగా తండ్రి గమనించి కాపాడారు. ఈ క్రమంలో ఆయన నీటిలో మునిగి చనిపోయారు. అప్పటి నుంచి తన వల్లే తండ్రి మృతి చెందారని తలచుకుంటూ విద్యార్థి బాధపడుతుండేవాడు. గతంలో ఓసారి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. శనివారం ఉదయం అతడి కోసం వెతకగా స్టోర్‌రూంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించాడు. మృతుడి మేనమామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

పెద్ద కుమార్తె చనిపోయిందనే మనస్తాపంతో కుటుంబం ఆత్మహత్య

అంబర్‌పేటలో ఘటన... ఆలస్యంగా వెలుగులోకి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: పెద్దకుమార్తె చనిపోయిందనే మనస్తాపంతో ఒకే కుటుంబంలోని ముగ్గురు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారక ఘటన హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీస్ తూర్పు మండలం డీసీపీ బాలస్వామి వివరాల ప్రకారం...ఎల్ఐసీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే శ్రీనివాస్(45)కు భార్య విజయలక్ష్మి(42), కుమార్తెలు కావ్య, శ్రావ్య(15) ఉన్నారు. పెద్దకుమార్తె కావ్య 5 నెలల క్రితం ఆత్మహత్య చేసుకోవడంతో వారు నెలన్నర క్రితం రాంనగర్ నుంచి బాగ్‌అంబర్‌పేట రామకృష్ణనగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు వచ్చారు. నాటినుంచి వారు ఎవరితోనూ మాట్లాడకుండా బంధువులకు సైతం దూరంగా ఉంటున్నారు. శనివారం సాయంత్రం శ్రీనివాస్ అక్క సువర్ణ తమ్ముడిని చూడటానికి వచ్చారు. ఎంత పిలిచినా తలుపు తీయకపోవడం, ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాచిగూడ ఏసీపీ హరీశ్ కుమార్, డీఐ హఫీజుద్దీన్, ఎస్సై సురేశ్‌లు ఘటనా ప్రాంతానికి చేరుకుని తలుపులు తెరిచారు. శ్రీనివాస్ ప్రధాన ద్వారం వెంటిలేటర్‌కు, భార్య విజయలక్ష్మి, కుమార్తె శ్రావ్య గదిలో కిటికీ ఇనుప చువ్వలకు చీరలతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వారు రెండు రోజుల క్రితమే చనిపోవడంతో మృతదేహాలు కుళ్లిన స్థితిలో ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తమను పదేపదే దేవుడు పిలుస్తున్నాడని వారు చెప్పేవారని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పలు కోణాల్లో ఈ కేసు విచారణ జరుపుతున్నట్లు డీసీపీ తెలిపారు.



ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన శ్రీనివాస్, విజయలక్ష్మి, శ్రావ్య